ISSN : 0971-8729

# యోజన

సంపుటి : 45 సంచిక : 9 అభివృద్ధి మాసపత్రిక జూలై 2017 ₹ 30

ప్రత్యేక సంచిక

వృద్ధులకు సామాజిక భద్రత సవాళ్లు - సమస్యలు - సుమతి కులకర్ణి

నత్తనడకన సాగుతున్న అందరికీ ఆరోగ్యం పథకం. - కె. సీతాప్రభు

దివ్యాంగులకు సామాజికభద్రత - సంధ్య లిమాయే

రైతుల సంక్షేమంపై వాస్తవాల పరిశీలన - నీలాబ్జ ఘోష్

రైతుల సంక్షేమం

దివ్యాంగులు

అసంఘటిత కార్మికులు

విద్య

బీమా

పెన్షన్

## సామాజిక భద్రత

విశిష్ట వ్యాసం

**వయోధికులకు ఆదాయ భద్రత-జాతీయ పెన్షన్ వ్యవస్థ**

- డా॥ బద్రి సింగ్ భండారి

ప్రత్యేక వ్యాసం

**సామాజిక భద్రత - ప్రపంచ దృక్పథం**

- చంద్రకాంత్ లహరియా

ఆరోగ్యం

ఆహారం

## దేశంలోని పొడవైన వంతెన ధోల సడియా



దేశంలోని అతి పొడవైన ఈ వంతెనను బ్రహ్మపుత్ర నదిపైన ప్రధానమంత్రి నరేంద్రమోదీ మే నెలలో ప్రారంభించారు. మూడు వరుసల్లో 9.15 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ వంతెనను లోహిత్ నదిపై అస్సాం-నాగాలాండ్ రాష్ట్రాలలోని ధోల నుండి సడియా వరకు నిర్మించారు. లోహిత్ నది బ్రహ్మపుత్ర నదికి ఉపనది. ఈ నిర్మాణంతో రెండు రాష్ట్రాల మధ్య దూరం గణనీయంగా తగ్గుతుంది. మౌలిక వసతులు అభివృద్ధికి అత్యావశ్యకమనీ, ఈ వంతెన నిర్మాణం ద్వారా రెండు రాష్ట్రాలలోనూ అభివృద్ధి మరింత వేగవంతమయ్యే అవకాశముందని ఈ వంతెనను ప్రారంభిస్తూ ప్రధానమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈశాన్య ప్రాంతాలను మిగతా దేశంతో మరింత దగ్గర చేయడం తన ప్రభుత్వ లక్ష్యమని కూడా ఆయన అన్నారు. అస్సాంకు చెందిన



ప్రముఖ సంగీత విద్వాంసుడు భూపేన్ హజారికా జ్ఞాపకార్థం ఈ వంతెనకు ఆయన పేరు పెట్టారు. గతంలో బ్రహ్మపుత్ర నదిని దాటాలంటే కేవలం తెప్పలమీద, అదికూడా పగటిపూట మాత్రమే సాధ్యమయ్యేది. ఇప్పటివరకూ ఈ నదిపై తేజ్‌పూర్ వద్దనున్న కలియ భోమొర వంతెన ఒక్కటే ఉండేది. ఈ నూతన వంతెన రెండు రాష్ట్రాల మధ్య దూరాన్ని 165 కిలోమీటర్లు తగ్గించింది. ఈ వంతెన కలుపుతున్న రెండు ప్రాంతాలు అస్సాంలోని రూపై నుండి అరుణాచలప్రదేశ్‌లోని మెకా వరకు ఇంతకు మునుపు ఆరుగంటల ప్రయాణమైతే ఇప్పుడు అది కేవలం ఒక గంట మాత్రమే! అంటే ఐదుగంటల సమయం ఆదా అన్నమాట. దీనివల్ల ఈ మార్గంలో నడిచే వాహనాల ఇంధనం రోజుకు పది లక్షలరూపాయల మేరకు ఆదా అవుతుందన్నమాట! అంతేకాదు, ఈ వంతెన చైనాతో ఉన్న మన సరిహద్దులలో కీలకపాత్ర వహిస్తుంది. ఈ వంతెన నిర్మాణానికి మొత్తం రూ. 2056/- కోట్లు ఖర్చయింది.

జూలై 2017 సంపుటి : 45 సంచిక : 9

ISSN : 0971-8729

# యోజన

ముఖ్య సంపాదకులు: దీపికా కచ్చల్
వరిష్ఠ సంపాదకుడు : విజయకుమార్ వేదగిరి
సంపాదకుడు : మహమ్మద్ సిరాజుద్దీన్

జాయింట్ డైరెక్టర్ (ప్రొడక్షన్) : వి.కె. మీనా

e-mail : yojana_telugu@yahoo.co.in
e-mail : yojana.telugu@nic.in

*ఆనోభద్రా క్రతవోయన్తు విశ్వతః (ఉత్తమ భావాలు అన్నివైపుల నుండి రావాలి)*

## ఈ సంచికలో...

1. వృద్ధులకు సామాజిక భద్రత సవాళ్లు – సమస్యలు 5
– ప్రొఫెసర్ సుమతి కులకర్ణి
2. నత్తనడకన సాగుతున్న అందరికీ ఆరోగ్యం పథకం 10
– ప్రొఫెసర్ కె. సీతాప్రభు
3. దివ్యాంగులకు సామాజికభద్రత 12
– సంధ్య లిమాయే
4. రైతుల సంక్షేమంపై వాస్తవాల పరిశీలన 14
– ప్రొఫెసర్ నీలాబ్జ ఘోష్
5. వయోధికులకు ఆదాయ భద్రత– జాతీయ పెన్షన్ వ్యవస్థ 19
– డాక్టర్ బద్రి సింగ్ భండారి
6. సామాజిక భద్రత – ప్రపంచ దృక్పథం 24
– చంద్రకాంత్ లహరియా
7. మధ్యాహ్న భోజన పథకం – సామాజిక భద్రత 30
– కిరణ్ భట్టి
8. ఆహార ప్రణాళిక : పౌష్టికాహార లక్ష్యాలు 33
– మౌసుమి దాస్
9. ఎన్‌డిఏ మూడు సంవత్సరాల పాలన విశ్లేషణ 35
– యోజన సంపాదకవర్గం
10. విజ్ఞాన విపంచి - ప్రాతూరి పోతయ్య శర్మ 41
11. దర్పణం 44
12. సామాజిక భద్రతలో తెలంగాణ ప్రభుత్వ ఆసరా పథకం–మూల్యాంకనం 46
– మాణిక్య మహేశ్
13. అసంఘటిత రంగానికి సామాజిక భద్రత 50
– డాక్టర్ రుమా ఘోష్
14. పేదల సాధికారతే పథకాల లక్ష్యం 53
– ఉర్మి గోస్వామి
15. కార్పొరేట్ సామాజిక బాధ్యత – అట్టడుగు వర్గాల సాధికారత 55
– జతీందర్ సింగ్
16. యువత సామాజిక భద్రతకు నాణ్యమైన విద్య 58
– డాక్టర్ రాకేశ్ కే వత్స్ – డాక్టర్ మీను వత్స్
17. మౌలికరంగానికి ఊతం – దేశాభివృద్ధికి సోపానం 62
– కె.ఆర్. సుధామన్
18. నూతన పెన్షన్ పథకం, స్వావలంబన పథకం, అటల్ పెన్షన్ యోజన. 67

**ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల గురించిన సమాచారాన్ని అందజేసేందుకు, తెలుగు, హిందీ, ఇంగ్లీషు, అస్సామి, బెంగాలి, తమిళం, ఉర్దూ, మరాఠీ, గుజరాతీ, మళయాళం, పంజాబీ, కన్నడ, ఒడియా భాషలలో వెలువడుతున్న మాసపత్రిక.**

### యోజన (తెలుగు) చందా వివరాలు

**1 సంవత్సరానికి - రూ. 230/- 2 సంవత్సరాలకు - రూ. 430/- 3 సంవత్సరాలకు - రూ. 610/-**

**మరిన్ని వివరాల కోసం : 040-27546312 /13 / 14 ఈ ఫోన్ నంబర్లకు సంప్రదించండి.**

**చందాను Bharatkosh.gov.in సైట్‌లో Publications Division లింకును క్లిక్ చేసి ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చు :**

ఎడిటర్, **యోజన (తెలుగు),** 205, 2వ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.

యోజన ప్రచురించిన వ్యాసాలలో వ్యక్తపరిచిన భావాలు ఆయా రచయితలవే, వారు పనిచేస్తున్న సంస్థలు, ప్రభుత్వ అభిప్రాయాలను అవి ప్రతిబింబించవు.
యోజనలో ప్రచురించే ప్రకటనలలోని అంశాలు ఆయా సంస్థలు, వారి ప్రతినిధులకు చెందినవి. ప్రకటన పాఠం / సారాంశం మూలంగా ఎదురయ్యే ఎటువంటి పర్యవసానాలకు యోజన బాధ్యత వహించదు.


ISSN : 0971-8729

# యోజన

చీఫ్ ఎడిటర్స్ డెస్క్

## సంపాదకీయం

### సామాజిక భద్రతకు నిలువుటద్దం




దేశంలో అధిక జనాభా ప్రయోజనాలు అన్ని చోట్లా బహు చర్చనీయం అయ్యాయి. యువ జనాభా అన్నిరంగాలలో దేశాన్ని ఏవిధంగా ముందుకు తీసుకువెళతారు అనేది ఒక అంశమైతే, ఉపాధి లభించని యువత దేశానికి ఎలా భారమవుతారు అనేది మరొక చర్చ! అయితే, ఈ హడావుడిలో ఎవరూ కూడా మన దేశంలో వృద్ధుల జనాభా కూడా పెరుగుతున్నదనే అంశాన్ని మరువకూడదు. 2026 నాటికి మనదేశంలో వృద్ధుల సంఖ్య 173 మిలియన్లకు చేరుతుందని అంచనా! వారిలో అధిక శాతం పేదలు, మహిళలు, ఎదో రూపంలో ప్రభుత్వం నుండి సహాయాన్ని ఆశించే వాళ్లయి ఉంటారు. వీళ్లలో, మహిళలు, వికలాంగులు, వెనుకబడిన వర్గాల వారు, అసంఘటిత రంగ కార్మికులు వంటి ఇతర నిస్సహాయ వర్గాల వారు కూడా ఉంటారు. సమాజంలోని ఇలాంటి నిస్సహాయ వర్గాలకు మద్దతు కూర్చడమే సామాజిక భద్రత అంటే! ఏ ప్రజాస్వామ్య ప్రభుత్వమూ కూడ కాదనజాలని అనివార్య కార్యక్రమం ఇది. అదృష్టవశాత్తూ మన రాజ్యాంగ నిర్మాతలు ఈ సామాజిక భద్రతకోసం ఆర్టికల్ 43 వంటి ఏర్పాట్లను రాజ్యాంగంలోనే పొందుపరిచారు. తదనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఈ సంక్షేమ స్పృహను సజీవంగా ఉంచగలిగాయి.

జాతీయ సామాజిక సహాయ పథకంలో భాగంగా ఉన్న ఇందిరాగాంధీ వృద్ధాప్య పింఛనుపథకం వృద్ధులకు ఊతమిస్తున్నది. ప్రభుత్వోద్యోగు లందరికీ పదవీ విరమణ అనంతరం పెన్షన్ అందుతుంది. నిజానికి ప్రభుత్వోద్యోగాలకు ఈ పెన్షన్ ఒక ప్రత్యేక ఆకర్షణ. ప్రైవేటు రంగ ఉద్యోగులకు ఈ సౌకర్యం లేదు. వీరు కేవలం తమ ఉద్యోగ కాలంలో పొదుపు చేసిన మొత్తాలతోనే తమ శేషజీవితం గడపాల్సిఉంటుంది. ఖర్మకాలి పిల్లల చదువులకో, లేదా కూతుళ్ల పెళ్ళిళ్ళకో అధిక మొత్తం ఖర్చు చేయాల్సి వస్తే, తరువాత ఏవైనా ఆరోగ్య సమస్యలు వస్తే వాటికి అయ్యే భారీ వ్యయానికి ఇక దేవుడే దిక్కు! ఇలాంటి సందర్భాలలో ప్రజలకు మద్దతు ఇవ్వడానికే జాతీయ పెన్షన్ పథకం, అటల్ పెన్షన్ పథకం, స్వావలంబన్ వంటి పథకాలను ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. దైవాధీనంగా ప్రకృతి దయాధర్మాలపై ఆధారపడిన వృత్తి వ్యవసాయం. రైతుల సంక్షేమమే దేశ ఆర్థిక పరిపుష్టికి మూలమని ఎరిగిన ప్రభుత్వం ప్రధానమంత్రి పంటల (ఫసల్) బీమా పథకం, కృషి సించాయి యోజన (సాగునీటి పథకం), కిసాన్ క్రెడిట్ కార్డ్ (రైతులకు బ్యాంక్ రుణాలను సులభతరం చేసేందుకు) వంటి పథకాలను అమలుచేసింది. జాతిని పోషించే రైతుకు ఈ చర్యలు ఉపశమనం కలిగిస్తాయని ఆశించవచ్చు. అంతేకాకుండా, పండిన పంట సక్రమంగా ప్రజలందరికీ చేరడం కూడా ఎంతో ముఖ్యం. అంటే, ఖరీదైన పప్పు ధాన్యాలను మార్కెట్ ధరలకు కొనలేని వారికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రాయితీ ధరలకు అందచేస్తున్నారు. అందునా ఈ పథకాన్ని ఇటీవల ప్రత్యక్ష ప్రయోజన పథకానికి (DBT) జోడించడం ద్వారా నిజమైన లబ్ధిదారులకు చేర్చేందుకు కృషిచేస్తున్నారు.

సమాజంలోని ఇతర బలహీన వర్గాలైన దివ్యాంగులు, మహిళలు, పేద కూలీలు, అసంఘటిత కార్మికులు వంటి వారందరికీ కూడా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నది. నయీ మంజిల్, ఉస్తాద్, నయీ రోష్నీ వంటి పథకాలను అల్పసంఖ్యాక వర్గాల వారికోసం అమలు చేస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ పథకాలను, కార్మిక సంక్షేమ పథకాలను కలిపి ఒక నియమావళిని రూపొందించింది. బాలికా విద్యకోసం బేటీబచావో బేటీపఢావో, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలను అమలు చేస్తున్నారు. గర్భవతులకు, పాలిచ్చే తల్లులకు ప్రసూతి సౌకర్య సహాయ నిధిని కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. వివిధ రకాల బలహీన వర్గాల కోసం అనేక ఆరోగ్య బీమా పథకాలను కూడా అమలుచేస్తున్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వమంటేనే ప్రజా సమస్యలను విస్మరించలేని ప్రభుత్వం. ప్రజల సంక్షేమాన్ని కాదని అదే ప్రజల నుండి ప్రభుత్వం ఎన్నుకోబడలేదు కదా! కనుక సాంఘిక సంక్షేమం ఆదర్శ ప్రభుత్వ లక్షణాలలో ప్రధానమైనది. ఇందుకోసం ఆ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను జాగ్రత్తగా రూపొందించి అమలు చేయాల్సి ఉంటుంది. ■

# వృద్ధులకు సామాజిక భద్రత సవాళ్లు - సమస్యలు

- ప్రొఫెసర్ సుమతి కులకర్ణి



**దేశంలో 2011నాటి జనాభా లెక్కల ప్రకారం వృద్ధుల (60+) సంఖ్య 10.4 కోట్లు కాగా, 2026నాటికి ఇది 17.3 కోట్లను దాటుతుందని అంచనా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధులకు నగదు రూపేణా ఇస్తున్న ఇందిరాగాంధీ జాతీయ వృద్ధాప్య పింఛన్ పథకం, ఇందిరాగాంధీ జాతీయ వితంతు పింఛన్ పథకం, ఇతర రూపాల్లో అనగా ఆహారభద్రత కింద వస్తుసేవలు, వృద్ధులకు జాతీయ కార్యక్రమం కింద ఆరోగ్య సేవలు, వివిధ మంత్రిత్వశాఖల నుంచి రాయితీలు, సౌకర్యాలు సామాజిక భద్రత కల్పిస్తున్నాయి.**

దీర్ఘకాలిక లేదా తాత్కాలిక కారణాలవల్ల తమ జీవనం కోసం తాము సంపాదించు కోలేని స్థితిలో ఉన్నవారికి జీవనోపాధి చూపడమే సామాజిక భద్రత లక్ష్యం. అత్యంత అభివృద్ధి చెందిన దేశాలలో ప్రభుత్వమే సామాజిక భద్రత కల్పించడ మన్నది అక్కడి జీవన ప్రమాణాలలో ఒక అంతర్గత భాగం. అయితే, ఈ దేశాలలో సామాజిక భద్రత వ్యవస్థలు సర్వ సాధారణంగా వివిధ ముప్పుల నుంచి కల్పించే రక్షణతో పోలిస్తే అభివృద్ధి చెందుతున్న దేశా(LDC)లలో దుర్బలత్వ విస్తృతి అధికం. దీర్ఘకాలిక నిరుద్యోగం, సమసమాజ నిర్మాణంలో అంతర్లీనంగా తీవ్ర స్థాయిలోగల అవకాశాల లేమిలను ఇందుకు కారణాలుగా చెప్పవచ్చు. ఎండీసీలతో సరిపోల్చదగిన స్థాయిలో ఎల్డీసీలలో సామాజిక భద్రత కల్పనకు ఆర్థిక ఆచరణాత్మకత అనేది ఒక కీలక అవరోధం. చివరకు అభివృద్ధి చెందిన దేశాలు కూడా ప్రజా పింఛను వ్యవస్థ మనుగడను కొనసాగించడంలో సమస్యలు ఎదుర్కొంటు న్నాయి. ఆయా దేశాల్లో సంతాన సాఫల్యత క్షీణత దీర్ఘకాలికంగా కొనసాగుతుండటంతో లబ్ధిదారులు.. అంటే వృద్ధపౌరుల శాతం పెరిగిపోతోంది. మరోవైపు సంపదకు వాటా సమకూర్చేవారు, అంటే పనిచేయగల వయస్కుల శాతం పడిపోతుండటమే ఇందుకు కారణం. ఈ 21వ శతాబ్దం మధ్యకల్లా ఈ దేశాల జనాభాలో 60 ఏళ్లు దాటినవారు దాదాపు మూడోవంతుకు చేరుతారని అంచనా.

భారత్ వంటి వర్ధమాన దేశాలలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యల స్వభావంలో విస్తృత భిన్నత్వం ఉంది. దీర్ఘకాలిక పేదరికం, నిరుద్యోగం, స్వల్ప ఉద్యోగితలతోపాటు అతిపెద్ద అనధికారిక రంగం మనుగడ కూడా ఇందుకు కారణాలు. ఎల్డీసీలలో ఇటీవలి జనాభా సంబంధిత అంశాలలో సంభవిస్తున్న మార్పుల నేపథ్యంలో దుర్బల వృద్ధ జనాభాకు సామాజిక భద్రత కల్పనపై దృష్టి మళ్లింది. కొన్ని ఐరోపా (ఫ్రాన్స్, స్వీడన్ వంటి) దేశాల మొత్తం జనాభాలో వృద్ధుల సంఖ్య 7 శాతం నుంచి 14 శాతానికి చేరేందుకు రమారమి 100 నుంచి 120 ఏళ్లు పట్టింది. కానీ, వర్ధమాన దేశాలలో మరణాల సంఖ్య వేగంగా తగ్గుతున్న దృష్ట్యా భారత్, చైనా సహా కొన్ని ఆసియా దేశాలలో కేవలం 40 ఏళ్లలోనే వృద్ధుల సంఖ్య రెట్టింపయ్యే అవకాశా లున్నాయి.

మాజీ డైరెక్టర్ & హెడ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్, ఐఐపియస్, ముంబయి.
E-mail: sumati2610@gmail.com

## 1. భారత్‌లో వృద్ధుల సామాజిక భద్రత సమస్య స్వభావం

ప్రపంచ జనాభాలో ఐదో వంతు, పేదలలో మూడోవంతు, వృద్ధులలో ఎనిమిదో వంతు భారతదేశంలోనే ఉన్నారు. ఇటీవలి దాకా కుటుంబం, యుక్తవయస్కులైన సంతానాన్ని వృద్ధులకు భద్రత కల్పించే విశ్వసనీయ వనరుగా పరిగణించేవారు. కానీ- వృద్ధుల జీవిత కాలం పెరగడం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడం, పనిలో మహిళల భాగస్వామ్యం పెరగడంవల్ల సంరక్షకుల లభ్యత తగ్గడం తదితర సామాజిక-ఆర్థిక-సాంస్కృతిక మార్పుల దృష్ట్యా ఈ సంప్రదాయ వనరులపై ఒత్తిడి పెరిగిపోయింది. అంతేకాకుండా వైధవ్య సంఘటనలు తగ్గడం, యువతరం వలస వెళ్లడం, అలాగే యువతలో వ్యక్తిగత దృక్పథం పెరిగిపోతుండటం వంటి కారణాలు కూడా పేద వృద్ధుల సమస్యలు తీవ్రం కావడానికి దారితీస్తున్నాయి. దీనికితోడు ఆరోగ్య పరిస్థితి దిగజారిపోయే సమయంలో పనిచేసే శక్తి సన్నగిల్లడం, ఆధారపడదగిన పొదుపు ఏదీ లేకపోవడం కూడా వృద్ధులకు సమస్యలే. ప్రపంచీకరణ ఫలితంగా పేదలకు అవకాశాలు తగ్గిపోవడం, పేదలలో ఒంటరి మహిళల సంఖ్య పెరుగుతుండటం అనూహ్య పర్యవసానాలు. వీటన్నిటి నేపథ్యంలో వృద్ధులకు సామాజిక భద్రత కల్పనకు లక్ష్యనిర్దేశిత చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని చర్యలు చేపట్టాయి కానీ, ఎండీసీలతో పోలిస్తే భారత్ వంటి ఎల్డీసీలలో సామాజిక భద్రత కల్పనకు ఆర్థిక ఆచరణాత్మకత ఓ కీలక అవరోధంగా మారింది.

## 2. బీకేపీఏఐ అధ్యయనం

'భారత దేశంలో జనాభా వృద్ధాప్య సమాచార నిధి రూపకల్పన' (BKPAI) పథకంలో భాగంగా 'వృద్ధ పౌరుల స్థితిగతులు' ప్రధానాంశంగా ఒక అధ్యయనం నిర్వహించబడింది. న్యూఢిల్లీలోని ఐక్యరాజ్య సమితి జనాభా నిధి (UNFPA), ఆర్థికాభివృద్ధి సంస్థ (IEG), బెంగళూరులోని సామాజిక ఆర్థిక పరివర్తన సంస్థ (ISEC), ముంబైలోని టాటా సామాజిక విజ్ఞాన సంస్థ (TISS) 2011 మే-సెప్టెంబరు మధ్య సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించాయి. ఇందులో భాగంగా జాతీయ సగటుకన్నా ఎక్కువగా వృద్ధ జనాభాగల ఏడు రాష్ట్రాల (హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు)ను ఎంపిక చేసి 8329 కుటుంబాల్లోని 9852 మంది వృద్ధుల గణాంకాలను సేకరించాయి. ఈ సమాచారం ఆధారంగా ప్రస్తుత వ్యాసంలో చర్చించ ప్రతిపాదిస్తున్న అంశాలివే... (అ) భారత్‌లో వృద్ధులకు సామాజిక భద్రత సమస్య తీవ్రత (ఆ) సామాజిక భద్రత కల్పనకు ప్రభుత్వపరంగా ప్రధాన చర్యలు (ఇ) రెండు కేంద్ర ప్రభుత్వ ప్రముఖ పింఛను పథకాల వినియోగంపై అవగాహన (ఈ) వృద్ధులపరంగా ఈ పథకాల పరిమిత వినియోగానికి కారణాలు (ఉ) వృద్ధులకు సార్వత్రిక పింఛను పథకం ఆచరణాత్మకత.

## 3. భారత దేశంలో సమస్య తీవ్రత

### (i) జనాభా గణాంకాల ప్రకారం

దేశంలో 2011నాటి జనాభా లెక్కల ప్రకారం వృద్ధుల (60+) సంఖ్య 10.4 కోట్లు కాగా, 2026నాటికి ఇది 17.3 కోట్లను దాటుతుందని అంచనా. ఇక 2000 నుంచి 2050 మధ్య దేశంలో వృద్ధుల జనాభా 360 శాతం పెరుగుతుందని కూడా అంచనాలు పేర్కొంటున్నాయి. దీనికి పూర్తి విరుద్ధంగా సంభావ్య మద్దతు నిష్పత్తి (పనిచేయగల 15-59 ఏళ్లవారిలో ప్రతి 60+ వయస్కుడి సంరక్షణచూసే వ్యక్తుల సంఖ్య రీత్యా నిర్వచించినపుడు) 2001లో 8.4గా కాగా, 2011నాటికి 7కు తగ్గిపోయిన నేపథ్యంలో 2026నాటికి కేవలం 5.2కు పడిపోతుందని అంచనా. ఇక దుర్బల వృద్ధులలో మహిళల సంఖ్య పెరుగుతున్న రీత్యా 2050 నాటికి 60 ఏళ్లు, అంతకుమించి వయసున్నవారు వృద్ధ పురుషులతో పోలిస్తే మహిళలు 1.84 కోట్లు అధికంగా ఉంటారని అంచనా. ఇక వైధవ్యానికి సంబంధించి 80, అంతకన్నా ఎక్కువ వయసున్నవారితో పోలిస్తే 60-64 ఏళ్ల మధ్య వయస్కుల సంఖ్య 44.5 శాతం నుంచి 86.8 శాతం కాగలదని అంచనా. పురుషులలో భార్యా వియోగానికి సంబంధించి 60-64 ఏళ్లవారిలో 10 మందికి ఒకరుగా ఉంటే 5కు చేరుతుందని, 80 ఏళ్లకు మించినవారిలో మూడోవంతు కాగలదని అంచనా.

### (ii) బీకేపీఏఐ అధ్యయనంలో ప్రతిబింబించిన వృద్ధుల దుర్బలత, పరిమాణం

వృద్ధులలో దాదాపు 45 శాతం దారిద్ర్య రేఖకు దిగువనున్న (BPL)వారికి ప్రభుత్వం ఇచ్చే రేషన్‌కార్డు లేదా అంత్యోదయ కార్డు కలిగిన కుటుంబాలకు చెందినవారు. మూడో వంతు వృద్ధులు రూ.1000కన్నా తక్కువ నెలవారీ తలసరి వ్యయం (MPCE)గల కుటుంబాలకు చెందినవారు. ఐదింట రెండు వంతుల మంది వృద్ధులకు వ్యక్తిగత ఆదాయమేదీ లేదు. సగం మంది వృద్ధులు ఆర్థికంగా పూర్తిస్థాయిలో ఇతరులపై ఆధారపడినవారే. చివరగా చూస్తే ఇతరత్రా ఎలాంటి భద్రతలేని కారణంగా 25 శాతం వృద్ధులకు తప్పనిసరిగా ఆర్థిక మద్దతు అవసరం. మొత్తంమీద హేతుబద్ధ కచ్చితత్వంతో చెబితే సుమారు 40 నుంచి 50 శాతం వృద్ధులు ఆర్థికంగా దుర్బలులే (బీపీఎల్ లేదా ఆర్థికంగా పూర్తిస్థాయిలో ఆధారపడాల్సిన వృద్ధుల శాతం ప్రాతిపదికన ఈ అంచనాకు వచ్చాం). మరో 25 శాతం వృద్ధులకు (అతి తక్కువ సంపన్నవర్గంలో ఉండటం, ఎలాంటి ఆస్తులు లేదా ఏ విధమైన

ఆర్థిక మద్దతు లేకపోవడంవల్ల) సమస్య మరింత తీవ్రంగా ఉంది. పురుషులతో పోలిస్తే వృద్ధ మహిళలు... ప్రత్యేకించి వితంతువులు-(i) ఆదాయం లేమి (పురుషులలో 26 శాతం, మహిళలు 59 శాతం), (ii) ఆస్తులు లేకపోవడం (పురుషులు 11 శాతం, మహిళలు 34 శాతం, వితంతువులు 28 శాతం, విదురులు 14శాతం), (iii) ఆర్థికంగా పూర్తి పరాధీనత (పురుషులు 33 శాతం, మహిళలు 66 శాతం) వంటి కారణాల వల్ల ఆర్థికంగా అత్యంత దుర్బల స్థితిలో ఉన్నారు. అదృష్టవశాత్తూ ఈ వృద్ధులలో 70 శాతం తమ యుక్తవయసు సంతానంతో జీవిస్తుండగా, కేవలం 6 శాతం మాత్రమే ఒంటరిగా నివసిస్తున్నారు. అయితే, అత్యంత పేదవారిలో (ఏ ఆస్తులూ లేనివర్గం) దాదాపు మూడోవంతు సామాజిక భద్రత తప్పనిసరి అయిన పరిస్థితుల నడుమ ఒంటరిగా లేదా జీవిత భాగస్వామితో బతుకీడుస్తున్నారు. వృద్ధాప్యంలో ప్రభుత్వమే తమను ఆదుకోవాలని ప్రతి ఐదుగురు పురుషులు, మహిళల్లో ఒకరు అభిప్రాయ పడుతున్నారు.

## 4. ప్రభుత్వ చర్యలు

దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధులకు నగదు రూపేణా (ఇందిరాగాంధీ జాతీయ వృద్ధాప్య పింఛన్ పథకం-IGNOAPS, ఇందిరాగాంధీ జాతీయ వితంతు పింఛన్ పథకం-IGNWPS), ఇతర రూపాల్లోనూ (ఆహారభద్రత కింద వస్తుసేవలు, వృద్ధులకు జాతీయ కార్యక్రమం కింద ఆరోగ్య సేవలు-NPHCE, వివిధ మంత్రిత్వశాఖల నుంచి రాయితీలు, సౌకర్యాలు) సామాజిక భద్రత కల్పిస్తున్నాయి. అలాగే కొన్ని రాష్ట్రాలు వివిధ పథకాలను అమలు చేస్తున్నాయి. ఉదాహరణకు కేరళలో కార్మిక సంక్షేమ బోర్డుల పింఛన్ పథకాలు; తమిళనాడులో అనాథలు, భర్త వదిలేసిన మహిళలు వంటి దుర్బలవర్గాలకు పింఛన్ పథకాలతోపాటు మధ్యాహ్న భోజన పథకం; పశ్చిమ బెంగాల్‌లో వృద్ధశ్రీ, సంజ్‌భాతి పథకాలు; ఒడిశాలో మధుబాబు పింఛన్ పథకం; మహారాష్ట్రలో శ్రావణ్‌బల్ పింఛన్ పథకం, సంజయ్‌గాంధీ అనాథ మహిళల పింఛన్ పథకం; పంజాబ్‌లో ఆటా (పిండి), దాల్ (పప్పు) పథకం వంటివి నిర్వహిస్తున్నారు. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు తమ పింఛన్ పథకాలను IGNOAPS లేదా IGNWPSలో విలీనం చేశాయి.

### ఇందిరాగాంధీ జాతీయ వృద్ధాప్య పింఛన్ పథకం (IGNOAPS)

కేంద్ర ప్రభుత్వం అనాథ వృద్ధుల కోసం ఈ పథకాన్ని తొలుత GNOAPS పేరిట 1995లో ప్రారంభించగా ఆ తర్వాత 2007లో దీని పేరును IGNOAPSగా మార్చారు. ఈ పథకం కింద 60-79 ఏళ్ల మధ్య వయస్కులకు ఇచ్చే పింఛన్ మొత్తాన్ని 2011లో రూ.200కు, 80 ఏళ్లు దాటినవారికి రూ.500కు పెంచారు. దీనికయ్యే మొత్తం వ్యయాన్ని కేంద్రమే రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేస్తుండగా, బీపీఎల్ కుటుంబాల్లో 65 ఏళ్లకు పైబడిన (ప్రస్తుతం 60ఏళ్లు) వారిలో 50 శాతం జనాభాకు లబ్ది పరిమితం చేశారు. ఈ పథకం కింద లబ్ది దారులను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాల మేరకు పంచాయతీలు ఎంపిక చేస్తాయి. ఈ పథకం కింద రాష్ట్రాలకు నిధుల కేటాయింపు, పింఛన్ల సంఖ్యను "సంఖ్య పరంగా పరిమితి = రాష్ట్రంలో 65 ఏళ్లకు పైబడిన జనాభాలో సగం × రాష్ట్రంలో పేదరిక నిష్పత్తి" సూత్రం ప్రకారం కేంద్రం నిర్ణయిస్తుంది. ఈ పథకం కింద 2008నాటికి సుమారు 65 లక్షల మంది లబ్ధిపొందారు. ఇక కొత్త జాతీయ వృద్ధపౌరుల విధానం-2011 ప్రకారం IGNOAPS కింద ఇచ్చే పింఛన్ మొత్తాన్ని నెలకు రూ.1000గా నిర్ణయించారు.

### ఇందిరాగాంధీ జాతీయ వితంతు పింఛన్ పథకం (IGNWPS)

ఈ పథకాన్ని 2009లో ప్రారంభించగా దారిద్ర్య రేఖకు దిగువనున్న 40-64 ఏళ్ల మధ్య వయస్కులైన (తర్వాత 40-59గా సవరించారు) వితంతువులైన లబ్దిదారులకు తలసరి నెలకు రూ.200 వంతున పింఛన్ మంజూరు చేశారు. వారికి 60 ఏళ్లు నిండిన తర్వాత ఇందిరాగాంధీ జాతీయ వృద్ధాప్య పింఛన్ పథకానికి అర్హులుగా పరిగణిస్తారు.

## 5. IGNOAPS, IGNWPSలపై అవగాహన, వినియోగం

నిర్దేశిత అసహాయ వృద్ధులకు ఈ పథకాలవల్ల లబ్ది చేకూరిందా.. లేదా? అన్నది ప్రస్తుత కీలకాంశం. బీకేపీఏఐ అధ్యయనం ప్రకారం ఇందులో పాల్గొన్న వృద్ధులలో అవగాహన స్థాయి IGNOAPSపై 79 శాతం, IGNWPSపై 72 శాతంగా నమోదైంది. అయితే, IGNOAPSను వినియోగించుకున్నవారు 13 శాతం కాగా, IGNWPSను వినియోగించుకున్న వితంతువులు 20 శాతం మాత్రమే కావడం గమనార్హం. ఇక బీపీఎల్ వృద్ధులలో 81 శాతం పురుషులు, 71 శాతం మహిళల్లో IGNOAPSపై అవగాహన ఉన్నప్పటికీ బీపీఎల్ పురుషులలో కేవలం 21 శాతం, మహిళల్లో 15 శాతం మాత్రమే ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. ఇక IGNWPS విషయానికొస్తే... బీపీఎల్ వృద్ధ మహిళల్లో 70 శాతానికి దీనిపై అవగాహన ఉన్నా కేవలం 20 శాతం మాత్రమే దీనిద్వారా లబ్ది పొందారు. ఈ పథకాల లబ్దికి సంబంధించి రాష్ట్రాలవారీగా వ్యత్యాసాలు ఉన్నప్పటికీ మొత్తంమీద IGNOAPS వినియోగంలో పంజాబ్, ఒడిశా, హిమాచల్‌ప్రదేశ్ మెరుగైన స్థానాల్లో ఉన్నాయి. అలాగే IGNWPS వినియోగంలో ఒడిశా, కేరళ, పశ్చిమ బెంగాల్, హిమాచల్‌ప్రదేశ్ మెరుగ్గా ఉన్నాయి.

## 6. పథకాల తక్కువ వినియోగానికి కారణాలు

వివిధ రాష్ట్రాలలో పథకాల అమలు అనుభవాలకు సంబంధించి బీకేవీఏఐ అధ్యయనం సందర్భంగా సేకరించిన గుణాత్మక సమాచారం ప్రకారం వీటి తక్కువ వినియోగానికి కారణాలు ఇలా ఉన్నాయి:-

- వ్యక్తిగత గుర్తింపు, వయసు, బీపీఎల్ గుర్తింపు, పంచాయతీ సభ్యుల సిఫారసు వంటి ధ్రువీకరణ పత్రాల సమర్పణలో పేద, నిరక్షరాస్యులైన వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ పరిస్థితులతో దళారుల ప్రవేశం, లంచాలు, అవినీతి, కుల దురభిమానం వంటివాటికి ఆస్కారం ఏర్పడింది.
- బీపీఎల్ జాబితా కచ్చితత్వానికి సంబంధించిన సమస్యలవల్ల మోసాలు, నకిలీలకు దారితీసింది.
- పింఛన్ పొందడం కోసం దీర్ఘకాలం ఎదురుచూడాల్సి రావడం.
- అవసరాలకు సరిపోని పింఛన్ మొత్తం
- అర్హులైన లబ్ధిదారుల గుర్తింపులో వైఫల్యంవల్ల కేటాయించిన నిధులను రాష్ట్రాలు తక్కువగా వినియోగించుకోవడం.

ఈ పరిమితుల మాట అలా ఉంచితే, సదరు పథకాల పనితీరు, ప్రభావంపై కొందరు పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హులైన వృద్ధులకు లబ్ధి చేకూర్చడంలో ఒడిశా, తమిళనాడు వంటి రాష్ట్రాలు మెరుగైన పర్యవేక్షణ యంత్రాంగాలు, వినూత్న పద్ధతులను అనుసరించాయి. ఓ అంచనా ప్రకారం ప్రస్తుతం దేశంలోని 60 లక్షల మంది పెద్దలు వృద్ధాప్య పింఛను అందుకుంటుండగా, 30 లక్షల మంది వితంతు పింఛన్ పొందుతున్నారు. జాతీయ స్థాయిలో వృద్ధాప్య పింఛన్ల విస్తరణ 7 శాతం (50 లక్షల మంది లబ్ధిదారులు) దాకా ఉందని న్యూఢిల్లీలోని జాతీయ అనువర్తిత ఆర్థిక పరిశోధన మండలి (NCEAR), అమెరికాకు చెందిన మేరీలాండ్ విశ్వవిద్యాలయం నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది.

## 7. సార్వత్రిక పింఛన్ కోసం డిమాండ్

ఈ సమస్యలన్నిటినీ అధిగమించాలంటే "వాటాతో నిమిత్తంలేని, సార్వత్రిక వృద్ధాప్య పింఛన్ వ్యవస్థ" అవసరమని పెన్షన్ పరిషద్ డిమాండ్ చేసింది. దీనికింద 55+ ఏళ్లున్న పురుషులు, 50+ ఏళ్లున్న మహిళలకు నెలకు రూ.2000 లేదా కనీస వేతనంలో 50 శాతం- వీటిలో ఏది ఎక్కువైతే ఆ మొత్తాన్ని పింఛన్ కింద ఇవ్వాలని ప్రతిపాదించింది. అయితే, ఆదాయపు పన్ను చెల్లింపు పరిమితి దాటినవారు, ఇతర వనరులద్వారా పైన పేర్కొన్న మొత్తంకన్నా ఎక్కువ పెన్షన్ పొందుతున్నవారిని దీన్నుంచి మినహాయించాలని సూచించింది.

సాధారణ లెక్కల ప్రకారం 60 ఏళ్లు, అంతకన్నా అధిక వయస్కులకు నెలకు రూ.2000 వంతున చెల్లిస్తే ప్రభుత్వంపై రూ.2,49,238కోట్ల ఆర్థికభారం పడుతుంది. కానీ, ప్రస్తుత పెన్షన్ పథకాలపై వ్యయాన్ని పొదుపు చేయగలిగితే వాస్తవభారం ఇంతకన్నా తక్కువగానే ఉంటుంది. ఈ సందర్భంగా అన్నిరకాల ప్రజాకర్షక చర్యలవల్ల విస్తృతితోపాటు వ్యయం కూడా పెరిగి, ప్రభుత్వ వనరులపై మరింత భారం పడుతుందన్న వాస్తవాన్ని గుర్తించడం అవసరం. అలాగే ఈ భారం హెచ్చు పన్నులకు, ద్రవ్యోల్బణ ఒత్తిడి లేదా రెండింటికీ దారితీయడం... ఫలితంగా వృద్ధులుసహా అందరిపైనా ప్రభావం పడటం వంటి పరిస్థితి కూడా ఏర్పడుతుంది. అందువల్ల తగిన మినహాయింపు ప్రమాణాన్ని నిర్దేశించడం కూడా కీలకం. ప్రతిపాదిత సార్వత్రిక పెన్షన్ పథకం కింద ఆదాయపు పన్ను చెల్లింపుదారులను మినహాయిస్తున్నా గ్రామీణ, వ్యవసాయ రంగాలకు సంబంధించి వృద్ధుల అర్హత ప్రమాణాలను నిర్ణయించడం కాస్త కష్టంతో కూడుకున్నదే. అయితే, ఆదాయ భద్రత ప్రధానమే అయినా, ఆరోగ్య-ఆహార భద్రత దిశగా పేదలకు ప్రత్యక్షంగా అందిస్తున్న ఉచిత సేవలకు అది ప్రత్యామ్నాయం మాత్రం కాబోదు.

## 8. ప్రస్తుత ప్రభుత్వ ఇటీవలి చర్యలు

ప్రస్తుత ప్రభుత్వం అటల్ పెన్షన్ యోజన (APY), ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (PMJDY), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన, (PMJJY), ప్రధానమంత్రి జన సురక్ష యోజన (PMJSBY) వంటి పథకాలను ప్రారంభించింది. అయితే, ఇవన్నీ లబ్ధిదారుల వాటాతో కూడినవేగాక, వృద్ధులకు ప్రత్యేకించినవికావు గనుక ఇప్పటిదాకా చర్చించిన పథకాలతో వీటిని పోల్చలేం. ఏదేమైనా భవిష్యత్ వృద్ధ తరం భద్రతలో వీటి ప్రభావం తప్పకుండా ఉంటుందన్న సూచనలు సుస్పష్టంగా కనిపిస్తున్నాయి.

అటల్ పెన్షన్ యోజన కింద అసంఘటిత రంగంలోని చందాదారులకు నెలవారీగా రూ.1000 నుంచి 5వేల దాకా పింఛన్‌కు హామీ ఉంటుంది. ఇందుకోసం చందాదారు వాటాలో 50 శాతం లేదా ఏడాదికి రూ.1000 ఏది తక్కువైతే అంత మొత్తాన్ని ప్రభుత్వం తన వాటాకింద APY నిధికి సమకూరుస్తుంది. అలాగే ఆదాయపు పన్ను చెల్లింపుదారులు కానివారు, ఇతరత్రా చట్టబద్ధ పింఛన్ పథకం పరిధిలో లేనివారు మాత్రమే ఈ పథకం కింద లబ్ధికి అర్హులు. కాగా, 2015 జూన్ 1 నుంచి డిసెంబరు 31వరకు ఈ పథకంలో చేరిన చందాదారులకు ప్రభుత్వం ఐదేళ్లపాటు మాత్రమే తన వాటా చెల్లిస్తుంది.

ప్రధానమంత్రి జన సురక్ష బీమా యోజన 2015లో ప్రారంభమైంది. దీని

కింద ప్రమాద బీమాకు ప్రభుత్వ మద్దతు లభిస్తుంది. బ్యాంకు ఖాతాగల 18-70 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తులు వార్షిక బీమా రుసుముగా రూ.12 చెల్లించి, లేదా తమ ఖాతానుంచి తగ్గించుకోవడం ద్వారా ఈ పథకాన్ని వినియోగించుకోవచ్చు. ఈ బీమా రక్షణ పొందినవారు ప్రమాదాల్లో మరణించినా, పూర్తి శారీరక వైకల్యానికి గురైనా రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యానికి గురైతే రూ.లక్ష వంతున బీమా కింద చెల్లిస్తారు. ఈ పథకాన్ని 2014లో ప్రారంభించిన ప్రధానమంత్రి జన్‌ధన్ యోజనకు అనుసంధానించారు.

ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన కింద బ్యాంకు ఖాతాలున్నవారికి వివిధ ఆర్థిక సేవలు అందుబాటులో ఉంటాయి. ఆ మేరకు అవసరం ఆధారిత రుణపరపతి, బీమా, చెల్లింపులు, నిల్వకన్నా ఎక్కువ వాడకం వంటి సదుపాయాలుంటాయి. ఈ పథకం కింద పైసా కూడా జమ చేయకుండానే ఖాతా తెరవడంతోపాటు సదరు ప్రక్రియ కూడా చాలా సరళంగా ఉంటుంది. ఈ ఖాతాదారులు ప్రమాదంలో మరణిస్తే రూ.లక్ష, సహజ మరణమైతే రూ.30 వేలు వంతున బీమా రక్షణ ఉంటుంది. దేశవ్యాప్తంగా ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 27 కోట్ల జన్‌ధన్ ఖాతాలు ప్రారంభం కాగా, వాటిలో రూ.66,500 కోట్లు జమయ్యాయి. అయితే, ఈ పథకం కింద నిల్వకన్నా ఎక్కువ వాడకం వంటి సదుపాయాలను వినియోగించడం కోసం చాలావరకూ నకిలీ ఖాతాలు ప్రారంభించబడ్డాయని, వీటివల్ల ప్రభుత్వరంగ బ్యాంకులపై అధికభారం పడుతున్నదని కూడా విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన 2015లో ప్రారంభం కాగా, 18-50 ఏళ్ల మధ్య వయస్కులు ఏటా మే 31వ తేదీలోగా రూ.330 వంతున వార్షిక రుసుము చెల్లించి ఈ బీమాను తీసుకోవచ్చు. పాలసీదారు మరణిస్తే ఈ పాలసీ కింద వారి కుటుంబానికి రూ.2 లక్షల మేర బీమా రక్షణ ఉంటుంది. అయితే, ఈ పథకాల పనితీరును ఇప్పుడప్పుడే లోతుగా మూల్యాంకనం చేయడం తగదు. ఇతరుల తరహాలోనే కొందరు వృద్ధులు కూడా ఈ వాటాతో కూడిన పథకాలద్వారా లబ్ధి పొందవచ్చు. అయితే, పేదలతోపాటు ఆర్థికంగా పూర్తి పరాధీనులు, దుర్బలులు, ఆస్తి లేదా ఆదాయం లేనివారికి భద్రతే ఇక్కడ అసలు సమస్య. ఈ దిశగా హేతుబద్ధ మినహాయింపు ప్రమాణాలతో భద్రత అవసరమైనవారిని గుర్తించడం, దరఖాస్తు ప్రక్రియను సరళీకరించడం, సమర్థ అమలు వ్యవస్థ ప్రధాన సవాళ్లు. చివరగా డబ్బుతో ముడిపడిన ఏ పథకమైనా, అది ఎంత చక్కగా రూపొందినా సమర్థ పర్యవేక్షణ యంత్రాంగం తోడ్పాటు లేకపోతే అవినీతికి, అరుదైన వనరుల వృథాకు దారితీసే ప్రమాదం ఉందని నొక్కి చెప్పాల్సిన అవసరం ఉంది. ■


**యోజన అభిమానులకు సూచన:**

యోజన పత్రిక యాజమాన్యం వీలైనంతవరకు సంచికను సకాలంలో పాఠకులకు అందచేయాలని కృషిచేస్తుంది. అయితే, అనేక కారణాలవల్ల, చందా కట్టిన వెంటనే పాఠకులకు పత్రికను పంపటం వీలుకాదు. చందావివరాలు మాకు చేరాలి, ఆసమయానికి సంచిక అందుబాటులో ఉండాలి. ఈ కారణాలవల్ల ఆన్‌లైన్ చందాదారులకు ఒక్కొక్కసారి చందా కట్టిన 15, 20 రోజుల తరువాతనే సంచికను పంపటం వీలవుతుంది. యోజన తెలుగు పత్రికకు 20వ తేది తరువాత అందిన చందాలకు, ఆ తరువాత నెలనుండే సంచికను పంపడం వీలవుతుంది. పత్రికను ఎప్పుడూ, సాధారణ పోస్టు ద్వారానే పంపుతాము. దీనికి రికార్డేమీ ఉండదు. ఒకవేళ ఎవరికైనా పత్రిక అందకపోతే, బదులుగా మరో సంచికను పంపడం లేదా చందాను సర్దుబాటు చేయడం వీలుకాదు. చందాదారులే తమ చిరునామా సరిచూసుకోవడం, స్థానిక పోస్టుమ్యాన్‌తో మాట్లాడటం చేయాలి. గమనించగలరు.

–సీనియర్ సంపాదకుడు.

# నత్తనడకన సాగుతున్న అందరికీ ఆరోగ్యం పథకం

– ప్రొఫెసర్ కె. సీతాప్రభు




**దేశంలోని ప్రాథమిక ఆరోగ్యానికి మరిన్ని జవజీవాలనివ్వడానికి జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకాన్ని (ఎన్.ఆర్.హెచ్.ఎం.) 2005లో ప్రకటించారు. ఇలాంటి విధానపరమైన చొరవలున్నప్పటికీ, అందరికీ ఆరోగ్యం అనేది ఇప్పటికీ మనదేశంలో అందని మానిపండే అయింది. బంగ్లాదేశ్ వంటి అల్పాదాయ దేశాలకన్నా తక్కువస్థాయిలోనూ, సహస్రాబ్ది లక్ష్యాలలో ఒకటైన ఆరోగ్య లక్ష్యానికి బారెడు దూరంలోనే ఉన్నది. దేశంలోని వివిధ రంగాలలో ఉన్న అసమతౌల్య అభివృద్ధి స్థితే ఆరోగ్యరంగలోనూ కనిపిస్తున్నది.**

ఆర్థిక స్థిరీకరణ కాలంలోనూ, క్లిష్ట సమయాలలోనూ సామాజిక భద్రత ప్రముఖ పాత్ర వహిస్తుంది. బెవరిడ్జి కమిటీ 1942లో సాంఘిక భద్రత అంటే “కోర్కెల నుండి విముక్తి” అని నిర్వచించింది. ఈ నిర్వచనం అత్యంత సమగ్రంగా ఉన్నది. అయితే విస్తృతమైన వినియోగ పరిధివల్లనూ, 1950ల్లో అంతర్జాతీయ కార్మిక సంస్థ అదనంగా ఇచ్చే సౌకర్యంగా సాంఘిక భద్రతను నిర్వచించడంతో ఈ నిర్వచనం వినియోగంలోకి రాలేదు. అయితే 1989లో డ్రెజే, సేన్‌లు ఈ నిర్వచనాన్ని అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో మరింత విస్తృతపరచడానికి ప్రయత్నించారు. మనదేశం వంటి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో సాంఘిక ఆర్థిక భద్రత అనివార్యమని అన్నారు. అందుకే, ఆరోగ్య భద్రత అనేది సాంఘిక భద్రత వంటి విస్తృతమైన పరిధిలోనిదని చెప్పవచ్చు.

**అందరికీ ఆరోగ్యం:**

ఆరోగ్య భద్రత అనేది అందరికీ ఆరోగ్యం అనే సూత్రంతో (1978లో ప్రకటించినట్లు) 2000 సంవత్సరం నాటికి అందరికీ ఆరోగ్యం అనే ప్రకటనతో ముందుకు వచ్చింది. ఈ ప్రకటనతో, భారతీయ వైద్యవిజ్ఞాన సంస్థ–ఐ.సి.ఎస్.ఎస్.ఆర్.ల నివేదిక ప్రేరణగా భారత ప్రభుత్వం 1983లో జాతీయ ఆరోగ్య విధానాన్ని ప్రకటించింది. దీన్ని తరువాత 2002లో సవరించింది. దేశంలోని ప్రాథమిక ఆరోగ్యానికి మరిన్ని జవజీవాలనివ్వడానికి జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకాన్ని (ఎన్.ఆర్.హెచ్.ఎం.) 2005లో ప్రకటించారు. ఇలాంటి విధానపరమైన చొరవలున్నప్పటికీ, అందరికీ ఆరోగ్యం అనేది ఇప్పటికీ మనదేశంలో అందని మానిపండే అయింది. బంగ్లాదేశ్ వంటి అల్పాదాయ దేశాలకన్నా తక్కువస్థాయిలోనూ, సహస్రాబ్ది లక్ష్యాలలో ఒకటైన ఆరోగ్య లక్ష్యానికి బారెడు దూరంలోనే ఉన్నది. దేశంలోని వివిధ రంగాలలో ఉన్న అసమతౌల్య అభివృద్ధి స్థితే ఆరోగ్యరంగంలోనూ కనిపిస్తున్నది. అధికాదాయము, ఆదాయ అసమతుల్యాలు పరిస్థితిని మరింత క్లిష్టం చేశాయి. దీనిప్రభావం అనుబంధ రంగాలపై కూడా పడింది. దీనితో అత్యంత కీలకమైన నివారణ, చికిత్స అంశాలు మరుగున పడ్డాయి. దీనితో దేశంలోని పేదల ఆరోగ్యం డోలాయమాన స్థితిలోపడింది. **2008వ సంవత్సరంలో మనదేశంలో అంటువ్యాధుల వల్ల జరిగిన 5.2 మిలియన్ల మరణాలు మొత్తం మరణాలలో 53 శాతంగా ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పింది.** గ్రామీణ, పట్టణ

టాటా ఛెయిర్ ప్రొఫెసర్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ముంబయి.
E-mail: seeta.prabhu@tiss.edu

ఆరోగ్య స్థాయిలపై ఆదాయ అసమానతలు కూడా ప్రభావం చూపుతు న్నట్లు ఒక అంచనా! ఐక్యరాజ్యసమితివారి అభివృద్ధి అంచనాలప్రకారం ఆరోగ్య అసమానతలవల్ల మనదేశం 2015లో 24 శాతం ఆరోగ్య సూచిని కోల్పోయింది.

స్థిరమైన ప్రాథమిక ఆరోగ్య రక్ష, వ్యాధినివారణ చర్యల పట్ల రాజకీయ నేతలకు విద్యారంగంపై ఉన్నంత నిబద్ధతలేక పోవడం వల్ల, అందరికీ ఆరోగ్యం అనేది, 'ఆంధ్ర ప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ పథకంవల్ల అధికార పార్టీకి ఐదు శాతం ఓట్లు అధికంగా వచ్చినట్లు' ఎన్నికలలో ఎప్పుడూ ప్రధానాంశం కాలేదు. అంతేకాదు, ఆరోగ్యరంగానికి చేస్తున్న అరకొర కేటాయింపులు కూడ రాజకీయ నిర్లక్ష్యాన్ని సూచిస్తున్నది. ఇప్పటికీ మనదేశ స్థూల జాతీయోత్పత్తిలో కేవలం 1.5 శాతం మాత్రమే ఆరోగ్యరంగానికి కేటాయిస్తున్నాం. అంటే, ప్రజల ఆరోగ్య వ్యయంలో 75శాతం వారే భరిస్తున్నారు. దీనితో ఆరోగ్యవ్యయం ప్రైవేటు ఆసుపత్రులలో ఆకాశాన్నంటుతున్న నేటి పరిస్థితులలో ఒక సాధారణ మధ్యతరగతి వ్యక్తి ఎవరైనా దురదృష్టవశాత్తూ తీవ్ర అనారోగ్యం బారిన పడితే, అతను దారిద్ర్య రేఖ దిగువకు చేరుతున్నాడు.

**మనదేశంలో ఆరోగ్యబీమా:**

గతంలో ఆదాయ అసమానతలు, ఆరోగ్య అసమానతలతో కునారిల్లిన బ్రెజిల్, బొలీవియా, ఇండోనేషియా, థాయ్‌లాండ్ వంటి దేశాలన్నీ 1980లలో తమ ఆరోగ్య విధానాలను సంస్కరించుకుని అందరికీ ఆరోగ్యం దిశగా అడుగులువేశాయి. థాయ్‌లాండ్‌లోని 30 బహ్త్ పథకం, ఇండోనేషియాలోని సంస్కరణల వికేంద్రీకరణ, సామాజిక ఆరోగ్యబీమా, బ్రెజిల్‌లో అమలవుతున్న అందరికీ సమాన ఆరోగ్య సేవలు పథకం వంటి కార్యక్రమాలన్నీ అద్భుత ఫలితాలను చూపాయి. ప్రాథమిక ఆరోగ్య మౌలిక సౌకర్యాలను మెరుగుపరిస్తే, గ్రామీణ ప్రాంతాలలో సంస్థాగత ప్రసవాలు ఎంత ఆరోగ్యకరంగా జరుగుతాయో ఈ ఫలితాలు నిరూపించాయి. దీనితో ఆయా దేశాలలో మాతా-శిశు మరణాలు కూడ గణనీయంగా తగ్గాయి. మనదేశంలో రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజనను 2008లో ప్రారంభించారు. ముఖ్యంగా పేదవారికి తీవ్ర అనారోగ్యాలు కలిగినప్పుడు భారీగా అయ్యే వ్యయంనుండి ఊరట కలిగించడానికి, నాణ్యమైన ఆరోగ్యసేవలను వారికి అందుబాటులోకి తేవడానికి ఈ పథకాన్ని నిర్దేశించారు. మొదట్లో ఈ పథకాన్ని కేవలం దారిద్ర్యరేఖకు దిగువనున్న వారికి మాత్రమే నిర్దేశించినప్పటికీ, తరువాత అసంఘటిత రంగంలోని కార్మికులకు, రిక్షా కార్మికులకు, చెత్తకాగితాలు ఏరుకునేవారికి కూడ విస్తరించారు. ఈ పథకం కింద కుటుంబానికి కేవలం సంవత్సరానికి రూ. 30/-లతో నమోదు చేసుకున్నవారు ఆసుపత్రిలో చేరితే అయ్యే వ్యయాన్ని రూ. 30,000/- ల వరకూ చెల్లిస్తారు. ఈ సహాయ మొత్తాన్ని ఇటీవల లక్ష రూపాయలకు పెంచారు. ఈ పథకం కింద మార్చి, 2016 వరకు 41.3 మిలియన్ల కుటుంబాలు నమోదు చేసుకున్నాయి. అయితే ఆసుపత్రిలో చేరిన కేసులు మాత్రం కేవలం 11.8 మిలియన్లే, అంటే పథకాన్ని వినియోగించుకోవడం అల్పంగా ఉన్నది. అంతేకాదు, రోగులు ఆసుపత్రి బయట పెట్టాల్సిన ఖర్చుకూడ గణనీయంగా ఉండటంతో పథక లక్ష్యం ఇంకా నెరవేరింది లేదు. ఎనిమిది రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్య బీమా పథకాలను నిర్వహిస్తున్నాయి. కర్ణాటకలోని వాజపేయి ఆరోగ్యశ్రీ పథకం, యశస్వినీ సహకార రైతు ఆరోగ్య పథకం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలోని రాజీవ్ గాంధీ ఆరోగ్యశ్రీ పథకం, తమిళనాడులోని ముఖ్యమంత్రి ఆరోగ్య పథకం, మహారాష్ట్రలోని జీవనదాయీ ఆరోగ్య బీమా పథకం, గుజరాత్‌లోని ముఖ్యమంత్రి అమృతం పథకం, ఛత్తీస్‌గఢ్‌లోని సంజీవనికోష్ పథకము ముఖ్యమైనవి. వీటిలో ఆంధ్రప్రదేశ్ లోని రాజీవ్‌గాంధీ ఆరోగ్యశ్రీ పథకం 85శాతం ప్రజలకు అందుబాటులో ఉండి, దాదాపు సంపూర్ణ ఆరోగ్య బీమాను అందిస్తున్నట్లు ఉన్నది. అయితే, దీనిలో ప్రాధాన్యాలు సరిగా లేకపోవడం అంటే నగానికి పైగా కేటాయింపులను కేవలం గుండెజబ్బులు, కాన్సర్, కిడ్నీ వ్యాధులకు మాత్రమే అందిస్తుండటం వల్ల, క్షయ, ఊపిరితిత్తుల వ్యాధులు వంటి మహమ్మారుల బారిన పడుతున్న 40 శాతం పేదలకు ఈ పథకం సుదూరంలోనే ఉన్నది. మొత్తం మీద, 2015 లెక్కల ప్రకారం 280 మిలియన్ల మందికి, అంటే నాలుగవ వంతు జనాభాకు ఆరోగ్యబీమా అందుతున్నట్లే! ఇదేకాక, ప్రభుత్వమే నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ సిబ్బంది ఆరోగ్య పథకం (సిజిహెచ్ఎస్), కార్మిక ఆరోగ్య బీమా పథకం (ఈ.ఎస్.ఐ.) వంటి పథకాలు కూడ ఉండనే ఉన్నాయి. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఏ ఆరోగ్య బీమా పథకం కూడ, ఒక్క మేఘాలయ రాష్ట్రం మినహాయించి, సంపూర్ణ భద్రతను కల్పించడం లేదు.

**ముందడుగు:**

2017లో ప్రతిపాదించిన మన జాతీయ ఆరోగ్య విధానం మాత్రం దాదాపు సమగ్ర ఆరోగ్య భద్రతకు హామీనిస్తుందని మాత్రం చెప్పవచ్చు. ఎలాగంటే, దీనిలో అనారోగ్యం అంటే, రోగం లేకపోవడం కన్నా, ఆరోగ్యంగా ఆనందంగా ఉండటంగా నిర్వచించారు. రెండవది, ప్రాథమిక ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చి అమలులో ప్రభుత్వరంగానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. అయితే ఆశ్చర్యకరంగా వ్యయం పెరుగుతున్నప్పటికీ, ఈ విధానంలో ఆరోగ్య రంగానికి మొత్తం స్థూల దేశీయోత్పత్తిలో కేవలం 2.5 శాతం మాత్రమే కేటాయించారు. అయితే, ఆర్థిక ఒత్తిడుల నుండి ఉపశమనంగా ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాలను ఆరోగ్యరంగంలో ప్రోత్సహిస్తున్నారు. అయితే,

*తరువాయి 32వ పేజీలో...*

# దివ్యాంగులకు సామాజికభద్రత

– సంధ్య లిమాయే



దివ్యాంగులకు, ఉపాధి పొందలేనివారికీ ప్రభుత్వమే తగిన సహాయం చేయాలని చెపుతుంది మన రాజ్యాంగం. మన ఆర్థిక వ్యవస్థలో వీలున్నంత వరకు అంటే స్తోమతు అనుమతించిన వరకు ప్రజలకు విద్య, పని హక్కులను కల్పించాలని ఆర్టికల్ 41 చెపుతున్నది. ఉపాధి లేనివారికీ, వృద్ధులకు, అనారోగ్యంతోనూ, వైకల్యంతోనూ ఉన్న వారికి సహాయ మందించాలని కూడా ఈ ఆర్టికల్ చెపుతున్నది.

మనదేశంలో సంప్రదాయికంగా కుటుంబమే ఒక అనధికార సామాజిక భద్రతా కూటమి. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలలో ఒకరికెవరికైనా ఏదైనా అవసరం/సమస్య వస్తే మరొకరు మద్దతుగా నిలబడేవారు. పారిశ్రామిక విప్లవం ఫలితంగా ఆధునికత, పట్టణీకరణ, పట్టణప్రాంతాలలో ఉద్యోగావకాశాలు కారణంగా ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమైపోయాయి. దీనితో సామాజిక భద్రత కూడా కుంటుపడింది. కనుక ప్రజల సంరక్షణ బాధ్యత ఇప్పుడు ప్రభుత్వానిదే! ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాలే సామాజిక సంక్షేమమంటే! అంటే మరో మాటలో చెప్పాలంటే, సమాజంలోని చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు వంటి బలహీన వర్గాల వారి జీవన నాణ్యతను పెంపొందించడానికి సామాజిక సంక్షేమం అనేది ఉండాలి. మనదేశంలో సామాజిక సంక్షేమమంటే సామాజిక బీమా, జాతీయ స్థాయి సహాయ మొత్తాలు, యజమాని ఉద్యోగులకు ఇచ్చే మద్దతు వంటివన్నమాట!

మనదేశంలో రాజ్యాంగంలోని 43వ ఆర్టికల్ ప్రజలకు కల్పించాల్సిన సామాజిక భద్రతను గురించి, ప్రభుత్వ బాధ్యతల గురించి వివరించింది. ఏడవ షెడ్యూల్‌లోని 14వ ఆర్టికల్ చట్టం ముందు అందరూ సమానులేనని చెపుతుంది. వికలాంగులకు, ఉపాధి పొందలేనివారికీ ప్రభుత్వమే తగిన సహాయం చేయాలని చెపుతుంది మన రాజ్యాంగం. మన ఆర్థిక వ్యవస్థలో వీలున్నంత వరకు అంటే స్తోమతు అనుమతించిన వరకు ప్రజలకు విద్య, పని హక్కులను కల్పించాలని ఆర్టికల్ 41 చెపుతున్నది. ఉపాధి లేనివారికీ, వృద్ధులకు, అనారోగ్యంతోనూ, వైకల్యంతోనూ ఉన్న వారికి సహాయ మందించాలని కూడా ఈ ఆర్టికల్ చెపుతున్నది. వికలాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం సామాజిక భద్రత మూడు రకాలుగా ఉన్నది. ఒకటి భద్రత అంటే గర్భవతులకు, శిశువులకు, వారికి జన్మనిచ్చిన తల్లులకు, వికలాంగులకు సహాయమివ్వడం; సామాజిక భద్రతా చర్యలు అంటే నిరుద్యోగ భృతి, బీమా వంటివి, మూడోరకం మద్దతు చర్యలు అంటే ప్రజలకు హింసాత్మక చర్యలనుండి రక్షణ కల్పించడం వంటివి.

**సాంఘిక భద్రత పథకాలు:**

తమ జీవితాలను గడపలేనంత పేదరికంలో ఉన్న దివ్యాంగుల భద్రత కోసం

అసోసియేట్ ప్రొఫెసర్, సెంటర్ ఫర్ డిజెబిలిటీ స్టడీస్ & యాక్షన్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ముంబయి
E-mail: limaye.sandhya@gmail.com

ప్రతి రాష్ట్రం కూడా తమ తమ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అనేక పథకాలను అమలు చేస్తున్నది. ఇందిరాగాంధీ జాతీయ వికలాంగుల పెన్షన్ పథకం, అంగవైకల్యంతో ఉన్నవారు ఏ రంగంలోనైనా విశేష కృషి చేస్తే జాతీయ అవార్డులు ఇవ్వడం, దివ్యాంగ విద్యార్థులకు ఉపకారవేతనాలు, దివ్యాంగులకు కావలసిన ఉపకరణాల కొనుగోలుకు సహాయం, ఉద్యోగాలలో రిజర్వేషన్ వంటివెన్నో అమలులో ఉన్నాయి. స్థూలంగా సంక్షేమ పథకాలను రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకటి నివారణకు ఉద్దేశించినవి, అంటే ఆరోగ్య బీమా, రోగనిరోధక టీకాలు, గర్భవతులకు, మాతా-శిశువుల సంరక్షణ వంటివి. రెండవది ప్రోత్సాహక కార్యక్రమాలు అంటే, దివ్యాంగులకు, వెనుకబడిన వర్గాలవారికి తగిన శిక్షణ, సహాయ కార్యక్రమాలు, విద్యా, పునరావాస సౌకర్యాలు, రిజర్వేషన్లు వంటివి. ఇంతేకాదు, వికలాంగులకు, వృద్ధులకు, మహిళలకూ పన్ను రాయితీలు వంటి అవకాశాలు కూడా ఉన్నాయి. ఇక విద్యారంగానికి వస్తే, 40 శాతం కన్నా అధికంగా వైకల్యం ఉన్నవారికి ఉపకారవేతనాలు, ఫీజుల మినహాయింపు, కంప్యూటర్లు, తమ వైకల్యాన్ని అధిగమించే ఉపకరణాలను అందించడం వంటివెన్నో అమలులో ఉన్నాయి. వికలాంగ విద్యార్థులకు ప్రభుత్వ విద్యాలయాల్లో మూడు శాతం రిజర్వేషన్ వర్తిస్తుంది. వారికి పుస్తకాలు, స్టేషనరీ ఇతర ఉపకరణాలను కూడా ఉచితంగా అందచేస్తారు. అలాగే అంధ విద్యార్థులకు మరికొన్ని ప్రత్యేకమైన మినహాయింపులున్నాయి. 14 సంవత్సరాల పైబడి వయసులో ఉన్న వికలాంగులకు సమ్మిళిత విద్యా కార్యక్రమంలో భాగంగా 9 నుండి 12 తరగతివరకు రెసిడెన్షియల్ విద్యా సౌకర్యాలను అందిస్తారు. రాజీవ్ గాంధీ ఫెలోషిప్ పథకం క్రింద ఎం.ఫిల్/పి.హెచ్.డి. వంటి అత్యున్నత విద్యా పరిశోధనకు ప్రతి సంవత్సరం రెండువందల మందికి ఉపకార వేతనాలను అందిస్తున్నారు.

**ఉద్యోగాలలో ప్రోత్సాహం:**

ప్రభుత్వ ఉద్యోగాలలో గ్రూప్ ఏ,బి,సి,డి వర్గాలలోను, ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, ఇతర ప్రభుత్వ సహాయంతో నడిచే సంస్థలలో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించారు. అలాగే గరిష్ఠ వయోపరిమితిలో సడలింపులు కూడా ఇచ్చారు. ఉద్యోగాల ఎంపికలో పరీక్షలకు గానీ, మరెందుకైనా గానీ ఏవైనా ఫీజులుంటే, వాటిని మినహాయించారు. అంతేకాదు, కొన్ని ప్రత్యేక ఉద్యోగాలను కేవలం దివ్యాంగులకే కేటాయించారు. ఇలాంటివారికి తమ స్వగ్రామానికి సమీపంలోనే నియామకం జరపాలని కూడా విధించారు. వికలాంగుల ఉపాధి కల్పనకు ప్రత్యేక ఉపాధి కేంద్రాలను ప్రారంభించింది. వికలాంగుల ఉపాధికి ప్రాధాన్యమిచ్చిన ప్రైవేటు సంస్థల యజమానులకు అనేక రాయితీలనిస్తున్నది ప్రభుత్వం. పెట్రోలియం మంత్రిత్వశాఖ వికలాంగులకు బంకుల కేటాయింపులో 7.5 శాతం రిజర్వేషన్ ఇస్తున్నది. దివ్యాంగుల ఆర్థిక సహాయ సంస్థ వికలాంగులకు స్వయం ఉపాధి సంస్థలను నెలకొల్పడానికి తగిన ఆర్థిక సహాయం చేస్తున్నది. ప్రభుత్వ రంగ బ్యాంకులు దివ్యాంగుల రుణాల వడ్డీపై రాయితీలనందిస్తున్నాయి. దివ్యాంగుల సాధికారత కార్యక్రమాల ప్రోత్సాహానికి ప్రభుత్వం జాతీయ అవార్డుల రూపంలో ప్రోత్సాహమిస్తున్నది.

**ముందున్న సవాళ్ళు:**

చేదునిజమేమంటే, మనదేశంలో దివ్యాంగుల సంక్షేమానికి లక్ష్యించిన కార్యక్రమాలు సరిగ్గా వారికి చేరడం లేదు. ఇదే కాదు, నిజానికి దేశంలోని అనేక సంక్షేమ కార్యక్రమాలు దివ్యాంగులకు చేరడం లేదు. అందుబాటులోనున్న దివ్యాంగుల ప్రత్యేక సహాయ కార్యక్రమాలు తగినంతగా లేవు. నిజానికి అభిలషణీయమైన అంశమేమంటే, దివ్యాంగుల సహాయ కార్యక్రమాలన్నీ ఏక గవాక్ష విధానంలో అందచేయాలి. అన్నీ రాష్ట్రాలలోని దివ్యాంగులకు ఏకవిధమైన పథకాలు లేవు, అమలు చేసే సంస్థ కూడా ఒకటి కాదు. ఇలాంటి సేవలోనున్న సంస్థలనన్నింటినీ ఏక ఛత్రం కిందకు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.పదవ పంచవర్ష ప్రణాళికలో అమలుచేసిన ప్రత్యేక కాంపొనెంట్ ప్రణాళికలో ప్రతి మంత్రిత్వశాఖ, ప్రతి విభాగము తమకు కేటాయించిన నిధులలో 10శాతాన్ని ఖచ్చితంగా వికలాంగుల సంక్షేమానికి కేటాయించాలి. అయితే ఈ నిర్ణయాన్ని నిర్దిష్టంగా అమలుచేసే యంత్రాంగమేదీ లేకపోవడం ప్రభుత్వ తప్పిదమే. ఇలాంటి లోపాలను సవరించడానికి సమ్మిళిత కార్యక్రమాలను అమలు చేయాలి. సమగ్రమైన పాలనా ఏర్పాట్లు తక్షణమే చేయాలి. అన్ని మార్గాల నుండి నిధులను సమకూర్చుకుని సమర్థుల నేతృత్వంలో అమలు చేయడానికి తక్షణమే తగిన చర్యలను చేపట్టాలి. ■


**ప్రచురణల విభాగం వారి హోమ్ లైబ్రరీ పథకం: పుస్తకప్రియులకు శుభవార్త:**

మా ప్రచురణల విభాగం అమలు చేస్తున్న హోమ్ లైబ్రరీ పథకం పథక సభ్యులకు వందరూపాయలపై బడిన పుస్తక కొనుగోలుపై 20 శాతం ముదరా ఇస్తారు. పోస్టేజి ఉచితం. సభ్యులకు ఉచితంగా మా ప్రచురణల కేటలాగును కూడ అందచేస్తాం. ఒక వ్యాపార సంవత్సరంలో డిస్కౌంటుతో రూ. 500/-లకన్నా అధిక విలువ గలిగిన పుస్తకాలు కొంటే, రూ. 25/ల విలువైన పత్రికలను ఉచితంగా అందిస్తాము. అవకాశాన్ని పుస్తక ప్రియులు సద్వినియోగం చేసుకోగలరు.

-సీనియర్ ఎడిటర్.

# రైతుల సంక్షేమంపై వాస్తవాల పరిశీలన

- ప్రొఫెసర్ నీలాబ్జ ఘోష్



**తుఫానులు, అకాల వర్షాల వంటి ప్రకృతి వైపరీత్యాలతో బాటు చెదలు, చీడపీడల వల్ల జరిగే నష్టాలను కూడా భర్తీ చేసేందుకు "ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన" (PMFBY) పేరిట మరోకొత్త పథకాన్ని 2016 జనవరిలో ప్రారంభించారు. వాతావరణ మార్పులవల్ల విస్తృత పరిధిలో పెద్ద సంఖ్యలో ప్రజలను ఇబ్బంది పెట్టే ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా జరిగే నష్టాన్ని నివారించడంలో పంటల బీమా పథకం రైతులకు ఒక కీలకమైన రక్షణగా ఉంటుంది.**

వివిధ మంత్రిత్వ శాఖలలో ఎప్పటికప్పుడు కొత్త విభాగాల ఏర్పాటు, పాత విభాగాలకు పేర్లు మార్చడం వంటివి తరచు జరుగుతున్నదే అయినా వ్యవసాయ మంత్రిత్వశాఖకు 2015లో వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖగా నామకరణం చేయడం ఆషామాషీగా జరిగిన వ్యవహారం కాదు. వ్యవసాయమంటే కేవలం ఆహారోత్పత్తిని పెంచడమేగాకుండా సమాజంలోని ఇతర వర్గాలతో పోల్చుకుంటే వ్యవసాయదారులు కూడా తమ శ్రమకు తగిన విధంగా సాంఘిక జీవనాన్ని మెరుగు పరచుకునేలా చేయడం కూడా వ్యవసాయ శాఖ విధిగా భావించడం వల్లనే ఈ శాఖకు పేరు మార్చడం జరిగింది. హరిత విప్లవం వల్ల ప్రాథమిక ఆహార పంటల ఉత్పత్తి అనేక రెట్లు పెరిగింది. ఇలా 1960వ దశకంలో తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొంటున్న దశనుంచి ఇప్పుడు ఆహారోత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించడమేగాక వరి, పాల ఉత్పత్తిలో మనదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండడం విశేషం. దీంతో ఇప్పుడు పప్పు ధాన్యాలు, పండ్లు, కూరగాయుల ఉత్పత్తిలో కూడా వినియోగదారుల డిమాండ్‌ను తట్టుకునేందుకు వీలుగా వ్యవసాయోత్పత్తి లక్ష్యాలను మరింత విస్తృతం చేశారు. అయితే ఈ విస్తృత గాథలో బక్కరైతు మాత్రం ప్రగతి పథానికి దూరంగా ఉంటూ ఇంకా ఎలాంటి ప్రయోజనాన్ని పొందలేని బాధితుడుగానే మిగిలిపోయాడు. వ్యవసాయ రంగంలో మనం ఎంత ప్రగతి సాధించినప్పటికీ రైతు ఆదాయం అతి తక్కువగా ఉండడమే గాక ఆర్థిక వ్యవస్థలో ఏర్పడే అనిశ్చిత పరిస్థితులకు ముందుగా అతనే బలికావలసి వస్తోంది. అందువల్లనే రైతుకుటుంబాల్లోని కనీసం 40 శాతం మంది అవకాశం దొరికితే వేరే వృత్తుల్లోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్టు 2003-04 సంవత్సరంలో నిర్వహించిన జాతీయ స్థాయి సర్వే వెల్లడించింది. రైతులు తమ ప్రాథమిక అవసరాలను తీర్చుకోవాలనుకుంటే కూడా తిరిగి వ్యవసాయంపైనే ఆధారపడడం తప్ప మరో గత్యంతరం లేదని జాతీయ స్థాయి సర్వేలు వెల్లడిస్తున్నాయి. అయితే సంప్రదాయ, ఆధునిక వ్యవసాయ పద్దతుల్లో వస్తున్న మార్పుల వల్ల అధికోత్పత్తి సాధించగలుగుతున్నప్పటికీ రైతులు ఎందువల్ల దుర్భరమైన పేదరికాన్ని ఎదుర్కోవలసి వస్తున్నదో పరిశీలించవలసి ఉంటుంది.

**రైతుల నిస్సహాయత :**

2022 నాటికీ రైతు ఆదాయం

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్, న్యూఢిల్లీ
E-mail: nila@iegindia.org

రెట్టింపయ్యేలా చేస్తామని ప్రధానమంత్రి ఇటీవల చేసిన ప్రకటన నేపథ్యంలో రైతుల ప్రస్తుత స్థితిగతులు, ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారించవలసి వస్తోంది. వ్యవసాయిక ఆదాయం అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. భూసంబంధమైన ఉత్పత్తి పెరగడంవల్ల అధిక ఆదాయం లభించే అవకాశం ఉంది. అయితే దీనికి కావలసిన నీరు, ఎరువుల సరఫరా, వాటికయ్యే ఖర్చు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా వ్యవసాయ రంగంలో సాంకేతికపరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయవలసి ఉంటుంది. అంతేగాకుండా తాలు, కుళ్ళు వంటివి నివారించి, మార్కెట్‌కు పంపే ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలను పాటించడంవల్ల ఉత్పత్తులకు హెచ్చు ధరలను రాబట్టి రైతు తన ఆదాయం పెంచుకునే అవకాశం ఉంది.

విభిన్న భౌగోళిక వాతావరణ పరిస్థితుల కారణంగా భారతదేశంలో వివిధ ప్రాంతాల మధ్య వ్యవసాయ పద్ధతుల్లో కూడా వైవిధ్యం స్పష్టంగా కనిపిస్తుంది. అందువల్ల సమాఖ్య వ్యవస్థలో వివిధ రాష్ట్రాల మధ్య వ్యవసాయ విధానాల అమలులో కూడా గణనీయమైన తేడాలు కనిపిస్తాయి. ఫలితంగా పంట దిగుబడులు, వాటికి లభించే ధరలు, మౌలిక వసతుల కల్పన వంటివి ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా ఉంటాయి. వీటికి తోడు చిన్న కమతాలు తీవ్రమైన ఆర్థిక అంతరాలకు కారణమవుతున్నాయి. మరోవైపు జనాభా పెరుగుదలకు తోడు పారిశ్రామిక రంగంలో ఉపాధికల్పన అవకాశాలు నామమాత్రంగా ఉండడం వల్ల వ్యవసాయరంగంపైన తీవ్రవత్తిడి ఏర్పడుతుండడంతో కమతాలవారీ ఆదాయం, తలసరి ఆదాయం కూడా చాల తక్కువగా కనిపిస్తున్నాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో స్థానిక పరిస్థితుల కారణంగా వ్యవసాయం లాభసాటిగా సాగుతున్నది. వివిధరంగాల మధ్య శ్రామిక శక్తి బదలాయింపువల్ల కుటుంబ ఆదాయం పెరగడంతోబాటు కొత్త ఆలోచనలు, నైపుణ్యాలు కూడా బదిలీ అవుతూ ఆయా రంగాల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశం లభిస్తుంది. వ్యవసాయరంగంలో వచ్చే అదనపు ఆదాయం వల్ల వ్యవసాయేతర రంగాల్లోని ఉత్పత్తులకు కూడా డిమాండ్ పెరుగుతుంది. వ్యవసాయం గురించి చర్చించాలంటే వాతావరణాన్ని గురించి తప్పక చర్చించాల్సిందే. వాన రాకడ ప్రస్తుత ఉత్పత్తిని మాత్రమే గాక భవిష్యత్తును కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. జలాశయాలు, నదులు, కాలువలు, బావులు, భూగర్భ జలవనరుల స్థాయి, భూసార స్థితిగతులవంటి వాటిపైన తరువాతి సీజన్ల వరకే గాక కొన్ని సంవత్సరాల వరకు ఈ ప్రభావం ఉంటుంది. ఇలాగే 2014, 2015 సంవత్సరాల్లో ఏర్పడిన దుర్భిక్షపరిస్థితులు వ్యవసాయరంగంపై పెట్టిన పెట్టుబడులను హరించడమేగాక రైతులను తీర్చలేని అప్పుల్లో ముంచేశాయి. మొత్తం మీద రుతుపవనాల పరిస్థితి ఆశాజనకంగా కనిపించినప్పటికీ ప్రాంతాల వారీగా సాలుసరి వానలు సకాలంలో కురవక పోవడం, అకాల వర్షాలు ముంచెత్తడం వంటి అసాధారణ పరిస్థితులు రైతులను తీవ్ర ఇబ్బందులపాలు చేశాయి. వానలే కాదు వరదలు కూడా రైతులను నట్టేట ముంచాయి. ఇలా 2016 సంవత్సరంలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసినప్పటికీ 9 రాష్ట్రాల్లో వరదలు ముంచెత్తాయి. ఒక్క బీహార్ రాష్ట్రంలోనే 3 లక్షల హెక్టార్ల పంట మునిగిపోగా 5 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వచ్చింది.

వ్యవసాయోత్పత్తుల ధరవరలు కూడా దారుణమైన అస్థిరతకు లోనవుతుంటాయి. సాధారణ పరిస్థితులలో సైతం పంట చేతికొచ్చి మార్కెట్‌కు తరలించేలోగానే కొద్ది నెలల్లోనే ధరలు తీవ్రమైన ఒడిదుడుకులకు లోనవుతుండడం వల్ల పండిన పంటను ఇంట్లోనే ఉంచుకునేందుకు రైతు గుండె దిటవు చేసుకోలేని పరిస్థితులు ఏర్పడుతుంటాయి. ఇలాంటి అనిశ్చిత పరిస్థితి వల్ల ఆ తర్వాత సొంత వినియోగానికి కూడా ఆహార ధాన్యాలను రైతులు హెచ్చు ధరలకు కొనుగోలు చేయవలసి వస్తుంది. రైతులకు కనీస మద్దతు ధరను పెంచడం దేశంలో తగినంత ఆహార ఉత్పత్తికీ, ధరల స్థిరీకరణకు తోడ్పడే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం తగినంత ధాన్యాన్ని సేకరించలేక పోతున్నది. సరఫరా సమృద్ధిగా ఉంటే ధరలు పడిపోతాయి. అలాగే 2016-17లో పప్పుధాన్యాల సరఫరా సమృద్ధిగా ఉండడం వల్ల రైతులకు గిట్టుబాటు ధరలు పెంచినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్‌లో పోటీని ఎదుర్కోవలసిన పరిస్థితులు ఉండడం వల్ల డిమాండు-సరఫరాలలో తేడాలను బట్టి వ్యవసాయోత్పత్తుల ధరవరలలో తీవ్రమైన అనిశ్చితి ఏర్పడుతున్నది.

**గ్రామీణ సౌకర్యాలు :**

వ్యవసాయోత్పత్తులు, వాటి ధరల కోణంలో నుంచి మాత్రమే చూస్తే ఇప్పటివరకు చేపట్టిన సంక్షేమ చర్యలు తప్పుదోవ పట్టినట్టు కనిపిస్తుంది. నిత్యజీవితంలో మనకు లభ్యమయ్యే పూర్తిస్థాయి సేవలు జీవన గమనాన్ని మార్చివేసి కొత్త మెలకువలను నేర్పించి మరిన్ని కొత్త అవకాశాలను కల్పించడమే గాక కొత్త సామర్థ్యాలను పెంపొందిస్తాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానపు ఫలితాలను సులువుగా అందుకునే అవకాశాన్ని కల్పిస్తాయి. ఈ మినహాయింపులు చాలావరకు పౌరహక్కులేనన్న భావన పెంపొందడంవల్ల వాటిని తప్పక అమలు చేయవలసిన బాధ్యత కూడా ప్రభుత్వంపైనే

ఉంటుంది. అయితే దురదృష్టవశాత్తూ భారత దేశపు అభివృద్ధి పటంలో కనిపించే "పట్టణ పక్షపాతం" గ్రామీణ రైతాంగాన్ని మరింత వెనుకబాటు తనంలోకి నెట్టేస్తున్నది. అనేక సంవత్సరాలుగా మానవ వనరుల అభివృద్ధి చిత్రంలో పేదలకు తగిన స్థానమే లేదు. దీని ఫలితంగా పెద్ద సంఖ్యలో పేదలు నివసించే గ్రామీణ ప్రాంతాలు తీవ్రంగా నష్టపోతు న్నాయి. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ ఉపాధి అవకాశాలు మెరుగు పరచేందుకు తగిన నాణ్యమైన విద్య వారికీ లభించడం లేదన్నది అక్షరసత్యం. బలహీనమైన ప్రణాళికలు, నిధుల లేమి, అమలులో అవినీతి వంటి అంశాలే ఇందుకు కారణమని వేరేగా చెప్పనక్కరలేదు. గ్రామీణ రైతాంగానికి ఎంతో అవసమైన ప్రజారోగ్యాన్ని కూడా విస్మరించారు. పౌష్టికాహారం, స్వచ్ఛమైన వాతావరణం, స్థిరమైన మంచి అలవాట్లు కూడా ఆరోగ్యాన్ని మెరుగుపరు స్తాయి. అలాగే ప్రజాపంపిణీ వ్యవస్థద్వారా ఆహారధాన్యాల సరఫరా వల్ల పంటలు పండని సమయంలో పేదరైతులు కూడా లబ్ది పొందేవారు. అయితే అనేక రకాలైన దుర్వినియోగపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజాపంపిణీ వ్యవస్థ 1980 మధ్య కాలం నుంచే అనేకరకాలైన మార్పులకు గురవు తున్నది.

గత దశాబ్దాలలో రహదారులు, రైల్వేలు, మెట్రో రైల్స్ వంటి భౌతిక రవాణా సౌకర్యాలపై ప్రజా ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించినప్పటికీ, 16 శాతం భారత గ్రామాలలో అన్నివాతావరణపరిస్థితులలోను వినియోగపడే రహదారుల సౌకర్యం ఏర్పడలేదన్నది వాస్తవం. విద్యుత్ సౌకర్యం అనేక పనులను సులభతరం చేయడమేగాక ఆర్థిక కార్యక్రమాల విస్తరణకు కూడా తోడ్పడుతుంది. గృహ వసతి, తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల సౌకర్యం, మరుగుదొడ్ల వసతి వంటివి కూడా పరిసరాల పరిశుభ్రతకు, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు తోడ్పడతాయి. అయితే దుర దృష్టవశాత్తూ ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోని 45 నుంచి 70 శాతం ఇళ్లకు విద్యుత్తు, తాగునీటి సరఫరా, మరుగుదొడ్డి సౌకర్యం లేకపోగా 18 శాతం మందికి వీటిలో ఏ ఒక్క సౌకర్యం కూడా అందుబాటులో లేదని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం కూడా విస్తరించడం వల్ల మొబైల్, ఇంటర్నెట్ సౌకర్యాలు పెరగడం వల్ల ప్రాథమిక సమాచార ప్రసారణ మరింత సులువైంది. ఆవిధంగా మౌలిక వసతులను మెరుగుపరచడంవల్ల రైతుసమాజం సాంఘిక స్థితిగతులు మెరుగుపడడమేగాక ఉత్పత్తి పెరగడం, మార్కెటింగ్ సౌకర్యం విస్తరించడం, వృథాను అరికట్టి ఉత్పత్తుల నాణ్యత పెంచి అదనపు విలువలు చేకూర్చడం వంటి లాభాలు పొందగలుగు తుంది. మహిళలకు ప్రత్యేకవసరాలున్నాయి. రైతుకుటుంబాలకు చెందిన మహిళలు చాలావరకు జీతభత్యాలు లేని పనుల్లోనే నిమగ్నమవుతుంటారు. అంతేగాకుండా తక్కువ కూలీ లభించే వరి నాట్ల వంటి క్లిష్టమైన కార్యక్రమాల్లో పాల్గొనవలసి ఉంటుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడం వల్ల మహిళలు క్రమంగా వ్యవసాయ కార్మిక వ్యవస్థ నుంచి మరింత మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉన్న కార్యక్రమాలవైపు దృష్టి సారిస్తున్నట్టు వెల్లడవుతోంది.

పురుషులు వ్యవసాయేతర కార్య క్రమాలకు స్పష్టమైన ప్రధాన్యత ఇవ్వడం వల్ల వ్యవసాయరంగం క్రమంగా స్త్రీల పరమవడ మేగాక పేద మహిళలకు తప్పనిసరి కావచ్చు. ప్రత్యేకంగా మహిళలకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక వసతుల ఏర్పాటు, శిశు సంరక్షణ సౌకర్యం, మహిళల సౌష్టవానికి తగిన విధంగా యంత్రసామగ్రిలో మార్పులు తీసుకురావడం, మహిళల కోసం అవసరమైన ప్రత్యేక సమాచార ప్రసారణ వంటి మహిళా రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టవలసి ఉంటుంది.

## రైతుల సంక్షేమం కోసం కొత్త అభివృద్ధి మార్గాలు:

రైతులకు సబ్సిడీపై మెరుగైన విత్తనాలు, ఎరువులు, ఇతర ఇంధన వనరులు సరఫరా చేయడం, భూమి అభివృద్ధి, నీటిపారుదల పనులకు, యాంత్రిక సామాగ్రి సమీకరణకు తగిన రుణ సౌకర్యం కల్పించడం, కనీస గిట్టుబాటు ధర కల్పించి రైతుల వద్ద ధాన్య సేకరణ జరిపి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా చౌకగా ఆహార ధాన్యాలు సరఫరా చేయడం వంటి కార్యకలాపాలు భారత వ్యవసాయ రంగానికి కీలక సాధనాలుగా ఉపకరించేవి.

అధికోత్పత్తి సాధించే మిగులు ప్రాంతాలకు ఇవి ఎంతో మేలు చేస్తుండడం వల్ల ఇతర ప్రాంతాల్లో వర్షాధారంగా పండే ఇతర పంటలకు, గిడ్డంగి సదుపాయాలు కల్పించేందుకు, ముఖ్యంగా ఈశాన్య ప్రాంతంలో హరిత విప్లవం సాధించేందుకు BGREI (Bringing Green Revolution in Eastern India) పథకాన్ని, నూనె గింజలు, పప్పు ధాన్యాలు, మొక్కజొన్న, ఆయిల్ పామ్ ఉత్పత్తి పెంచేందుకు ఇసోపోమ్ (ISOPOM- Integrated Scheme of Oilseeds, Pulses, Maize and Oilpalm) పథకాన్ని, జాతీయ ఆహార భద్రత కార్యక్రమాన్ని, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (RKVY), గిడ్డంగుల అభివృద్ధి కోసం వేర్ హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీ (WDRA) వంటి పథకాలను అమలుచేస్తున్నారు.

## సుస్థిర అభివృద్ధి పథకాలకు ప్రాధాన్యం:

పర్యావరణ మార్పులకు వ్యతిరేకంగా జరుగుతున్న అంతర్జాతీయ పోరాటంలో

పాల్గొంటున్న భారతదేశం పారిస్ ఒప్పందంపై సంతకం చేయడమేగాక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో కూడిన ఒక సమగ్ర మార్గదర్శక ప్రణాళిక NAPCC (National Action Plan on Climate Change) ను అమలుచేస్తోంది. ఇందులో భాగంగానే పర్యావరణ మార్పులపై అవగాహన పెంచడంతోబాటు, ప్రకృతి వైపరీత్యాలను ఎలా ఎదుర్కోవాలో దిశానిర్దేశనం చేసేందుకు తగిన మార్గదర్శక సూత్రాలను కూడా ప్రభుత్వం రూపొందిం చింది.

ప్రమాదవశాత్తు జరిగే నష్టాన్ని నివారించేందుకు బీమా ఒక చక్కని పరిష్కారం. అయితే దశాబ్దాలపాటు అనేక శషభిషల అనంతరం పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. 1999-2000 సంవత్సరంలో ప్రారంభమైన ''జాతీయ వ్యవసాయ బీమా పథకం'' (నేషనల్ అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ స్కీం-NAIS)లో ఒక ప్రాంతాన్ని ప్రాతిపదికగా చేసుకుని పంట నష్టాన్ని అంచనా వేయటం ద్వారా ఆప్రాంతం మొత్తం మీద జరిగిన నష్టంగా భావించి ఆ పరిధిలో ఉండే రైతులందరికీ పరిహారం అందజేస్తారు. ఇందువల్ల ఒక్కొక్క రైతు ప్రత్యేకంగా తన పంట నష్టం గురించి చెప్పుకోవలసిన అవసరం ఉండదు. సంస్థాగత (బ్యాంకులు, సహకార సంఘాల) రుణాలకు ఈ బీమా పథకాన్ని తప్పనిసరిగా వర్తింపజేస్తారు. అయినప్పటికీ డేటా సేకరణ విషయంలో NAIS వైఫల్యం వల్ల పరిమితమైన చిన్న ప్రాంతాలను ప్రభావితం చేసే విపత్తు నష్టాలను భర్తీచేయలేక పోవడంవల్ల తీవ్ర నష్టాలలో మునిగి పోయింది. దీన్ని నివారించేందుకు పంటల బీమా పథకంలో పలుమార్పులు తీసు కొచ్చారు. **ఇలాఉండగా తుఫానులు, అకాల వర్షాల వంటి ప్రకృతి వైపరీత్యా లతో బాటు చెదలు, చీడపీడల వల్ల జరిగే నష్టాలను కూడా భర్తీ చేసేందుకు "ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన" (PMFBY) పేరిట మరోకొత్త పథకాన్ని 2016 జనవరిలో ప్రారంభించారు. బీమారంగంలో ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించేందుకు వీలుగా పంటరుణా లపై బీమా కోసం చెల్లించ వలసిన ప్రీమియం తాలూకు రైతులకు ఇచ్చే సబ్సిడీలను కొనసా గించేందుకే ప్రభుత్వం కట్టుబడి ఉంది.** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడం వల్ల పంట నష్టాల అంచనాల ప్రాంతీయ పరిధి ఇక సమీప భవిష్యత్తులో పూర్తిగా స్థానికంగా మారే అవకాశం ఉంది.

వాతావరణ మార్పులవల్ల విస్తృత పరిధిలో పెద్ద సంఖ్యలో ప్రజలను ఇబ్బంది పెట్టే ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా జరిగే నష్టాన్ని నివారించడంలో పంటల బీమా పథకం రైతులకు ఒక కీలకమైన రక్షణగా ఉంటుంది. మన ఉపగ్రహ సాంకేతిక పరిజ్ఞానం వల్ల తుఫాను ఏర్పడే దశనుంచి దాని దిశాగమనాలతో బాటు విస్తృతి, కలిగించగల నష్టాలను కూడా అంచనా వేసి చాలా ముందుగానే హెచ్చరించగల శక్తి సామర్థ్యాలు మన వాతావరణ శాఖకు అందు బాటులోకి వచ్చాయి. 2005లో అమలులోకి వచ్చిన విపత్తుల నిర్వహణ చట్టం కింద ఏర్పాటైన జాతీయ విపత్తు నివారణ బృందాలు, కేంద్రీయ దళాలు కూడా విపత్తుల నుంచి ప్రజలను రక్షించడంలో వెంటనే రాష్ట్ర ప్రభుత్వాలకు సహకరించ వలసి ఉంటుంది. అలాగే కరవు సంభవించి నప్పుడు రాష్ట్రప్రభుత్వం నీటిపారుదల తదితర రంగాలలో ప్రత్యేక సబ్సిడీలను ప్రకటించాల్సి వుంటుంది.

సాంప్రదాయిక నిబంధనలు విఫలమై నప్పుడు మార్కెటింగ్ సంస్కరణల అవసరం ఎంతో ఉంది. మార్కెట్ల మధ్య పోటీని పెంచి సమర్థవంతంగా చేయడానికి వీలుగా వ్యవసాయోత్పత్తుల మార్కెట్ కమిటీ (APMC-Agriculture Produce Market Committee) చట్టాన్ని సవరిం చింది. ధరల నియంత్రణలో ప్రభుత్వ జోక్యం వల్ల పర్యవేక్షణ పేరుతో ఏర్పడే ప్రతిబం ధకాలు, బడ్జెట్ పరిమితుల నేపథ్యంలో ఎదురయ్యే ఇబ్బందులు గిడ్డంగుల నిర్వహణ, పంపిణీ విధానాలను కూడా ఆటుపోట్లకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే రైతులకు అందజేస్తున్న పెట్టుబడి, ఆహార సబ్సిడీలకు తోడు 2013లో జాతీయ ఆహార భద్రత హక్కు చట్టం వల్ల మరింత ఆర్థిక భారం పెరిగింది. ప్రపంచ మార్కెట్లో పోటీ వల్ల కొరతను సృష్టించడం లేదా సరఫరాను పెంచడంద్వారా దళారులే ధరలను నియంత్రిస్తుండడం వల్ల దాని ప్రభావం ఆహార ధాన్యాల ధరలపై కూడా పడుతోంది. ఈ తరుణంలో ప్రభుత్వ జోక్యం వల్ల రైతులు తప్పుదారి పట్టే ప్రమాదం ఎదురవుతుంది. ఇదే సందర్భంగా ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలలో కూడా గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే వంట గ్యాస్ సబ్సిడీని నేరుగా లబ్దిదారులకే చేరేలా ఏకైక గుర్తింపు కార్డు (UID - Unique Identifier) సహాయంతో "జన్ ధన్" లేదా ఇతర బ్యాంకు ఖాతాల ద్వారా నేరుగా జమచేయడం (డీబీటీ లేదా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ఇందులో చెప్పుకోదగ్గ పరిణామం. ఇలాఉండగా 2016-17 ఆర్థిక సర్వే సబ్సిడీల స్థానంలో ప్రత్యామ్నాయంగా వినియోగపడే సార్వజనిత ప్రాథమిక ఆదాయ (UBI- Universal Basic Income) భావనపై అధ్యయనం కోసం ప్రత్యేకమైన అధ్యాయాన్ని కేటాయించింది. కనీస ఆదాయం అన్నది పౌరుల చట్టబద్ధమైన హక్కులలో ఒకటిగా గుర్తించాలన్న ప్రచారానికి ఈ అధ్యాయం పూర్తి మద్దతుని స్తోంది.

అనేక గ్రామీణ అభివృద్ధి పథకాలు సబ్సిడీల రూపంలో వ్యవసాయ పరమైన పెట్టుబడులకు పరోక్షంగా ఊతమివ్వడమే

గాకుండా రైతుల జీవన ప్రమాణాలను పెంచేందుకు కూడా తోడ్పడుతున్నాయి. జాతీయ గ్రామీణ జీవనోపాధుల కార్యక్రమం (NRLM), జాతీయ సామజిక సహాయ కార్యక్రమం (NSAP), గృహవసతి కల్పించేందుకు చేపట్టిన ఇందిరా ఆవాస్ యోజన (IAY), రహదారుల అభివృద్ధి కోసం చేపట్టిన PMGY (ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన) జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (NRHM) వంటివాటిని ఈ కోవలో చెప్పుకోవచ్చు. అంతే గాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల్లో గల వ్యవసాయ మార్కెట్ కమిటీల వద్ద పంటల ధరలను ఎప్పటి కప్పుడు తెలుసుకునేందుకు వీలుగా జాతీయ స్థాయిలో ఏర్పాటుచేసిన ఈ–నామ్ (e-NAM - e-National Agricultural Market) రైతులకు ఎంతో తోడ్పడుతోంది. అలాగే సాగునీటి పథకాలకు అత్యంత ప్రాధాన్యం కల్పించి చిన్నచిన్న సాగునీటి పథకాలు చేపట్టడం వల్ల కరవు పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనే అవకాశం లభిస్తోంది. వ్యవసాయ పనులు లేని కాలంలో ప్రలకు ఉపయోగపడే నిర్మాణ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో 2005లో ప్రారంభించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGA) పేదరైతులకు కూడా ఎంతో ఉపయోగపడుతోంది. ఇది ఒకవిధంగా పౌరులకు ఉపాధి కల్పనపై చట్టబద్ధత కల్పించడమేనని చెప్పవచ్చు. బడ్జెట్ నిబంధనలకులోబడి చేపట్టే ఈ పనులలో నాణ్యత ప్రమాణాలపై కొన్ని విమర్శలు వస్తున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి కల్పనతోపాటు ప్రభుత్వ పరమైన ఆస్తుల కల్పనకు, తోడ్పడుతున్నదని చెప్పక తప్పదు. యువతకు పారిశ్రామిక, ఉత్పాదక రంగాల్లో ఉపాధి పొందేందుకు తగిన ప్రమాణాలలో ఉద్యోగ నైపుణ్యాలు కల్పిం చేందుకు 2015లో NPSDE (National Policy on Skill Development and Entrepreneurship) కార్యక్రమాన్ని ప్రారంభించింది.

**ముగింపు :**

వినియోగదారుల సంక్షేమం కోసం ఉద్దేశించిన అనేక ప్రమాణాలు చాలా కాలంగా రైతుల ఆదాయ భద్రతలకు అడ్డంకిగా నిలుస్తూవచ్చాయి. అయితే ప్రస్తుత స్వేచ్ఛా మార్కెట్ సంస్కరణలు పూర్వపు మద్దతు వ్యస్థలకు వ్యతిరేకంగా నిలిచి భద్రతావ్యూహాలను బలంగా వ్యతిరేకిస్తు న్నాయి. అయితే మార్కెట్ శక్తుల వ్యూహాలు భిన్నంగా సాంఘిక భద్రతా వ్యవస్థ నూతన రూపాంతర నమూనా ఇప్పుడు పౌర సంక్షేమం రూపంలో ముందుకు వస్తున్నది. ఈ క్రమంలో ప్రభుత్వం ఒకవైపు సామాన్యుడి ఆదాయానికి తగిన విధంగా ధరలను అదుపులో ఉంచుతూనే మరోవైపు బలీయమైన స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థకు చేయూతనివ్వవలసి ఉంటుంది.

అయినప్పటికీ ప్రజల ఆహార భద్రతకు కట్టుబడి ఉంటూనే రైతుల సాంఘిక సంక్షేమానికి దన్నుగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అభివృద్ధికి సంబంధించిన సమాచారాన్ని వెల్లడించి ప్రజలందరూ అభివృద్ధి పథంలో నడిచేందుకు తగిన మౌలిక వసతులను కల్పించడం ప్రభుత్వ బాధ్యత. అయితే పన్నుచెల్లింపుదారులైన ప్రజలకు అవసరమైన ఆహార భద్రత కల్పిస్తూనే రైతుల సంక్షేమానికి కట్టుబడిఉండాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. అదే సందర్భంగా ప్రజల ఆదాయ వనరులను పెంచుతూ పన్నుచెల్లింపుదారుల సంఖ్యను పెంచుకో వడం ద్వారా వ్యవసాయరంగాన్ని కూడా ఇతర పరిశ్రమల తరహాలోనే లాభదాయక మైన పరిశ్రమగా తీర్చిదిద్దగల ఔత్సాహికులను ప్రోత్సహించడం, అందులోకి పెట్టుబడిదా రులను ఆహ్వానించి వారికి కూడా తగిన లాభాలు పంచిపెట్టేందుకు తగిన పథకాలను ప్రభుత్వం రూపొందించుకోవలసి ఉంది. ఇలాంటప్పుడే ప్రభుత్వం తన పర్యవేక్షక విధానంలో ఉన్న ఇబ్బందులను తొలగించేం దుకు సాంకేతికపరిజ్ఞానాన్ని వినూత్న పద్ధతులలో సమర్థవంతంగా వినియోగిం చాల్సి ఉంది. అప్పుడే మంచి జీవన హక్కు కలిగిన పౌరుడిగా రైతు కూడా స్వేచ్ఛా మార్కెట్లో మరింత సమర్థవంతంగా పని చేయగలుగుతాడు. ■


యోజన

జి.ఎస్.టి.

ఆగష్టు, 2017 సంచిక

విశిష్ట వ్యాసం

# వయోధికులకు ఆదాయ భద్రత-జాతీయ పెన్షన్ వ్యవస్థ

– డాక్టర్ బద్రి సింగ్ భండారి



**2017 జూన్ నాటికి జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పిఎస్)లో 10.7 మిలియన్ల మంది చందాదారులున్నారు. వీరు చేసే చందా చెల్లింపులు సుమారు 1,42,263 కోట్ల రూపాయలు. మొత్తం చందాదారులలో ప్రభుత్వ ఉద్యోగులు 49 శాతం ఉండగా, నిర్వహణలోని ఆస్తులలో 88 శాతం వరకు ఉన్నాయి. చందాదారుల చెల్లింపులు, నిర్వహణలోని ఆస్తులకు అటల్ పెన్షన్ యోజన మొత్తాన్ని కూడా కలిపితే 16.1 మిలియన్ల మంది చందాదారులు, 1,44,340 కోట్ల రూపాయల చందా మొత్తం, 1,87,151 కోట్ల రూపాయల మేరకు నిర్వహణలోని ఆస్తులు ఉన్నాయి.**

పెన్షన్ లేదా వృద్ధాప్యంలో రాబడి సమకూర్చడం అనేవి సామాజిక భద్రతలో ప్రధానమైన అంశాలు. రిటైర్‌మెంట్ తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనకుండా జీవితం సాఫీగా సాగడానికి, జీవన ప్రమాణాలు కాపాడుకోవడానికి ఇది ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. పెన్షన్ వ్యవస్థ ఆర్థికంగా సమర్థంగా ఉండడమే కాకుండా అది ఖాతాదారులకు అందుబాటులో ఉండాలి. ఆర్థిక వ్యవస్థ సుస్థిరాభివృద్ధికి ఇది తోడ్పడడంతోపాటు వివిధ వృత్తులలోని వారు, వివిధ ఆదాయాల వారికి విస్తృత సేవలు అందించేదిగా ఉండాలి. ప్రపంచ వ్యాప్తంగా గత మూడు దశాబ్దాలలో చాలా దేశాలలో పెన్షన్ వ్యవస్థను ఆర్థికంగా నిలదొక్కుకునే దిశగా సంస్కరించారు. అలాగే దీనిని పెరుగుతున్న జనాభా సవాళ్లకు దీటుగా తీర్చిదిద్దడంతోపాటు అవ్యవస్థీకృత, అసంఘటిత రంగానికికూడా విస్తరింపచేసే దిశగా సంస్కరణలు తీసుకువచ్చారు.

భారత దేశంలో సంప్రదాయికంగా వయసుపైబడిన వారి ఆదాయ భద్రతకు సంబంధించిన అంశాన్ని కొద్దికాలం క్రితం వరకు కూడా ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చూసుకునేది. ఇందుకు సంబంధించిన విలువలు ఆ వ్యవస్థలో ఉండేవి. అయితే చిన్న కుటుంబాలు, నగరీకరణ, వృత్తి, ఉద్యోగాలలో మార్పుల కారణంగా సంప్రదాయికంగా వయోధికులకు ఉంటూ వచ్చిన కుటుంబ మద్దతు క్రమంగా తగ్గిపోతూ వస్తోంది. మరోవైపు ఆదాయ స్థాయిలో పెరుగుదల, వైద్యశాస్త్రంలో పురోగతి కారణంగా ప్రజల జీవన కాలం పెరుగుతోంది. గతంలో కొన్ని దశాబ్దాల క్రిందటి కంటే ఇప్పుడు రిటైర్‌మెంట్ అనంతర జీవితకాలం ఎక్కువగా ఉంటోంది. ఒకవైపు జనాభా పెరుగుదల, మరోవైపు ఉద్యోగుల సర్వీసు, వారి జీతం ఆధారంగా ఇచ్చే నిర్ణీత పెన్షన్ వ్యవస్థపై పడుతున్న భారమే పలు దేశాలు పెన్షన్ సంస్కరణలు తేవడానికి కారణం.

పెన్షన్, ఉద్యోగ భవిష్యనిధి, ఉద్యోగ విరమణ నిధి, లేదా ఉద్యోగ విరమణ ప్రయోజనాలు ఇలా రకరకాల పేర్లతో ఉన్నప్పటికీ ఇవన్నీ వయోధికుల ఆర్థిక భద్రతకు సంబంధించినవి. ఇవి ప్రధానంగా ప్రభుత్వ సర్వీసులోనో లేదా, ప్రభుత్వ రంగ సంస్థలలోనో, ప్రైవేటు రంగంలోని పెద్ద సంస్థలలోని వారికో పరిమితమౌతూ వస్తున్నాయి. 2004వ సంవత్సరంలో పెన్షన్ సంస్కరణలు తీసుకురాక ముందు భారత పెన్షన్ విధానం ప్రధానంగా ఈ కింద

పూర్తికాలపు సభ్యుడు (ఎకనమిక్స్), పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (పిఎఫ్ఆర్‌డిఏ), న్యూఢిల్లీ.
E-mail: badris.bhandari@pfrda.org.in

పేర్కొన్న విధంగా పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్, ఉద్యోగవిరమణ పథకాలుగా ఉండేది.

ఎ) జాతీయ సామాజిక సహాయ పథకం (ఎన్ఎస్ఎపి) కింద ప్రభుత్వ నిధులతో కల్పించే సామాజిక పెన్షన్లు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికీ, అరవైఏళ్లు పైబడిన వారికీ, దివ్యాంగులకు, వితంతువులకు కనీస సామాజిక పెన్షన్ భద్రతను కల్పిస్తాయి.

బి) సెంట్రల్ సివిల్ సర్వీసెస్ పెన్షన్ పథకం 1972 అనేది నిర్దేశిత ఉద్యోగ పెన్షన్ పథకం. 2004 సంవత్సరానికి ముందు కేంద్ర ప్రభుత్వ సర్వీసులో చేరిన వారికి ఇది వర్తిస్తుంది. ఉద్యోగ విరమణ ప్రయోజనాలను ఉద్యోగి పదవీ విరమణ సందర్భంగా లెక్కకట్టే విధానానికి సంబంధించినది. ఇలాంటి పథకాలే పలు రాష్ట్రప్రభుత్వాల ఉద్యోగులకు, ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీల ఉద్యోగులకు వున్నాయి.

సి) ఉద్యోగుల భవిష్యనిధి చట్టం 1952 కింద నోటిఫై చేసిన ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలలో 20 కంటే ఎక్కువ మంది సిబ్బంది ఉన్న సంస్థల కోసం ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ నిర్వహించే ఉద్యోగుల భవిష్యనిధి (ఇపిఎఫ్), ఉద్యోగుల పెన్షన్ (ఇపిఎస్) పథకాన్ని నిర్వహించాలి.

డి) వివిధ వృత్తులలోని వారి కోసం అంటే ఉదాహరణకు బొగ్గుగనుల సిబ్బంది పిఎఫ్, నావికుల పిఎఫ్, అస్సాం తేయాకు తోటలలోని సిబ్బంది పిఎఫ్ వంటి ప్రావిడెంట్ ఫండ్ పథకాలు న్నాయి.

ఇ) జీవిత బీమా సంస్థ,కొన్ని మ్యూచువల్ ఫండ్‌లు పెన్షన్ పథకాలను ప్రవేశ పెట్టాయి. భారత ప్రభుత్వం బ్యాంకులు, పోస్టాఫీసుల ద్వారా పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ పథకాన్ని నిర్వహిస్తోంది. ఈ పథకంలో ఏ వ్యక్తి అయినా చేరవచ్చు. ఇవి ప్రధానంగా పన్ను ప్రోత్సాహకాలు, ఈ పథకం కింద చెల్లింపులకు పలు మినహాయింపులతో కూడినవి.

సివిల్ సర్వీసెస్‌కు సంబంధించి, నిర్దేశిత లబ్ధి, పే యాజ్ యు గో పెన్షన్ విధానం, ఫండింగ్ లేకపోవడం వంటివి భారత దేశంలో ప్రధానంగా పెన్షన్ సంస్కరణలు తీసుకురావడానికి ఒక కారణం కాగా, మరోవైపు శ్రామికులలో 84 శాతంగా ఉన్న అసంఘటితరంగంలోని కార్మికులకు వయసుపైబడిన తర్వాత ఆర్థిక భద్రత కల్పించాల్సిన అవసరం మరొక కారణం. వయోధికులకు సామాజిక ఆర్థిక భద్రత (ఒ.ఎ.ఎస్.ఐ.ఎస్) కమిటీ, భట్టాచార్య కమిటీ, రంగాచార్య కమిటీ వంటివి దేశ ఆర్థిక స్థితిగతులు, జనాభా పెరుగుదల వంటి వాటిని దృష్టిలో ఉంచుకుని పెన్షన్ వ్యవస్థలను రూపొందించుకోవాలని చేసిన సూచనలకు అనుగుణంగా నిర్దేశిత లబ్ధితోకూడిన , అన్‌ఫండింగ్, పే యాజ్ యు గో విధానానికి స్వస్తిపలికి డిఫైన్డ్ కంట్రిబ్యూషన్ ఫండెడ్ పెన్షన్ వ్యవస్థను తీసుకువచ్చింది. దీనినే తొలుత నూతన పెన్షన్ పథకమని ఆతర్వాత ప్రస్తుతం జాతీయ పెన్షన్ వ్యవస్థ(నేషనల్ పెన్షన్ సిస్టం-ఎన్‌పిఎస్) అని అంటున్నారు.

## నేషనల్ పెన్షన్ వ్యవస్థ

డిఫైన్డ్ కంట్రిబ్యూషన్ పెన్షన్ పథకం. దీని నిర్వహణ, నియంత్రణ పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డవలప్‌మెంట్ అథారిటీ, న్యూఢిల్లీ (పిఎఫ్ఆర్‌డిఎ) కింద వుంటుంది. తొలుత ఎన్.పి.ఎస్‌ను 2004 జనవరి 1 తర్వాత చేరిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు (సైనిక దళాలు మినహా) తప్పనిసరి వర్తింపు కింద అమలు చేశారు. ఆ తర్వాత,ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫై చేసిన తేదీ నుంచి రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు కూడా వర్తింప చేశారు. చివరగా 2009 మే 1 నుంచి ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలోని వారు, స్వయం ఉపాధి కింద ఉన్నవారు, అసంఘటిత రంగంలోని వారు ఇలా భారత పౌరులందరు స్వచ్ఛందంగా ఈ పథకం ఎంచుకోవడానికి వీలు కల్పించారు. దీనితో ప్రస్తుతం 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వయసుగల భారతీయ పౌరులు ఎవరైనా తాము పనిచేస్తున్న వయసులో ఈ పథకం కింద చెల్లింపులు చేస్తే, ఆ తర్వాత రిటైర్మెంట్ అనంతర సమయంలో పెన్షన్ పొందడానికి వీలుంటుంది. ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్.పి.ఎస్ తప్పనిసరి. ఉద్యోగి జీతంలో పదిశాతం (మూల వేతనం, కరవుభత్యం కలిపి), దానితోపాటు అంతే మొత్తాన్ని యాజమాన్యం , ఉద్యోగికి చెందిన పర్మినెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నెంబర్ (ప్రాణ్) ఖాతాలో జమ చేస్తారు. స్వచ్ఛందంగా ఈ పథకాన్ని ఎంచుకున్న పౌరులు ఏడాదికి కనీసం వెయ్యి రూపాయల వంతున తమ పెన్షన్ ఖాతాలో జమచేసుకోవచ్చు. ఈ మొత్తాన్ని తమ రాబడి స్థాయినిబట్టి పెంచు కోవచ్చుకూడా. ఇలా ఖాతాలలో జమ అయిన మొత్తాన్ని పి.ఎఫ్.ఆర్.డి.ఎ మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వ సెక్యూరిటీలు, కార్పొరేట్ డిబెంచర్లు, బాండ్లు, మంచి పేరున్న కంపెనీల షేర్లలో పిఎఫ్.ఆర్.డి.ఎ వద్ద నమోదు చేసుకున్న ప్రొఫెషనల్ పెన్షన్ ఫండ్‌ల ద్వారా పెట్టుబడి పెడతారు. ఈ పథకం కింద చందాదారుడు పెన్షన్ ఫండ్‌ను ఎంపిక చేసుకోవడానికి, తాను రిస్క్ భరించగల తీరును బట్టి పెట్టుబడి రకాలను (ఈక్విటీలు, కార్పొరేట్ బాండ్స్ లేదా డిబెంచర్లు, ప్రభుత్వ సెక్యూరిటీలను) ఎంచుకోవచ్చు. పెన్షన్ ఫండ్ మేనేజర్లు వివిధ సెక్యూరిటీలను వాటి స్థూల ఆస్తి తరగతుల నుంచి ఎంపిక చేసుకుంటారు.

నేషనల్ పెన్షన్ సిస్టమ్ కింద పెన్షన్ చందా దారులపేర్ల నమోదు, వారి నుంచి చందా వసూలు, వ్యక్తిగత పెన్షన్ చందా

దారుల రికార్డుల నిర్వహణ, ఫైనాన్షియల్ మార్కెట్‌లలో ఈ మొత్తాలను పెట్టుబడిగా పెట్టడం, సెక్యూరిటీలకు సంబంధించిన రికార్డులను నిర్వహించడం, పెన్షన్ చెల్లింపులకు సంబంధించిన వివిధ పనులను ఆయా రంగాలలో వాటికి ఉన్న అనుభవాన్ని, నైపుణ్యాన్ని బట్టి వివిధ సంస్థలను ఎంపిక చేసి అప్పగించడం జరుగుతుంది. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలకు సంబంధించి ఎన్‌పిఎస్ సంబంధిత వివిధ కార్యకలాపాలను నిర్వహించేందుకు కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు (పిఎఒలు, డిడిఒలు) ఉంటాయి. వీటిని పిఒపిలు పాయింట్ ఆఫ్ ప్రెసెన్స్ అంటారు.ఇవి ఎన్‌పిఎస్ ఖాతాలు ప్రారంభించడానికి, చందాదారుల నుంచి చందా మొత్తాన్ని వసూలు చేయడానికి, వసూలు చేసిన మొత్తాన్ని ట్రస్టీబ్యాంకులో జమ చేసే పని చేస్తాయి. ఎన్.ఆర్.ఎస్ ట్రస్టీ బ్యాంకు చందాదారుల తరఫున సెక్యూరిటీలు, ఆస్తులు కలిగి ఉంటుంది. కేంద్ర రికార్డుల నిర్వహణ సంస్థ (సిఆర్ఎ) వ్యక్తిగత చందాదారులకు సంబంధించిన రికార్డులను నిర్వహించడంతో పాటు ఎన్.పిఎస్‌లోని వివిధ విభాగాలతో సమన్వయంతో పనిచేస్తుంది. సి.ఆర్.ఎ తన వద్ద నమోదు చేసుకున్న పెన్షన్ చందాదారులకు ప్రత్యేక శాశ్వత ఉద్యోగ విరమణ ఖాతా సంఖ్య (పర్మినెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నెంబర్–ప్రాణ్)ను జారీ చేస్తుంది. ఇందుకు సంబంధించిన డాటాబేస్‌ను నిర్వహిస్తుంది. ప్రాణ్‌లోని ప్రతి చందాదారు లావాదేవీలను నమోదు చేస్తుంది ఎన్‌పిఎస్‌కు సంబంధించి రికార్డులను కేంద్రీకృత విధానంలో నిర్వహించడం వల్ల వ్యక్తిగత పెన్షన్ ఖాతాను దేశంలోని ఏ ప్రాంతానికైనా ఏ వృత్తి, ఉద్యోగానికికైనా మార్చుకునే అవకాశం ఉంది. ఎన్‌పిఎస్ నిర్వహణ ఉన్నత సాంకేతిక పరిజ్ఞాన వినియోగంతో కూడుకున్నది. ఈ విధానం కింద సమాచారం, నిధుల బదిలీ ఎలక్ట్రానిక్ పద్ధతిలో జరుగుతుంది. ఫలితంగా వేగం, కచ్చితత్వం, సమర్థత కలిగిఉంటుంది. పెన్షన్ చందాదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పి.ఎఫ్.ఆర్.డి.ఎ కింద నమోదైన పెన్షన్ ఫండ్‌లు పి.ఎఫ్.ఆర్.డి.ఎ పెట్టుబడి మార్గదర్శకాలకు అనుగుణంగా చందాదారుల పెన్షన్ కార్పస్‌ను నిర్వహించేందుకు అనుమతి కలిగి ఉన్నాయి.

ప్రభుత్వ రంగంలోని ఉద్యోగులు డ్రాయింగ్ డిస్బర్సింగ్ ఆఫీసర్ (డిడిఒ) ద్వారా లేదా పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ (పిఎఒ) ద్వారా ఎన్‌పిఎస్ ఖాతాను ప్రారంభించవచ్చు. కార్పొరేట్ రంగంలోని వారు లేదా అసంఘటిత రంగంలోని వారు దేశవ్యాప్తంగా గల పబ్లిక్, ప్రైవేట్ రంగ బ్యాంకులు, పోస్టాఫీసులు, దేశవ్యాప్తంగా 60 వేలకు పైగా గల కొన్ని బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల వద్దగల పాయింట్స్ ఆఫ్ ప్రెసెన్స్ (పిఒపి)ల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తిగల వారు సబ్‌స్క్రయిబర్ రిజిస్ట్రేషన్ ఫారం(ఎన్.ఎస్.ఆర్.ఎఫ్–1)ను నింపి, దానితోపాటు ఖాతాదారు సమాచారానికి సంబంధించిన కె.వై.సి వివరాల డాక్యుమెంట్లను, గుర్తింపు, చిరునామా పత్రాలను సమర్పించాలి. కొన్ని పి.ఒ.పిలకు తమ బ్రాంచీలు, రెప్రజెంటేటివ్ కార్యాలయాలు విదేశాలలో కూడా ఉన్నాయి. పి.ఒ.పిల సవివర జాబితా www.pfrda.org.in, www.npscra.nsdl.co.in వెబ్‌సైట్‌లలో చూడవచ్చు. ఎన్‌పిఎస్ ఖాతాను ఆన్‌లైన్ ద్వారా e-NPS పోర్టల్ ద్వారా ఎన్‌పిఎస్ ట్రస్ట్ వెబ్‌సైట్ www.npstrust.org.in ద్వారా ప్రారంభించవచ్చు. ఈ ఎన్‌పిఎస్ కింద ఆధార్, లేదా పాన్ నెంబర్, బ్యాంక్ ఖాతా, కె.వై.సి డాక్యుమెంట్ల సహాయంతో ఎవరైనా ఎన్.పి.ఎస్ ఖాతా ప్రారంభించవచ్చు. పి.ఒ.పి సంస్థలు తమ క్లయింట్లకు ఇంటర్నెట్ ద్వారా అందుబాటు లోకి తెచ్చిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సదుపాయానికి ఇది అదనం. ఎన్.పి.ఎస్‌లో చేరిన అనంతరం, చందాదారు పర్మినెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నెంబర్ (ప్రాణ్) పొందుతారు. ఈ ఖాతాకు అతడు లేదా ఆమె చేసే చెల్లింపులన్నీ జమ అవుతాయి.ఈ ఖాతాను ఆ తర్వాత దేశంలోని ఎక్కడికైనా బదిలీ చేసుకోవచ్చు. ఉన్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇందులో ఉపయోగిస్తున్నందున ఖాతాదారు తన ఖాతాను ఆన్‌లైన్‌లోను, ఎన్‌పిఎస్ మొబైల్ యాప్ ద్వారా చూసుకోవచ్చు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఎన్.పి.ఎస్ నిర్వహణకు సంబంధించి 2003 డిసెంబర్‌లో ఆర్థిక మంత్రిత్వశాఖ ఒక నోటిఫికేషన్ జారీ చేసింది.ఇది కార్యరూపం దాల్చడానికి కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ జనవరి 2004న ఉత్తర్వులు జారీచేశారు. 2004 జనవరి నుంచి 2008 మార్చి వరకు ఉద్యోగుల ఎన్‌పిఎస్ చెల్లింపులను సెంట్రల్ పెన్షన్ అకౌంటింగ్ ఆఫీస్ నిర్వహించే పబ్లిక్ అకౌంట్‌లో వుంచారు. ఈ నిధులను 2008 మార్చి తర్వాత ప్రభుత్వం తొలుత సూచించిన మార్గదర్శకాల ప్రకారం మార్కెట్‌లో పెట్టుబడి పెట్టేందుకు పి.ఎఫ్.ఆర్.డి.ఎ చే నియమితమైన ట్రస్టీ బ్యాంకులో జమచేయడం జరిగింది. ట్రస్టీబ్యాంకుకు ఈ నిధులు బదిలీ అయ్యేవరకు ప్రభుత్వం 8 శాతం వార్షిక వడ్డీరేటును చెల్లించింది. వ్యయ విభాగానికి చెందిన కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ కార్యాలయం, ట్రస్టీబ్యాంకుకు, సెంట్రల్ రికార్డుల ఏజెన్సీకి ఎన్.పి.ఎస్ చెల్లింపులకు సంబంధించిన రికార్డుల తయారీ, సమాచారాన్ని అప్‌లోడ్ చేయడం, వంటి వాటికి సంబంధించిన సవివరమైన ప్రక్రియను సూచిస్తూ 2009 సెప్టెంబర్‌లో ఉత్తర్వులు జారీచేసింది. అలాగే ఆలిండియా సర్వీసు అధికారులకు సంబంధించి సిబ్బంది మంత్రిత్వ శాఖ 2009 సెప్టెంబర్‌లో రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు మార్గదర్శకాలు జారీచేసింది.

ఎన్.పి.ఎస్ రెండు రకాల ఖాతాలను అంటే టైర్ -1,టైర్-2 ఖాతాలను ఆఫర్‌చేస్తోంది. టైర్-1 ఖాతా పెన్షన్ ఖాతా. ఆప్షనల్ ఇన్వెస్ట్‌మెంట్ ఖాతా అయిన టైర్-2 ఖాతా ప్రారంభించడానికి ఇది తప్పనిసరి. టైర్-1 ఖాతాలోని నిధులలో 25 శాతానికి మించకుండా పాక్షికంగా ఉపసంహరించు కోవచ్చు. దీనిని ఖాతాదారు పిల్లల ఉన్నత చదువుల కోసం లేదా వివాహ ఖర్చుల కోసం, లేదా ఇంటి నిర్మాణం, నిర్దేశిత అనారోగ్యాలకు సంబంధించి ఖాతాదారుకు లేదా భార్య లేదా భర్తకు, పిల్లలు లేదా వారిపై ఆధారపడిన తల్లిదండ్రులకు అయ్యే ఖర్చులకు ఈ 25 శాతం పరిమితికి లోబడి ఉపసంహరించుకోవచ్చు. ప్రాణాంతక వ్యాధులు, ప్రమాదాల సమయంలో కూడా పాక్షికంగా నిధులను ఉపసంహరించు కోవచ్చు. నిధులను చెల్లించే దశలో గరిష్ఠంగా మూడు సార్లు మాత్రమే ఉపసంహరణకు వీలు కల్పిస్తారు. మొదటి ఉపసంహరణకు ఎన్.పి.ఎన్‌లో చేరిన తర్వాత మూడు సంవత్సరాలకు అనుమతిస్తారు. టైర్-1 నుంచి జరిపే పాక్షిక ఉపసంహరణలకు పూర్తిగా పన్ను మినహాయింపు ఉంది. టైర్-2 ఖాతా స్వచ్ఛందంగా నిధులు పొదుపు చేసేందుకు సంబంధించినది.ఇందులో చెల్లింపులు, ఉపసంహరణలకు వీలు ఉంది. అయితే టైర్-2 నిధులలో చెల్లింపులకు, ఉప సంహరణలకు పన్ను మినహాయింపులు లేవు.

ఎన్.పి.ఎన్ ఖాతాదారుకు 60 సంవత్సరాలు వచ్చిన తర్వాత, ప్రాన్‌లో ఉన్న మొత్తంలో కనీసం 40 శాతం మొత్తాన్ని క్రమానుగత పెన్షన్‌కోసం యాన్యుటైజ్ చేయించాలి. మిగిలిన 60 శాతం మొత్తాన్ని ఒకేసారి తీసుకోవచ్చు. ఖాతాలోని మొత్తంలో 40 శాతం ఏకమొత్తంగా తీసుకునే డబ్బుకు పన్ను మినహాయింపు ఉంది.యాన్యుటైజ్డ్ మొత్తానికి కూడా పన్ను మినహాయింపు వుంది. చందా దారుడు 60 సంవత్సరాలకు ముందే వైదొలగే పక్షంలో అతడు లేక ఆమె ఖాతాలోని మొత్తంలో 80 శాతం మొత్తాన్ని యాన్యుటీ కొనుగోలుకు ఉపయోగించాలి. మిగిలిన 20 శాతం సొమ్మును ఏకమొత్తంగా తీసుకోవచ్చు. ఒకవేళ చందాదారుడు 60 సంవత్సరాలు రాకముందే అకాల మరణంపొందితే, అతడు లేక ఆమె నామినీ ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేకుండా ఖాతాలో మిగిలిన నిల్వను ఏకమొత్తంగా తీసుకోవచ్చు. మార్కెట్ అనుకూల సమయాన్నిబట్టి, సెక్యూరిటీలను తగిన సమయంలో లిక్విడేట్ చేయడానికి వీలుంది. ఇందుకు చందాదారు తన ఎన్‌పిఎస్ నిధి తుది ఉపసంహరణను 70 ఏళ్లు వచ్చేవరకు వాయిదావేయవచ్చు. అలాగే యాన్యుటి కొనుగోలును 60 ఏళ్లు వచ్చిన తర్వాత కూడా గరిష్ఠంగా మూడేళ్లు వాయిదావేయవచ్చు.ఇలా వాయిదా వేసిన సమయంలో వారు కోరుకుంటే ఖాతాలో చందా మొత్తాన్ని జమచేస్తూ పోవచ్చు కూడా.

## ఎన్.ఆర్.ఐ.లకు ఎన్.పి.ఎస్.

ప్రవాస భారతీయులు(ఎన్.ఆర్.ఐ)లు ఎన్.పి.ఎస్ ఖాతాలను రిపాట్రియబుల్, నాన్‌రిపాట్రియబుల్ ప్రాతిపదికన ఖాతాలను ప్రారంభించవచ్చు.వీరు చందా మొత్తాన్ని తమ ఎన్.ఆర్.ఇ., ఎఫ్‌సిఎన్ఆర్, ఎన్.ఆర్.ఒ ఖాతాల నుంచి పంపవచ్చు. నాన్ రిపాట్రియబుల్ ఎన్.పి.ఎస్ ఖాతా విషయంలో మెచూరిటీ సమయంలో లేదా పాక్షిక ఉప సంహరణ సమయంలో ఎన్.పి.ఎస్ నిధులను ఎన్.ఆర్.ఒ ఖాతాలో మాత్రమే జమచేస్తారు. ఎన్.పి.ఎస్ ఖాతాను వ్యక్తుల పేరుమీదే ప్రారంభించాలి. పవర్‌ఆఫ్ ఆటార్నీకింద దీనిని నిర్వహించడానికి వీలు లేదు.ఒకవేళ విదేశాలలో పి.ఒ.పి సర్వీస్‌ప్రొవైడర్ ద్వారా ఖాతా ప్రారంభించినట్టయితే టైర్-1 ఖాతా ప్రారంభించే సమయంలో చెల్లించాల్సిన కనీస మొత్తం రూ.6000 లు. టైర్-2 ఖాతాకు ఇది రూ. 2000 లు. తదుపరి చందా చెల్లింపు లను చందాదారుడు వార్షిక పద్ధతిన కానీ లేదా తనకు అనుకూలంగా ఉన్న విధంగా లేదా అంతకంటే తక్కువ కాల పరిమితులలో చెల్లించవచ్చు. చందాదారు రిజిస్ట్రేషన్‌కు పి.ఒ.పి సర్వీసు చార్జీలు 8 అమెరికన్ డాలర్లు లేదా స్థానిక కరెన్సీకి అంతే సమాన మొత్తం వసూలు చేస్తారు.మొదటి, ఆ తర్వాతి చందా మొత్తాలకు చెల్లించిన మొత్తంలో ఒక శాతం వసూలు చేస్తారు. ఇందుకు కనిష్ఠంగా ఒక అమెరికన్ డాలర్ లేదా స్థానిక కరెన్సీకి సమానమైన మొత్తం, గరిష్ఠంగా 8 అమెరికన్ డాలర్లు లేదా స్థానిక కరెన్సీకి సమానమైన మొత్తం వసూలు చేస్తారు. అన్ని నాన్ ఫైనాన్షియల్ లావాదేవీలకు ఒక్కొ లావాదేవీకి ఒక అమెరికన్ డాలర్ లేదా స్థానిక కరెన్సీతో అంతకు సమానమైన మొత్తాన్ని వసూలు చేస్తారు. ఒకవేళ ఖాతాను భారత దేశంలో ప్రారంభించినట్టయితే, ప్రారంభ కనీస మొత్తం టైర్-1కు 500 రూపాయలు, వార్షిక మొత్తం రూ. 1000లుగా ఉంది. ఖాతా ప్రారంభానికి,భారతీయ నివాసస్తులకు వర్తించే విధంగానే రూ. 125లు ఉంటుంది. కంట్రిబ్యూషన్ చార్జీలు, కంట్రిబ్యూషన్ మొత్తం కనీసం 20 రూపాయలకు తగ్గకుండా గరిష్ఠంగా రూ 25000లు మించకుండా అందులో 0.25 శాతం వసూలు చేస్తారు. అన్ని నాన్‌ఫైనాన్షియల్ లావాదేవీలకు ప్రతి లావాదేవీకి 20 రూపాయలు వసూలుచేస్తారు.

## ఎన్‌పిఎస్ కింద పన్ను ప్రయోజనాలు

ఉద్యోగుల స్వంత కంట్రిబ్యూషన్‌లో పదిశాతం వరకు (మూల వేతనం, కరవు భత్యం) ఎన్‌పిఎస్‌కు చేసే చెల్లింపు ఆదాయ పన్ను చట్టం సెక్షన్ 80 సిసి డి(1) కింద పన్ను మినహాయింపు ఉంది. సెక్షన్ 80 సిసిఇ కింద 1,50,000 వరకు ఇది పరిమితం. ఎంప్లాయర్ కంట్రిబ్యూషన్‌కు కూడా ఉద్యోగి మూలవేతనం, కరవుభత్యంపై పది శాతం వరకు సెక్షన్ 80సిసిడి (2) కింద ఎలాంటి పరిమితి లేకుండా పన్ను మినహాయింపు పొందుతారు. సెక్షన్ 80సిసిడి (1బి) కింద రూ 1,50,000ల పరిమితికి పైబడిన 50వేల రూపాయల వరకు అదనపు

ఎన్‌పిఎస్ చెల్లింపులకు మినహాయింపు ఉంది. అంటే, ఎన్‌పిఎస్‌కు చేసే స్వంత చెల్లింపులకు రూ2 లక్షల వరకు పన్ను మినహాయింపును పొందవచ్చు. ఉద్యోగులైన వ్యక్తులకు, స్వయం ఉపాధి కింద ఉండేవారికి మధ్య సమాన త్వాన్ని సాధించేందుకు, స్వయం ఉపాధి పథకాలలోని వారికి తమ మొత్తం రాబడిలో 10 నుంచి 20 శాతానికి మినహాయింపు పరిమితిని పెంచుతూ ఫైనాన్స్ యాక్ట్ 2017లో నిర్ణయం తీసుకున్నారు.

**ఎన్.పి.ఎస్ కింద ఫీజులు, చార్జీలు...**

నేషనల్ పెన్షన్ సిస్టం (ఎన్‌పిఎస్)లో ఖాతా ప్రారంభానికి, పిఒపిలకు చెల్లించే చార్జీలు, ఖాతా నిర్వహణ ఖర్చులు, సిఆర్ఎ లావాదేవీల చార్జీలు,పెన్షన్ ఫండ్‌ల పెట్టుబడి నిర్వహణ ఫీజు, ఎన్‌పిఎస్ ట్రస్టు సర్వీసు చార్జీలు, అసెట్ మెయింటినెన్స్ కస్టోడియన్ చార్జీలు ఇవన్నీ కలిపి నిర్వహణలోని ఆస్తులలో 0.5 శాతం కంటే తక్కువ ఉంటాయి. ఇది పోటీ రిటైర్మెంట్ పథకాలు, ఇన్సూరెన్స్ కంపెనీలు, మ్యూచువల్ ఫండ్ పథకాల కంటే తక్కువ.

**పెట్టుబడి నిర్వహణ, ఎన్‌పిఎస్ కింద రాబడి ప్రభుత్వరంగ చందాదారులకు పెట్టుబడి విధానం....**

ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగుల ఎన్‌పిఎస్ కంట్రిబ్యూషన్లు ఎస్‌బిఐ పెన్షన్‌ఫండ్, యుటిఐ రిటైర్మెంట్ సొల్యూషన్స్, ఎల్ఐసి పెన్షన్‌ఫండ్‌లకు అంతకు ముందు సంవత్సరం పనితీరును బట్టి కేటాయిస్తున్నారు. పెన్షన్‌ఫండ్‌లు ఈ మొత్తాన్ని పిఎఫ్ఆర్‌డిఎ పెట్టుబడి మార్గదర్శకాలకు అనుగుణంగా పెట్టుబడి పెట్టవలసి ఉంటుంది.

ఎ) యాభై శాతం వరకు ప్రభుత్వ సెక్యూరిటీలు, సంబంధిత పత్రాలు

బి) 45శాతం వరకు రుణపత్రాలు, దాని సంబంధిత పత్రాలు

సి) 15 శాతం వరకు ఈక్విటీ సంబంధిత పత్రాలు

డి) 5 శాతం వరకు స్వల్పకాలిక రుణ పత్రాలు

ఇ) 5శాతం వరకు ఆస్తుల మద్దతు కలిగిన, ట్రస్ట్‌వ్యవస్థలు తదితర పెట్టుబడులలో పెట్టవచ్చు.

ప్రభుత్వ ఉద్యోగులు కాని చందా దారులు హెచ్‌డిఎఫ్‌సి పెన్షన్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్,ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ పెన్షన్‌ఫండ్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్, కోటక్ మహేంద్ర పెన్షన్ ఫండ్ లిమిటెడ్, ఎల్.ఐ.సి పెన్షన్‌ఫండ్ లిమిటెడ్, రిలయన్స్ కాపిటల్ పెన్షన్ ఫండ్ లిమిటెడ్, ఎస్.బి.ఐ పెన్షన్ ఫండ్స్ లిమిటెడ్, యుటిఐ రిటైర్మెంట్ సొల్యూషన్స్ లిమిటెడ్, బిర్లా సన్‌లైఫ్ పెన్షన్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ వంటి ఎనిమిది పెన్షన్‌ఫండ్‌ల నుంచి పెన్షన్ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు.

2017 జూన్ నాటికి ఎన్‌పిఎస్ కింద 10.7 మిలియన్ల మంది చందాదారులు న్నారు. వీరు చేసే చందా చెల్లింపులు సుమారు 1,42,263 కోట్ల రూపాయలు. మొత్తం చందాదారులలో ప్రభుత్వ ఉద్యోగులు 49 శాతం ఉండగా, నిర్వహణలోని ఆస్తులలో 88 శాతం వరకు ఉన్నాయి. చందాదారుల చెల్లింపులు, నిర్వహణలోని ఆస్తులకు అటల్ పెన్షన్ యోజన మొత్తాన్ని కూడా కలిపితే 16.1 మిలియన్ల మంది చందాదారులు, 1,44,340 కోట్ల రూపాయల చందా మొత్తం,1,87,151 కోట్లరూపాయల మేరకు నిర్వహణలోని ఆస్తులు అవుతాయి.

ఎన్‌పిఎస్ పోర్టుఫోలియో భిన్నరకాలుగా ఉంటుంది. ప్రస్తుతం ఎన్.పి.ఎస్ పోర్టుఫో లియోలలో సుమారు 13.5 శాతం పోర్టుఫో లియోను ఈక్విటీవాటాలలో 48 శాతం మొత్తాన్నిప్రభుత్వ సెక్యూరిటీలలో, 35.5 శాతం కార్పొరేట్ బాండ్లలో మిగిలినది స్వల్పకాలిక మార్కెట్ పత్రాలలో పెట్టుబడి పెడుతున్నారు. కార్పొరేట్‌బాండ్ పోర్టుఫో లియోలో 98 శాతం మొత్తాన్ని ఎ ఎ లేదా అంతకంటే ఎక్కువ రేటింగ్ కలిగిన సెక్యూరిటీలలో పెట్టుబడి పెడుతున్నారు.

సిజి, ఎన్‌జి పథకాలపై అవి ప్రారంభించినప్పటి నుంచి 2017 ఏప్రిల్ చివరి నాటికి వార్షిక రాబడి పది శాతం వరకు ఉంది. పన్ను రాయితీలతోపాటు, సులభతరమైన, పారదర్శకమైన విధానం దేశంలో ఎక్కడికైనా మార్చుకోవడానికి వీలున్న పెన్షన్ వ్యవస్థ, ఎన్‌పిఎస్ ప్రత్యేకత. పెన్షన్ ఫండ్‌లను ఎంచుకోవడానికి, పెట్టుబడితీరును నిర్ణయించుకోవడానికి, తక్కువ నిర్వహణా వ్యయం,ఆకర్షణీయ రాబడి వంటివి జాతీయపెన్షన్ వ్యవస్థను ఆకర్షణీయ పెన్షన్‌ను చందాదారులకు కల్పిస్తోంది.

**పథకాల ప్రారంభం నుంచి పథకాల వారీగా, పిఎఫ్ వారీగా రాబడిని సూచిస్తున్న పట్టిక 29 ఏప్రిల్ 2017 నాటికి**

| ఫెన్షన్ ఫండ్స్ | | ఎస్‌బిఐ | యుటిఐ | ఎల్ఐసి | కొటాక్ | రిలియన్స్ | ఐసిఐసిఐ | హెచ్‌డిఎఫ్‌సి |
|---|---|---|---|---|---|---|---|---|
| సిజి | | 10.43 | 10.06 | 10.13 | – | – | – | – |
| ఎస్‌జి | | 10.04 | 10.11 | 10.23 | – | – | – | – |
| కార్పొరేట్–సిజి | | 10.61 | – | 10.79 | – | – | – | – |
| టైర్–1 | ఈ | 9.69 | 11.81 | 13.89 | 10.94 | 11.01 | 11.84 | 16.80 |
| | సి | 11.14 | 9.79 | 11.61 | 11.06 | 9.67 | 11.11 | 11.65 |
| | జి | 10.06 | 8.75 | 12.44 | 8.96 | 8.63 | 9.03 | 11.04 |
| టైర్–2 | ఈ | 9.33 | 9.64 | 8.91 | 10.08 | 9.59 | 9.31 | 12.31 |
| | సి | 10.80 | 9.99 | 9.94 | 9.80 | 9.44 | 11.04 | 9.90 |
| | జి | 10.29 | 9.86 | 12.63 | 8.82 | 8.95 | 9.20 | 11.65 |
| ఎపిఎస్ స్వావలంబన్ | | 11.10 | 10.96 | 10.92 | 11.18 | – | – | – |

మూలం: www.npst.org.in


■

సమగ్ర దృక్పథం

ప్రత్యేక వ్యాసం

# సామాజిక భద్రత - ప్రపంచ దృక్పథం

- చంద్రకాంత్ లహరియా




**ప్రపంచ జనాభాలో కేవలం 27 శాతం మందికే సమగ్ర సామాజిక భద్రత అందుబాటులో ఉన్నదని 2014 సంవత్సరంలో ఐఎల్ఓ ప్రచురించిన నివేదిక స్పష్టం చేస్తోంది. సామాజిక భద్రతా కార్యక్రమాలను అందించడంలో రెండు ప్రధానమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. అవి సార్వజనీనత, సుస్థిరత. జనాభాలో ఎంపిక చేసిన వర్గాలకు, ఎంపిక చేసిన ప్రయోజనాలు అందించే విధంగా పలు దేశాల్లో సామాజిక భద్రతా పథకాలను ప్రారంభించారు.**

'సామాజిక భద్రత' అనే పదాన్ని భిన్న ప్రాంతాల్లో భిన్న సందర్భాలు, విభిన్నమైన అర్థాల్లో వినియోగిస్తారు. అయితే 'సామాజిక రక్షణ', 'సామాజిక సంక్షేమం', తరహా ఇతర అర్థాలు వచ్చే సందర్భాలన్నింటిలోనూ ఈ పదం విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఎవరి భావం ఏదైనా సామాజిక భద్రత అనేది మనకి తరచు వినిపించే పదం. అసలు సామాజిక భద్రత అనే సిద్ధాంతాన్ని మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన (ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ తీర్మానం 21ఎ, 1948) 22వ అధికరణంలో పొందుపరిచారు. "సమాజంలోని సభ్యుడు లేదా సభ్యురాలుగా ప్రతి ఒక్కరికీ - జాతీయ స్థాయిలో ఆయా ప్రభుత్వాల కృషి ఫలితంగా లేదా అంతర్జాతీయ సహకారం ఆధారంగా, ఆయా దేశాలు లేదా రాజ్యాలకు అందుబాటులో ఉండే ఆర్థిక, ఇతర వనరులకు లోబడి, పౌరుల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి ఆచరిస్తున్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులకు లోబడి- సామాజిక భద్రత పొందే హక్కు ఉంది'' అని ఆ ప్రకటన నిర్వచించింది. అలాగే "ప్రతి ఒక్కరికీ ఈ హక్కు కల్పించడానికి అవసరం అయితే ఇతర సామాజిక రక్షణ విధానాల ద్వారా దీనికి మద్దతు ఇవ్వాలి" అని కూడా 23వ అధికరణం సూచించింది. అంతర్జాతీయ స్థాయిలో మాత్రం మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన 22వ అధికరణాన్నే సామాజిక భద్రతకు గీటురాయిగా పరిగణిస్తారు.

### సామాజిక భద్రత పరిణామక్రమం

సామాజిక భద్రత సిద్ధాంతం ఈ నాటిది కాదు. ప్రాచీన, మధ్యయుగం నాటి నాగరికతల్లో నాటి రాజులు, చక్రవర్తులు అనుసరించిన సామాజిక భద్రతా విధానాలను చరిత్రకారులు తమ రచనల్లో ప్రముఖంగా పొందుపరిచారు. అయితే 19వ శతాబ్ది కాలంలో సామాజిక భద్రత సిద్ధాంతానికి ఆధునిక అర్థం ఆవిష్కారమైంది. ఆధునిక కాలంలో సామాజిక భద్రతకు జర్మనీని మార్గదర్శిగా పేర్కొనవచ్చు. జర్మన్ చాన్సలర్ ఒట్టోవాన్ బిస్మార్క్ కాలంలో ఆ దేశం కార్మికుల నష్టపరిహారం (1884), 'వ్యాధిగ్రస్తుల' బీమా (1888), సామాజిక బీమా కార్యక్రమం (1889) వంటి ఎన్నో విప్లవాత్మక సామాజిక భద్రతా చర్యలు ప్రారంభమయ్యాయి. 20వ శతాబ్ది నాటికి జర్మనీ దేశీయులకు సమగ్ర సామాజిక భద్రతా వ్యవస్థ అందుబాటులో ఉంది.

సుమారుగా అదే సమయంలో 1897 సంవత్సరంలో యునైటెడ్ కింగ్‌డమ్ కూడా

నేషనల్ ప్రొఫెషనల్ ఆఫీసర్, ప్రపంచ ఆరోగ్య సంస్థ కార్యాలయం, న్యూఢిల్లీ
Email: c.lahariya@gmail.com

కార్మికుల నష్టపరిహార చట్టాన్ని రూపొందించింది. 1911లో యుకె ప్రభుత్వం జాతీయ బీమా చట్టాన్ని కూడా తయారుచేసింది. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత యుకె ప్రభుత్వం తొలి సార్వత్రికసామాజిక భద్రతా వ్యవస్థను ఆచరణలోకి తెచ్చింది. ఇందుకు సంబంధించిన కీర్తి అంతా బ్రిటిష్ ఆర్థికవేత్త, ప్రగతిశీల సంస్కర్త విలియం హెన్రీ బెవరిడ్జ్‌కు దక్కుతుంది. బెవరిడ్జ్ ప్రణాళిక పేరిట ఆయన ప్రభుత్వానికి ఒక నివేదిక అందించారు. ఈ ప్రణాళికకు అనుగుణంగానే ఇప్పటికీ అమలులో ఉన్న నేషనల్ హెల్త్ సిస్టంను ఇందుకు చక్కని ఉదాహరణగా పరిగణించవచ్చు.

1900–1920 మధ్య కాలంలో అమెరికాలో సామాజిక భద్రతా సిద్ధాంతం క్రమక్రమంగా విస్తరించింది. వృద్ధాప్య పింఛను నుంచి ఆర్థిక భద్రత, అంతిమంగా 'సామాజిక భద్రత' (సామాజిక బీమా ప్రయోజనం గల ఆర్థిక భద్రత) ఏర్పడ్డాయి. అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్వెల్ట్ అధికారంలో ఉండగా 1935 సంవత్సరంలో 'సామాజిక భద్రత' చట్టాన్ని రూపొందించారు. 1943లో 'సార్వత్రిక జాతీయ సామాజిక బీమా వ్యవస్థ' ఏర్పడడానికి అది దారి తీసింది. 1946 సంవత్సరంలో పియరీ లరోకి నాయకత్వంలో ఫ్రాన్స్‌లో జాతీయ సామాజిక భద్రతా వ్యవస్థ ఏర్పాటయింది. దీని ద్వారా మొత్తం జనాభా అంతా సామాజిక భద్రత ఛత్రం కిందకు వచ్చింది.

ఇదే సమయంలో అంతర్జాతీయ చట్టాలు, ఒడంబడికల్లో సామాజిక భద్రతా అంశాన్ని చేర్చడానికి అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ), ఐక్యరాజ్యసమితి బలమైన ప్రతిపాదనలు పదేపదే చేశాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కార్యాచరణ, సహకారం, సమాచార మార్పిడి సామాజిక భద్రత కల్పనలో కీలక మైలురాళ్లు కాగలవని 1944 సంవత్సరపు ఐఎల్‌ఓ ప్రకటన ప్రతిపాదించింది. సామాజిక భద్రతా చర్యలు తీసుకునేందుకు, అలాంటి రక్షణ అవసరమైన వారందరి కనీస అవసరాలు తీరేలా కనీస ఆదాయం అందించేందుకు, సమగ్ర ఆరోగ్య సంరక్షణ కల్పించేందుకు ఆయా దేశాలకు అవసరమైన మద్దతును అందించాల్సిన అవసరాన్ని కూడా ఆ ప్రకటన గుర్తించింది. 1952లో ఐఎల్‌ఓ సామాజిక భద్రత (కనీస ప్రమాణాలు) ఒడంబడికను (ఎన్‌ఆర్.102) ఆమోదించింది. పట్టిక 1లో సూచించిన అంశాలన్నింటినీ సామాజిక భద్రతలో చేర్చాలని అందులో ప్రతిపాదించింది. సామాజిక భద్రత సాధన కోసం ఐఎల్‌ఓ చేసిన ప్రకటనలన్నింటిలోనూ ఈ ప్రకటనే తలమానికం. సామాజిక భద్రతకు అంతర్జాతీయంగా ఆమోదనీయ మైన కనీస ప్రమాణాలను ధ్రువీకరిస్తూ చేసిన ఏకైక అంతర్జాతీయ తీర్మానం ఇది.

## అంతర్జాతీయ అనుభవాల నుంచి పాఠాలు

సమాజంలో తీవ్ర నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురవుతున్న వర్గాలకు రక్షణ కల్పించడంలో సామాజిక భద్రత కీలకమైన అడుగుగా భావిస్తున్నారు. సామాజిక అసమానతలను తొలగించడం తద్వారా పేదరికాన్ని రూపుమాపేందుకు కూడా ఈ చర్యలు సహాయకారిగా ఉంటున్నాయి. ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ సామాజిక సామరస్యం, ప్రజాస్వామ్యం పరిఢవిల్లడానికి కారణం అవుతున్నాయి. ఇటీవలే ముగిసిపోయిన సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలతో (ఎండిజి) పాటు కొత్తగా ప్రవేశపెట్టిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డిజి), వివిధ అంతర్జాతీయ సామాజిక లక్ష్యాల్లోను, పలు అంతర్జాతీయ వేదికలపై కూడా అంతర్జాతీయ కట్టుబాటు, సంఘీభావానికి ప్రతీకగా సామాజిక భద్రత సాధనను ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు.

కొన్ని ఎంపిక చేసిన దేశాల్లో సామాజిక భద్రతా చర్యలు తొలినాళ్లలోనే ప్రారంభమైనా అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లో పురోగతిలో మందగమనం చోటు చేసుకుంది. ప్రపంచ జనాభాలో కేవలం 27 శాతం మందికే సమగ్ర సామాజిక భద్రత అందుబాటులో ఉన్నదని 2014 సంవత్సరంలో ఐఎల్‌ఓ ప్రచురించిన నివేదిక స్పష్టం చేస్తోంది. సామాజిక భద్రతా కార్యక్రమాలను అందించడంలో రెండు ప్రధానమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. అవి సార్వజనీనత, సుస్థిరత.

జనాభాలో ఎంపిక చేసిన వర్గాలకు, ఎంపిక చేసిన ప్రయోజనాలు అందించే విధంగా పలు దేశాల్లో సామాజిక భద్రతా పథకాలను ప్రారంభించారు. అయితే కొన్ని దేశాలు మాత్రమే సార్వజనీనత సాధించగలిగాయి. ప్రధానంగా అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లో అతి తక్కువ మంది లబ్ధిదారులకు మాత్రమే పరిమిత సంఖ్యలో సామాజిక భద్రతా పథకాలను అమలుపరచగలుగుతున్నారు. కాగితం మీద ఆ పథకాలు ఆకర్షణీయంగానే కనిపిస్తున్నా అధిక శాతం జనాభాకి అవి అందడంలేదు. ప్రధానంగా ఈ పథకాల ద్వారా లబ్ధికి ఎంత మంది అర్హులనేది నిర్ణయించడం ఒక సవాలుగా ఉంది. ఈ కారణంగా పలు పథకాలు విస్తరణలో గాని, జనాభాలోకి చొచ్చుకు పోవడంలో గాని సార్వజనీనత కోల్పోయాయి. అయితే ఈ పథకాలపై రాజకీయ వర్గాలకు ఆసక్తి అధికంగానే ఉంటుంది. ప్రజల ఆశలు, ఆర్థిక స్తోమతకు అనుగుణంగా నిరంతరం ఈ పథకాలను సమీక్షించి సవరణలు చేస్తూ ఉండాలి.

ఇక సామాజిక భద్రతా పథకాల రూపకల్పన, స్వభావంలో భిన్న దేశాల మధ్య తేడాలుంటాయి. జనాభా, ఆర్థిక వనరుల స్వభావాలను బట్టి పలు అభివృద్ధి చెందిన దేశాల్లో సామాజిక భద్రతా కార్యక్రమాలకు ఆయా దేశాల జిడిపిలో ఐదో వంతు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నది అంచనా. ప్రజల సగటు జీవిత కాలం పెరగడం, ఇప్పుడు

ఉద్యోగాలు చేసుకుంటున్న వారు రానున్న కాలంలో పదవీ విరమణ చేసి విశ్రాంత జీవితం గడపడం, జిడిపిలో రిటైర్మెంట్ వ్యయాల వాటా పెరగడం.. ఇవన్నీ సామాజిక భద్రతా వ్యయాలపై వత్తిడిని పెంచే అంశాలు. సామాజిక భద్రతను విస్తరించడం, సమాజంలోకి మరింతగా చొచ్చుకుపోయేం దుకు ప్రణాళికలు రూపొందించే సమయం లోనే ప్రభుత్వాలు అందుకు దీటుగా ఆర్థిక ప్రణాళికలు కూడా రచించుకోవాలి. సామాజిక భద్రతా పథకాలు దెబ్బ తినకుండా ఉండాలంటే ఈ చర్య చాలా అవసరం.

వర్ధమాన దేశాల్లోని సమాజంలోని అట్టడుగు వర్గాలవారందరికీ సామాజిక భద్రతా ప్రయోజనాలు అందించగల సంస్థాగతమైన సామర్థ్యాలు లేకపోవడం ఒక ప్రధానమైన సవాలు. అధిక శాతం కార్మికశక్తి అసంఘటిత రంగాల్లో పని చేస్తున్నందువల్ల చట్టపరంగా అమలు పరిచి తీరాల్సిన సామాజిక భద్రతా పథకాలకు వారు దూరం అవుతున్నారు. ఇలాంటి వారిని గుర్తించి వారి కోసం నవ్యతతో కూడిన పథకాలు రూపొందించి అమలుపరచాల్సివస్తోంది.

దేశంలో అమలులో ఉండే రాజ్యాం గానికి కట్టుబడి సామాజిక భద్రతా పథకాలను రూపొందించి, వాటి అమలును వ్యవస్థీకరించడం ఈ పథకాల విస్తరణలో ఒక కీలక అడుగు అవుతుంది. ప్రజలకు సామాజిక భద్రత కల్పించడం అనే అంశాన్ని చాలా దేశాల రాజ్యాంగాల్లో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పొందుపరచడం జరిగింది. అయితే ఈ లక్ష్యాన్ని మరింత స్పష్టంగా, దృఢంగా ప్రస్తావించిన దేశాలు సామాజిక భద్రతా పథకాల అమలులో ఇతర దేశాల కన్నా ముందున్నాయి.

ప్రపంచ స్థాయిలో సామాజిక భద్రతా వ్యవస్థ పరిణామక్రమానికి సంబంధించి కొన్ని ఉదాహరణలున్నాయి. ప్రపంచంలో అత్యంత అధునాతనమైన, సమగ్ర సామాజిక భద్రతా వ్యవస్థ గల దేశాల్లో ఫిన్లాండ్ ఒకటి. అక్కడ పౌరులందరికీ సామాజిక భద్రతను విస్తరించారు. సమాజంలోని భిన్న వర్గాల జనాభాకు విభిన్నమైన విధానం అమలులో ఉంది. ఈ పథకం కోసం అవసరం అయిన వనరులు పన్నుల ద్వారా వసూలయ్యే ఆదాయాల నుంచి సమకూరుస్తారు. ఒక సర్వస్వతంత్ర సంస్థ ఈ పథకాల అమలును పర్యవేక్షిస్తుంది. అలాగే ఉద్యోగాలు చేసుకుంటున్న వారు, క్రమం తప్పకుండా ఆదాయాలు ఆర్జిస్తున్న వారికి అమలుపరిచే పథకాల కోసం ప్రైవేటు బీమా కంపెనీలు, పింఛను ఫండ్‌లలో సభ్యులుగా చేరి వారు చేసే పొదుపు నుంచి నిధులు అందేటట్లు చేస్తారు. ఇది సామాజిక బీమాతో పాటు సంక్షేమాన్ని కూడా అందిస్తుంది. సామాజిక భద్రతా యంత్రాంగంలో భాగంగా ఫిన్లాండ్‌లో సమగ్ర ఆరోగ్య రక్షణ పథకం అమలులో ఉంది. ప్రపంచంలోని ఐదు దేశాల్లో అమలులో ఉన్న సామాజిక భద్రతా పథకాల స్వరూప స్వభావాలు పట్టిక 1లో పొందు పరచడం జరిగింది.

వివిధ దేశాల్లో అమలు జరిగే సామాజిక భద్రతా పథకాల ఉమ్మడి స్వభావాలను ఈ విధంగా సంక్షిప్తీకరించ వచ్చు.

- ఇంచుమించుగా అన్ని దేశాలూ వయోవృద్ధులకు పింఛన్లు, సంఘటిత రంగాల్లోని వారికి రిటైర్మెంట్ ప్రయోజనాలు, కనీస వేతన చట్టాలు అమలుపరుస్తున్నాయి. ఈ పథకాల ప్రయోజనాన్ని సమాజంలోని ఇతర వర్గాలకు కూడా విస్తరించే ప్రయత్నం చేస్తున్నాయి.
- సమాజంలోని ఇతర వర్గాలకు విస్తరించే ప్రయోజనాలు మాత్రం సాధారణ అర్హత కల వారితో పోల్చితే తక్కువగా ఉంటు న్నాయి. ఈ వర్గాలకు అందించే ప్రయోజ నాలు సార్వజనీనంగాను, సమగ్రంగాను ఉండడంలేదు.
- సామాజిక భద్రతలో ఆరోగ్య సేవలను కూడా భాగం చేయాలనే విషయంలో అందరి మధ్య ఏకాభిప్రాయం ఉన్నప్పటికీ సార్వజనీన ఆరోగ్య రక్షణ కల్పించగల యంత్రాంగాల ఏర్పాటులో మాత్రం కొన్ని దేశాలు మాత్రమే పురోగతి సాధించాయి.
- మంచి పురోగతి సాధించిన దేశాలు మాత్రం వివిధ పథకాలను సంఘటితం చేసి అమలుపరుస్తున్నాయి. సేవలం దించే వారిని, సేవలు కొనుగోలు చేసే వారిని వేర్వేరుగా ఉంచి పర్యవేక్షణకు పూర్తి స్వయంప్రతిపత్తి గల సర్వస్వతం త్రంగా వ్యవహరించే సంస్థలను ఏర్పాటు చేశాయి.
- ఫెడరల్ వ్యవస్థలో ఇలాంటి పథకాలు రూపొందించి అమలుపరిచే బాధ్యత ఆయా రాష్ట్రప్రభుత్వాలది కాగా కేంద్రం వారికి విధానపరమైన మార్గనిర్దేశం చేస్తుంది.
- ఇందుకు కొన్ని నవ్యతతో కూడిన చర్యలు కూడా అనుసరిస్తున్నారు. ఈ సేవలను పూర్తి స్థాయిలో విస్తరించడానికి సమాచార, కమ్యూనికేషన్ సాధనాలను వినియోగించుకుంటున్నాయి. అవసర మైతే ఇలాంటి వ్యవస్థలకు కొన్ని దేశాలు చట్టపరంగాను, న్యాయపరంగాను మద్దతు ఇచ్చే యంత్రాంగాలను కూడా ఏర్పాటు చేశాయి.

## భారతదేశం ముందున్న ఏడు మార్గాలు

ఏడు పదుల వయసులో ఉన్న స్వతంత్ర భారతంలో యువజనాభా (జనాభాపరమైన లబ్ధి) అధికంగా ఉంది. త్వరితగతిన అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ గుర్తింపు పొందింది. అంతర్జాతీయ మాంద్యానికి ఏ మాత్రం ప్రభావితం కానిది భారత్ ఒక్కటే. దేశంలో ఆచరణలో ఉన్న సామాజిక భద్రతా వ్యవస్థను పటిష్టం చేయడానికి ఇంతకు మించిన

అనుకూలమైన సమయం మరొకటుండదు. రాజ్యాంగంలోని 41, 42 అధికరణాల్లో నాల్గవ విభాగం పౌరులకు పనిహక్కు, విద్యాహక్కు, నిరుద్యోగులైతే భృతి హక్కు, వృద్ధాప్యం, అనారోగ్యం, అంగవైకల్యంతో బాధ పడే వారికి సహాయం పొందే హక్కు కల్పించారు. భారతదేశంలోని సామాజిక భద్రతా పథకాల్లో బలం ఇదే. సామాజిక భద్రతా ప్రయోజనాలు విస్తరించడానికి చక్కని చట్టపరమైన వ్యవస్థను కూడా రాజ్యాంగం అందుబాటులో ఉంచింది.

సామాజిక భద్రతా కార్యక్రమాలు ప్రారంభ దశలోనే ప్రవేశపెట్టిన దేశంగా భారతదేశానికి ప్రత్యేక స్థానం ఉంది. 1923లోనే దేశంలో కార్మికుల నష్టపరిహార చట్టం రూపొందించారు. ఆ తర్వాత ఈ పథకం పరిధిలోకి మరిన్ని వర్గాలను తీసుకువస్తూ ఎప్పటికప్పుడు జాబితాలో సవరణలు చేస్తూనే ఉన్నారు. పేపర్ మీదైతే ఈ పథకం ఆకర్షణీయంగానే కనిపిస్తుంది. అయితే ప్రపంచంలోని ఇతర దేశాలకు వలెనే భారతదేశం, దేశంలోని రాష్ట్రాలు కూడా అమలులో పలు సవాళ్లను ఎదుర్కొంటు న్నాయి. పథకాల్లో సారూప్యత లేకపోవడం, అమలు తీరు పరిపూర్ణంగా లేకపోవడం, విస్తరణపరమైన లోపాలు (తాజాగా ప్రవేశ పెట్టిన పథకాలకు కూడా వర్తిస్తాయి) ఈ సవాళ్లలో కొన్ని. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని సామాజిక భద్రతా పథకాల విస్తరణ, లోతును పెంచేందుకు ప్రభుత్వం ఏడు రకాల చర్యలు తీసుకోవలసి ఉంటుంది.

**ఎ) సార్వజనీనతకు ప్రణాళిక :**

పథకాల్లో కొత్త లబ్ధిదారులను చేర్చే విషయం పరిశీలించడానికి ఒక ప్రత్యేక విధానం అవసరమని అంతర్జాతీయ అనుభవాలు తెలుపుతున్నాయి. అది లేకపోతే కొందరికి ఈ పథకాలు అందకుండా పోతాయి. ఇందుకోసం అత్యున్నత స్థాయిలో చట్టపరమైన మద్దతు గల ఆమోదనీయ ప్రణాళికను ఒకదాన్ని రూపొందించడం తప్పనిసరి. ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించేందుకు వీలుగా ఈ ప్రణాళికను ప్రభుత్వమే అధికారికంగా విడుదల చేయాలి. ఈ ప్రణాళిక సమర్థవంతంగా అమలు జరగా లంటే ప్రస్తుతం అమలులో ఉన్న పథకాల న్నింటినీ సమీకృతం చేయడం, అందుకు అవసరమైన మద్దతు యంత్రాంగాలు ఏర్పాటు చేయడం తప్పనిసరి. సమాజంలోని అన్ని వర్గాలను సామాజిక భద్రత ఛత్రం కిందకు తీసుకువచ్చేందుకు ఇటీవల ప్రవేశపెట్టిన ఆధార్ కార్డులు, జన్‌ధన్ యోజన చక్కని వేదికలుగా ఉపయోగ పడతాయి. వీటిని కొత్తగా రూపొందించే ప్రణాళికతో సంఘటితం చేయడం అవసరం.

**బి) జాతీయ స్థాయి సర్వస్వతంత్ర వ్యవస్థ ఏర్పాటు :**

సామాజిక భద్రతా పథకాలు, ప్రయోజనాల అమలుకు పలు దేశాలు సర్వస్వతంత్రంగా వ్యవహరించే వ్యవస్థలను ఏర్పాటు చేశాయి. భారతదేశంలో సామాజిక భద్రత కల్పించేందుకు పలు అవకాశాలను అందించినప్పటికీ వాటి అమలు మాత్రం సంతృప్తికరంగా లేదు. ఈ పథకాలు, కార్యక్రమాల్లో సమర్థతను, ఆచరణీయతను తీసుకువచ్చేందుకు జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో సర్వస్వతంత్రంగా వ్యవహరించగల ఒక వ్యవస్థ ఏర్పాటు కావడం అవశ్యం. దీని వల్ల విధానాలను ప్రభుత్వం రూపొందిస్తే, వాటి అమలు బాధ్యత ఆ వ్యవస్థకు ఉంటుంది.

**సి) సరికొత్త ధోరణిలో సామాజిక రంగ పెట్టుబడుల ప్రణాళిక :**

సార్వజనీనమైన, సమగ్ర సామాజిక భద్రతా విధానం ప్రారంభించాలంటే ఆ దేశం సంపన్న దేశం అయి ఉండాలన్న నియమం ఏదీ లేదు. ఒక చక్కని పెట్టుబడి ప్రణాళిక రూపొందిస్తే అదే ఆర్థికాభివృద్ధికి దోహదకారి అవుతుంది. మారుతున్న జనాభా ధోరణులు, అవసరమైన వనరులపై స్పష్టమైన అవగాహనతో కూడిన ఒక సామాజిక భద్రతా ప్రణాళిక వచ్చే 15 నుంచి 20 సంవత్సరాల కాలానికి రూపొందించడం ఎంతో ఉపయో గకరంగా ఉంటుంది. పథకాలు స్థిరంగా అమలుజరిగేందుకు నవ్యతతో కూడిన ఆర్థిక వనరుల కేటాయింపు విధానం అవసరం. చట్టాల్లోను, రాజ్యాంగంలోను అవసరమైన సవరణలు చేపట్టడం ద్వారా ఎంపిక చేసిన వర్గాలు ఆయా పథకాల్లో పెట్టుబడి పెట్టడాన్ని నిర్బంధం చేయవచ్చు.

**డి) సంఘీభావం, ప్రజాచైతన్యం :**

సామాజిక భద్రతా వ్యవస్థకు సంఘీ భావం కీలకం. సమాజంలో నిరాదరణకు గురవుతున్న వర్గాల వారికి చేయూత ఇచ్చేందుకు ప్రజలందరూ కట్టుబాటు ప్రకటించడమే సంఘీభావం. సంపన్నులు పేదలకు; విద్యావంతులు నిరక్షరాస్యులకు; వ్యవస్థీకృత రంగంలో పని చేస్తున్న వారు అవ్యవస్థీకృత రంగంలోని వారికి లేదా అర్హతలకు దీటైన ఉద్యోగాలు లేని వారికి సహాయం అందించేందుకు ముందుకు రావాలి. ఇలాంటి కార్యక్రమాల్లో సమాజంలో అన్ని వర్గాలను భాగస్వాములను చేయడం ద్వారా ఈ సంఘీభావం సాధించవచ్చు. ఇలాంటి సంఘీభావం వల్ల ప్రస్తుతం నడుస్తున్న పథకాల విస్తరణను పెంచడానికి కూడా వీలుంటుంది.

**ఇ) సార్వత్రిక ఆరోగ్య రక్షణ :**

ఆరోగ్య సంబంధిత వ్యయాలు సొంతంగానే భరించవలసిరావడం వల్ల భారతదేశంలో ఏటా 63 మిలియన్ ప్రజలు పేదరికంలోకి దిగజారుతున్నారని అంచనా. పేదరికం రేఖకు దిగువన ఉన్న వారు మరింత పేదరికంలోకి జారిపోతున్నారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆరోగ్య సంబంధిత వ్యయాలు ఎలా భరించాలి, సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ ఏ విధంగా కల్పించాలనే విషయంలో స్పష్టమైన విధానం లేకపోవడం సామాజిక భద్రత ప్రయత్నాలన్నింటినీ దెబ్బ తీస్తోంది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం చేస్తున్న వ్యయం 30 శాతమే. ఇది

ప్రపంచంలో ఇతర దేశాలు చేస్తున్న వ్యయాల్లో అతి తక్కువ అంటే అతిశయోక్తి కాదు. అంటే 65 శాతం ఆరోగ్య సంరక్షణ వ్యయాలను ప్రజలు సొంతవనరుల నుంచే భరిస్తున్నారు. ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం అధికంగా ఖర్చు చేయడం వల్ల ఆ మేరకు ప్రజలకు సొమ్ము ఆదా అయి పేదరిక నిర్మూలనకు సహాయకారి అవుతుంది. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్న సిద్ధాంతానికి కట్టుబడి ప్రభుత్వం ప్రజారోగ్యంపై అధికంగా ఇన్వెస్ట్ చేయడం వల్ల జిడిపి ఉత్తేజితమై తద్వారా ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుంది. అనేక దేశాలు సామాజిక భద్రతా చర్యల్లో భాగంగా సామాజిక ఆరోగ్య బీమాను అందుబాటులోకి తెచ్చి సార్వత్రిక ఆరోగ్య సంరక్షణకు పాటు పడుతున్నాయి. భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ దిశగా చిత్తశుద్ధితో కృషి చేయాలి. ప్రభుత్వం ఆరోగ్య రంగంపై పెట్టుబడులు పెంచి సామాజిక ఆరోగ్య బీమాను రూపకల్పనకు కృషి చేయాలి. ప్రస్తుతం అమలులో ఉన్న రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన (ఆర్ఎస్‌బివై) వంటి పథకాలు ఈ దిశగా మంచి అడుగే అయినా భారత ప్రభుత్వం ఆరోగ్య సంరక్షణపై చేస్తున్న ఖర్చులో ఈ పథకానికి కేటాయిస్తున్నది ఒక శాతం కన్నా తక్కువే కావడం పెద్ద లోపం. ఇలాంటి కీలకమైన పథకానికి ఇంత తక్కువ ఖర్చు చేయడం వల్ల దాని ప్రభావం కూడా పరిమితంగానే ఉంటోంది. ఈ పథకంతో పాటు ప్రతిపాదిత జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకాన్ని (ఎన్‌హెచ్‌పిఎస్) కూడా సత్వరం ప్రారంభించి అవసరమైనన్ని వనరులు కేటాయించడం వల్లను, ఇటీవల విడుదల చేసిన జాతీయ ఆరోగ్య విధానం (2017) అమలు వల్లను సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ ప్రయత్నాలు మరింత జోరందుకుంటాయి.

**ఎఫ్) రాష్ట్రప్రభుత్వాల చొరవ :**

భారత్ వంటి ఫెడరల్ వ్యవస్థలో సామాజిక భద్రతా చర్యల్లో రాష్ట్రాల భాగస్వామ్యం అత్యంత కీలకం. సామాజిక భద్రతా పథకాలు సవ్యధోరణులతో రూపొందించడానికి, విజయవంతం కావడానికి ఇది దోహదపడుతుంది. కేంద్రప్రభుత్వ ఆర్థిక వనరులు ఎప్పుడూ పరిమితంగానే ఉంటాయి. కాని రాష్ట్రప్రభుత్వ నాయకత్వం కట్టుబాటు, భవిష్యత్తుపై వారి విజన్‌ను బట్టి ఇలాంటి పథకాల అమలులో ప్రత్యేకత చాటుకోగలుగుతాయి. దేశంలోని పలు రాష్ట్రాలు సార్వజనీన సామాజిక భద్రత, సార్వజనీన ఆరోగ్య సంరక్షణ సేవల విషయంలో యావత్ దేశానికి దారి చూపగల స్థితిలో ఉన్నాయి.

**జి) శాసన, చట్టపరమైన సంస్కరణలు :**

సామాజిక భద్రతా పథకాలకు శాసనపరమైన మద్దతు అవసరం. అప్పుడే వాటికి దీర్ఘకాలిక స్థిరత్వం, చట్టపరమైన మద్దతు లభిస్తాయి. అలాగే ఆ పథకాల్లో చందాదారులుగా చేరాలంటూ ప్రజలను నిర్బంధం చేసే విధానానికి బదులుగా అవసరమైన సందర్భాల్లో పన్నుల ద్వారా సమకూరే ఆదాయం నుంచి నిధులు అందించాలి. అలా చేయకపోతే వీటిని దీర్ఘకాలం పాటు స్థిరంగా కొనసాగించడం ఒక సవాలే అవుతుంది. ఇందుకోసం చట్టాలు, నిబంధనల్లో మార్పులు తెచ్చేందుకు రాజ్యాంగ సవరణలు కూడా చేపట్టాలి. ఇదంతా సమర్థమైన నిపుణులు, దేశంలోని ప్రధాన విద్యాసంస్థల మార్గదర్శకంలో సాగాల్సిన ప్రక్రియ.

**ముగింపు**

గత కొద్ది దశాబ్దాలుగా సామాజిక భద్రతా చర్యలు క్రమక్రమంగా విస్తరించి పరిణామం చెందాయి. ఆర్థికాభివృద్ధి బాటలో భిన్న దశల్లో ఉన్న దేశాల అనుభవాల నుంచి కొన్ని పాఠాలు కూడా మనకు ఆవిష్కారం అయ్యాయి. భారతదేశంలో సామాజిక భద్రత అనేది ఒక రాజ్యాంగ నిబంధన, కట్టుబాటు. దేశంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలన్నీ ప్రాధాన్యతా క్రమంలో ఈ బాధ్యతను నిర్వర్తిస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ వాటి విస్తృతి, ప్రభావం ఇంకా పరిమితంగానే ఉంది. సామాజిక భద్రతా పథకాల్లో సార్వజనీనత, సుస్థిరత కోసం ప్రపంచదేశాల అనుభవాల నుంచి భారత్ పాఠాలు నేర్చుకోవచ్చు. సామాజిక రంగం పెట్టుబడుల ప్రణాళిక, సామాజిక భద్రతా పథకాల రూపకల్పన, అమలులో పాలు పంచుకుంటున్న విభాగాలను, అందుబాటులో ఉన్న పథకాలను సంఘటితం చేయడం, ఇలాంటి పథకాలకు ఆర్థిక వనరులు సమకూర్చేలా ప్రజల్లో సంఘీభావం సాధించడం, రాష్ట్రాలన్నింటినీ ఈ కార్యక్రమాల అమలులో ముందువరుసలో నిలవడం వంటి చర్యలు సత్ ఫలితాలనిస్తాయి. అలాగే సామాజిక భద్రతా యంత్రాంగంలో సార్వత్రిక ఆరోగ్య సంరక్షణను ఒక భాగం చేయడం కూడా తప్పనిసరి. దేశంలో సామాజిక భద్రతా పథకాలను సార్వజనీనం, సుస్థిరం చేయడం వల్ల పేదరిక నిర్మూలన జరిగి దేశం త్వరితంగా స్థిరమైన అభివృద్ధి బాటలో ముందుకు సాగుతుంది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడం (ఎస్‌డిజి) తేలికవుతుంది.

**అంతర్జాతీయ కార్మిక సంస్థ నిబంధనావళి 1952 కింద సామాజిక భద్రతలోని అనుబంధ అంశాలు...**

- వృద్ధాప్య పింఛన్లు : ఒక నిర్దిష్ట వయసు కన్నా పైబడి జీవించిన వారికి రక్షణ కల్పించడం.
- జీవించి ఉన్న వారికి ఆసరా : కుటుంబంలో సంపాదనాపరులు మరణించిన కారణంగా వైధవ్యం ప్రాప్తించిన వారు, పిల్లలు ఆసరా కోల్పోయినందుకు వారికి అవసరమైన ఆసరా అందించడం.
- అనారోగ్యంతో మూలపడిన వారికి సెలవు: ఎవరైనా అనారోగ్యం కారణంగా పని చేయలేని స్థితి ఏర్పడినప్పుడు కోల్పోయిన ఆదాయాలకు పరిహారంగా సెలవుతో కూడిన ప్రయోజనం

అందించడం.

- విధినిర్వహణలో గాయాలు : ఎవరైనా విధినిర్వహణలో భాగంగా ప్రమాదంలో గాయపడినా, మరణించినా అందించే సహాయం. గాయపడిన వారికి వైద్యచికిత్స ఖర్చులు ఇవ్వడం, సెలవు మంజూరు చేయడం.
- వైకల్య ప్రయోజనం : శాశ్వత అంగవైకల్యంతో లేదా అసమర్థతతో బాధపడుతూ తమకు తాము సంపాదించుకోలేని స్థితిలో ఉన్న వారికి ఆసరా.
- నిరుద్యోగ ప్రయోజనం : పని చేయగల సామర్థ్యాలుండి, పని చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ఉపాధి లభించని స్థితిలో చేయూత.
- కుటుంబ ప్రయోజనం : కుటుంబంలోని పిల్లలను సాకే బాధ్యత.
- వైద్య చికిత్స : కారణం ఏదైనప్పటికీ కదలలేని స్థితిలో ఉన్న వారికి (గర్భిణీలతో సహా) వైద్యచికిత్సలు అందించడం.
- మాతృత్వ ప్రయోజనం : గర్భిణీలుగా ఉండి పని చేయలేని స్థితి ఏర్పడి ఇంటికే పరిమితమైనప్పుడు కోల్పోయిన ఆదాయాలకు పరిహారం అందించడం
- ఏ కారణం వల్ల అయినా ప్రభుత్వాలు అందిస్తున్న సామాజిక భద్రతా పథకాల ప్రయోజనం పొందలేకపోతున్న వారికి సామాజిక సహాయం అందించడం.

1. సార్వజనీనతకు ప్రణాళిక రూపొందించేందుకు అంగీకారం, అభివృద్ధి.
2. సర్వస్వతంత్రంగా వ్యవహరించే జాతీయ స్థాయి సామాజిక భద్రతా సంస్థ ఏర్పాటు
3. ఆర్థిక వనరుల సమీకరణకు నవ్య ఆలోచనా ధోరణులతో కూడిన సామాజిక రంగ పెట్టుబడుల ప్రణాళిక రూపకల్పన.
4. ప్రజలందరినీ చైతన్యవంతులను, భాగస్వాములను చేస్తూ సంఘీభావం సాధించడం.
5. సామాజిక భద్రతా చర్యల్లో భాగంగా సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ విధానం అమలు.
6. రాష్ట్ర ప్రభుత్వాల చురుకైన భాగస్వామ్యం
7. అవసరమైన శాసన, చట్టపరమైన మద్దతు కల్పించడం.

**పట్టిక – 1 వివరణ: ఎంపిక చేసిన దేశాల్లో సామాజిక భద్రతా చర్యల సంక్షిప్త వివరణ**

| | |
|---|---|
| **ఆస్ట్రేలియా:** | చెల్లింపులు చేయకుండా మనుగడ సాగించలేని పరిస్థితి ఉన్నప్పటికీ అందుకు కావలసిన వనరులు అందుబాటులో లేని వ్యక్తులు, గృహాలకు ఆస్ట్రేలియా సామాజిక భద్రతాపరమైన చెల్లింపులు చేస్తుంది. అక్కడ ఉన్న సామాజిక భద్రతా విధానం అత్యంత విస్తారమైనది. సాంప్రదాయికంగా సామాజిక భద్రతా ప్రయోజనాలు అందుకునే వారే కాకుండా (రిటైరైన వారు, వారి భార్యలు, పిల్లలు, దివ్యాంగులు, నిరుద్యోగులు, రోగగ్రస్తులు, కొత్తగా పుట్టిన పిల్లల సంరక్షణ బాధ్యత గల తల్లిదండ్రులు) విద్యార్థులు, రోగగ్రస్తులకు అండగా ఉండే వారు, ఆదిమ జాతుల వారికి కూడా సహాయం అందిస్తుంది. |
| **చైనా:** | చైనాలో ఆయా రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా సామాజిక భద్రతా పథకాలను రూపొందిస్తారు. వాటికి సంబంధించిన నిబంధనలు కేంద్రప్రభుత్వం రూపొందిస్తే పాలనాపరమైన వ్యవహారాలు, నిర్వహణా పరమైన బాధ్యతలు రాష్ట్రప్రభుత్వాలు చేపడతాయి. గత నాలుగు దశాబ్దాల కాలంలో ఈ పథకాలన్నింటిలోనూ పెను మార్పులు చోటు చేసుకున్నాయి. చాలా పథకాలు అమలులో ఉండగా వాటిలో కొన్నింటికి ఉద్యోగులు, యాజమాన్యాలు కలిసి చందాదారులుగా ఉంటారు. మరికొన్ని పథకాలకు పూర్తిగా యాజమాన్యాలే వాటా అందిస్తాయి. ఈ బీమా పథకాలకు వేతనపరమైన పరిమితులు కూడా ఉంటాయి. ఉద్యోగులు అంతకు ముందు సంవత్సరంలో అందుకున్న వేతనం, సామాజిక భద్రతకు వారందిస్తున్న వాటా ఆధారంగా ఈ పరిమితి ఉంటుంది. |
| **క్యూబా:** | క్యూబాలో సామాజిక భద్రతా వ్యవస్థ అంతా సార్వజనీనంగా ఉంటుంది. వాటి అమలుకు కావలసిన నిధులు పూర్తిగా ప్రభుత్వమే సమకూర్చుతుంది. ఎన్నో అభివృద్ధి చెందిన దేశాల్లోని వ్యవస్థల కన్నా క్యూబాలోని వ్యవస్థ అత్యంత విస్తారమైనది. సామాజిక భద్రతా పథకంతో పాటుగా క్యూబా పౌరులందరికీ సమగ్ర ఉచిత ఆరోగ్య సంరక్షణ ప్రయోజనం అందిస్తోంది. ఇతర దేశాలతో పోల్చితే ఎంతో తక్కువ వ్యయాలకే త్వరితగతిన ఈ ప్రయోజనాలను ప్రజలంద రికీ అందుబాటులోకి తీసుకురాగలిగింది. |
| **జపాన్:** | జపాన్‌లో కూడా ఇంచుమించుగా సార్వజనీన సామాజిక భద్రతా వ్యవస్థ అమలులో ఉంది. సూత్రప్రాయంగా అయినా సరే ప్రతీ ఒక్కరూ ఈ వ్యవస్థలో భాగస్వాములు కావడం అక్కడ తప్పనిసరి. మౌలిక జీవన వ్యయాలు, గృహవ్యయాలు, నిర్బంధ విద్య, నైపుణ్యాల శిక్షణ వ్యయాలు, ఆరోగ్య బీమా, అంత్యక్రియలు...అన్నింటికీ ప్రభుత్వం నుంచి సహాయం అందించే విధానాన్ని జపాన్ అనుసరిస్తోంది. ఎన్నో సంవత్సరాల నుంచి ఈ వ్యవస్థ సమగ్రంగా రూపు దిద్దుకుని వయోవృద్ధుల జనాభా పెరుగుతున్న దేశాలకు ఆదర్శనీయంగా నిలిచింది. |
| **ఫిలిప్పీన్స్:** | ఫిలిప్పీన్స్‌లో కూడా సామాజిక భద్రతా వ్యవస్థను పూర్తిగా ప్రభుత్వమే నిర్వహిస్తోంది. ప్రైవేటు రంగంలోని కార్మికులు, వృత్తినిపుణులు, అవ్యవస్థీకృత రంగాల్లోని వారికి సామాజిక బీమా కార్యక్రమాన్ని ప్రభుత్వమే నిర్వహిస్తోంది. సామాజిక భద్రతా వ్యవస్థ కింద ప్రధానంగా మూడు విభాగాలున్నాయి. ఎ) సామాజిక భద్రతా కార్యక్రమం బి) ఆరోగ్య రక్షణ కార్యక్రమం సి) ఉద్యోగుల నష్టపరిహార కార్యక్రమం. ప్రభుత్వోద్యోగుల కోసం ప్రభుత్వ సర్వీసుల బీమా వ్యవస్థ (జిఎస్ఐఎస్) నిర్వహణలో ప్రత్యేకంగా ప్రభుత్వ పింఛను ఫండ్ అందుబాటులో ఉంటుంది. |

■

పారదర్శకత

# మధ్యాహ్న భోజన పథకం - సామాజిక భద్రత

– కిరణ్ భట్టి



మధ్యాహ్న భోజన పథకం – బాగా విజయవంతం అయిందని చెప్పాలి. కేంద్ర ప్రభుత్వ సాంఘిక భద్రత కార్యక్రమాల్లో ఇదే అతిపెద్ద పథకంగా రూపుదిద్దుకుంది. ఆకలి మరియు పోషకాహారం లోపాన్ని సరిదిద్దడానికి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. పాఠశాల భోజనాలు ఆకలిని తగ్గిస్తాయి. విద్యార్థుల హాజరీని పెంచుతాయని ప్రపంచ వ్యాప్తంగా జరిపిన సర్వేలో వెల్లడి అయింది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పిల్లలకు మొదటి ఆహారం. దేశంలోని 11.5 లక్షల స్కూళ్లల్లో 10 కోట్ల మందికి పైగా పిల్లలకు ఇది అందుతోంది.

సామాజిక భద్రత అనేది అందరి శ్రేయస్సు కోసం ఉద్దేశించబడింది. పౌరులందరికీ హామీ ఇచ్చే వ్యవస్థ. దేశ పౌరులందరూ గౌరవప్రదమైన జీవితం గడపడానికి వీలు కల్పించే విధంగా ప్రభుత్వం తన సేవలను అందిస్తోంది. ప్రజలకు ప్రాథమిక ప్రయోజనాలు కల్పించే విధంగా చర్యలు ఉంటున్నాయి.

సమాజంలో భద్రత – సంక్షేమాలను అందరికీ అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సాంఘిక భద్రతను కల్పిస్తోంది. ప్రయోజనాలు అందరికీ సమానంగా లభించాలనేది కూడా ఒక ధ్యేయంగా ఉంది. ప్రజాస్వామిక రూపాల ఆధారంగా సామాజిక ఒప్పందం విస్తృతంగా గుర్తింపు పొందింది. గతంలో జరిగిన సాంఘిక భద్రత చరిత్రను గుర్తించడం కొంచెం కష్టమే అయినప్పటికీ రోమన్ సామ్రాజ్యం నుండి వేర్వేరు ప్రభుత్వాల వరకు అందించిన ప్రజా సంక్షేమ రూపాలు రుజువయ్యాయి. పేదలకు పంపిణీ చేసిన ఉచిత ధాన్యం రికార్డుల నుండి ఇది తెలుసుకోవచ్చు. ఆ తరువాత కాలంలో ఆంగ్ల పేద చట్టాలు (1601), మరియు యు.ఎస్. సోషల్ సెక్యూరిటీ యాక్ట్ (సాంఘిక భద్రతా చట్టం 1935) సాంఘిక భద్రతా నియమాలకు మంచి ఉదాహరణగా ఉన్నాయి. ఇవన్నీ ప్రజాశ్రేయస్సు అనే ఆలోచన మీదే ఆధారపడి ఉన్నాయి.

అయినప్పటికీ సాంఘిక భద్రత గురించి సర్వ సాధారణంగా ఆమోదించిన భావన మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన (1948) ఆర్టికల్ 22లో పొందుపరచ బడింది. అందులో ఇలా ఉంది. సమాజంలో సభ్యుడిగా, అందరికీ సామాజిక భద్రత మరియు జాతీయ ప్రయత్నం – అంతర్జాతీయ సహకారం ద్వారా ప్రతి రాష్ట్రం యొక్క ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల కోసం చర్యలు – అలాగే వ్యక్తిగత గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛ, అభివృద్ధి తప్పనిసరిగా ప్రతి పౌరుడికీ చేరటానికి అర్హత పొందవచ్చు. పెన్షన్లు లేక నిరుద్యోగ బీమా (సాంఘిక బీమా అని కూడా అంటారు) అందించడం, అలాగే వివిధ ప్రాథమిక సేవలను అందించడం, వివిధ రకాల విరాళాలను అందచేయడం చేస్తారు. అయితే ఆరోగ్యం, విద్య అనేవి విరాళాలపై ఆధారపడి ఉండవు. విద్య, ఆరోగ్య రంగాలను సాంఘిక – భద్రతా రూపాలుగా భావిస్తారు. పౌరుల్లో పేదరికం నిర్మూలన, సాంఘిక అసమానత లను రూపుమాపడం జరుగుతుంది. సమాజంలో పౌరులందరికీ

సీనియర్ ఫెలో, సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్ (సి.పి.ఆర్), న్యూఢిల్లీ.
E-mail: kiran.bhatty@cprindia.org

సాంఘిక సమానత్వాన్ని కల్పించే దిశగా చర్యలు ఉంటాయి.

భారతదేశంలో పెన్షన్లు, ఉపాధి హామీ (నిరుద్యోగ భృతితో సహా) ప్రసూతి ప్రయోజనాలు, ఆహార సబ్సిడీలు, పాఠశాల భోజనం (మధ్యాహ్న భోజనం) వంటి సామాజిక భద్రత ఏర్పాట్లు ఉన్నాయి. అయితే ఈ పథకాల అమలు చాలా సందర్భాల్లో అసంతృప్తికరంగా ఉంది. ప్రజలకు ఉద్దేశించిన ప్రయోజనాల వైఫల్యం సమాంతర సాహిత్యం వరకు విస్తరించింది. ఈ పేలవమైన పనితీరుకు పలు కారణాలు ఉన్నాయి. ఒక పక్క అధికారుల ఉదాసీనత, వనరులు కొరత, మరో పక్క అవినీతి వల్ల పథకాలు సంతృప్తికరంగా అమలు జరగటం లేదు. అసమర్థత పౌరులది కాదు. ప్రభుత్వానిదే! రాష్ట్రాల సంక్షేమ కార్యక్రమాల అమలు వైఫల్యాలు, ముఖ్యమైన చర్చనీయ అంశాలుగా మారాయి. ప్రభుత్వం తనకు అంతర్గతంగా ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడానికి చాలా తక్కువ ప్రయత్నాలు చేస్తోంది. దీనికి బదులుగా వ్యవస్థలోని లోపాలను పరిష్కరించడానికి కొన్ని ప్రయత్నాలు చేసింది. కొన్ని పరిష్కార మార్గాలను కనిపెట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ – ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రవేశ పెట్టింది. అలాగే పథకాల అమలు కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించింది. ప్రారంభంలో సాంకేతికత వల్ల కొంత తికమక పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే ప్రజాసంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో ప్రజలకు అందాలంటే అవినీతిని అరికట్టాలి. ఇందులో భాగంగానే సాంకేతిక పరిజ్ఞానాన్ని పథకాల అమలుకు తప్పనిసరి చేసింది. బయోమెట్రిక్ ఆధారంగా ఆధార్ కార్డును (UID) పాఠశాలల్లో మధ్యాన్న భోజనం పొందటానికి తప్పనిసరి చేసింది. ఈ అంశంపై అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశం ప్రకారం తాజాగా ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం పొందడానికి ఆధార్ గుర్తింపు కలిగి ఉండాలి. ఈ వ్యాసం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమస్యకు పరిష్కారం, మరియు విద్యలో సామాజిక భద్రత – కార్యక్రమ అమలు మెరుగుపరచడంలో బయోమెట్రిక్ సంస్కర ణలను సూచిస్తుంది. వాస్తవానికి పిల్లల పోష కాహారం – విద్యా భద్రతను అడ్డుకునేందుకు చెబుతున్న వివిధ కారణాలను విశ్లేషించి, పథకం అమలుకు మెరుగైన సూచనలు అందిస్తుంది.

## మధ్యాహ్న భోజన పథకం

సాంఘిక భద్రత మరియు విద్య మధ్య ఉన్న సంబంధాలు బాగా స్థిర పడినప్పటికీ రెండు దిశలలో అమలు చేస్తున్నందున కొంచెం క్లిష్టమైనవే అని చెప్పాలి. ఐతే విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు బలహీన నేపధ్యం ఉన్న పిల్లలకు కొన్ని రకాల సామాజిక భద్రత అవసరం అవుతుంది. అలాగే విద్య అనేది భవిష్యత్తులో వచ్చే ప్రమాదాలకు వ్యతిరేకంగా సామాజిక భద్రతకు ఒక రూపం. విద్య కోసం సాంఘిక భద్రతా నిబంధనలను సడలించి, ఆర్థికంగా వెనుకబడ్డ కుటుంబాల పిల్లలను పాఠశాలలకు పంపడానికీ, విద్యాభ్యాసం కొనసాగించడానికీ వారికి సదుపాయాలు కల్పిస్తారు. వారికి వివిధ స్థాయిల్లో స్కాలర్‌షిప్‌లు కల్పించడం, ఆర్థిక ప్రోత్సాహకాలు కల్పించడం, మధ్యాహ్న భోజనాలు, పాఠశాల ఆరోగ్య పథకాలు ఇవన్నీ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రణాళికా వ్యూహాలు జరుగుతున్నాయి. భారతదేశంలో పైన పేర్కొన్న పథకాలన్నీ అమలులో భాగంగానే ఉన్నాయి. వివిధ స్థాయిల్లో రూపకల్పన, అమలులో ప్రభుత్వం ఆశించిన ఫలితాలు సాధించింది.

అన్నింటిలో కన్నా మధ్యాహ్న భోజన పథకం – బాగా విజయవంతం అయిందని చెప్పాలి. కేంద్ర ప్రభుత్వ సాంఘిక భద్రత కార్యక్రమాల్లో ఇదే అతిపెద్ద పథకంగా రూపు దిద్దుకుంది. ఆకలి కడుపులతో విద్యను నేర్చుకోవడానికి అవకాశం లేదు. ఆకలి మరియు పోషకాహారం లోపాన్ని సరిదిద్దడానికి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. పోషకాహార మెరుగుదలకు సంబంధించి రెండు లక్ష్యాలను నిర్దేశించారు. పిల్లలు స్కూలుకు రావడానికి మరియు రోజంతా అక్కడే ఉండటానికి వీలు కల్పిస్తుంది. వాస్తవానికి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అనేది ముఖ్యమైన లక్ష్యాలను అందిస్తుంది. పాఠశాల భోజనాలు ఆకలిని తగ్గిస్తాయి. విద్యార్థుల హాజరీని పెంచుతాయని ప్రపంచ వ్యాప్తంగా జరిపిన సర్వేల్లో వెల్లడి అయింది. చాలావరకు అభివృద్ధి చెందిన దేశాల్లో ఇదే మాదిరిగా జరుగుతోంది. భారతదేశంలో తొలిసారిగా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెట్టింది. తమిళనాడు ప్రభుత్వం 1982లో ఆ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దీనిని ప్రారంభించారు.

ఆ తర్వాత 2001లో సుప్రీంకోర్టు మధ్యాహ్న భోజన పథకంపై ఆదేశాలు జారీ చేసింది. దేశంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయాలని కోరింది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనమే పిల్లలకు మొదటి ఆహారం. దేశంలోని 11.5 లక్షల స్కూళ్లల్లో 10 కోట్ల మందికి పైగా పిల్లలకు ఇది అందుతోంది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, ఒబీసీ వర్గాల నుంచి 25 లక్షల మంది మహిళలు మధ్యాహ్న భోజన పథకంలో సహాయకులుగా వివిధ పాఠశాలల్లో పని చేస్తున్నారు. పిల్లలందరూ కలసి భోజనాలు చేయడం వల్ల వారిలో ఒక విధమైన సన్నిహితత్వం – మిత్రత్వం, పరస్పర అవగాహన పెరుగుతాయని సర్వేలో తేలింది.

ఈ భోజన పథకాన్ని విద్యార్థుల తల్లి దండ్రులు కూడా అపుడపుడు పర్యవేక్షణ చేయడం వల్ల లోపాలు తలెత్తే అవకాశం తగ్గుతోంది. ఈ కార్యక్రమంలో అపశృతులు

లేవని చెప్పడం లేదు. పంపిణీ విధానంలో లోపాలున్నాయి. సరఫరాలో అసమర్థత, పదార్థాలలో తక్కువ పరిశుభ్రత, మరియు మౌలిక సదుపాయాల్లో కొరత, అలాగే భోజనంలో పూర్తి పోషక విలువలు లేకపోవడం, మధ్యాహ్న భోజనం (MDM) ఆధారంగా పిల్లల ఖచ్చితమైన సంఖ్యను అంచనా వేయడంలో ఇబ్బందులు ఉన్నాయి. అలాగే పిల్లలు కొందరు మధ్యాహ్న భోజనం కోసమే వచ్చి అది పూర్తి అయ్యాక వెళ్లిపోవడం, ఉపాధ్యాయులు ఈ పథకం పర్యవేక్షణలో ఎక్కువ సమయం కేటాయించడం వల్ల బోధన సక్రమంగా సాగటం లేదు. అంతేకాకుండా కులం ఆధారంగా పిల్లలను విడిగా భోజనం చేయమంటున్నారని కొన్ని చోట్ల ఫిర్యాదులు వచ్చాయి. అలాగే పిల్లలు తప్పనిసరిగా ఆధార్ గుర్తింపు (UID) ఎలా ఉపయోగించాలనేది స్పష్టంగా లేదు. మధ్యాహ్న భోజన పథకం పనితీరు మెరుగుపరచేందుకు బయోమెట్రిక్ విధానాన్ని ఉపయోగించటం, UID ని నియమించాలనే ప్రతిపాదన ముందుకు వచ్చింది. సేవలు, ప్రయోజనాలు లేదా సబ్సిడీలను పంపిణీ చేయడానికి గుర్తింపు పత్రంగా ఆధార్ ఉండాలనేది ఒకవాదన. ఇది పంపిణీ ప్రక్రియను మరింత సులభతరం చేస్తుంది. పారదర్శకత, సమర్థత ఏర్పడు తుంది.

ఏది ఏమైనప్పటికి ఆధార్ కార్డు లేకుండా పిల్లల సంఖ్యతో సరిపోల్చడానికి UID కేటాయింపులో అనేక అంతరాలు న్నాయి. కాబట్టి సరళీకరణ అనేది పిల్లలను క్రమపద్ధతిలో పరిమితం చేసే రూపంగా ఉంటుంది. ఇది తప్పనిసరిగా ఒక సామాజిక భద్రతా కార్యక్రమం యొక్క ఉద్దేశం కాదు. ఈ పద్ధతి ద్వారా జవాబుదారీ తనం ఏర్పడుతుంది. మౌళిక సదుపాయాల కొరత, అపరిశుభ్రత, పోషక విలువలు లేని భోజనం, విద్యార్థుల హాజరీ ఇవన్నీ UID ద్వారా బయటపడతాయి. ఇప్పటికీ పోషకాహార లోపం అనేది బయటపడింది. ఇదిలా ఉండగా పెన్షన్లు, ప్రజాపంపిణీ వ్యవస్థ, వివిధ ప్రభుత్వ ప్రోత్సాహకాలలో ఆధార్ ఉపయోగించడం రాజస్థాన్, ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో తక్కువగా ఉంది. ఆయా రాష్ట్రాలలో 30 శాతం మంది లబ్దిదారులు ఈ అంశాలలో సమస్యలను ఎదుర్కొంటున్నట్లు ఒక నివేదికలో వెల్లడైంది. మొబైల్ నెట్‌వర్క్‌కు సంబంధించిన సమస్యలు, విద్యుత్ సరఫరాలో లోపాలు బాగా ఉన్నాయి. దేశంలోని పెద్ద పెద్ద పట్టణ ప్రాంతాలలో కూడా ఈ సమస్యలు తలెత్తుతున్నాయి. అలాగే నెట్‌వర్క్‌లో లోపాలవల్ల ఆధార్ గుర్తింపు తగినట్లుగా చూపించకపోవడంవల్ల కొంతమంది పిల్లలు మధ్యాహ్న భోజనానికి తిరస్కరించబడతారు. సాంకేతికత ఎందుకు విఫలమైంది? ఈ అసమర్థతకు ఎవరు బాధ్యత వహిస్తారు?

అయితే సామాజిక పర్యవేక్షణ, సామాజిక ఆడిట్లు లబ్దిదారులకు సంబంధించి సమాచారాన్ని బహిరంగంగా ఉంచడం వల్ల అవినీతి తగ్గుతుంది. లబ్ధిదారులకు ప్రయోజనం కలుగుతుంది. ఈ పథకంలో జవాబుదారీ తనం పెంచడానికి మరిన్ని అనువైన మార్గాలు ఉన్నాయి. వాస్తవం చెప్పాలంటే సమాజంలో పిల్లలపై నిరంతరం నిర్లక్ష్యవైఖరి ఎక్కువగా ఉంది. పిల్లల ఆరోగ్యం, విద్య, అంశాలలో లోటుపాట్లు ఎక్కువ ఉన్నాయి. పిల్లలపై హింసాత్మక సంఘటనలు ఎక్కువగా ఉంటుతున్నాయి. కొన్నిచోట్ల మంచి పనితీరు ప్రదర్శించిన కార్యక్రమంలో కూడా వ్యతిరేకాంశాలు కనబడుతున్నాయి. మేము కోరుకునేదేమిటంటే పిల్లల శ్రేయస్సు కోసం ప్రభుత్వం పలు చర్యలు చేపట్టాలి. పిల్లలు వేడివేడిగా, పోషక విలువలు ఉన్న భోజనాన్ని ఆశిస్తున్నారు. అలాగే మంచి విద్య కావాలను కుంటున్నారు. ఉపాధ్యాయుల ద్వారా మంచి బోధనను కోరుకుంటున్నారు. ఇవన్నీ అమలు కావాలంటే అవినీతిని రూపుమాపాలి. పారదర్శకమైన జవాబుదారీతనం కావాలి. పిల్లల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారిని విలన్‌లుగా చూడటం మానుకోవాలి. అలాగే ప్రజలను వారిపై ఆధారపడిన పిల్లలను దృష్టిలో ఉంచుకొని ప్రజాస్వామ్య దేశంలో సాంఘిక ఒప్పందం అమలు ఎలా జరుగుతుంది? మనం డిజిటల్ పారదర్శకత మరియు జవాబుదారీ తనంతో పిల్లల సామాజిక భద్రతను త్యాగం చేయబో తున్నామా! ఒకసారి ఆలోచించండి. పిల్లల సంక్షేమం కోసం ఎలా ముందుకు వెళ్లాలో చూడాలి.

■

*11వ పేజీ తరువాయి...*

## నత్తనడకన సాగుతున్న అందరికీ ఆరోగ్యం పథకం.

ఈ భాగస్వామ్యాన్ని జాగ్రత్తగా నిర్వహించక పోతే, తిరిగి ప్రైవేటు ఆధిపత్యంలోకి ఆరోగ్య రంగం జారిపోయే ప్రమాదమున్నది. మొత్తం మీద ప్రాథమిక సౌకర్యాలున్నప్పుడే ఆరోగ్య బీమా సక్రమంగా పనిచేస్తుందని చెప్పవచ్చు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. మాజీ కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీమతి సుజాత రావు అంచనాల ప్రకారం కేవలం మాతా శిశు సంరక్షణకు మాత్రమే స్థూల దేశీయోత్పత్తిలో ఒకటి నుండి ఒకటిన్నర శాతం కేటాయిం పులు మూలధనంగా అవసరం. అదనంగా ప్రజా పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, పౌష్టికాహారం వంటి అనుబంధ అవసరాలకు మరో రెండుశాతం కేటాయింపులు అవసరమని ఆవిడ అంచనా వేశారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో 3.8వ లక్ష్యం అందరికీ ఆరోగ్యం. ఈ లక్ష్య సాధన దిశగా మనదేశం ఇంకా ఎంతో దూరం ప్రయాణిం చాల్సి ఉన్నది. 2017లో రూపొందించిన జాతీయ ఆరోగ్య విధానం కనీసం 2030 నాటికన్నా అందరికీ ఆరోగ్యం అనే లక్ష్యాన్ని సాధించడంలో ప్రధాన పాత్ర వహిస్తుందని ఆశిద్దాం!

■

# ఆహార ప్రణాళిక : పౌష్టికాహార లక్ష్యాలు

– మౌసుమి దాస్



**ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయటం వలన ఆహార భద్రత కలుగుతుంది. ఇందుకోసం వ్యవసాయ ఉత్పత్తుల ఖర్చులు తగ్గించే దిశలో పరిశోధనలు మరిన్ని జరగాలి. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి, ప్రతి ఒక్కరూ కొనుక్కోగలిగే రీతిలో అందుబాటులో ఉంచాలి. ఆరోగ్యంపై పోషకాహార ప్రభావం యొక్క ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలలో అవగాహన కల్పించాలి. ఆహార భద్రతకు సంబందించిన సంక్షేమ పథకాలు అర్హులైన లబ్దిదారులకే అందే విధంగా కార్యాచరణ ఉండాలి.**

ఆహార భద్రత అనే అంశం బహుముఖ మైనది. ఇందులో అనేక అంశాలు సమ్మిళితమై ఉంటాయి. ముఖ్యంగా ఆహార ఉత్పత్తి నుంచి దాని సరఫరా, వినియోగ దారుల అభిరుచి, అలాగే వినియోగంతో పాటు సూక్ష్మ పోషకాలు, ఆహార నిర్వహణ ఇలా చాలా విషయాలు దాగి ఉంటాయి. ఆహార భద్రతా వ్యవస్థ నేడు తరచుగా చర్చల్లోకి వస్తున్న అంశం. ఇందులో విధాన ప్రతిపాదన దశ నుంచే భాగస్వామ్యం కావాల్సి ఉంటుంది. ఇందుకు ఒక వ్యవస్థ ఏర్పాటు చేసుకునే దిశగా పాలనా వ్యవస్థలు చొరవ తీసుకోవాల్సిన బాధ్యత ఉంది.

ఆహార విధానం అనేది అలవాట్లు, అవసరాలను బట్టి మారుతూ ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాల కాలమాన భౌగోళిక పరిస్థితులను బట్టి విధానం మారుతూంటుంది. ప్రపంచంలో డెబ్బయి


**ప్రగతిశీల ప్రపంచ ఆహార వ్యవస్థ : అంతర్గత సంబంధాల, అడ్డంకులు**

| | | |
|---|---|---|
| మానవ ఆరోగ్యం, పోషకాహార విధానాలు | ఆహార భద్రత, వినియోగం, డిమాండ్ విధానాలు | దారిద్ర్య నిర్మూలనా పథకాలు |
| స్థానిక మార్కెట్ విధానాలు | ఆహార ఉత్పత్తి & సరఫరా విధానాలు | వాతావరణ మార్పులు, ఇంధనం, ప్రకృతి వనరుల నిర్వహణ విధానాలు |
| పాలక వ్యవస్థలు, సంస్థలు | ప్రపంచీకరణ & ఆహార విధానాలు | సాంప్రదాయ ఆహార పద్ధతులు |

మూలం: పిన్‌స్ట్రప్ – అండర్‌సన్ మరియు వాట్సన్ (2011)

ప్రధానంగా రెండు విషయాలపై ఎక్కువగా చర్చ జరుగుతోంది. ఒకటి ఆహార వ్యవస్థ రెండోది పోషకాల స్థితి. ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) ఇచ్చిన సూత్రీకరణ ప్రకారం ఆహార భద్రత అనేది శాతం మందికి జీవనాధారంగా వున్న వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోతున్నాయి. వాతావరణ మార్పులు, వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావాలు చూపిస్తున్నాయి. ఆకలి, పేదరికం ఎక్కువగా

అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ & రిసెర్చ్, న్యూఢిల్లీ.
E-mail: mdas@ncaer.org




వున్న ప్రాంతాల్లో వ్యవసాయ రంగాన్ని ఇతోధికంగా ప్రోత్సహించేందుకు ఈ రంగంలో పెట్టుబడులు పెంచాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలైన దక్షిణాసియా, ఆఫ్రికా ప్రాంతాల్లో ఆహార ప్రణాళికపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం పిన్‌స్టరప్ - అండర్‌సన్ మరియు వాట్సన్ (2011) ఆహార నిర్వహణ, ప్రణాళిక వ్యవస్థపై పలు నిర్ణయాత్మక అంశాలను రూపొందించారు.

భారత్ లాంటి దేశాల్లో ఆహార విధానం విషయాల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా గతంలో కన్నా ఇప్పుడు ఎక్కువగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. దేశంలో ప్రస్తుతం అతి పెద్ద ఆహార ప్రజాపంపిణీ వ్యవస్థ (పి.డి.ఎస్.) ఉంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఈ ప్రజాపంపిణీ వ్యవస్థ వేళ్లూనుకొని ఉంది. అయితే ఇందులో లోపాలు ఉన్నాయి. నిర్ణీత సమయంలో ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టపరచి అర్హులందరికీ విస్తరింపచేయాలి. ఆహార భద్రతలో ప్రధానమైనది శుభ్రమైన శుచికరమైన పరిసరాలు, వైవిధ్యమైన ఆహారం, మహిళల సాధికారతపై దృష్టి సారించాల్సి వుంది. జాతీయ ఆహార భద్రతా చట్టం 2013 ప్రకారం ప్రధాన ఆహార పంటలతో పాటు చిరుధాన్యాల ఆవశ్యకతను కూడా పెంచింది. పీడీఎస్ వ్యవస్థతో మాత్రమే పరిమితం కాకుండా పిల్లల పోషకాహార విలువలపై కూడా నిరంతర అధ్యయనం పర్యవేక్షణ అవసరం.

ముఖ్యంగా సహస్రాబ్ది లక్ష్యాల సాధనలో భాగంగా భారత్‌లో 1990 నాటికి 53.5 శాతం చిన్నారులు పోషకాహార లోపంతో ఉంటే 2005 నాటికి అది 40 శాతానికి తగ్గింది. అనంతరం 2015 నాటికి పోషకాహార లోపం 26 శాతానికి పరిమితం అయ్యింది.

ప్రస్తుతం మిలీనియం లక్ష్యాల స్థానంలో సుస్థిర లక్ష్యాల (సస్టెయినబుల్ గోల్స్)ను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆహార ఉత్పత్తితో పాటు పోషకాల లభ్యత కూడా ప్రామాణికంగా తీసుకోవడం జరుగుతోంది. దీన్ని రాష్ట్ర/జాతీయ స్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఇందులో ప్రధానమైనవి

1) వ్యవసాయాన్ని ఆహార ఉత్పత్తికి ప్రధాన వనరుగా గుర్తించడం.
2) వ్యవసాయాన్ని ఆదాయ వనరుగా గుర్తించడం (ఆహార, వాణిజ్య పంటల ఉత్పత్తి).
3) ఆహార వినియోగాన్ని ప్రభావితం చేసే వ్యవసాయ విధానం, ధరలను గుర్తించాలి.
4) మహిళ భాగస్వామ్యాన్ని వ్యవసాయంలో గుర్తించి అందుకు సంబంధించిన ఉపాధి అవకాశాలు కల్పించాలి.
5) వ్యవసాయంలో చంటి పిల్లల తల్లులను భాగస్వామ్యం చేయడం ద్వారా పిల్లలకు పోషణ దూరం అవుతోంది. దీన్ని గుర్తించి మాతృత్వం కేంద్రంగా పథకాలు రూపొందించాలి.
6) తల్లులు వ్యవసాయంలో భాగస్వామ్యం కావడం వల్ల చిన్నారుల ఆహారంపై ప్రభావం కనిపిస్తోంది.

## సుస్థిర లక్ష్యాల సాధన కోసం కొన్ని అంశాలు ఏర్పాటు చేసుకోవాలి

లక్ష్యం 1 (దారిద్ర్య నిర్మూలన), లక్ష్యం 2 (ఆకలి నిర్మూలన), లక్ష్యం 3 (ఆరోగ్యం, పోషణ), లక్ష్యం 6 (శుభ్రమైన నీరు - సానిటేషన్) లక్ష్యం 12 (వాతావరణ మార్పులు)

ఈ లక్ష్యాలను ఒకే గొడుగు కిందకు తెచ్చి సాధించేందుకు 2030 నాటికి దీర్ఘకాలిక లక్ష్యాలను పెట్టుకొని సాధించాల్సి ఉంటుంది. వివిధ మంత్రిత్వ శాఖలు అనుబంధంగా అనుసంధానం చేసి లక్ష్యాలను సాధించాల్సి ఉంది. దీంతో పాటు ఆరోగ్యంపై పోషకాహార ప్రభావం యొక్క ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలలో అవగాహన కల్పించాలి. ఆహార భద్రతకు సంబంధించిన సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకే అందే విధంగా కార్యాచరణ ఆచరించాలి. భవిష్యత్తులో కూడా ఆహార

*తరువాయి 39వ పేజీలో...*

## ఎన్‌డిఏ మూడు సంవత్సరాల పాలన విశ్లేషణ

మూడు సంవత్సరాలుగా కేంద్రంలో ఉన్న జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం సూక్ష్మ సమస్యలపై ముఖ్యంగా తన దృష్టిని సారించింది. ఒక్కొక్క సారి సూక్ష్మ అంశాలే జీవన గమనంలో ప్రధాన ఆటంకాలవుతాయి. అయితే ఇలాంటి అంశాలపై దృష్టి పెట్టడం అంటే, అట్టడుగు స్థాయి ప్రజా జీవనంపై సమగ్ర అవగాహన ఉన్నట్లే అని చెప్పవచ్చు. ఈ ప్రభుత్వం అనుసరించిన విధానాలను ప్రధానమైన వాటిని, అంటే ప్రజా జీవనంపై విశేష ప్రభావం చూపిన వాటిని వరుస క్రమంలో కాకుండా, ప్రాధాన్యతా క్రమంలో చర్చిద్దాం. పొట్ట తిప్పలకోసం కుటుంబాలను వదిలి ఎంత దూరమైనా వెళ్ళే ప్రజల శాతం ఇప్పటికీ మన సమాజంలో గణనీయంగానే ఉన్నది. అంటే ఉద్యోగాలలో బదిలీలని కాదు, వలస కార్మికులుగా వెళ్ళేవారి సంగతి! ఇలా వెళ్ళిన ప్రజలు అష్టకష్టాలూ పడి సంపాదించిన పదీ పరక ఇంటి దగ్గర ఉన్న తమ వృద్ధులైన తల్లితండ్రులకో, భార్య పిల్లలకో పంపుదామంటే ఇంతవరకూ తాము పనిచేస్తున్న చోటు నుండి స్వగ్రామానికి వెళ్ళడం కూడా పెద్ద వ్యయభారంగా ఉండేది. చాలా సందర్భాలలో యజమానులు లేదా పని కల్పించిన దళారులు స్వగ్రామానికి వెళ్ళటానికి సెలవు కూడా ఇవ్వకపోవడం, ఒక వేళ వెళితే, పని నుండి తొలగించడం కూడా రివాజుగా ఉండేది. కానీ, కనీస మొత్తం ఏమీ అవసరం లేకుండానే బ్యాంకు ఖాతా తెరవడం **(జనధన్), దానిని తన చరవాణి నెంబర్‌తోను, ఆధార్ కార్డుతోను అనుసంధానం చేయడం (జేఏఎం ట్రినిటీ)** వల్ల తన కష్టానికి రావలసిన మొత్తం ఖచ్చితంగా తన ఖాతాలోనే సత్వరం జమ అయి, తను వెళ్లనవసరం లేకుండానే, ఊరిలోని వృద్ధ తలితండ్రులు ఆ ఖాతా నుండి **బ్యాంకింగ్ కరెస్పాండెంట్ల** సహకారంతో అవసరమైన మొత్తాలను తీసుకునే వెసులుబాటు రావడం నిజంగా ప్రశంసనీయం. దీనివల్ల, ప్రభుత్వానికి కూడా బినామీ లబ్దిదారుల బెడద, అవినీతి తప్పిపోయాయి. అందుబాటులో నున్న గణాంకాల ప్రకారం, మొత్తం 28 కోట్లకు పైగా పేదరికపు రేఖకు దిగువునున్నవారి చేత బ్యాంక్ ఖాతాలు తెరిపించారు. ఈ ఖాతాలలో ప్రస్తుతం రూ. 63,971 కోట్లకు పైగా ప్రజా ధనం జమ అయింది. వీటిలో 60 శాతం పైగా ఖాతాలు గ్రామీణ ప్రాంతాలలోనే ఉన్నాయి. ఈ ఖాతాదారులలో 22 కోట్లమందికి రూపే కార్డులు అందచేశారు. ఈ కార్డులున్నవారికి అవసరమైతే స్వయం ఉపాధికి లక్ష రూపాయలవరకు రుణ

సౌకర్యము (ఎటువంటి హామీ లేకుండా!), ప్రమాద బీమా సౌకర్యము ఉంటాయి. అసంఘటిత కార్మికులకు, దిక్కులేని వృద్ధులకు అతి తక్కువ బీమా మొత్తంతో ప్రమాద బీమా, జీవిత బీమా సౌకర్యాలను ప్రారంభించారు. సంవత్సరానికి కేవలం రూ. 12/–ల ప్రీమియంతో రెండు లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని ప్రజలందరికీ **"ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన"** పథకం కింద కల్పించారు. అసంఘటిత రంగ జీవులకు ఇది ఎంతో ప్రయోజనకరం. ఈ పథకంలో ఇప్పటికే 13 కోట్లమంది ప్రజలు నమోదు చేసుకున్నారు. **"ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకం"** కింద, దాదాపు మూడు కోట్లమంది ప్రజలు సాలుసరి రూ. 330/–ల ప్రీమియంతో జీవిత బీమా కల్పించుకున్నారు. దీనితోనే చెప్పుకోదగ్గ మరో వృద్ధాప్య పెన్షన్ పథకం అటల్ పెన్షన్ యోజన. ఈ పథకంలో అసంఘటిత రంగంలో ఏరోజుకారోజు రెక్కాడితేగానీ డొక్కాడని బడుగు జీవులు పనిచేయలేని సమయంలో ఆదుకోడానికి నిర్దేశించిన **స్వావలంబన పథకంలోని** 40 సంవత్సరాలు దాటిన లబ్ధి దారులందరికీ ఈ అటల్ పెన్షన్ యోజన పథకాన్ని వర్తింపచేశారు. ఈ పథకంలో ఇప్పటివరకూ 38.23 లక్షల మంది చేరారు. రూ. 1344 కోట్ల వితరణ జరిగింది.

**అతి చిన్న సంస్థలకు ఆర్థిక సహాయం కోసం మైక్రో యూనిట్స్ డెవలప్మెంట్ రీఫైనాన్స్ ఏజెన్సీ, ఎంయూడిఆర్ఏ–MUDRA సంస్థను** ప్రారంభించి, ఎటువంటి హామీ లేకుండా ఆర్థిక సహాయాన్ని అందచేస్తున్నారు. ఇప్పటివరకూ ఈ పథకం కింద 7.45 కోట్లమందికి రూ. 3.2 లక్షల కోట్లను మంజూరు చేశారు. ఈ లబ్దిదారులలో 70 శాతం మంది మహిళలే!

మన దేశంలోని వివిధ ప్రాంతాలు భౌగోళికంగా అత్యంత క్లిష్టమైన ప్రదేశాలు. ఈ ప్రాంతాలన్నింటినీ కలిపితేనే నిజమైన సమైక్యత అనే భావనతో మారుమూల ప్రాంతాలను, కొండ ప్రాంతాలను కూడా కలుపుతూ రోడ్, రైల్వే, జల, వాయు మార్గాలతో కలుపుతూ **యూడిఏఎన్ (ఉడే దేశ్ కా ఆం నాగరిక్), సాగరమాల, భారత్‌మాల పథకాల్ని ప్రారంభించారు.**

స్వతంత్ర భారత చరిత్రలో మొదటిసారిగా దేశంలో మిగులు విద్యుత్తును సాధించారు. ముఖ్యంగా వివిధ రాష్ట్రాలలోని పంపిణీ సంస్థల నష్టాలను పూరించుకునే వెసులుబాటు

కల్పిస్తూ, **యూడిఏవై పథకాన్ని** అమలుచేసి 2019 నాటికి దేశం పూర్తిగా విద్యుత్ మిగులు వ్యవస్థగా మార్చే లక్ష్యం దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాము. అంతే కాదు, ప్రస్తుతమున్న బల్బుల స్థానంలో ఎల్ఈడి బల్బులను సరఫరా చేసి విద్యుత్ వినియోగ నష్టాలను కూడా కనిష్ట స్థాయికి చేర్చాలని కృషి జరుగుతున్నది. సంప్రదాయేతర ఇంధన వనరులకు యథోచిత ప్రోత్సాహమిస్తున్నారు.

మోదీ ప్రభుత్వం 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో **ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన** పేరుతో పంటల బీమా పథకాన్నీ, సాగునీటి సౌకర్యానికి **ప్రధానమంత్రి కృషి సించాయి యోజన పథకాన్నీ,** రైతుల ఉత్పత్తులకు ఏ ప్రాంతంలో గిట్టుబాటు ధరలు లభిస్తాయో తెలుసుకుని అక్కడికే తమ పంటలను తీసుకువెళ్ళేందుకు సహాయంగా **ఈ-నేషనల్ అగ్రికల్చరల్ మార్కెట్, ఈ-ఎన్ఏఎం** పోర్టల్‌ను అందరికీ అందుబాటులోకి తెచ్చారు. దీనిని వినియోగించడం అతి సులువు.

కార్మికులకు ఉపయోగపడే వివిధ చట్టాలను, అంటే దాదాపు 16 చట్టాలను క్రోడీకరించి ఒక ఉమ్మడి **లేబర్ కోడ్‌**ను త్వరలో వినియోగంలోకి తేనున్నారు. ఇందుకోసం ఇప్పటికే **శ్రమ సువిధ పోర్టల్** అందరికీ అందుబాటులోకి వచ్చింది. అలాగే కార్మికుల ప్రావిడెంట్ నిధినుండి సొమ్ము తీసుకునే విధానాన్ని డిజిటల్ చేశారు. ఇప్పుడు యాజమానుల అవసరం లేకుండా కార్మికులు తమ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో ఎంత సొమ్ము నిల్వ ఉన్నది తెలుసుకోవచ్చు, తమకు అవసరమైన మొత్తాలను సులువుగా రెండురోజుల్లో ఆన్‌లైన్‌లో తీసుకోవచ్చు. దీనికి కావలసిందల్లా తమ ఆధార్ కార్డ్‌ను అనుసంధానం చేసుకోవడమే!

అన్నిటికన్నా ప్రధానమైనది, అతి సూక్ష్మ దృష్టితో అమలుచేసిన **"స్వచ్ఛ భారత్ అభియాన్"** మొదట్లో 2019 నాటికి అంటే మహాత్మా గాంధీ జన్మ శతాబ్ది ఉత్సవాల నాటికి యావత్ భారతదేశాన్ని బహిరంగ మలవిసర్జన శాపాన్నుండి విముక్తం చేసేందుకై లక్ష్యించి ప్రారంభించినా, దీని స్ఫూర్తి నలుదిశలా వ్యాపించి, ప్రస్తుతం దేశవ్యాప్తంగా **స్మార్ట్ నగరాలు, స్మార్ట్ గ్రామాల** రూపంలో మిక్కిలి ప్రజాదరణ పొందుతోంది. మాజీ రాష్ట్రపతి డా. అబ్దుల్ కలామ్ పిలుపునిచ్చినట్లుగా గ్రామాల వెనుకబాటుతనాన్ని నిర్మూలించడానికి గ్రామాలలో పట్టణ

సౌకర్యాల ఏర్పాటు **పియూఆర్ఏ-Provision of Urban Amenities in Rural Areas** స్ఫూర్తి కూడా ఈ స్మార్ట్ నగరాల పథకంలో కలిసింది.

మరో సంచలనాత్మక చర్యను గురించి ప్రస్తావించాలంటే, నల్లధనం, అవినీతి వంటి ఆర్థిక జాడ్యాలను సమూలంగా నిర్మూలించడానికి అత్యంత ధైర్యసాహసాలతో ప్రకటించిన పెద్ద నోట్ల రద్దు గురించి చెప్పాలి. **డీ-మోనెటైజేషన్**ను ప్రస్తావించాలి. అప్పటివరకూ చలామణీలో ఉన్న ఐదు వందలు, వెయ్యి రూపాయల నోట్లను ఉన్నపలాణ రద్దుచేయడానికి ఎంతో ధైర్యం కావాలి. దీనివల్ల సరిహద్దు ఆవలినుండి అక్రమంగా వస్తున్న దొంగనోట్లకు వెన్నువిరిగింది. దీనివల్ల దేశంలో నగదు చెలామణీ తగ్గి, ప్రజల అన్ని ఆర్థిక అవసరాలకూ **డిజిటల్ లావాదేవీలను** ప్రోత్సహించారు. ఇది అవినీతి నిర్మూలనలో ప్రధాన చర్యగా నిలిచింది.

దేశవ్యాప్తంగా ఇంతే సంచలనం కలిగిస్తున్న మరో నిర్ణయం **జీఎస్‌టి. ఒకే దేశం, ఒకే పన్ను, విధానం** అనే లక్ష్యంతో మరో వారం రోజుల్లో అంటే, జూలై ఒకటవ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమలవుతున్న నూతన పన్ను విధానం అనేక వస్తు సేవలపై ప్రజల పన్ను భారాన్ని మూడు శాతం వరకూ తగ్గించనున్నది. అలాగే వ్యాపారస్తులకు, పారిశ్రామికవేత్తలకూ పన్ను చెల్లింపును మరింత సులువు చేస్తూ, ఇప్పటివరకూ అమలులో ఉన్న వివిధ పన్నులు అంటే, ఎక్సైజ్, వ్యాట్, సేవా పన్ను వంటి అన్ని పన్నుల స్థానంలో ఈ నూతన పన్నువిధానం అమలుకానున్నది.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండీ కేంద్ర రాష్ట్రాలమధ్య ఆర్థిక వనరుల పంపిణీని సంతృప్తికరంగా పరిష్కరించలేని ప్లానింగ్ కమిషన్ స్థానంలో **నీతిఅయోగ్‌ను** ప్రారంభించి, రాష్ట్రాలకు కేంద్ర వనరుల వాటాను ప్రస్తుతమున్న స్థాయి నుండి మరో పది శాతం పెంచారు.


*34వ పేజీ తరువాయి...*

## ఆహార ప్రణాళిక : పౌష్టికాహార లక్ష్యాలు

కొరత రాకుండ దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించాలి. అభివృద్ధి సంక్షేమ పథకాలలో ఆహార భద్రత అంశాలను విస్తృతంగా ప్రస్తావించాలి. ప్రభుత్వ పథకాల ద్వారా మిగిలే ఆదాయాన్ని ఇతర అవసరాలకు దాచుకుంటే ఆర్థిక పరిస్థితి మెరుగుపరచుకోవచ్చు, తద్వారా ఆహార భద్రతను సాధించవచ్చు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయటం వలన ఆహార భద్రత కలుగుతుంది.

### ఏ) ఆహార వైవిధ్యం : ప్రాధాన్యత

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార వైవిధ్యతను పరివ్యాప్తం చేసేందుకు ప్రణాళికలు తయారుచేయాల్సి ఉంది. ఇందుకోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ వారు తయారుచేసిన ఇండియన్ ఫుడ్ పిరమిడ్ విధానాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. దీని ద్వారా విశాలమైన జనబాహుళ్యానికి ఆహారం అందించవచ్చు. **ఉదాహరణకు అమెరికాకు చెందిన వ్యవసాయ విభాగం కలర్ ఫుల్ ప్లేట్ పేరిట ఒక కాన్సెప్ట్ తయారుచేసింది. ఇందులో సమతుల ఆహారం నిర్వచించ బడింది. అందులో ప్రధానంగా పండ్లు, కూరలు, ప్రోటీన్లు, పప్పు దినుసులు, పాల ఉత్పత్తులు ఉన్నాయి.** వీటిని తీసుకుంటే పోషకాలు సమానంగా పొందే అవకాశం ఉంది. ఈ తరహా వైవిధ్య ఆహారం భారతీయులకు కూడా ఇవ్వాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా శాఖాహారులు, మాంసా- హారులు సైతం ప్రోటీన్లతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాల్సి ఉంటుంది.




పోషకాలను పొందేందుకు ఆయా ప్రాంతాల, భౌగోళిక పరిస్థితులను అనుసరించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఇందు కోసం ప్రభుత్వాలు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. ఆహార భద్రత కోసం ఆహారపదార్థాల - విలువల సమాహారం రూపొందించడం. కొంత సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి వివిధ ఉత్పత్తులను తయారు చేసుకొని నిల్వ చేసుకోవచ్చు .

### బి) లక్షిత కార్యాచరణ :

కుటుంబంలోని ప్రతి మనిషికి సరి పడినంత పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అమర్చుకోవాలి. వీలైనంతవరకు ప్రతిరోజు కుటుంబానికి సరిపడినంత ధాన్యాలు, పప్పు దినుసులు, పండ్లు, కూరగాయలు, మంసాహారాలు, పాలు, పాలపదార్థాలు సమకూర్చుకోవాలి. ముఖ్యంగా క్యాలరీల కన్నా ప్రోటీన్లు, సూక్ష్మ ధాతువులు సమ్మిళితంగా ఉన్న ఆహారం తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా పప్పుదినుసులు ప్రోటీన్లతో పాటు, బి-విటమిన్ పుష్కలంగా ఉంటుంది. పప్పు దినుసులను పీడీఎస్ ద్వారా ప్రజలకు అందచేయాలి. సమ్మిళిత పోషకాహారంలో పప్పు దినుసులు ప్రధాన పాత్ర వహిస్తాయి. అలాగే పాఠశాల విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో ప్రోటీన్లు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. అలాగే కోడి గుడ్లు, పాలు ఆహారంలో తీసుకునేలా చర్యలు తీసుకోవాలి.

దారిద్ర్య రేఖ సవరణ, ప్రామాణిక ఆహార స్థిరీకరణ, సూత్రీకరణకు దేశంలోని రెండు కమిటీలు ప్రధానంగా కృషి చేశాయి అందులో ప్రధాన మైనవి. ఒకటి టెండూల్కర్ కమిటీ, రెండోది రంగరాజన్ కమిటీ ఈ రెండు కమిటీలు దారిద్ర్య రేఖను సవరించేందుకు సూత్రీకర ణలు చేశారు. దాంతోపాటు ప్రామాణిక ఆహారం విషయంలోనూ పలు సూచనలు చేశారు. అందులో ప్రధాన అంశం ఆహారాన్ని కాలరీల లెక్కన ప్రామాణికత తీసుకోవాలా లేక పోషకాల విలువ ప్రకారం గుర్తించాలా అనే అంశం పై పలు సూచనలు చేశారు. అయితే రెండు కమిటీలు పోషకాలనే ప్రమాణంగానే దారిద్ర్య రేఖను నిర్వచించాయి. తద్వారా దేశ వ్యాప్తంగా సార్వజనిత ఆమోదమైన పోషకాహార సూచీ తయారు చేశారు. ఇందులో ప్రధానంగా పేద మధ్య తరగతి ప్రజలు స్వీకరించే పోషకాహారాన్ని నిర్వచించారు. ఇక వైవిధ్యమైన ఆహారన్ని సిఫార్సులు చేశారు. ఈ ఆహార సిఫార్సులు కేవలం శాఖాహారులకు మాత్రమే కాకుండా మాంసాహారులకు సైతం నిర్వచించారు.

పేదరికం అనేది చాలా గతిశీల మైనది. ఆ స్థితి ఎవరికైనా రావచ్చును. అందుకు వాతావరణ కారణాలు, కావచ్చును విపత్తు కావచ్చును ఏ పరిస్థితి ఎదురైనప్పటికీ ఆర్థిక పరిస్థితి తారుమారై పేదరికం వస్తుంది. ఈ పరిస్థితి వల్ల మొదట ప్రభావితం అయ్యేది ఆహారపు అలవాట్లే కావడం దురదృష్టకరం.

### సి) డిజిటల్ తరహా పరిష్కారం - పంపిణీ, పర్యవేక్షణ

ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టంగా చేసేందుకు డిజిటల్ సేవలను ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో సరుకుల పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాల్సిన బాధ్యత నిర్వహణా వ్యవస్థలపై ఉంది. అలాగే డబ్బును నేరుగా లబ్దిదారుడికి ఇవ్వడం వల్ల కావాల్సిన పోషకాహారాన్ని లబ్దిదారుడు పొందే వీలుంది. అలాగే వైవిధ్యమైన ఆహారం స్వీకరించే వీలు కలుగుతుంది. ముఖ్యంగా నాణ్యమైన ఆహార ధాన్యాలు లబ్దిదారుడు ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది.

అలాగే లబ్దిదారులను ఆధార్

కార్డులకు అనుసంధానం చేయడం కూడా అవసరం. దీని ద్వారా కేవలం నగదును నేరుగా లబ్ధిదారులకు బదిలీ చేయడం మాత్రమే కాదు వారి ఆరోగ్య పరిస్థితులను కూడా బేరీజు వేయడం సులభతరం అవుతుంది. ముఖ్యంగా పేద అట్టడుగు వర్గాలకు పోషకాహారం లభిస్తుందా లేదా అనే విషయం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. దారిద్ర్య రేఖను అంచనా వేయడానికి ప్రత్యేక విభాగం అవసరం లేకపోయినప్పటికీ ప్రస్తుతం అందుబాటులో ఉన్న యంత్రాంగం తోనే ఈ సమస్యను అధిగమించే ప్రయత్నం చేయాలి. మానవ వనరుల సద్వినియోగంతో పాటు వ్యూహాత్మకంగా పర్యవేక్షించే వీలు కలుగుతుంది. మంగోలియా లాంటి దేశాల్లో ఈ తరహా పర్యవేక్షణ ద్వారా దారిద్ర్యన్ని నిర్మూలించే ప్రయత్నం జరిగింది. అంతేకాదు పోషకాహారం ప్రజలకు ఎంత మేర దక్కుతుందో తెలుసుకునే వీలు కలుగుతుంది.

**డి) స్థూల కాయం దాని పర్యవసనాలు**

దేశంలో ఒక వైపు పోషకాహార లోపంతో ఒక వర్గం బాధలు పడుతూ ఉంటే మరో వర్గం ఊబకాయం బాధలు ఎదుర్కొంటోంది. స్థూల కాయం అనేది నేటి తరంలో సర్వసాధారణంగా ఎదుర్కొంటోన్న సమస్యగా మారింది. ముఖ్యంగా పట్టణీకరణ, జీవనశైలి, సులభంగా లభ్యమవుతున్న నూనె పదార్థాలు, నెయ్యి, కొవ్వుతో కూడిన పదార్థాలు విరివిగా దొరకడం, అలాగే మార్కెట్లోని చిరు తిండ్లు కారణంగా చిన్న వయస్సు నుంచే ఊబకాయం ఎదుర్కొవాల్సి వస్తోంది. ఊబ కాయం ఫలితంగా మధుమేహం, గుండె పోటుతో పాటు పలు జబ్బులు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా విరివిగా మార్కెట్లో లభిస్తున్న 'జంక్' ఫుడ్ పై పెద్ద ఎత్తున పన్ను విధించాల్సి ఉంది. ఇందుకోసం పెద్ద ఎత్తున కొవ్వు సంబంధిత పదార్థాలను గుర్తించి విశ్లేషించే అవకాశం ఉంటుంది. అయితే అధిక కెలోరీలు గల ఆహార పదార్థాలపై విధించిన పన్నుతో అటు పోషకాహార లోపంతో బాధపడే పిల్లలకు సబ్సిడీ తరలించడం ద్వారా ఉభయతారకంగా ఈ నిర్ణయం పనిచేస్తుంది.

**ఈ) ఆహార భద్రత, సరఫరా, దుర్వినియోగం అరికట్టడం**

ప్రజా పంపిణీ వ్యవస్థలో ఆహార భద్రత అనేది ప్రధానాంశంగా ఉండాలి. ముఖ్యంగా ఈ వ్యవస్థలో లీకేజీలు, అవినీతిని అరికట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఆహార సరఫరాలో పలు లోపాలను గుర్తించి వాటిని సరిచేయడం ద్వారా ఎంతో లాభం చేకూరుతుంది. మన దేశంలో ఆహార ధాన్యాలు అవసరమైన దానికన్నా రెండింతలు అధికంగానే ఉన్నాయని అంచనా అయినప్పటికీ దారిద్ర్యం ,ఆకలి, పౌష్టికాహార లోపం ఎక్కువగా ఉంది . ఆహారం నిల్వలున్న పంపిణీ సక్రమంగా లేకపోతే, పంపిణీ జరిగినప్పటికీ, ప్రజలు వినియోగించుకో నట్లయితే ఆహార భద్రత లేనట్లే. ఆహార పదార్థాలు నిల్వచేయడానికి సరిపడా యాంత్రిక, శీతలీకరణ సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం సమస్యగా మారింది. ఇందుకోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది. జాతీయ ఆహార భద్రత బిల్లు-2011 ముసాయిదా ప్రకారం చిరుధాన్యాలైన జొన్న, రాగి, సజ్జ, కొర్ర మొదలగు వాటిని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించాలి .

అంతేకాదు, ఆహార పదార్థాల నిల్వకు రసాయనాలను వాడుతున్నారు. దీన్ని నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది. ఉదాహరణకు అఫ్లోటాక్సిన్స్ వాడటం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. అలాగే పాల ఉత్పత్తి దారులను పరిగణలోకి తీసుకొని వారు నష్టపోతే పరిహారం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలి. వాతావరణ మార్పులపై సమగ్ర అధ్యయనం చేసి రైతులతో ఆ సమాచారం పంచుకోవాలి. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయటం వలన ఆహార భద్రత కలుగుతుంది. దేశ ఆహార భద్రత కొరకు ప్రభుత్వ గోడౌన్లలో ఉన్న లక్షలాది టన్నుల ఆహార ధాన్యాలు ముక్కిపోకుండా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ ఉత్పత్తుల ఖర్చులు తగ్గించే దిశలో పరిశోధనలు జరిగితే ఆహార భద్రత కలుగుతుంది. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి, ప్రతి ఒక్కరు కొనుక్కోగలిగే రీతిలో అందుబాటులో ఉంచాలి.

పైన పేర్కొన్న చర్యలతో పాటు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను కూడా గమనించాల్సి ఉంటుంది. పోషకాహార లోపాలను ఎదుర్కొనేందుకు సమగ్ర విధానం రూపొందించాల్సి ఉంది. ఇందుకోసం భారతదేశం ఒక కార్యక్రమ ప్రణాళికతో ముందుకు పోవాల్సి ఉంది. ఆహార భద్రత కోసం ఆహారపదార్థాల - విలువల సమాహారం రూపొందించి కొంత సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి వివిధ ఉత్పత్తులను తయారు చేసుకొని నిల్వ చేసుకోవాల్సిన అవసరం ఉంది. అన్ని రకాల ఆహార పదార్థాలు ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉండే విధివిధానాలను రూపొందించాలి. ఆరోగ్యంపై పోషకాహార ప్రభావం యొక్క ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలలో అవగాహన కల్పించాలి. ఆహార భద్రతకు సంబందించిన సంక్షేమ పథకాలు అర్హులైన లబ్దిదారులకే అందే విధంగా కార్యాచరణ ఆచరించాలి. భవిష్యత్తులో కూడా ఆహార కొరత రాకుండ దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించాలి. ముఖ్యంగా స్వల్ప లక్ష్యాలను సాధిస్తూనే దీర్ఘకాలిక లక్ష్యాలను అందుకోవాల్సి ఉంది. అందుకోసం సరిపడేంత నిధులు సమకూర్చాలి. ఒక డాష్ బోర్డ్ ఏర్పాటు చేసి స్పష్టమైన గణాంకాలతో ఖచ్చితత్వంతో పేదరికం, పోషకాహార లోపంపై పోరాటం చేస్తేనే సరికొత్త సమాజం ఆవిష్కృతం అవుతుంది. ■



# విజ్ఞాన విపంచి

ప్రాతూరి పోతయ్య శర్మ

1) ఇటీవల వార్తల్లో వినిపిస్తున్న 'జీలాండియా' అనే ఖండం ఎక్కడ ఉంది అనుకుంటున్నారు. వివరాలేవీ?
   ఎ) పసిఫిక్ ప్లేట్‌కి , ఆస్ట్రేలియా ప్లేట్‌కి మధ్యన ఉంది (ఇది న్యూజిలాండ్ నుండి విడిపోయి ఉండవచ్చును, అనే భావన ఉన్నది).
   బి) 1995లో 'జీలాండియా' అనే పదాన్ని ల్యూకేన్‌డికిన్ అనే ఆయన తెలిపాడు.
   సి) దీని విస్తీర్ణం 5 మిలియన్ చదరపు కిలోమీటర్లు (పసిఫిక్ మహాసముద్రంలో).
   డి) పైవన్నీ
2) బార్రెన్ దీవి వల్కానో (అగ్ని పర్వతం) ఎక్కడ ఉంది?
   ఎ) అండమాన్ & నికోబార్ దీవులల్లో, పోర్ట్ బ్లెయిర్‌కి 140 కిలోమీటర్ల దూరంలో ఉంది.
   బి) మెక్సికో సి) ఇండోనేషియా
   డి) మలేషియా
3) ఢిల్లీలో ఉన్న బయోడైవర్సిటి పార్కులు ఏవి?
   ఎ) నార్త్ రన్ రిడ్జ్
   బి) యమునా బయోడైవర్సిటీ పార్క్
   సి) ఆరావళి బయోడైవర్సిటీ పార్క్
   డి) పైవన్నీ
4) బ్రిటన్‌లో ఇటీవల సాధారణ ఎన్నికలు నిర్వహించారు. 650 పార్లమెంట్ సభ్యుల సీట్లలో కన్సర్వేటివ్ పార్టీకి 318 సీట్లు వచ్చాయి. తెరెసా మే అధికారం చేపట్టటానికి 326 సీట్లు కావాలి. తగ్గిన సీట్లలో సపోర్ట్ ఇవ్వటానికి, బ్రిటన్‌లో ఏ పార్టీ ముందుకొచ్చింది?
   ఎ) డెమోక్రాటిక్ యూనియనిస్ట్ పార్టీ (DUP)
   బి) లేబర్ పార్టీ (సి) SNP (డి) లిబడెం
5) అకిన్ వుమి అదేసినా, దేనికి ప్రెసిడెంట్?
   ఎ) వరల్డ్ బ్యాంకు
   బి) ఆఫ్రికన్ డెవలప్‌మెంట్ బ్యాంకు
   సి) ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు
   డి) జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్
6) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్? (దేశాలు : విదేశీ విధానాలు)
   ఎ) ఇండియా : యాక్ట్ ఈస్ట్ పాలసీ
   బి) జపాన్ : ఎక్స్ పాండెడ్ పార్టనర్ షిప్ ఫర్ క్వాలిటీ ఇన్ఫ్రాస్ట్రక్చర్
   సి) USA : పివట్ ఆఫ్ ఆసియా
   డి) పైవన్నీ
7) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్? (దేశాలు : మహారాజుల భవనాలు).
   ఎ) స్పెయిన్ : జర్ జ్యూలా ప్యాలెస్
   బి) బ్రిటిష్ మహారాణి : బకింగ్ హాం ప్యాలెస్ & విండ్సర్ భవనం
   సి) స్వీడన్ : డ్రోట్ నినోల్మ్ ప్యాలెస్
   డి) పైవన్నీ
8) కర్ణాటక రాష్ట్రములో గల ప్రాంతీయ భాషలు ఏవి?
   ఎ) కొడవ, కొంకణి, తుళు
   బి) బ్యారీ, నవయాతి
   సి) సంకేతి, హవ్యక డి) పైవన్నీ
9) జామియా మిల్లియా ఇస్లామియాకి ఛాన్సలర్‌గా కొత్తగా ఎవర్ని నియమించారు?
   ఎ) తలాత్ అహ్మద్ సైఫ్ బి) నజ్మా హెప్తుల్లా
   సి) హమీద్ అన్సారి డి) సుష్మా స్వరాజ్
10) G–20 దేశాల సమావేశం జూలై, 2017లో ఎక్కడ నిర్వహించదలిచారు?
   ఎ) న్యూయార్క్ బి) హంబర్గ్, జర్మనీ
   సి) స్టాక్ హోమ్ డి) బెర్లిన్
11) G–7 దేశాల సమావేశం ఇటీవల ఎక్కడ నిర్వహించారు?
   ఎ) కెనడా బి) తావోర్మినా, ఇటలీ
   సి) జపాన్ డి) బీజింగ్ , చైనా
12) EPFలో కార్మికులు తమ జీతంలో సేవింగ్స్ కాంట్రిబ్యూషన్ ఎంత శాతం చేస్తారు?
   ఎ) 12 శాతం బి) 20 శాతం
   సి) 25 శాతం డి) 15 శాతం
13) ఇటీవల భారతదేశ రక్షణ శాఖ షార్ట్ రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్స్ (SR-SAM) అనే క్షిపణి కాంట్రాక్టు రద్దు చేసి, 'ఆకాష్' అనే క్షిపణి వాడ దల్చుకుంది. 'ఆకాష్' వివరాలేవీ ?
   ఎ) దీన్ని DRDO అభివృద్ధి చేసింది.
   బి) ఇదిలో అల్టిట్యూడ్ అనగా 30 మీటర్ల ఎత్తు నుండి కూడా ప్రయాణించగలదు.
   సి) దీని రేంజ్ : 25 కి.మి. డి) పైవన్నీ
14) కేన్స్ ఫిలిం ఫెస్టివల్ (ఫ్రాన్స్)లో 'పామే డి ఓర్' (Palme d' Or) (గోల్డెన్ పామ్) సినిమా బహుమతి, ఇటీవల ఏ సినిమాకు ఇచ్చారు?
   ఎ) "ది స్క్వేర్" (దీని డైరెక్టర్:రూబెన్ ఆస్ట్ లుండ్)
   బి) "120 బేటే మెంట్స్ పార్ మినిట్"
   సి) 'ది బిగిల్ డ్ '
   డి) ది కిల్లింగ్ ఆఫ్ ఎ సేక్రేడ్ డీర్
15) భారత డిఫెన్సు మాన్యుఫాక్చరింగ్‌లో తల పెట్టిన స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ వివరాలేవీ ?
   ఎ) దీనిలో 4 సెగ్మెంట్స్ (భాగాలు) ఉన్నాయి
   బి) రెండు సెగ్మెంట్స్ నావికా దళానికి సంబంధించినవి. (అందులో ఒకటి జలాంతర్గాములు, మరొకటి యుటిలిటీ హెలికాప్టర్స్)
   సి) మరో రెండు సెగ్మెంట్లలో ఒకటి సింగల్ ఇంజిన్ ఫైటర్ ఎయిర్ క్రాఫ్ట్‌కి, రెండవది ఆర్మీకి చెందిన ఆర్మ్‌డ్ వెహికల్స్‌కి సంబంధించినది. డి) పైవన్నీ
16) INS కల్వరి, జూలై 2017లో భారత నావికా దళంలో చేరుతుంది . 'కల్వరి' అనే పేరు దేనికి ఉంది?
   ఎ) బాగాలోతైన సముద్ర జలాలలో జీవించే టైగర్ షార్క్ చేపలకుంది.
   బి) సముద్ర దీవిలోని ఒక కోట పేరు.
   సి) ఛత్రపతి శివాజీ కోట.
   డి) రాణా ప్రతాప్ సింగ్ గుర్రం పేరు.
17) బంగ్లాదేశ్‌లో భారతదేశ సంస్థల కోసం ఎక్కడెక్కడ స్పెషల్ ఎకనామిక్ జోన్‌లు (SEZ\T) రాబోతున్నాయి ,?
   ఎ) మొంగ్లా బి) భేరా మారా
   సి) మీర్ సరాయ్ డి) పైవన్నీ
18) 'క్రి ప్టో కరెన్సీ' అంటే ఏమిటి? వివరాలేవీ?
   ఎ) దీన్నే బిట్ కాయిన్స్ అంటారు . 2008లో బిట్ కాయిన్ సృష్టి కర్త సటోషి నక మోటో అని చెప్తారు.
   బి) క్రి ప్టో కరెన్సీలు, 'బ్లాక్ చైన్' సాఫ్ట్‌వేర్ వాడే కంప్యూటర్ నెట్ వర్క్ చేత సృష్టించబడతాయి.
   సి) ఏప్రిల్ 1, 2017 నుండి జపాన్ వీటిని ఆమోదిస్తోంది. (జూలై 1 , 2017 నుండి ఆస్ట్రేలియా ఆమోదిస్తానన్నది)
   డి) పైవన్నీ
19) ఇటీవల వార్తల్లో ఉన్న 'జూడి' ఏమిటి?
   ఎ) 36.5 మిలియన్స్ ఆండ్రాయిడ్ ఆధారిత స్మార్ట్ ఫోన్‌లను హిట్ చేసిన మాల్ వేర్ (మాలిషియస్ సాఫ్ట్‌వేర్)
   బి) కంప్యూటర్ పేరు సి) రోబో పేరు
   డి) ఒక నక్షత్రం పేరు
20) "లండన్ బ్రిడ్జి.. లండన్ బ్రిడ్జి... ఫాలింగ్ డౌన్ ఫాలింగ్ డౌన్ ...." అనే నర్సరీ రైం, చిన్న పిల్లలు పాడే పాటలలో ఒకటి. ఇంగ్లాండ్‌లో

లండన్‌బ్రిడ్జిని, ఏ నది మీద నిర్మించారు ?
ఎ) థేమ్స్ నది బి) టై గ్రిస్ నది
సి) మొస్క్వా నది డి) వోల్గా నది

21) గండి కోట చరిత్ర / యుద్ధం (క్రీస్తు శకం 1652) గురించి తెలిపే చారిత్రక ఆధారం ఏది ?
ఎ) మెకంజీ కైఫియత్
బి) లార్డ్ క్లైవ్ జీవిత చరిత్ర
సి) బుస్సీ జీవిత చరిత్ర డి) ఇవేవి కావు

22) కాలిన్ మెకంజీ క్రీస్తు శకం 1816–1820 సంవత్సరాల మధ్యకాలంలో పలుమార్లు అమరావతి, ఆంధ్రప్రదేశ్ సందర్శించి 85 స్కెచ్‌లు తయారుచేసాడు. 132 స్టోన్స్ (చారిత్రాత్మక శిలలు / రాళ్ళు) సేకరించాడు. ప్రస్తుతం ఇవి ఇక్కడున్నాయి?
ఎ) మద్రాసు మ్యూజియం
బి) లైబ్రరీ అఫ్ ఆసియాటిక్ సొసైటీ, కోల్ కతా
సి) బ్రిటిష్ లైబ్రరీ, లండన్
డి) సాలార్ జంగ్ మ్యూజియం, హైదరాబాద్

23) 'ఉల్లాల్ కోస్ట్ ( సముద్ర తీరం) ఎక్కడుంది?
ఎ) గుజరాత్ బి) మంగళూరు, కర్ణాటక
సి) పుదుచ్చేరి డి) ఒడిశా

24) ఒరాంగ్ టైగర్ రిజర్వు భారత దేశంలో ఎక్కడ ఉంది?
ఎ) అరుణాచల్ ప్రదేశ్ బి) అస్సాం
సి) మణిపూర్ డి) మిజోరం

25) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్?
ఎ) కాంలాంగ్ టైగర్ రిజర్వు: అరుణాచల్ ప్రదేశ్
బి) జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్ : ఉత్తరాఖండ్
సి) బండిపూర్ నేషనల్ పార్క్ : కర్ణాటక
డి) పైవన్నీ

26) ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, భారతదేశ ఆర్థికాభివృద్ధి నుండి బీద వారు లబ్ది పొందటానికి ఏ మార్గాలు తెలుపుతున్నారు ?
ఎ) రిఫార్మ్ బి) పెర్‌ఫార్మ్
సి) ట్రాన్స్‌ఫార్మ్ డి) పై మూడు

27) ఇటీవలి కాలంలో భారతదేశ ఆర్థిక అభివృద్ధిని తెలిపే 'గోల్డెన్ ఇండికేటర్స్' ఏవి ?
ఎ) ఫిస్కల్ డెఫిసిట్ తగ్గుదల; కరెంటు ఎకౌంటు డెఫిసిట్ తగ్గుదల.
బి) ద్రవ్యోల్బణం తగ్గుదల; ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ పెరగటం.
సి) RBI లో ఫారిన్ ఎక్స్ఛేంజి నిల్వలు ఎక్కువ కావటం. డి) పైవన్నీ

28) కేంద్ర ప్రభుత్వంచే పట్టిన పీపుల్ సెంట్రిక్ అభివృద్ధి కార్య క్రమాలు ఎవరెవరిని దృష్టిలో పెట్టుకుని ఉన్నాయి, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాటల్లో?
ఎ) గావ్ (గ్రామం) ; గరీబ్ (బీదవారు)
బి) కిసాన్; మజ్ దూర్ (శ్రామికులు)
సి) మహిళ; యువ డి) పైవన్నీ

29) భారత దేశంలో నల్ల ధనాన్ని నిర్మూలించేందుకు చేపట్టిన కార్యక్రమాలు ఏవి ?
ఎ) ఇన్‌కం డిక్లేరేషన్ స్కీం (IDS)
బి) రూ. 500, రూ. 1000 నోట్ల రద్దు
సి) స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (SIT) ఏర్పాటు
డి) పైవన్నీ

30) బేటి బచావో బేటి పఢావో (BBBP) అమలు చేశాక, హర్యానా రాష్ట్రములో ప్రతి 1000 బాలురకు, బాలికల సంఖ్య (చైల్డ్ సెక్స్ రేషియో) ఇంతకు పెరిగింది?
ఎ) 840 బి) 950 సి) 900 డి) 850

31) మిలిటరీ 'పోలీస్' చేసే విధులు ఏవి ?
ఎ) కంటోన్మెంట్‌లలోను, ఆర్మీ ఎస్టాబ్లిష్మెంట్ లలోను పోలీస్ విధులు (కాపలా / పహారా) నిర్వహించటం.
బి) సోల్జర్స్ తమ రూల్స్ & రెగ్యులేషన్స్ అతిక్రమించకుండా చూడటం
సి) శాంతి సమయంలో, యుద్ధ సమయంలో సోల్జర్స్ (సైనికుల) రవాణా పర్యవేక్షించటం; సివిల్ పోలీస్‌లకు అవసరమైనప్పుడు సహాయ పడటం.
డి) పైవన్నీ (ఇవి చేయటానికి, భారత ఆర్మీలో మహిళలను రిక్రూట్మెంట్ చేసుకుంటున్నారు)

32) US గోల్డ్ మాన్ ప్రైజ్ అందుకున్న ఉరోస్ మాసేర్ల్ ఏ దేశస్థుడు ?
ఎ) స్లోవేనియా బి) ఫిన్ ల్యాండ్
సి) జపాన్ డి) ఆస్ట్రేలియా

33) ఇటీవల కతార్ దేశంతో దౌత్య సంబంధాలు తెంచుకున్న దేశాలు ఏవి ?
ఎ) సౌది అరేబియా; ఈజిప్ట్
బి) UAE సి) బహ్రెయిన్ డి) పైవన్నీ

34) ఇటీవల శ్రీహరి కోట అంతరిక్ష కేంద్రం నుండి ప్రయోగించిన GSAT - 19 వివరాలు ఏవి ?
ఎ) GSLV Mk-III-D-2 రాకెట్ ద్వారా ప్రయోగించారు . GSLV Mk-III - D–2లో క్రయోజెనిక్ ఉంటుంది.
బి) GSAT-19 కమ్యూనికేషన్స్ ఉపగ్రహం బరువు 3,136 కిలోగ్రాములు.
సి) దీనిలో Ka/Ku–బ్యాండ్ హై త్రూ పుట్ కమ్యూనికేషన్స్ ట్రాన్స్పాండర్స్ ఉన్నాయి; జియో స్టేషనరి రేడియేషన్ స్పెక్ట్రో మీటర్ (GRASP) పే లోడ్‌లో ఉంటుంది
డి) పైవన్నీ

35) 2018–19లో ఇస్రో ప్రయోగించనున్న ఆదిత్య – L 1 అంతరిక్షంలో ఎక్కడ నుండి పరిశోధనలు చేస్తుంది?
ఎ) హాలో ఆర్బిట్ చుట్టు పక్కల సన్–ఎర్త్ సిస్టంలోని లాగ్రంగియన్ పాయింట్ వద్ద ఉంటుంది.
బి) చంద్రుని కక్ష్యలో ఉంది
సి) కుజగ్రహం సమీపం నుండి
డి) ఇవేవి కావు

36) బుధి–గండకి హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ పై నేపాల్ – చైనా సంతకాలు చేసుకున్నాయి. దీన్నించి ఎంత విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది? (MWలలో)
ఎ) 1200 బి) 83,000
సి) 2,400 డి) 1,500

37) SBI రూ.11,000 కోట్ల విలువగల షేర్లను క్వాలిఫైడ్ ఇష్యూ ప్లేస్‌మెంట్ (QIP) ద్వారా ఇవ్వదల్చింది. ఒక్కొక్క షేర్ సర్టిఫికేట్ ముఖ విలువ (ఫేస్ వాల్యూ) ఎంత?
ఎ) ఒక్క రూపాయి బి) రూ. 287.58
సి) రూ. 100 డి) రూ. 200

38) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్? (పుస్తకాలు : రచయితలు)
ఎ) "ది మినిస్ట్రీ ఆఫ్ అట్ మోస్ట్ హ్యాపీనెస్" : అరుంధతి రాయ్
బి) "ది అండర్ గ్రౌండ్ రైల్ రోడ్" : కోల్‌సన్ వైట్ హెడ్
సి) "బ్యాంకో క్రసి" : ఎరిక్ టౌ స్సైంట్
డి) పైవన్నీ

39) కతార్ దేశ కరెన్సీ ఏది?
ఎ) దిర్హాం బి) దీనార్
సి) కతారి రియాల్స్ డి) యెన్

40) "ఎల్‌నినో" వల్ల ఎక్కడి నీటి ఉష్ణోగ్రత ఒక డిగ్రీ సెల్సియస్ పెరిగి, భారత దేశానికి వచ్చే నైరుతి రుతు పవనాల వర్షాలు ఆవిరైపోతాయి?
ఎ) ఈ క్విటోరియల్ పసిఫిసిక్ మహాసముద్రం
బి) ఉత్తర ధృవం సి) దక్షిణ ధృవం
డి) ఇవేవి కావు.

41) ఇండియన్ ఓషన్ డైపోల్ (IOD) ఏమిటి? వివరాలేవీ?
ఎ) పశ్చిమ ఇండియన్ ఓషన్ ఉపరితల ఉష్ణోగ్రత, ఈస్టర్న్ ఇండియన్ ఓషన్ ఉపరితల ఉష్ణోగ్రత కన్నా ఎక్కువ కావటం, మరల కొద్ది రోజులకే ఉష్ణోగ్రత తగ్గి పోవటం జరుగుతుంటుంది. దీన్నే IOD అంటారు.
బి) పాజిటివ్ IOD వల్ల ఎల్‌నినో ఎఫెక్ట్ / ప్రభావం నుండి 'బఫర్' / రక్షణ వచ్చింది.
సి) ఎల్‌నినో ప్రతి 10 సంవత్సరాల కాలంలో 6 సంవత్సరాలు ఎల్‌నినో చేత వర్షాలు దెబ్బ తింటాయి. డి) పైవన్నీ

42) 38 ఏళ్ల వయసులోనే రిపబ్లిక్ అఫ్ ఐర్లాండ్ దేశానికి ప్రధాన మంత్రి అయిన దెవరు?
ఎ) లియో వారాద్ కర్ బి) ఎండా కెన్ని
సి) జస్టిన్ ట్రూడో
డి) ఏమ్మాన్యుయేల్ మాక్రాన్

43) బోడి వెస్ట్ హిల్స్, థేని జిల్లా, తమిళనాడులో ఇండియా బేస్డ్ న్యూట్రినో అబ్జర్వేటరీ రాబోతున్నది. 'న్యూట్రినో'లు ఏవిటి ?
ఎ) చాలా చిన్న చిన్న పార్టికల్స్. 'ద్రవ్య రాశి' లేనివీ. కాంతి వేగం కన్నా కాస్త తక్కువ వేగంతో ప్రయాణిస్తాయి.

బి) నక్షత్రాలు పేలి పోయినప్పుడు, భీకరమైన 'అస్ట్రోఫిజికల్' విస్ఫోటనాలప్పుడు, ఇవి అంతరిక్షంలో ఉద్భవిస్తాయి. గామా కిరణాలు పేలినప్పుడూ జనిస్తాయి.

సి) విశ్వవ్యాప్తంగా ఇవి ఉంటాయి. ఏ పదార్థం గుండా అయినా చొచ్చుకొని పోగలవు.

డి) పైవన్నీ

44) 2017 US స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్; విజేత ఎవరు?

ఎ) ప్రణయ వరద  బి) అనన్య విజయ్

సి) ద్రోణవల్లి హారిక  డి) పి.వి.సింధు

45) భారత రాష్ట్రపతి ఎన్నికలలో ఎవరు పాల్గొన లేరు? ఓటు వెయ్యలేరు ?

ఎ) రాజ్యసభకి, లోక్‌సభకి, రాష్ట్రపతి చేత నామినేట్ చేయబడిన సభ్యులు

బి) MLCలు (MLCలలో చాలా మంది కౌన్సిల్‌కి పరోక్షంగా ఎన్నిక కాబడిన వారు ఉంటారు)

సి) రాష్ట్ర అసెంబ్లీకి, గవర్నర్ చేత నామినేట్ చేయబడిన MLA లు.

డి) పై అందరూ (వివరణ : నామినేట్ చేయబడిన MPలు, MLAలు రాష్ట్రపతి ఎన్నికలో ఓటు వెయ్యలేరు)

46) ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ యాంటి బయాటిక్స్ మందులను , (వినియోగ అవసరాలను బట్టి) ఎన్ని రకాలుగా వర్గీకరించింది ?

ఎ) యాక్సిస్ గ్రూప్ (ఉదా: అమోక్సిసిలిన్)

బి) వాచ్ గ్రూప్ (ఉదా : సిప్రో ఫ్లోక్సాసిన్)

సి) రిజర్వు గ్రూప్ (ఉదా: కొలిస్తిన్; సెఫలో స్పోరిన్స్)  డి) పైవన్నీ

47) షాంఘై కో–ఆపరేషన్ ఆర్గనైజేషన్ (SCO) లో భారతదేశం సభ్యదేశంగా చేరింది. SCO సమావేశం జూన్, 2017లో ఎక్కడ నిర్వ హించారు?

ఎ) మాస్కో  బి) ఆస్థానా, కజాక్‌స్తాన్

సి) తాష్కెంట్  డి) బిష్కెక్

48) ఫర్జాబ్ B గ్యాస్ ఫీల్డ్ (క్షేత్రం) (12.5 ట్రిలియన్ క్యూబిక్ ఫీట్ సామర్థ్యం గలది) ఎక్కడుంది?

ఎ) ఇరాన్  బి) లిబియా

సి) నైజీరియా  డి) ఉగాండా

49 ) ఇటీవల రాజాచారి వార్తల్లో ఉన్నారు . ఈయన్ని అంతరిక్ష యానం కోసం ట్రైనీ గా ఎవరు ఎంపిక చేశారు ?

ఎ) NASA, USA వారు 22వ క్లాస్ అమెరికన్ స్పేస్ ఫ్లైట్ ట్రైనీగా తీసుకున్నారు.

బి) JAXA  సి) ఇస్రో  డి) రాస్ కాస్మోస్

50) రోలాండ్‌గారోస్ (ఫ్రెంచ్ ఓపెన్)లో 2017 మిక్స్‌డ్ డబుల్స్ (టెన్నిస్ ఆటలో) విజేతలు ఎవరు?

ఎ) రోహన్ బోపన్న & గాబ్రీలా లాడా బ్రౌస్కీ

బి) రాబర్ట్ ఫరా & అన్నాలెనా గ్రోనేపెల్డ్

సి) రీకా హారికా & మహేష్ భూపతి

డి) వీరెవరు కారు

51) డైరెక్టరేట్ జనరల్ అఫ్ ఫారిన్ ట్రేడ్ (DGFT) వివరాలు ఏవి?

ఎ) భారత దేశ విదేశ వాణిజ్య పాలసీ రూప కల్పనలో ప్రధాన పాత్ర పోషిస్తుంది.

బి) ఇండియన్ ట్రేడ్ సర్వీస్ అధికారులు పనిచేస్తుంటారు.

సి) ప్రస్తుతం ఇది కేంద్ర వాణిజ్య శాఖ పరిధిలో పనిచేస్తోంది  డి) పైవన్నీ

52) అల్–ఉదైద్ మిలిటరీ బేస్, ఏ దేశంలో ఉంది? (ఇక్కడ USA సైనికులు పనిచేస్తున్నారు)

ఎ) సౌదీ అరేబియా  బి) కతార్

సి) ఇరాక్  డి) మొరాకో

53) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?

ఎ) B & R ఇనిషియేటివ్ : బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (చైనా దేశానిది)

బి) RATS : రీజినల్ యాంటి టెర్రరిస్ట్ స్ట్రక్చర్

సి) CPEC : చైనా–పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్  డి) పైవన్నీ

54) భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 300 A దేనికి సంబంధించినది ?

ఎ) పంచాయతి రాజ్  బి) ఆస్తి హక్కు

సి) మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్

డి) సమాచార హక్కు

55) ఇటీవల ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ ఫ్రేమ్ వర్క్ పాక్టును ఆమోదించిన 'నౌరు' దేశ వివరాలు ఏవి?

ఎ) జనాభా : సుమారు 10,200

బి) భూమధ్య రేఖకు దగ్గరగా ఉన్న దీవి దేశం ఇది

సి) ఈ దేశంలో తుఫాన్లు దాదాపు రావు

డి) పైవన్నీ

56) పవిత్రమైన 'వెస్ట్రన్ వాల్' , జెరూసలేం ఓల్డ్ సిటీని ఇటీవల సందర్శించి, ప్రార్థన చేసిన విదేశీ ప్రముఖులు ఎవరు?

ఎ) డోనాల్డ్ ట్రంప్

బి) షమ్యూల్ రాబినౌ విట్జ్

సి) బెంజమిన్ నెటన్యాహూ  డి) గోల్డా మీర్

57) హసన్ రౌహాని ఏ దేశ అధ్యక్షుడు?

ఎ) జాంబియా  బి) ఇరాన్

సి) మొజాంబిక్  డి) జైర్

58) భారత దేశం 2016 లో ఎంత స్టెయిన్లెస్ స్టీల్ (మిలియన్ టన్నులలో) ఉత్పత్తి చేసి ప్రపంచంలో రెండవ స్థానానికి చేరుకుంది ?

ఎ) 3.32  బి) 1.2  సి) 2.2  డి) 0.5

59) 'ముంబై ఇండియన్స్' టీంవాళ్ళు ఏ ఏ సంవత్సరాలలో IPL ఫైనల్స్‌లో గెలిచారు?

ఎ) 2013  బి) 2015

సి) 2017  డి) పై మూడు

60) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్?

ఎ) యూరోపియన్ యూనియన్ కౌన్సిల్, ప్రెసిడెంట్ : డోనాల్డ్ టస్క్

బి) NATO సెక్రటరీ జనరల్:జేంస్ స్టోల్టెన్ బెర్గ్

సి) వరల్డ్ బ్యాంకు అధ్యక్షుడు : జియాంగ్ కిం

డి) పైవన్నీ

61) నార్త్ అట్లాంటిక్ ట్రియటి ఆర్గనైజేషన్ (NATO) కొత్త హెడ్ క్వార్టర్స్ అధికారాన్ని బెల్జియం ప్రభుత్వం నుండి ఎవరి ఇచ్చారు?

ఎ) UNO

బి) అందులో సభ్యులుగా ఉన్న 28 దేశాల యొక్క కూటమికి

సి) WHO  డి) IAEA

62) 'కాస్పీ' ఏ దేశ స్టాక్ ఎక్స్ఛేంజి సెన్సెక్స్ పేరు?

ఎ) జపాన్  బి) హాంగ్ కాంగ్

సి) దక్షిణ కొరియా  డి) సింగపూర్

63) 'వన్నా క్రై' వంటి రాన్ సం వేర్ (దోపిడీ చేసుకునే తరహా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్) వచ్చినప్పటికీ, అన్ని విపత్కర పరిస్థితులు తట్టుకునేలా సైబర్ సెక్యూరిటీ కోసం భారత దేశం వేటిని ఏర్పాటు చేసింది?

ఎ) STQC

బి) బాట్ క్లీనింగ్ & మాల్ వేర్ ఎనాలిసిస్ సెంటర్

సి) నేషనల్ సైబర్ సెక్యూరిటీ కో–ఆర్డినేషన్ సెంటర్ ; మరియు CERT-in

డి) పైవన్నీ

64) ఇండియా వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ లెక్కల ప్రకారం భారతదేశంలో 3.85 లక్షల మంది నుండి 4.1 లక్షల వరకు బంగారం నగలు తయారు చేసే వారు / అమ్మేవారు ఉన్నారు. వీరిలో ఎంత శాతం మంది అసంఘటిత రంగంలో ఉన్నారు?

ఎ) 70% బి) 30% సి ) 40% డి ) 10%

## జవాబులు (జూలై – 2017)

| | | | |
|---|---|---|---|
| 1–డి | 17–డి | 33–డి | 49–ఎ |
| 2–ఎ | 18–డి | 34–డి | 50–ఎ |
| 3–డి | 19–ఎ | 35–ఎ | 51–డి |
| 4–ఎ | 20–ఎ | 36–ఎ | 52–బి |
| 5–బి | 21–ఎ | 37–ఎ | 53–డి |
| 6–డి | 22–ఎ | 38–డి | 54–బి |
| 7–డి | 23–బి | 39–సి | 55–డి |
| 8–డి | 24–బి | 40–ఎ | 56–ఎ |
| 9–బి | 25–డి | 41–డి | 57–బి |
| 10–బి | 26–డి | 42–ఎ | 58–ఎ |
| 11–బి | 27–డి | 43–డి | 59–డి |
| 12–ఎ | 28–డి | 44–బి | 60–డి |
| 13–డి | 29–డి | 45–డి | 61–బి |
| 14–ఎ | 30–బి | 46–డి | 62–సి |
| 15–డి | 31–డి | 47–బి | 63–డి |
| 16–ఎ | 32–ఎ | 48–ఎ | 64–ఎ |

■

### అసంఘటిత రంగ కార్మికులకు సాంఘిక భద్రత.



ఇప్పటివరకు వివిధ రూపాలలో ఉన్న కార్మిక చట్టాలనన్నింటినీ ఏకీకృతం చేస్తూ లేబర్ కోడ్ నొకదానిని కేంద్ర కార్మిక శాఖ రూపొందించి కేంద్ర మంత్రివర్గ ఆమోదానికి పంపింది. 40 కోట్లమంది అసంఘటిత రంగ కార్మికులకు ప్రావిడెంట్ ఫండు, వైద్యబీమా వంటి సాంఘిక భద్రత పథకాలను వర్తింపచేయనున్నట్లు కేంద్ర కార్మికమంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. దీనిలో భాగంగా ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఇటీవల ఎక్కువమంది ఉద్యోగస్థులను ప్రావిడెంట్ ఫండ్ పరిధిలోకి తెచ్చేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. నాణ్యమైన ఉపాధిని మరింత ప్రోత్సహించేందుకు యజమానులకు ప్రధానమంత్రి రోజ్‌గార్ ప్రోత్సాహన్ యోజన పథకం కింద నూతన ఉద్యోగులకు చెల్లించే భవిష్యనిధిని 8.33 శాతం చొప్పున మూడు సంవత్సరాలు తానే చెల్లించడానికి ప్రభుత్వం సంసిద్ధతను తెలియచేసింది. ఈ సంక్షేమ చర్యలలో భాగంగా ప్రతి ఈ.ఎస్.ఐ. లబ్దిదారుడు రెండు వైద్యశాలలలో సేవలను పొందే సులువును కూడ కలుగచేశారు.

### అందరికీ కనీస ఆదాయం.

ప్రస్తుతం అమలవుతున్నవివిధ సంక్షేమ కార్యక్రమాలన్నిటి బదులుగా మొత్తం



పేద ప్రజలందరికీ నెలకు కనీస ఆదాయం ఒక నిర్దుష్ట మొత్తంలో (అంటే ఉదాహరణకు నెలకు రూ. 10,000/–లు) ఉంటే మరింత ప్రయోజనకరం కాగలదనే అంశంపై ఇటీవల దేశంలో చర్చ జరుగుతున్నది. దీని సాధ్యాసాధ్యాలపై ఇంకా పరిశీలన జరగవలసి ఉంది. ప్రతివ్యక్తికీ కనీస మొత్తం ఆదాయం ఉంటే కొనుగోలు శక్తి పెరుగుతుంది. ప్రాధాన్యాలు మారుతూ ఉంటాయి కనుక, వ్యక్తులు వారి ఇష్టానుసారం ఆ మొత్తాన్ని ఖర్చు పెట్టుకోగలుగుతారు. ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలలో, పేదవారు కానివారికి కూడ నగదు పంపిణీ జరుగుతున్నది. దీనిని ఈ నూతన విధానంలో అరికట్టవచ్చు. విలువైన రాయితీలను అనర్హులకు చేరకుండా నిరోధించవచ్చు. ప్రస్తుతం అమెరికా, ఫిన్లాండ్, కెనడా వంటి దేశాలలో ఈ విధానం సాధ్యాసాధ్యాలపై అధ్యయనాలు జరుగుతున్నాయి.

### గృహనిర్మాణము – జి.ఎస్.టి.



జూలై ఒకటవ తేదీ నుండి అమలు కానున్న వస్తు–సేవల పన్ను విధానం వలన గృహనిర్మాణదారులకు అందే పన్ను తగ్గుదల ప్రయోజనాన్ని లబ్దిదారులతో పంచుకోవాలని కేంద్ర గృహనిర్మాణ మంత్రిత్వశాఖ పిలుపు నిచ్చింది. జి.ఎస్.టి. పన్ను మొత్తాన్ని ఒకే విడతగా చెల్లించమని ఒత్తిడి చేస్తున్న నిర్మాణ దారులు, సంస్థలను హెచ్చరిస్తూ, అలాంటి చర్యలు చట్టవ్యతిరేకమని ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం గృహనిర్మాణ సామగ్రిపై 12శాతం ఎక్సైజు సుంకం, సేవ పన్ను 4.5శాతం, వాట్ ఒక్కశాతం చొప్పున విధిస్తున్నారు. వీటన్నిటి బదులుగా వచ్చే నెల నుండి అమలయ్యే వస్తు–సేవల పన్ను మొత్తం 12 శాతాన్ని మించదు.


### దేశంలోని మొదటి ప్రైవేటు రైల్వేస్టేషన్.



భోపాల్ సమీపంలోని హబీబ్ గంజ్ రైల్వేస్టేషన్, దేశంలోని మొదటి ప్రైవేటు రైల్వే స్టేషన్‌గా రికార్డులకెక్కింది. ప్రైవేటు సంస్థల సహకారంతో ఈరైల్వే స్టేషన్ను అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో తీర్చిదిద్దుతారు. భోపాల్ లోని బన్సల్ గ్రూప్ సంస్థకు ఎనిమిది సంవత్సరాల కాలపరిమితితో ఈ బాధ్యత నప్పగించారు. ఈ సంస్థ రూ వందకోట్లతో స్టేషన్ను తీర్చిదిద్ది, మరో రూ. 350 కోట్ల పెట్టుబడితో స్టేషన్ సమీపంలోని 17,245 చదరపు మీటర్ల స్థలాలను వాణిజ్య ప్రాతిపదికన అభివృద్ధి చేస్తుంది. పూర్తిగా సౌరవిద్యుత్తుతో నడిచే ఈ స్టేషన్,

వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లతో అలరారుతుంది. ఈ మేరకు ఒక పి.పి.పి. ఒప్పందం ఖరారయింది.

**రైలు టికెట్లను ఇతరులకు బదలాయించవచ్చు.**





ఒకరు కొనుక్కున్న రైలు టికెట్‌పై ఇంతవరకు మరొకరు ప్రయాణించడం నేరం. ఈ నిబంధనను సవరించి, ఇకపై ఒకరు కొనుక్కున్న టికెట్‌ను మరొకరికి బదలాయించుకునే సౌలభ్యాన్ని రైల్వే విభాగం కలుగచేస్తున్నది. అంటే రిజర్వేషన్ టికెట్ పై పేరు మార్చ వచ్చున్న మాట! అయితే ప్రభుత్వోద్యోగులు, వివాహబృందాలు, విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులకు మాత్రమే ఈ సౌకర్యం వర్తిస్తుంది. సమీపంలోని ప్రధాన రైల్వేస్టేషన్ ముఖ్య రిజర్వేషన్ పర్యవేక్షణాధికారి ఈ పేరు మార్పును అనుమతిస్తారు. కన్ఫర్మ్‌డ్ రిజర్వేషన్ టికెట్లపై 24 గంటల ముందు వరకు ఈ మార్పును అనుమతిస్తారు.

**ప్రైవేట్ స్కూల్‌కు పంపిస్తే జరిమానా.**



స్కూల్ అంటే ప్రైవేట్ స్కూల్ అనుకునే రోజులు ఇవి. సర్కారీ బడులను హేళనగా చూసే రోజులు. స్మార్ట్‌లుక్ ఉండదని, టీచర్లు పట్టించుకోరని, అవి కేవలం వీధిబడులు మాత్రమేనని అనుకునే రోజులు. అలాంటి సమయంలో ఇదిగో మీ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకే పంపించండి. లేదంటే భారీ జరిమానా తప్పదంటూ ఆ గ్రామమంతా తీర్మానించింది. ప్రభుత్వ స్కూళ్లపై ఎంత మమకారం ఉండాలి ఇలా గవర్నమెంట్ స్కూళ్లను బతికించు కోవడానికి! ఆ గ్రామం చూపిన సాహసం ఇప్పుడు అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. తెలంగాణాలోని జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలోని పోతారం గ్రామం ఈ ఆదర్శానికి బాటలు వేసింది. గ్రామమంతా ఒక్కటై, తమ గ్రామం నుంచి ప్రైవేట్ పాఠశాలకు విద్యార్థులను పంపిస్తే వారికి రూ. 50 వేల జరిమానా విధించాలని తీర్మానించారు. కుల సంఘాల వారీగా సమావేశమై ఈ మేరకు తీర్మానం చేశారు. సర్పంచ్ సిరికొండ కవితకు తీర్మాన పత్రాలను అందించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి మూతపడే పరిస్థితి నెలకొనడంతో ఈ సమష్టి నిర్ణయం తీసుకున్నారు.

**ఇక కిరోసిన్ రాకెట్లు.**



జి.ఎస్.ఎల్.వి. ఎం.కె-III విజయం తర్వాత, ఇస్రో ప్రస్తుతం సెమీ క్రయోజనిక్ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంపై దృష్టి సారించింది. ఈ విధానంలో ఇంధనంగా కిరోసిన్‌ను వినియోగిస్తారు. 2021 నాటికి అందుబాటులోకి వచ్చే ఈ పరిజ్ఞానం పర్యావరణ హితంగా ఉండటమేకాదు, ప్రస్తుతం క్రయోజనిక్ ఇంజన్లలో వాడుతున్న ద్రవ హైడ్రోజన్, ద్రవ ఆక్సిజన్లు ఎంతో బరువుగా ఉండటంవల్ల, వీటి స్థానంలో అతి తేలికైన, సాధారణ ఉష్ణోగ్రతలో నిల్వ చేయగలిగిన శుద్ధిచేసిన కిరోసిన్‌ను వినియోగిస్తారు. రిఫైన్డ్ కిరోసిన్, లేదా ఇస్రోసిన్‌గా పిలిచే ఈ ఇంధన వినియోగం వల్ల రాకెట్‌లో అదనంగా మరో రెండు టన్నుల బరువును తీసుకువెళ్ళవచ్చు. ■

## యోజన చందా ఆన్‌లైన్‌లో

భారత ప్రభుత్వ ప్రచురణల విభాగం వారి యోజన, ఇతర పత్రికలకు చందాను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. www.Bharatkosh.gov.in వెబ్ సైట్‌లో Publications' Divistion వారి linkను క్లిక్ చేసి సూచనలను అనుసరించండి. చెల్లింపులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్ ద్వారా చెయవచ్చు. చందా వివరాలు సంవత్సరానికి రూ. 230/-, రెండు సంవత్సరాలకు రూ. 430/-, మూడు సంవత్సరాలకు రూ. 610/-లు.

*సీనియర్ ఎడిటర్*

# సామాజిక భద్రతలో తెలంగాణ ప్రభుత్వ ఆసరా పథకం- మూల్యాంకనం

- మాణిక్య మహేశ్



**ఏ ప్రభుత్వమైనా ఒక సంక్షేమ పథకాన్ని రూపొందించి, అమలు చేసినప్పుడు క్షేత్ర స్థాయిలో దాని ప్రయోజనాన్ని అర్హులైన లబ్ధిదారులు అందుకునప్పుడే ఆ కార్యక్రమం విజయవంతం అయిందని చెప్పవచ్చు. ఒక సంక్షేమ కార్యక్రమం, దాని లక్ష్యాలను కచ్చితంగా చేరే క్రమంలో ప్రభుత్వ శాఖలు ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వాలు అమలుచేసిన వృద్ధాప్య, వితంతు పెన్షన్ పథకాలకి సమూల మార్పులు చేసి కొత్తగా ఆసరాను తీసుకొచ్చింది.**

సామాజిక భద్రత విషయంలో బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పథకాలు, విధానాలు రూపొందిస్తుంటుంది. అయితే సర్కారు ఎంచుకున్న లక్ష్యాల మేరకు పథకాల ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో అందినప్పుడే అయా సంక్షేమ కార్యక్రమాలు విజయవంతం అవుతాయి. పథకాలు అనుకున్న లక్ష్యాలను చేరుకునే క్రమంలో ప్రభుత్వ శాఖలు అనేక సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది. ముఖ్యంగా కార్యక్రమాల రూపకల్పనకు అవసరమైన సమాచార సేకరణ, లబ్దిదారుల ఎంపిక, వారికి ప్రయోజనాల చేరవేత వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా సంక్షేమ ఫలాలు అందుకునే లబ్దిదారులంతా బలహీనవర్గాలు, నిరక్షరాస్యులు, గ్రామీణ నిరుపేదలే ఉంటారు. ఈ నేపథ్యంలో వారి సామాజిక స్థాయిలకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాల అమలు జరగాలి. నూతనంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రం సైతం ఇతర ప్రభుత్వాల మాదిరిగానే అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నది. ముఖ్యంగా గత ప్రభుత్వాలు ఇచ్చిన వృద్ధాప్య పింఛన్ పథకంలో కొన్ని మార్పులు చేర్పులు చేసి ఆసరా పేరుతో పేదలకు ఆర్థికంగా తోడ్పాడు అందిస్తున్నది. ఈ పథకం రూపకల్పన, అది అమలవుతున్న తీరు, లబ్దిదారుల స్పందన వంటి అంశాలను ఈ వ్యాసంలో క్రోడీకరించడం జరిగింది. వివిధ జిల్లాల్లోని పలువురు లబ్దిదారులు, అధికారులను కలిసి సమాచారం సేకరించి, సామాజిక సంక్షేమ రంగంలో ఆసరా పింఛన్ పోషిస్తున్న పాత్రను ఈ వ్యాసంలో సమగ్రంగా వివరించడం జరగింది.

సంక్షేమంతోనే వికాసం, ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాల అభ్యున్నతితోనే సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. సంక్షేమ రాజ్యానికి పునాది అయిన ఈ భావనను అందిపుచ్చుకున్న మనదేశం, స్వాతంత్ర్యం వచ్చాక బలహీన వర్గాల కోసం అనేక పథకాలు, కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తూ వస్తున్నది. దేశంలోని వివిధ రాష్ట్రాలు కూడా తమ తమ పరిధిలోని బడుగు, బలహీన వర్గాల ప్రయోజనాల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నాయి. అయితే ఏ ప్రభుత్వమైనా ఒక సంక్షేమ పథకాన్ని రూపొందించి, అమలు చేసినప్పుడు క్షేత్ర స్థాయిలో దాని ప్రయోజనాన్ని అర్హులైన లబ్ధిదారులు అందుకునప్పుడే ఆ కార్యక్రమం విజయవంతం అయిందని చెప్పవచ్చు. ఒక సంక్షేమ కార్యక్రమం, దాని లక్ష్యాలను

PRO to Minister for IT & Municipal Administration, Govt. of Telangana

E-mail: protoktr@telangana.gov.in

కచ్చితంగా చేరే క్రమంలో ప్రభుత్వ శాఖలు ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా కార్యక్రమ రూపకల్పనకు కావాల్సిన సమాచార సేకరణ, లబ్దిదారుల ఎంపిక, వారికి ప్రయోజనాల చేరవేత వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సి వస్తుంది. సాధారణంగా సంక్షేమ ఫలాల ప్రయోజనాన్ని పొందే లబ్దిదారులంతా బలహీనవర్గాలు, నిరక్ష రాస్యులు, గ్రామీణ నిరుపేదలే ఉంటారు. ఈ నేపథ్యంలో వారి సామాజిక స్థాయిలకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాల రూపం, కార్యచరణ ఉండాలి.

ఎవరికైనా ఆర్థికపరమైన అండతోనే సామాజిక భద్రత సాధ్యమవుతుంది. ఆర్థిక భరోసా లేకపోవడంతో మనదేశంలోని బలహీనవర్గాలు సామాజిక భద్రతను పొందలేకపోతున్నాయి. ఈ వర్గంలోని పేదలైన వృద్ధులు, వికలాంగులు, వితంతు, ఒంటరి మహిళలకు అత్యవసరమైన సామాజిక భద్రతకు ఆర్థికపరమైన అండ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ మేరకు కేంద్రం పలు పింఛన్ సౌకర్యాలను అందిస్తున్నది. వీటికి అయా రాష్ట్రాలు కొన్ని మార్పులు చేసుకుంటు న్నాయి. ఇదే విధంగా కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం ఆయా వర్గాలే లక్ష్యంగా 'ఆసరా' పేరుతో ఒక పథకాన్ని అమలు చేస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వాలు అమలుచేసిన వృద్ధాప్య, వితంతు పెన్షన్ పథకాలకి సమూల మార్పులు చేసి కొత్తగా ఆసరాను తీసుకొచ్చింది. గతంలో కేవలం వృద్ధులు, దివ్యాంగులు, వితంతు మహిళలకు మాత్రమే పరిమితం అయిన ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతపరిచి చేనేత కార్మికులు, గీత కార్మికులు, బీడీ కార్మికులు, కళాకారులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ బాధితులను ఆసరా పరిధిలోకి తీసుకొచ్చింది. అంతకుముందు ఇతర పథకాల కింద అమలవుతున్న పలు పింఛన్ కార్యక్రమాలను ఇందులో విలీనం చేశారు. ఇంతేకాదు ఆయా పథకాలకు కేంద్ర ప్రభుత్వం తనవంతుగా ఇస్తున్న నిధులకు అదనంగా కొంత చేర్చి ఆసరాను అమలుచేస్తున్నది. అందుకే గతంలో 200 రూపాయలున్న వృద్ధులు, వితంతు పెన్షన్‌ను 1000 రూపాయలు, ఐదువందల రూపాయలుగా ఉన్న దివ్యాంగుల పెన్షన్‌ను 1500 రూపాయలకు పెంచగలిగింది. గత కొంత కాలంగా జీవన వ్యయం పెరగిపోయినందున, అప్పటి వరకు ఇస్తున్న 200 రూపాయలు వారి కనీసావసరాలకు సరిపోవు కాబట్టి ఈ పెంపు నిర్ణయం తీసుకోవడం జరిగింది. సామాజిక భద్రతా కార్యక్రమాల్లో భరోసాతో పాటు జీవన ప్రమాణాల పెంపు, ఎవరిమీదా అధారపడ కుండా చేసే ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని కూడా పరిగణలోకి తీసుకున్నట్లు ఆసరా పింఛన్లను కార్యక్రమాన్ని పర్యవేక్షించిన రిటైర్డ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఒకరు తెలిపారు. దీంతోపాటు చేనేత, కల్లుగీత, బీడీ కార్మికులు చేస్తున్న పని వాతావరణం వలన వారికి 50 సంత్సరాలకే అనేక అనారోగ్య సమస్యలు తలెత్తడం, వారి వేతనాలు గిట్టుబాటు కాకపోవడంవంటి కారణాలతో జీవనభృతి ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దేశంలో ఎక్కడా లేని విధంగా మొదటిసారి నిరాదరణకు గురవుతున్న ఒంటరి మహిళలు, పెళ్లి కాకుండా మిగిలిన మహిళలకు పింఛన్ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగింది. హెచ్ఐవి భాధితులకు సైతం పింఛను 200 నుంచి 1000కు పెంచడంతో కార్యక్రమంలో నమోదు చేయించుకున్న వారి సంఖ్య 10 వేల నుంచి 40 వేలకు పెరిగింది. ఇలా అన్ని వర్గాలు కలిపి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఆసరా పింఛన్ పథకం క్రింద సుమారు 37.87 లక్షల మంది లబ్ది పొందుతున్నారు. 2017-18 సంవత్సరానికి ఈ పద్దు కింద రూ. 5,300 కోట్లు ఖర్చు కాగలదని రాష్ట్ర ప్రభుత్వ అంచనా!

లబ్దిదారుల సంఖ్య ఎక్కువగా ఉంటుందన్న ఉద్దేశ్యంతోనే ఆసరా రూపకల్పన, లబ్దిదారుల ఎంపిక, అమలులో ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రజల తాలుకు సరైన సమాచారం ఉన్నప్పుడు మాత్రమే సరైన పథకాలు రూపొందిచ గలుగుతామని తెలంగాణ ప్రభుత్వం పలు మార్లు ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో మొత్తం తెలంగాణ సామాజిక, ఆర్థిక ముఖచిత్రంపై ప్రభుత్వానికి అవగాహన కోసం సమగ్ర కుటుంబ సర్వేను చేయడం జరిగింది. కేవలం ఒకే ఒక్క రోజులో రాష్ట్రంలోని ప్రతి ఇంటినీ మదింపు చేసి వివరాలు సేకరించడం జరిగింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్రంలో సూమారు 91 లక్షల కుటుంబాలు, మూడు కోట్ల అరవై లక్షల జనాభా ఉన్నట్లు తెలింది. వీరిలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న జనాభా, బడుగు, బలహీన వర్గాలు, దళిత, గిరిజన, మహిళా వివరాలు సైతం స్పష్టంగా తెలిసాయి. దీనితో సామాజిక భద్రత రంగంలో చేపట్టబోయే పలు కార్యక్రమాలను విలీనం చేయడం, నూతనంగా మరికొన్ని వర్గాలకు ప్రయోజ నాలు కల్పించే విషయంలో ఖచ్చితమైన అంచనాలు వేసేందుకు అవకాశం కలిగింది. దీంతో ఆసరా పథకం రూపురేఖలపైన స్పష్టత వచ్చింది. సమగ్ర కుటుంబ సర్వేతో పాటు అంతకుముందు అమలు చేస్తున్న పథకాల లబ్దిదారుల వివరాలతో ఆసరా పెన్షన్ పథకానికి అర్హతా నిబంధనలను రూపొం దించారు. వాటి ప్రకారం 65 సంవత్సరాలు లేదా అంతకన్న ఎక్కువ వయసున్న వృద్ధులు ఆసరా పెన్షన్ పథకానికి అర్హులుగా గుర్తించారు. వయసు నిర్ధారణ కోసం జనన ధృవీకరణ పత్రం లేదా ఆధార్ కార్డును ధరఖాస్తుతో జతచేయవచ్చనే నిబంధనను రూపొందించారు. 18 సంవత్సరాలు నిండి, భర్త చనిపోయిన స్త్రీలను వితంతు పెన్షన్‌కు, 50 సంవత్సరాల పైబడిన చేనేత, కల్లు గీతకార్మికులను పెన్షన్‌కు అర్హులుగా నిర్దేశిం చింది. వయసుతో సంబంధం లేకుండా కనీసం 40 శాతం వైకల్యం ఉన్న వారితో

పాటు 51 శాతం వినికిడి లోపం ఉన్నవారు వికలాంగుల పెన్షన్‌ను తీసుకునేలా నిబంధనలను రూపొందించారు. వీరితో పాటు ఈ పథకంలో యాంటీ రిట్రోవైరల్ థెరపీ చేయించుకుంటున్న ఎయిడ్స్ బాధితులు కూడా పెన్షన్ పొందవచ్చు. 2017 జూన్ నుంచి ఒంటరి మహిళలను కూడా ఈ ఆసరా పరిధిలోకి తీసుకొచ్చారు. ఎలాంటి ఆధారం లేని 35 ఏళ్ల ఒంటరి మహిళలను అర్హులుగా నిర్ణయించారు. వివాహం చేసుకోని మహిళలు, విడాకులు తీసుకున్న మహిళలు, విడాకులు తీసుకోకుండా భర్త నుంచి విడిగా ఉంటున్నవారు, జోగినులను ఒంటరి మహిళలుగా పరిగణించి పెన్షన్ అందిస్తారు. ముఖ్యంగా ఒక సాంఘిక దురాచారానికి బలైన జోగినులకు ఆర్థికంగా రక్షణ కల్పించేలా నిర్ణయం తీసుకోవడం ఒక విశేషంగా చెప్పుకోవచ్చు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఏదైనా ఇతర పెన్షన్ పొందుతున్న వారితో పాటు ఆర్థికంగా ఉన్నవారిని ఆసరాకు అనర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. ఆర్థికంగా బలహీన వర్గాలుగా ఉన్న వృద్ధులు, వితంతువులకు ఆసరా కల్పించడంతోపాటు సామాజికంగా వివక్షకు గురవుతున్న ఏయిడ్స్ భాధితులకు, జోగినులకు సైతం రక్షణ దొరికింది. మొత్తం రాష్ట్రంలోని అత్యధిక వర్గాల వారికి సామాజిక భద్రత కల్పించే వీలు కలిగింది.

పథకం రూపకల్పన, అమలుపైనా ప్రభుత్వం చేసిన కసరత్తులను ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అవసరం ఉన్నది. ఆసరా లబ్ధిదారుల ఎంపికలో ఎక్కడా తప్పులు దొర్లకుండా ప్రభుత్వం పకడ్బందీగా వ్యవహరించింది. లబ్ధిదారుల ఎంపికతో పాటు పెన్షన్ పంపిణీ బాధ్యతను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ [సెర్ప్]కు అప్పగించింది. గ్రామీణాభివృద్ధి శాఖ కంటే విస్తృతమైన పరిధి, మానవ వనరులు ఉన్నందునే సెర్ప్‌ను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది. ఈ నిర్ణయం సత్ఫలితాలను ఇచ్చింది. గ్రామస్థాయిలో బలంగా ఉన్న స్వయం సహాయక సంఘాల సేవలను ఆసరా లబ్ధిదారుల ఎంపికలో ఉపయోగించుకున్నారు. గ్రామీణ ప్రాంతాలలో గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా విలేజి రెవెన్యూ అధికారి, పట్టణ ప్రాంతాలలో బిల్ కలెక్టరుకు దరఖాస్తు చేసుకున్న వ్యక్తుల సామాజిక, ఆర్థిక నేపథ్యాన్ని గ్రామపంచాయితీల దగ్గర చర్చించారు. వీటిపైన ఉన్న ఫిర్యాదులు తీసుకున్నారు. అభ్యంతరాలపై చర్చించారు. ఎవరైనా అర్హులు ధరఖాస్తు చేసుకోకుంటే అప్పటికప్పుడు మంజూరు చేయించారు. ఈ ప్రక్రియ అంతా బహిరంగంగానే జరగడంతో ఎక్కడా ఎవరికి అనుమానాలు, అభ్యంతరాలు రాలేదు. దివ్యాంగుల అంగవైకల్యాన్ని గుర్తించేందుకు ప్రత్యేకంగా జిల్లా స్థాయిల్లో క్యాంపులను నిర్వహించారు. అప్పటి వరకు పించన్లు పొందుతున్న వారందరు మరోసారి అధార్ కార్డులు తమకు సమర్పించాలన్న నిబంధన విధించడంతో, వయస్సు దృవీకరణకు అవకాశం కలిగింది. దీంతో అనర్హులైన నకిలీ లబ్ధిదారులను తొలగించారు. ముఖ్యంగా తప్పుడు ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని, ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ప్రభుత్వాధికారులే భాధ్యత వహించాలని నిర్దేశించడంతో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగానే జరిగిందని చెప్పవచ్చు. లబ్ధిదారుల గుర్తింపు, ఎంపిక పూర్తయ్యాక ఈ జాబితాను గ్రామపంచాయితీల వద్ద ప్రజలకు అందుబాటులో ఉంచారు. ఇలా మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లబ్ధిదారుల వివరాలను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ తయారు చేసిన ఆసరా వెబ్ సైట్లో ఉంచారు.

పథకం లక్ష్యాల్లో ఒటైన సాధికారత, భరోసా కల్పించడం వంటి అలోచనల నేపథ్యంలో మొదటి నెల పెన్షన్ మొత్తాన్ని నగదు రూపంలో అందించారు. అప్పటి వరకు వస్తున్న పెన్షన్‌కు దాదాపు రెండింతలు, ఐదింతలు వస్తున్న దాన్ని నగదు రూపంలో ఇస్తే ఆర్థికంగా ఒక భరోసా కలిగించవచ్చన్న ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం అలా చేసింది. అయితే రెండవ నెల నుంచి మాత్రం బ్యాంకుల్లో మాత్రమే నగదు వేస్తామని లబ్ధిదారులకు అధికారులు స్పష్టం చేశారు. దేశంలోని అర్థిక వ్యవస్థను డిజిటలీకరణ వైపు నడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన జామ్ ట్రినీటీ (JAM)ని తెలంగాణ ప్రభుత్వం ఉపయోగించకుంది. ఈ మేరకు ప్రతి ఒక్క లబ్ధిదారునిచేతా బ్యాంక్ ఖాతాలను తెరిపించే క్రమంలో జన్ ధన్ యోజన కార్యక్రమాన్ని సంపూర్ణంగా వినియోగించుకున్నారు. రాష్ట్రంలోని బ్యాంకులతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి, శూన్య బ్యాలెన్స్‌తో బ్యాంక్ ఖాతాలను తెరిపించారు. గ్రామాల్లో ఉన్న మహిళా లబ్ధిదారులు చాలా మంది అప్పటికే స్వయంసహాయక సంఘాల్లో ఉన్నందున బ్యాంకు ఖాతాలు కలిగి ఉన్నారు. ఇలా అప్పటి వరకు ఇతర బ్యాంకుల్లో ఉన్న వారి వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు ఉండేలా, ఎవరికైనా ఆధార్ లేకపోతే గ్రామస్థాయిల్లోనే ప్రత్యేకంగా క్యాంప్‌లు ఏర్పాటుచేసి ఆధార్ కార్డులను జారీ చేశారు. బ్యాంకులు లేని ప్రాంతాల్లో పోస్టాఫీసు ఖాతాలను ఇప్పించారు. ఇలా అందరికీ బ్యాంక్ ఖాతా, ఆధార్ కార్డు ఉపయోగాలపై అవగాహన, చైతన్యాన్ని కల్పించారు. గ్రామస్థాయిలో బ్యాకింగ్ కరస్పాండెంట్లను, మైక్రో బ్యాంకింగ్ సేవలను వినియోగించు కోవడం ఈ పథకంలో అమలు చెప్పుకోదగ్గ మరోక పరిణామం. ఆసరా చెల్లింపులే ప్రధాన వనరుగా వెలసిన పలు మైక్రోబ్యాంకింగ్ యూనిట్లు ప్రస్తుతం తమ పరిధిని విస్తరించుకుని జాతీయ ఉపాధి హామీ కూలీ, పన్నుల చెల్లింపులను సైతం చేస్తున్నాయి. దీంతో పలు గ్రామాలకు బ్యాంకింగ్ సేవలు పరిచయం అయ్యాయి. దీంతోపాటు బ్యాంకింగ్ కరస్పాండెంట్ల వినియోగం ద్వారా మారుమూల పల్లెలు,

తాండాల్లో ఈ పథకం చెల్లింపులు సులభం అయ్యాయి. తమ దగ్గరలోని పట్టణానికి వెళ్లి పడే శ్రమ, ఖర్చులు తగ్గపోయాయి. ఈ విధానంలో స్త్రీ నిధి బ్యాంక్ సేవలను విస్తృతంగా వాడుకుం టున్నారు. ఈ బ్యాంకింగ్ కరస్పాండెంట్ల విధానంలోనే పలు వినూత్నమైన పద్ధతులను స్త్రీనిధి బ్యాంకు చేపట్టింది. లబ్ధిదారుల్లో చాలా వరకు నిరక్షరాస్యులు కావడం, వారికి కార్డు వినియోగంపైన అవగాహన లేనందున వారికి ఆధార్ అనుసంధానిత చెల్లింపులు చేపట్టారు. ఆధార్ కార్డులో నమోదు అయిన వారి వేలిముద్రల ఆధారంగా చెల్లింపులు చేస్తుండ దంతో మోసాలకు తావులేకుండా పోయింది. ఇక లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాలోకి వచ్చిన పెన్షన్ మొత్తాన్ని స్వైపింగ్ యంత్రాల దగ్గర కార్డులను ఉపయోగించి తీసుకున్నారు. దీనికోసం అందుబాటులో మొబైల్ సెల్యులర్ సేవలను ఉపయోగించు కుంటున్నారు. ప్రస్తుతం ఆసరా ద్వారా అందుతున్న ప్రతి ఒక్కరూపాయి ఖాతాల ద్వారానే అందుతుం దని చెప్పవచ్చు. ఆధార్ కార్డు వినియోగం వలన డూప్లికేషన్‌ను తగ్గించగలిగారు. దాంతోపాటు వయస్సు తక్కువున్నప్పటికీ, అప్పటిదాక పింఛను పొందుతున్న అనర్హులను తొలగించగలిగారు. ఈ మెత్తం లబ్ధిదారుల సంఖ్యను గ్రామాల వారీగా ఆన్‌లైన్లో ఉంచారు. ప్రతి నెల ఎంత మందికి ఆసరా పథకం అందుతున్నదో తెలిపేలా ఈ వెబ్‌సైట్‌లో సమాచారాన్ని అప్ డేట్ చేస్తు న్నారు. కేవలం ఒక్కసారిమాత్రమే దరఖాస్తు లకు అవకాశ మివ్వకుండా, నిరంతరం అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేస్తుండం ఇంకో సానూకూలంశంగా చెప్పవచ్చు.

ఆర్థిక అండ ఉంటేనే సామాజిక భద్రత సాధ్యమని బలంగా నమ్మిన తెలంగాణ ప్రభుత్వం ఆసరా పరిధి, ప్రయోజనాలను విస్తృతపరిచి అంతకుముందున్న పెన్షన్ పరిమితిని పెంచడంతో పాటు ప్రయోజనా లను మరిన్ని వర్గాలకు అందించింది. మరి నిజంగానే ప్రభుత్వ లక్ష్యం నెరవేరిందా? ఆసరా సత్ఫలితాలను ఇస్తుందా? ఈ ప్రశ్నలకు సమాధానం తెలుసుకునేందుకు కొంతమంది లబ్ధిదారుల అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగింది. సామాజిక భద్రతలో ముఖ్యమైనది ఆర్థిక భరోసాతో పాటు మిగతా సమాజంలో అంతర్భాగం అవడం. ఈ పెన్షన్ తీసుకుంటున్న వారు నిరుపేదలు. సహజంగానే వారి సంతానం కూడా పేదలే. ఫలితంగా వారి దగ్గర వుంటున్న వృద్ధులు, వితంతువులకు ఎంతో కొంత ఆర్థికంగా అండ దొరికిందని చెప్పవచ్చు. గతంలో కంటే అయిదు రెట్లు అధికంగా వెయ్యి రూపాయలను పెన్షన్‌గా తీసుకుంటున్న వృద్ధులు ఆత్మాభిమానంతో బతుకుతున్నారు. చిన్న చిన్న ఖర్చులకు కూడా తమ పిల్లలను అడిగే పరిస్థితి ఇప్పుడైతే లేదు. తమ ఆరోగ్య సంబంధ అవసరాల కోసం మందులను కొనడంతో పాటు మనుమలు, మనుమరాళ్ల చిన్న చిన్న అవసరాలను కూడా తీర్చగలుగుతున్నారు. పుట్టిన రోజు వేడుకలకు బహుమతులు ఇవ్వడం, పిల్లలు స్కూల్‌కు వెళ్లేటప్పుడు పెన్సిల్, చాక్లెట్లు కొనివ్వగలుగుతున్నారు. ఫలితంగా కొడుకు, కోడళ్ళ ముందు ఆత్మాభిమానాన్ని ఘనంగా చాటుకుంటు న్నారు. ఈ పింఛన్ వస్తున్న నాటి నుండి తన పిల్లలు తమకు మరింత గౌరవంగా చూసుకుంటున్నరని సిరిసిల్లా జిల్లాలోని చిన్నబోనాల గ్రామంలోని రాజయ్య తెలిపారు. ఇందుకు తమకు వచ్చే వెయ్యి రూపాయాల కన్నా మిన్నగా తమ అవసరాలకు వారిపై అధారపడక పోవడమే అన్నారు. తమ మనువరాలు స్కూలు ప్రారంభ సమయంలో కొత్త పుస్తకాలు కొనిచ్చానని, అది తనకు సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు.

గతంలో కన్నా అధికంగా వెయ్యి రూపాయాలు పింఛన్ ఇస్తున్న నేపథ్యంలో ఈ పథకంలో నమోదు చేసుకున్నానని, ఈ వెయ్యి రూపాయలతో కనీస పౌష్టికాహారం అందుకుంటున్నట్లు నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి చెందిన హెచ్ఐవి భాధితుడు వేంకటేష్ (పేరు మార్చడం జరిగింది) తెలిపారు. గత 25 సంవత్సరాల నుండి బీడీలు చుడుతున్నప్పటికీ వచ్చే కూలీ మాత్రం సరిపోవడం లేదని, ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న వెయ్యి రూపాయల భృతితో కొంత వరకు భరోసా కలిగిందని కామరెడ్డి జిల్లాకు చెందిన బీడీ కార్మికురాలు లక్ష్మి తెలిపింది. ఆసరా పింఛన్ కార్యక్రమం వలన తమకు అర్థికంగా కొంత వెసులుబాటుతో పాటు మానసిక భరోసా కలిగిందని పలువురు లబ్ధిదారులు అభిప్రాయ పడుతున్నారు. అయితే ఈ పథకం అమలులో లోపాలు పెద్దగా లేనప్పటికీ రూపకల్పనలో మాత్రం మౌలికంగా కొన్ని విషయాలను విస్మరిం చినట్టు కనిపిస్తుంది. ముఖ్యంగా గ్రామాల్లో, పట్టణాల్లో తమ వారెవరు లేకుండా వీధుల్లో తిరిగే మానసిక వికాలాంగులను ఈ పథకం పరిధిలోకి తీసుకుని రావాడానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకోలేదు. అయితే గ్రామాల్లో కుటుంబ సభ్యుల అండ లేకుండా ఉండే ఒంటరి మహిళలకు మాత్రం 2017 జూన్ నుంచి పింఛన్లు ఇస్తున్నారు. దీంతో పాటు కుటుంబంలో ఒక్కరికి మాత్రమే వృద్ధాప్య పెన్షన్‌ను ఇచ్చే విధానంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. భార్య భర్తల్లో ఒక్కరికి మాత్రమే పెన్షన్ ఇవ్వడం కన్నా దంపతుల్లో ఇద్దరికి పింఛన్ ఇస్తే బాగుండేదని కొంత మంది లబ్దిదారులు చెప్పారు. ఆసరా పథకంతో ప్రభుత్వం అనుకున్న ప్రాథమిక సామాజిక భద్రత లక్ష్యాన్ని చేరుకుందనే చెప్పవచ్చు. సమాజంలోని ప్రతి ఒక్క వర్గంలోని బలహీన వర్గాల్లోని వివిధ సెక్షన్లకు సామాజిక భద్రత కల్పించే దిశగా, సంక్షేమ రాజ్య మౌలిక లక్ష్యాలను అందుకునే సుదీర్ఘ ప్రయాణంలో ఈ పథకం ఖచ్చితంగా ఒక ముందడుగుగా భావించవచ్చు. ■

# అసంఘటిత రంగానికి సామాజిక భద్రత

– డాక్టర్ రుమా ఘోష్



**వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లోని ఉద్యోగుల్లో సుమారు 72 శాతం మంది ఎటువంటి సామాజిక భద్రతా ప్రయోజనానికి అర్హులు కాదు. మొత్తం కార్మికుల్లో కేవలం 7 శాతంగా ఉన్న సంఘటిత రంగంలోని కార్మికులు మాత్రమే సామాజిక భద్రతా కల్పించే వివిధ చట్టాల పరిధి లోకి వస్తున్నారు. మొత్తం కార్మిక లోకంలో – 472.9 మిలియన్లకుపైగా ఉన్న అసంఘటిత రంగంలోని కార్మికులకు ఉద్యోగ భద్రత, జీతాలు, పని పరిస్థితులు, సామాజిక భద్రత మరియు సంక్షేమం మొదలైన వాటిద్వారా సరైన కార్మిక రక్షణ పొందలేక పోతున్నారు.**

సమసమాజ నిర్మాణానికి సామాజిక భద్రత అనేది ఒక ముందస్తు అవసరం. సామాజిక భద్రత కలిగి ఉండడం అనేది ఒక ప్రాథమిక హక్కు. అందువల్ల, ఐక్యరాజ్యసమితి రూపొందించిన ''అంతర్జాతీయ హక్కుల ప్రతిపాదన''లోని 22 మరియు 25వ అధికరణలలోని – సామాజిక భద్రత అనేది ఒక మానవ హక్కు. వైద్య ప్రయోజనాలు, నిరుద్యోగ ప్రయోజనాలు, వృద్ధాప్యంలో ఆసరా, పని చేస్తుండగా గాయపడితే సహాయం, కుటుంబానికి ఆసరా, ప్రసూతి ప్రయోజనం, తన తర్వాత తనపై ఆధార పడిన వారి ప్రయోజనం వంటి తొమ్మిది ప్రయోజనాలతో కూడిన ముఖ్యమైన అంశాలలో కనీస ప్రమాణాలతో ప్రయోజనాలు కల్పించాలని – అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ. ఎల్. ఓ) 1952లో ఆమోదించిన 102వ సామాజిక భద్రత(కనీస ప్రమాణాలు) సదస్సు – కూడా – సూచించింది.

అంతర్జాతీయ కార్మిక సంస్థ వ్యవస్థాపక సభ్యురాలైన భారతదేశం – ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల ప్రతిపాదనలతో పాటు అంతర్జాతీయ కార్మిక సంస్థకు చెందిన పలు ప్రతిపానాలను కూడా ఆమోదించింది. వీటిలో చాలా భాగం – సామాజిక భద్రతకు నేరుగా సంబంధించినవి గానూ, అలాగే, ఇటీవల ప్రారంభించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను బలోపేతం చేసేవిగానూ ఉన్నాయి. దేశం ఎంతో స్థిరమైన సామాజిక భద్రతా విధానం కలిగి, పైన పేర్కొన్న తొమ్మిది ప్రయోజనాలలో చాలా వాటిని అమలు చేస్తోంది. ఒక నిర్ణీత పరిమాణం కంటే పెద్దగా ఉంటే – వాటి పరిమాణంతో ప్రమేయం లేకుండా ప్రయివేటు సంస్థలు లేదా ప్రభుత్వ రంగ సంస్థలతో సహా – సంఘటిత రంగంలోని – సాధారణ కార్మికులందరికీ ప్రయోజనం కల్పించాలని ప్రధానంగా వీటిని ఉద్దేశించారు. ఈ చర్యల వల్ల సంఘటిత రంగం లోని సాధారణ కార్మికులతో పాటు అసంఘటిత రంగంలోని కొన్ని సంస్థలకు కూడా కొంత వరకు ప్రయోజనాలు విస్తరించాయి. [1] అయితే, అసంఘటిత రంగంలోని అధిక భాగం – భారత ఆర్థిక వ్యవస్థలో కీలక భాగంగా ఉన్న, కార్మిక లోకంలోని దాదాపు 84 శాతం కార్మికులు సమగ్ర సామాజిక భద్రతా విధానం పరిధిలో లేరు .

**భారతదేశంలో అసంఘటిత రంగం:**

ఎన్.ఎస్.ఎస్.ఓ. 68వ విడత

ఫ్యాకల్టీ సభ్యులు, వి.వి. గిరి నేషనల్ లేబర్ ఇన్స్టిట్యూట్
E-mail: rumaghosh.vvgnli@gov.in

అంచనాల ప్రకారం సుమారు 84 శాతం కార్మికులు "అసంఘటిత" లేదా "అనధికార" రంగంలోనూ మరియు 90 శాతం మంది అనధికార ఉపాధి లోనూ (అధికార, అనధికార రంగాలు రెండూ కలిపి) ఉన్నారు. "అనధికార రంగం – భారతదేశంలో ఉపాధి పరిస్థితులు, 2011-12" పై-ఎన్.ఎస్.ఎస్. నివేదికల ప్రకారం – గ్రామీణ ప్రాంతాల్లో – స్వయం ఉపాధిలో ఉన్నవారిలో సుమారు 97 శాతం మంది, తాత్కాలిక కార్మికులలో 78 శాతం మంది, సాధారణంగా జీతం/ వేతనం తీసుకుంటున్నవారిలో 42 శాతం మంది మంది అనధికార రంగంలో పనిచేస్తున్నారు. అదే పట్టణ ప్రాంతాల్లో అయితే స్వయం ఉపాధిలో సుమారు 98 శాతం మంది, తాత్కాలిక కార్మికుల్లో 81 శాతం మంది, సాధారణంగా జీతం/ వేతనం తీసుకుంటున్న వారిలో 40 శాతం మంది అనధికార రంగంలో ఉన్నారు. అనధికార రంగంలోని కార్మికుల్లో దాదాపు 75 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనూ, 70 శాతం మంది పట్టణ ప్రాంతాల్లోనూ ఉన్న చిన్న చిన్న సంస్థల్లో పనిచేస్తున్నట్లు గణాంకాలు వెల్లడి స్తున్నాయి.

వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లోని సుమారు 79 శాతం మందికి ఉద్యోగానికి సంబంధించి లిఖితపూర్వక ఒప్పందాలు లేవు. వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్నారు. నిష్పత్తి చూస్తే – 60 శాతం మంది రోజువారీ కూలీలు కాగా 28 శాతం మంది సాధారణంగా జీతం/ వేతనం తీసుకుంటున్నవారు ఉన్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లోని ఉద్యోగుల్లో సుమారు 72 శాతం మంది ఎటువంటి సామాజిక భద్రతా ప్రయోజనానికి అర్హులు కాదు. నిష్పత్తి ప్రకారం చూస్తే 93 శాతం మంది తాత్కాలిక కార్మికులు, 56 శాతం మంది సాధారణ జీతం / వేతనం తీసుకుంటున్న ఉద్యోగులు ఉంటారు. [2] విస్తృతంగా నిర్వచిస్తే – ఒక అధికార రంగం యజమానితో ఒప్పందపూర్వక ఉద్యోగం లేకుండా, ఇంటిపనులలో కానీ, స్వయం ఉపాధితో కానీ లేదా రోజువారీ కూలీతో పనిచేసే వారిని అసంఘటిత రంగం కార్మికులు అంటారు.

సమాజంలో సాంఘికంగా, ఆర్థికంగా బలహీన వర్గాల వారిలో అత్యధిక శాతం మంది అనధికార ఆర్థిక వ్యవహారాల కార్యకలాపాలపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నారు. గత రెండు దశాబ్దాల కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ ఉన్నత స్థాయి పెరుగుదల – అనధికార వ్యవస్థ పెరుగుదలతోనే ముడిపడి నడిచింది. అధికార, అనధికార ఆర్థిక కార్యకలాపాల మధ్య అంతర్గత సంబంధాలు పెరుగుతున్నట్లు సూచనలు ఉన్నాయి. ఉత్పత్తిలో, ఉపాధిలో, ఆదాయంలో అనధికార ఆర్థిక వ్యవస్థ ఒక రకమైన నూతన ఉత్సాహంతో పనిచేస్తోంది. వేగవంతమైన, సమ్మిళిత అభివృద్ధికి – అనధికార ఆర్థిక వ్యవస్థ పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం. పెరుగుదలను నిలబెట్టు కోవడం అనేది అసంఘటిత ఆర్థిక వ్యవస్థలో నిమగ్నమైన వారి అవసరాలను మెరుగుపరచడం క్రెడిట్, వృత్తి నైపుణ్యాలు, సాంకేతికత, మార్కెటింగ్, మౌలిక సదుపాయాలూ మొదలైన రంగాల అవసరాలను తీర్చడం వంటి వాటితో ముడిపడి ఉంది. అంతేకాక, ఈ రంగంలోని అధిక భాగం కార్మికులకు ఏ విధమైన సామాజిక భద్రతా లేదు. అంటే – చందాతో కూడిన సామాజిక బీమా పథకం కానీ, పన్ను/ సెస్‌తో కూడిన సామాజిక భద్రతా ప్రయోజనాలు కానీ లేవు. గత శతాబ్ద కాలంలో – ప్రస్తుతం అమలులోఉన్న సామాజిక భద్రతా విధానాలకు ఇది ఒక భారీ సవాలు.

మొత్తం కార్మికుల్లో కేవలం 7 శాతంగా ఉన్న సంఘటిత రంగంలోని కార్మికులు మాత్రమే సామాజిక భద్రతా కల్పించే వివిధ చట్టాల పరిధి లోకి వస్తున్నారు. ఈ కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తున్న ప్రధాన చట్టాలు : ఉద్యోగుల రాజ్య బీమా చట్టం 1948, మరియు ఉద్యోగుల భవిష్య నిధి & ఇతర నిబంధనల చట్టం, 1952 మొదలైనవి. ఈ రెండు చట్టాలు కార్మికులకు వైద్య, ఆరోగ్య బీమా మరియు భవిష్య నిధి, పింఛను కల్పిస్తున్నాయి. మొత్తం కార్మిక లోకంలో – 472.9 మిలియన్లకు పైగా ఉన్న అసంఘటిత రంగంలోని కార్మికులకు – తాత్కాలిక మరియు కాలానుగుణమైన ఉపాధి, వివిధ ప్రదేశాల్లో పనిచేయడం, యజమాని-ఉద్యోగుల మధ్య సరైన సంబంధాలు లేకపోవడం, అసాధారణమైన మరియు తరచుగా ఎక్కువ పనిగంటలు పనిచేయడం, పరిమిత రుణ సదుపాయం, చట్టపరమైన రక్షణ, సామాజిక భద్రత, ప్రభుత్వ మద్దతు లేకపోవడం వంటి వివిధ కారణాల వల్ల ఉద్యోగ భద్రత, జీతాలు, పని పరిస్థితులు, సామాజిక భద్రత మరియు సంక్షేమం మొదలైన వాటిద్వారా సరైన కార్మిక రక్షణ పొందలేక పోతున్నారు.

అసంఘటిత రంగంలోని కార్మికులు – ముఖ్యంగా మూడు రకాలైన సామాజిక రక్షణలను అనుభవించలేకపోతున్నారని – సంఘటిత రంగంలోని సంస్థల జాతీయ కమీషన్ (ఎన్. సి. ఈ.యు.ఎస్) పేర్కొంది. అవి – ఉద్యోగ భద్రత (ఏక పక్షంగా తొలగించడం నుంచి రక్షణ లేదు), పని భద్రత (పని ప్రదేశంలో ప్రమాదాల నుంచి మరియు ఆరోగ్య సమస్యల నుంచి రక్షణ లేదు, సామాజిక భద్రత (ఆరోగ్య ప్రయోజ నాలు, పింఛను మరియు ప్రసూతి ప్రయోజ నాలు). [3] అసంఘటిత రంగానికి సామాజిక భద్రతను విస్తరించాలనే కుతూహ లంతో-పెరుగుతున్న జనాభాను, అసంఘ టిత రంగంలో తగ్గని కార్మికులు వంటి జనాభాకు సంబంధించిన అంశాలను

దృష్టిలో ఉంచుకుని – భారత ప్రభుత్వం 2008లో ఒక మైలు రాయి వంటి అసంఘటిత కార్మికుల సామాజిక భద్రతా చట్టాన్ని (యు.డబుల్యూ.ఎస్.ఎస్.ఏ) చేసింది. భారతదేశంలో అతి పెద్దగా ఉన్న అసంఘటిత రంగంలోని కార్మికులు – గౌరవ ప్రదమైన జీవితాలు గడిపే విధంగా – వారికి కనీస స్థాయి సామాజిక రక్షణ కల్పించడమే ఈ చట్టం యొక్క ప్రయోజనం. హక్కుల ప్రాతిపదికగా ఈ చట్టం ప్రశంసలు అందుకున్నప్పటికీ, అమలు యంత్రాంగంతో పాటు నిధుల కేటాయింపు మందకొడిగా వుంది. జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో సామాజిక మండళ్లను ఏర్పాటు చేయాలని కేవలం సలహాలు ఇచ్చే పాత్రను మాత్రమే పోషిస్తుంది.

**అసంఘటిత రంగానికి సామాజిక భద్రత:**

ప్రస్తుతం దేశ సామాజిక భద్రతా విధానం రెండు స్థాయిల్లో నిర్వహించబడు తోంది. మొదటి స్థాయిలో – ప్రాథమిక సామాజిక అభివృద్ధి కోసం – అక్షరాస్యతా మిషన్, పాఠశాల విద్య, ఆరోగ్య సేవలు, త్రాగు నీరు, పరిశుభ్రత, సాంకేతిక శిక్షణ వంటి సార్వత్రిక కార్యక్రమాలు మరియు పథకాలు ఉంటాయి. ఇక రెండవ స్థాయిలో వెనుకబడిన వర్గాల ప్రజలకు – వారు పని చేస్తున్న స్థాయితో సంబంధం లేకుండా – ఐ.సి.డి.ఎస్‌బీ పి.డి.ఎస్‌బీ ఎన్. ఎస్.ఏ.పిబీ ఎమ్.జి.ఎన్. ఆర్.ఈ.ఏ. వంటి సామాజిక / మానవ అభివృద్ధి పథకాల ద్వారా వారి ప్రోత్సాహక, రక్షిత అవసరాలు తీర్చడానికి వీలుగా – సామాజిక–ఆర్థిక భద్రత కల్పిస్తారు.

ఆరోగ్యం, ప్రమాదాలు, మృతి, వార్ధక్యం వంటి ఆకస్మిక సంఘటన లను అధిగమించడానికి చట్టపరమైన మద్దతుతో భారతదేశంలో అమలులో ఉన్న సామాజిక భద్రతా / సంక్షేమ కార్యక్రమాలు కేవలం ప్రభుత్వ/సంఘటిత రంగం లోని కార్మికులకు మాత్రమే అందుబాటులో వున్నాయి. అందువల్ల అసంఘటిత రంగంలోని కార్మికులను కూడా విపత్కర సమయం లో సామాజిక బీమా పరిధిలోకి తీసుకురా వలసిన అవసరం ఉంది. పేదవారి సంఖ్య క్రమంగా తగ్గుతున్న విషయం వాస్తవమైన ప్పటికీ, పేదవారిలో ఎక్కువ శాతం మంది అసంఘటిత రంగంలోనే పనిచేస్తున్నారు. ఇంతేకాక, సామాజిక రక్షణ లేకపోవడం వల్ల ఉత్పాదకత తగ్గుతోంది. అనారోగ్యం వల్ల కార్మికుల ఉత్పాదకత తగ్గిపోవడమే కాక, వైద్యం కోసం ఖర్చులు కూడా పెరగడంతో కార్మిక కుటుంబాలు రుణాల బారిన పడుతున్నాయ నేది మరో ముఖ్యమైన అంశం. [5] అందువల్ల అసంఘటిత రంగంలోని కార్మికులకు కనీస భద్రతా సౌకర్యాలు కల్పించకపోతే – సమ్మిళిత వృద్ధికి అర్థమే లేకుండా పోతుంది. అంతేకాక, దేశంలోని ప్రస్తుత సామాజిక భద్రతా పరిపాలనా వ్యవస్థ సవాళ్ళను ఎదుర్కొం టోంది. అవి (అ) అసంఖ్యాకమైన విధానాలు, పథకాలు, సంస్థలు, (ఆ) సరిగా చేరుకోలేక పోవడం, (ఇ) సరిపోని ప్రయోజనాలు, (ఈ) బహు ముఖంగా విడిపోవడం, (ఉ) అమలు (మరియు ఎంపిక)లో నాణ్యత లేకపోవడం, (ఊ) అధిక వ్యయం, మరియు (ఎ) పెద్ద వర్గాలను ముఖ్యంగా అసంఘటిత రంగ కార్మికులను మినహాయించడం.

ఈ విషయాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని – కార్మికులపై ఏర్పాటైన 2వ జాతీయ కమీషన్ సిఫార్సులకు అనుగుణంగా – కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ – సామాజిక భద్రత కోసం రూపొందించిన కేంద్ర కార్మిక చట్టాలను సరళీకరించి, సమ్మిళితం చేసి, హేతుబద్ధం చేయడానికి చర్యలు చేపట్టి, వాటిని – సామాజిక భద్రతకు సంబంధించి ప్రస్తుతం ఉన్న కార్మిక చట్టాలను అన్నింటినీ క్రోడీకరించడం ద్వారా సామాజిక భద్రత, సంక్షేమం కోసం రూపొందించిన ఒక విధానం తో భర్తీ చేయనుంది. (ఈ పీ ఎఫ్ చట్టం, ఈ ఎస్ ఐ చట్టం, ప్రసూతి ప్రయోజనాల చట్టం, గ్రాట్యుటీ చెల్లింపు చట్టం, ఉద్యోగుల నష్ట పరిహార చట్టం, అసంఘటిత రంగ సామాజిక భద్రతా చట్టం, మరియు వివిధ సంక్షేమ పన్ను/నిధుల చట్టంతో సహా మొత్తం 15 కార్మిక చట్టాలు).

త్రైపాక్షిక ప్రాతినిధ్యంతో – ఈ విధానం – ఒక మూడంచెల సామాజిక భద్రతా పరిపాలనా నిర్మాణాన్ని ప్రతిపాదించింది – (అ) ప్రధానమంత్రి అధ్యక్షతన కేంద్ర సామాజిక భద్రతా మండలి (ఆ) కేంద్ర ప్రభుత్వ స్థాయిలో సామాజిక భద్రతా కేంద్ర మండలి మరియు (ఇ) సామాజిక భద్రతా విధానాన్ని అమలు చేయడం కోసం రాష్ట్రాలు / కేంద్ర పాలిత ప్రాంతాల స్థాయిలో రాష్ట్ర సామాజిక భద్రతా మండళ్లు. ఇక నాల్గవ దశ కింద – స్థానిక సంస్థలు (పంచాయితీలు, పట్టణ స్థానికు సంస్థ)లకు నమోదు మరియు సౌకర్యాల కల్పన విధులను అప్పగించారు. ఈ విధానంలో కార్మికులందరికీ (తప్పనిసరి నమోదు) ఒక విశిష్ట ఆధార్ తరహా నమోదు విధానం ఉంటుంది అలాగే సంచార సామాజిక భద్రతా ఖాతా ఉంటుంది. అంటే – నమోదులో భాగంగా కార్మికులందరికీ ప్రారంభించే విశ్వకర్మ కార్మిక సురక్షా ఖాతా (వికాస్)ను ఆధార్ సంఖ్య తో అనుసంధానం చేస్తారు. కార్మికులు ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వలస వెళ్ళినప్పుడు – ఇది చందా జమ చేయడానికి, ప్రయోజనాలు పొందడానికి ఎంతో ఉపయోగ పడుతుంది. ఈ కొత్త సామాజిక భద్రతా విధానం దేశ పౌరులకు అందిస్తున్న ఒక సౌహార్ద్ర చర్య లేదా సౌకర్యమే కాక – దేశంలోని కార్మికు లందరి హక్కుగా ఉంటుంది.

■

# పేదల సాధికారతే పథకాల లక్ష్యం

– ఉర్మి గోస్వామి



**నయీ మంజిల్ పథకాన్ని విద్య, నైపుణ్యాభివృద్ధి, మధ్యలో బడి మానివేసిన వారి కోసం ప్రవేశపెట్టారు. ఉస్తాద్ పథకం సంప్రదాయ కళలు, వృత్తులలో శిక్షణ ఇచ్చేందుకు ఉద్దేశించింది. ఇవన్నీ కూడా మైనార్టీ వర్గాల ఉన్నతి కోసమే. 2016–17 కేంద్ర బడ్జెట్‌లో నయీ మంజిల్ పథకం కోసం 175 కోట్లు, ఉస్తాద్ కోసం 22 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించింది. మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వశాఖ కోటి 82 లక్షల మంది విద్యార్థులకు 4,740 కోట్ల రూపాయలు అందజేసింది. వీటిలో ఉపకార వేతనాలు 166 కోట్ల రూపాయలు 1,38,426 మంది విద్యార్థినులకు**

అలలు పెరిగితేనే పడవలు కదులుతాయి. జాన్ ఎఫ్. కెనెడి నానుడిగా ఇది స్థిరపడింది. ప్రస్తుతం భారతదేశంలో పరిస్థితి అలాగే వుంది. సమాజంలో పేద వర్గాల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ చర్యలు తీసుకుంటోంది. ఆర్థిక భద్రత, సామాజిక సంక్షేమం పడుగు పేకల వంటివి. సంప్రదాయకంగా ఈ పథకాలను నిర్దేశిత వర్గాల కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. సమాజంలో వెనుకబడిన వర్గాలు, దేశంలో వెనుకబడిన ప్రాంతాల ఉన్నతి కోసం ఈ పథకాలను అమలుజేస్తోంది. అయితే, వీటివల్ల ఆశించిన ప్రయోజనాలు ఒనగూరడం లేదు. అందుకే అలలు పెరిగేట్టు చూడాలి. అంటే సంక్షేమ చర్యలు పెరగాలి. ఆయా వర్గాలకు వాటి ఫలితాలు అందేట్టు చూడాలి. వారి జీవన పరిస్థితులు మెరుగయ్యేట్టు చూడాలి. విద్య, ఆరోగ్య, రక్షణ, నైపుణ్యం మొదలైనవి ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు ఎంతో ఉపయోగపడతాయి. ముఖ్యంగా బలహీనవర్గాల ఉన్నతికి ఇవి ఎంతో ఉపకరిస్తాయి. అయితే, మతాలు, కులాల ప్రాతిపదికగా అందరికీ ఇలాంటి అవకాశాలు కల్పించడం సాధ్యమా? అది వివేకమా? అధికారంలో ఉన్న ప్రభుత్వాలు దేశంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని స్థితిగతులను దృష్టిలో ఉంచుకోవాలి. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా దారిద్ర్య నిర్మూలన పై ప్రభుత్వాలు దృష్టిని కేంద్రీకరించాలి. ప్రభుత్వం చేపట్టే సాంఘిక భద్రత, సంక్షేమ కార్యక్రమాలన్నింటికి ఇదే ప్రధాన సూత్రం. అదే సమయంలో మరికొన్ని వర్గాలు, కులాల ఆర్థిక పరిస్థితులను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. ఇందుకోసం ప్రభుత్వం అదనంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రత్యేకించి కొన్ని కులాల, సామాజిక వర్గాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించే పథకాలు, కార్యక్రమాలు ఆయా వర్గాల స్థితిగతులను మెరుగుపరిచేట్టు చూడాలి.

నిర్దేశిత వర్గాలకు ఉద్దేశించినవైనా, సాధారణంగా అందరికీ వర్తించేవి అయినా, ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనాన్ని రూపుమాపాలి. అయితే, మైనార్టీలు, దళితులు, గిరిజనుల కోసం ప్రభుత్వం అమలుజేస్తున్న సంక్షేమ చర్యలను మదింపు చేయవలసి ఉంది. అలా చేయకపోతే వాటి ఫలితాలు అంతంత మాత్రంగానే ఉంటాయి.

సమాజంలో మహిళల స్థితిగుతులను మెరుగుపరిచేందుకు వారికి విద్యా సౌకర్యాలు

అసిస్టెంట్ ఎడిటర్, ఎకనమిక్ టైమ్స్
E-mail: urmi.goswami@gmail.com

కల్పించడం మొదటి చర్య కావాలని ఈశ్వర చంద్ర విద్యాసాగర్, వివేకానంద వంటి సంస్కర్తలు ప్రబోధించారు. మహిళల అభ్యున్నతి కోసం ఇటీవల కాలంలో ప్రభుత్వాలు ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నాయి. ఉదాహరణకు సూక్ష్మ రుణాలు - మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో దోహదం చేస్తున్నాయి. సూక్ష్మ రుణాలు గ్రామీణ ప్రాంతాలలో మహిళల స్థితిగతులను మార్చివేశాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఉజ్వల' పథకాన్ని ఈ కోణం నుంచే అర్థం చేసుకోవలసి ఉంది. ఈ పథకం సమాజంలో ఏ ఒక్క కులానికో, మతానికో నిర్దేశించింది కాదు. నిరుపేదలు, దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న వారందరి కోసం ప్రవేశపెట్టింది. ప్రభుత్వానికి అందిన సంఖ్యా వివరాలను బట్టి గత ఏప్రిల్ 3వ తేదీ నాటికి 2 కోట్ల మంది లబ్ధిదారులకు దీనివల్ల ప్రయోజనం చేకూరింది. వీరిలో అధిక సంఖ్యాకులు షెడ్యూల్డు కులాలు, తెగలు, మైనార్టీ వర్గాలకు చెందిన వారే. గత సంవత్సరం ప్రధాని నరేంద్ర మోదీ ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద దారిద్ర్య రేఖకు దిగువున వున్న కుటుంబాలకు చెందిన మహిళలకు 5 కోట్ల వంట గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. అంతకుముందు వీరంతా కలప, పిడకలతో వంట చేసుకునేవారు. పొగ, మసి వారి ఆరోగ్యాన్ని దెబ్బతీసేవి. పుల్ల, పుడకను కాల్చితే వచ్చే పొగ 400 సిగరెట్ల పొగతో సమానమని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ కుటుంబాలకు చెందిన మహిళల ఆరోగ్య సమస్యలను తీర్చడానికి, వారి ఆర్థికాభివృద్ధికి ఒకే ఒక్క చర్యతో సాధ్యమైన పథకం. దీంతో ఈ కుటుంబాలకు చెందిన పిల్లలు మంచి వాతావరణంలో పెరుగుతున్నారు. వారి విద్యాబుద్ధులకు అవసరమైన వాతావరణం నెలకొంటోంది. రోగాల బారిన పడి వైద్యుల చుట్టూ తిరగడం, వైద్యుల కోసం అదనపు వ్యయాలను భరించవలసి రావడం వంటి బెడద తప్పింది. నిజంగా ఇది గొప్ప విజయం. కుటుంబంలో ఆరోగ్యకరమైన వాతావరణం పిల్లల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దారిద్ర్యాన్ని నిర్మూలించేందుకు ఇది దోహదం చేస్తుంది. అయితే, ఇది ఆరంభం మాత్రమే.

"జన్‌ధన్ యోజన" పథకం తీసుకోండి. ఇది కూడా ఏ ఒక్క వర్గానికో, కుల, మతాలకో పరిమితమైనది కాదు. బ్యాంకింగ్ వ్యవహారాలకు దూరంగా ఉన్న వారందరి కోసం. బ్యాంకుల్లో డబ్బు దాచుకోవడం, డబ్బు చెల్లించడం, బీమా, పెన్షన్ మొదలైన కార్యకలాపాలన్నింటిలో ఈ వర్గాలకు ప్రమేయం కల్పించడం. ఈ పథకం నిరుపేద వర్గాలు జీరో బ్యాలెన్స్ ఖాతాలను బ్యాంకుల్లో తెరిచేందుకు దోహదం చేస్తోంది. క్రెడిట్, డెబిట్ కార్డులు పొందేందుకు తోడ్పడుతోంది. ఇది ఎంతో మార్పునకు నాంది పలికింది. ముఖ్యంగా ఉపకార వేతనాలు, పెన్షన్లు, సబ్సిడీలు నేరుగా లబ్ధిదారులకు అందించేందుకు ఈ పథకం దోహదం చేస్తుంది. దళారుల నుంచి విముక్తి కలిగించడమే కాకుండా, సామాజికంగా దీని ప్రభావం ఎంతో ఉంది. ఆయా వర్గాలకు సాంఘిక, ఆర్థికపరమైన సుస్థిరత్వాన్ని కలిగిస్తోంది. నిర్దేశిత వర్గాల కోసం ప్రవేశపెట్టిన సాంఘిక సంక్షేమ పథకాలను సక్రమంగా, సజావుగా అమలుచేసేందుకు తోడ్పడుతోంది. సాంఘికపరమైన అడ్డంకులు దాటుకుని ఆయా వర్గాలు స్వశక్తిపై ఆధారపడేందుకు అనువైన పరిస్థితులను కల్పిస్తోంది. మైనార్టీల విద్య, ఉపాధి, సాధికారత లక్ష్యంగా ఈ పథకాలను ప్రభుత్వం రూపొందిస్తోంది. ప్రభుత్వం ఇటీవల రెండు కొత్త పథకాలను ప్రవేశపెట్టింది. 'నయీ మంజిల్', 'ఉస్తాద్' (కళలు, వృత్తి పనులలో శిక్షణ, నైపుణ్యం పెంచే కార్యక్రమాలు). ఈ రెండు పథకాలను 2014-15, 2015-16 ఆర్థిక సంవత్సరాలలో ప్రవేశపెట్టడం జరిగింది.

నయీ మంజిల్ పథకాన్ని విద్య, నైపుణ్యాభివృద్ధి, మధ్యలో బడి మానివేసిన వారి కోసం ప్రవేశపెట్టారు. ఉస్తాద్ పథకం సంప్రదాయ కళలు, వృత్తులలో శిక్షణ ఇచ్చేందుకు ఉద్దేశించింది. ఇవన్నీ కూడా మైనార్టీ వర్గాల ఉన్నతి కోసమే. 2016-17 కేంద్ర బడ్జెట్‌లో నయీ మంజిల్ పథకం కోసం 175 కోట్లు, ఉస్తాద్ కోసం 22 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించింది. ఇవి విద్య, అభివృద్ధి, ఉపాధికి దోహదం చేసేవే. మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వశాఖ కోటి 82 లక్షల మంది విద్యార్థులకు 4,740 కోట్ల రూపాయలు అందజేసింది. వీటిలో ఉపకార వేతనాలు 166 కోట్ల రూపాయలు 1,38,426 మంది విద్యార్థినులకు అందజేసింది. "బేగం హజరత్ మహల్" ఉపకార వేతనాలుగా వీటిని అందజేయడం జరిగింది. 5,20,000 మంది యువతకు ఉపాధి నిచ్చే శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. వీరిలో 40 శాతం మంది మహిళలు ఉన్నారు. 33 డిగ్రీ కళాశాలలు, 223 బహుళార్థ సద్భావ మండపాలు, 18 గురుకుల తరహా రెసిడెన్షియల్ పాఠశాలలను గడిచిన 6 సంవత్సరాలలో ఏర్పాటుచేయడం జరిగింది.


విద్యా ప్రచారం కోసం "తహ్రీక్-ఎ-తాలీమ్'', చేతి వృత్తులవారి ఉత్పత్తుల మార్కెటింగ్‌కి ''హునర్ హాట్'' వంటి పథకాలను అన్ని రాష్ట్రాలలో అమలుచేయడం జరుగుతోంది. అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలు ఐదింటిని ఏర్పాటుచేయడం జరుగుతోంది. అన్ని రాష్ట్రాలలో ''ఉస్తాద్ సమ్మాన్ సమాగమం"ను నిర్వహిస్తున్నారు.

మైనార్టీలు అధికంగా ఉండే ప్రాంతాలలో 100 గురుకుల నవోదయ తరహా పాఠశాలలను నెలకొల్పడం జరిగింది. ఈ పథకాలన్నీ లబ్దిదారులకు విద్య, ఉపాధి కల్పిండానికి ఉద్దేశించినవే. ఇది

*తరువాయి 70వ పేజీలో...*

# కార్పొరేట్ సామాజిక బాధ్యత - అట్టడుగు వర్గాల సాధికారత

**- జతీందర్ సింగ్**



కార్పొరేట్ సామాజిక బాధ్యత

**వ్యాపారస్తులు మరియు మేధావులు కేవలం తమ వ్యాపార విజ్ఞానాభివృద్ధికి చెందిన అంశాలకే కాక మానవాభివృద్ధికి కూడా ప్రాముఖ్యత ఇవ్వాలి. తద్వారా వారి వ్యాపారం కూడా వృద్ధి చెందుతుంది. కార్పొర్ట్ కంపెనీలు తమ వ్యాపార లక్ష్యాలతో పాటు, సామాజిక బాధ్యత లక్ష్యాలను కలిపి అమలుచేయడం తమ ఎజెండాలో భాగం చేయాలి. ఈ కార్పొరేట్ సామాజిక బాధ్యత అన్నది నిర్భంధ విధానంకాదు. ఇది ఒక స్వచ్ఛంధ బాధ్యతగా సమాజంలో అట్టడగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసేందుకు ఉప కరించేది.**

కార్పొరేట్ సామాజిక బాధ్యత ద్వారా ఆయా సంస్థలు సామాజిక అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రజలకు, సమాజానికి లబ్ధిచేకూరే పథకాలను చేపట్టి తమవంతు బాధ్యతను నిర్వహిస్తున్నాయి. ఈ ప్రయోజనాలను అందించేందుకు ప్రపంచంలోని పలుదేశాల లోని సంస్థలు పనిచేస్తుండగా, ప్రస్తుతం భారతదేశంలో కూడా ఈ ఒరవడే ప్రారంభ మైంది. ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాలశాఖ ద్వారా 2009లో వెలువడిన నిబంధనల ద్వారానే కంపెనీ చట్టం 2013 రూపొందించ బడింది. ఈ కంపెనీ చట్టం 2013 సెక్షన్ 135(1)లో కార్పొరేట్ సామాజిక బాధ్యత నిర్వహించే కంపెనీలు లేదా సంస్థలు పరిధిని విశ్లేషించడం జరిగినది. ఈ చట్టానికి లోబడి క్రింద పేర్కొన్న విధానం కలిగిన కంపెనీలు/ సంస్థలు తప్పక సామాజిక బాధ్యతను నిర్వర్తించాలి.

అవి

1. ఆదాయ వనరులు 500 కోట్లు లేదా ఎక్కువగా కలిగిన కంపెనీలు.
2. సంవత్సరానికి 1000 కోట్లు, అంతకు మించి టర్నోవర్ కలిగిన కంపెనీలు.
3. సంవత్సరానికి 5 కోట్లు కదా అంతకన్న ఎక్కువ లాభలను ఆర్జించే కంపెనీలు.

భారతదేశంలో సుమారుగా 8000 వేల కంపెనీలు ఈ నిబంధనల పరిధిలోకి వస్తు న్నాయి. కాబట్టి ఈ కంపెనీలన్నీ కార్పొరేట్ సామాజకి బాధ్యత చట్టం పరిధిలో వున్నాయి. ఈ చట్టం ప్రకారం ప్రతి కంపెనీ లేదా సంస్థ తన ఆదాయం నుండి కనీసం రెండు శాతాన్ని మూడు సంవత్సరాలకు ఈ సామాజిక బాధ్యత కింద ఖర్చుచేయాలి. అనగా ఈ కంపెనీలన్ని తన వంతు ఆదాయన్ని ఇచ్చి నట్లయితే సుమారు 10,000 - 12,000 కోట్లు రూపాయలు ఒనగూడుతాయి. తద్వారా స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల కనిపి స్తుంది. లాభార్జన పెరిగినకొలదీ కార్పొరేట్ సామాజిక బాధ్యత ఆదాయం పెరిగి అభివృద్ధి జరుగుతుంది. సెక్షన్ 135 ప్రకారం ప్రతి సంస్థ లేదా కంపెనీ సామాజిక బాధ్యత క్రింద ముగ్గురు లేదా అంతకన్న ఎక్కువ మంది డైరెక్టర్స్‌తో ఒక కమిటీని ఏర్పాటుచేయాలి. ఇందులో ఒకరు ఖచ్చితంగా కంపెనీకి చెందని స్వతంత్ర్య వ్యక్తి వుండాలి. షెడ్యూల్ VIIలో పొందపరిచిన అంశాలపై ఈ కమిటీ నిర్ణయాలు తీసుకుం టుంది. స్వంతసంస్థ ద్వారా కాని, ట్రస్టుల ద్వారా కాని లేదా ఇతర సామాజిక సంస్థలతో కలిసి కాని ఈ కమిటీ సామాజిక బాధ్యతలోని అంశాలను పూర్తి చేయాలి.

సీనియర్ సెక్రటరి, పంజాబ్, హర్యానా, ఢిల్లీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, న్యూఢిల్లీ.
E-mail: jatinder@phdcci.in

ఈ కార్పొరేట్ సామాజిక బాధ్యత అన్నది నిర్భంధ విధానంకాదు. ఇది ఒక స్వచ్ఛంధ బాధ్యతగా సమాజంలో అట్టడగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసేందుకు ఉప కరించేది. కార్పొరేట్ సామాజిక బాధ్యత – సాధికారత అంటే అట్టడుగు వర్గాల సాధికారత ద్వారా వారిని సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి పరిచి తరువాత వారి నైపుణ్యాలను మెరుగుపరుస్తూ తద్వారా వారి జీవన ప్రమాణాలను పెంచడం. ఐతే ఇది ఒక్క ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. కంపెనీలు కూడా ఇందులో పాలుపంచు కోవడం ద్వారా తాము సామాజికాభివృద్ధిలో ప్రముఖపాత్ర వహించవచ్చు. వ్యాపారం ఒక ప్రదేశానికి సంబంధించిన అంశం. అక్కడ వున్న సమస్యలు లోటుపాట్లు అక్కడి వ్యక్తులకే అర్థం అవుతాయి. ఈ సామాజిక బాధ్యత చట్టం ద్వారా వారు వీటిని పరిష్కరించగలు గుతారు. భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశం పరాయి పాలన నుండి విముక్తిపొంది, అట్టడగు వర్గాలను, అణగారిన వర్గాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కొంత సమయం పడుతుంది. అందుకే భారత ప్రభుత్వం "అందరితో కలిసి అందరి వికాసానికి" అనే స్లోగన్‌తో ప్రభుత్వ మరియు ప్రభుత్వతర సంస్థలను ఒకటిచేసి ఈ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేలా చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల అభివృద్ధికి అందించే ఆదాయ వనరులు సరిపడినంతగా లేవు. పలురకాల స్కీముల ద్వారా అణగారిన వర్గాలను పైకి తేవాలని ప్రభుత్వాలు తపిస్తు న్నాయి. కాని సరిపడినంతగా ఆదాయం లేకపోవడం, సరియైన వ్యక్తులకు ఈ పథకాలు అందకపోవడం అన్నదే సమస్య! కాబట్టి ఈ లక్ష్యాలను ప్రాధాన్య క్రమంలో అమలుకు ప్రభుత్వేతర సంస్థల భాగస్వామ్యం అవసరం. మరీ ముఖ్యంగా విద్య, ఆహారం, మరియు ఆరోగ్య రంగాలలో ఆర్థిక సహకారం ఎక్కువగా అవసరం. ఐక్యరాజ్య సమితి ద్వారా విడుదల చేయబడిన మానవ వనరుల రిపోర్టులో మొత్తం 188 దేశాలకు గాను, భారతదేశం 131వ స్థానంలో వుంది. మానవాభివృద్ధిని నిర్వహించేదే మానవ వనరుల సూచి. ఇది కేవలం ఆర్థికాభివృద్ధినే కాక, విభిన్న రంగాలలో 360 డిగ్రీల అభివృద్ధిని సూచిస్తుంది. భారత ప్రభుత్వం కూడా మేక్-ఇన్-ఇండియా, స్టార్టప్ - ఇండియా, నైపుణ్యభారతం మరియు డిజిటల్ ఇండియా లాంటి పథకాలతో నైపుణ్యం, అక్షరాస్యత, మరియు ఉద్యోగ కల్పనకు కృషి చేస్తున్నది.

## కార్పొరేట్ సామాజిక బాధ్యతలో కారొరేట్ కంపెనీల పాత్ర

ప్రజల జీవన ప్రమాణాల పెంపుదల కోసం కార్పొరేట్ కంపెనీలు కూడా సంఘాల ఏర్పాటు చేస్తున్నాయి. కొత్త సంఘాలతో కలిసి అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి రూపొందించిన 17 స్థిరమైన, అభివృద్ధి లక్ష్యాలను 2015 నుండి కార్పొరేట్ కంపెనీలు కూడా తమలక్ష్యాలుగా చేసుకు న్నాయి. ప్రభుత్వంతో కలిసి అభివృద్ధి కార్య క్రమాలను నిర్వహిస్తే అవి అణగారిన వర్గాలను చేరుతాయని అర్థం చేసుకున్నాయి. కొన్ని సంవత్సరాల క్రితం వరకు భారతదేశంలో విద్యాభివృద్ధి ఒక్కటే ప్రధాన అంశంగా వుండేది కాని ఇప్పుడు పరిస్థితులు మారాయి. నైపుణ్యాల పెంపుదల మరియు ఆర్థిక వనరుల పెంపుదల ముఖ్య విధానాలుగా మారింది. విద్యార్జనలో కేవలం చదవడం, రాయడమే కాక నైపుణ్యాన్ని ఆర్జించడం కూడా అవసరంగా మారింది. అట్టడగు స్థాయి నైపుణ్యాల పెంపుదల అన్నది అట్టడగు స్థాయి వ్యాపార పెంపుదలకు దోహదం చేస్తుంది. ప్రపంచ ఆర్థిక ఫోరం 2016లో ప్రపంచ ప్రమాదావగాహన సర్వేలో రెండు అంశాలు అభివృద్ధికి అటంకంగా వున్నాయి. అవి (1) సామాజిక అసమానతలు (2) విస్తరిస్తున్న నిరుద్యోగత మరియు ప్రచ్ఛన్న నిరుద్యోగితలు ఈ రంగాలపై అవగాహన జ్ఞానం అన్నది నాయకులకు వుపయోగిస్తుంది. తద్వారా వారు తగిన ప్రణాళికలను అమలు చేయగలుగుతారు. భారత పారిశ్రామిక వేత్తలకు ఈ విషయంలపై అవగాహన వుండడంతో వారు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత వనరులను ఈ విషయాలపైన ఖర్చు చేస్తున్నారు.

## కార్పొరేట్ సామాజిక బాధ్యత

## అట్టడుగు స్థాయి దివ్యాంగులలో జీవనోపాధి అవకాశం పెంపుదల :

దివ్యాంగులలో అద్భుతమైన ప్రత్యేక మైన నైపుణ్యాలు నిగూఢంగా ఉంటాయి. వారు, మనం ఊహించిన దానికన్నా కూడా ఎక్కువ నిపుణతలో పనిచేయగలరు. అందుకే వారిని దివ్యాంగులు అనాలి అన్నారు. మన భారత ప్రధాని నరేంద్ర మోదీ. ప్రపంచంలో అత్యధిక దివ్యాంగులు కలిగిన దేశాలలో భారతదేశం కూడా ఒకటి. 2011 జనభా లెక్కల ప్రకారం 2.21 శాతం దివ్యాంగులు (మొత్తం జనభాలో) వున్నారు. వీరిలో అధికశాతం గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. దివ్యాంగులు సామాజిక ఆర్థిక అంశాలలో వివక్షతను ఎదుర్కొంటు న్నారు. అంతేకాక విద్య, నైపుణ్యం లాంటి అంశాలలో వెనుకబడి వున్నారు. కొంత కాలం క్రితం వరకు దివ్యాంగులను కొన్ని రకాల ఉద్యోగాలలో మాత్రమే చేర్పించేవారు. కాని కార్పొరేట్ సామాజిక బాధ్యతలోకి కంపెనీలు ప్రవేశించి దివ్యాంగులపై వాత్సల్యాన్ని చూపిస్తున్నారు. అడ్డంకులను అధిగమించే దివ్యాంగుల కోసం విద్య, వృత్తి విద్య, ఉద్యోగాలను కూడా అందిస్తూ చేయూత నిస్తున్నారు.

## స్వయం సహాయక బృందాలు - సూక్ష్మరుణాలు

గ్రామీణ ప్రాంతాలలో వున్న వనరుల వినియోగం, జీవనోపాధితో ఇక్కడి ప్రజల వలసలను ఆపేందుకు కృషి జరుగుతున్నది. అందుకోసం ఏర్పాటు చేసినవే స్వయం సహాయక బృందాలు. అవసరాలకు ఆదుకునే సూక్ష్మరుణాల ఏర్పాట్లు, కార్పొరేట్ సామాజిక బాధ్యత ద్వారా స్వయం సహాయక బృందాలు తయారుచేసే వస్తువులకు మార్కెట్ సౌకర్యం కల్పించడం, వస్తు తయారీకి రుణాలు ఇప్పించడం వంటివి చేస్తున్నారు. ఈ-కామర్స్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా వుస్తువులను అమ్మేలాగ చర్యలు తీసుకుంటు న్నారు. స్వయం సహాయక బృందాల నైపుణ్యాభివృద్ధికి, వినియోగానికి తగిన సహాయాన్ని ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు.

## జనాభాలో వయోవృద్ధులు

భారతదేశ జనాభాలో యువ జనాభాతో పాటు నేటికాలంలో వయోవృద్ధుల జనాభా కూడా పెరుగుతున్నది. ప్రతి సంవత్సరం 3.8 శాతం వయోవృద్ధుల పెరుగుదల నమోదవు తున్నది. నేడు మొత్తం జనాభాలో వీరు 8 శాతంగా వున్నారు. 2050 సంవత్సరానికి సుమారు 240 మిలియన్లుగా వీరి జనాభా వుంటుందని అంచనా. మానసిక, శారీరక అనారోగ్యాలతోపాటు వీరి ఆదాయ వనరులు కూడ తగ్గడం గమనించవచ్చు. పౌర అవసరాలలో కోత, తగ్గిన ఆరోగ్య సౌకర్యాలు, గృహలేమి లాంటి ఇబ్బందులు వీరిని మరింత నిస్తేజం చేస్తున్నాయి. వయో వృద్ధులకు అవసరమైన వృద్ధాశ్రమాలు, ఆరోగ్య వసతుల కల్పన లాంటి కార్యక్రమాలు సామాజిక బాధ్యతలో భాగం కావాలి. షెడ్యూలు VIIలో ఈ విషయాలు బాధ్యత ప్రభుత్వంతో పాటు కంపెనీలది కూడా అని పొందుపరిచారు.

## మురికివాడల అభివృద్ధి

పట్టణాలలో విద్య, ఉపాధి, ఉద్యోగ, గృహరంగాలలో అభివృద్ధి మురికివాడలు తయారయేందుకు దోహదం చేశాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 93 మిలియన్ ప్రజలు నగరాలలోని మురికివాడలలో నివసిస్తున్నారు. ఈ మురికివాడల అభివృద్ధి కూడా సామాజిక బాధ్యలో భాగం అయ్యి ప్రభుత్వంలో కలిసి పట్టణాలను మురికివాడల రహితంగా మార్చేందుకు కృషి జరుగుతుంది. ''స్మార్ట్ సిటీ''లు చేసే కంటే ముందే నగరాలను ఈ మురికివాడల రహిత నగరాలుగా మార్చాలి సుస్థిర ఆర్థికవృద్ధి, అవకాశాల కల్పన, ఉద్యోగ కల్పన లాంటివి ఈ మురికి వాడలలో ప్రవేశపెట్టినపుడే నగరాలు / పట్టణాలు మురికివాడల రహిత సామాజిక బాధ్యత లక్ష్యం మురికివాడల అభివృద్ధిగా మారితే తద్వారా పారిశ్రామిక వృద్ధి సాధ్య పడుతుంది.

## ముగింపు

వ్యాపారస్తులు మరియు మేధావులు కేవలం తమ వ్యాపార విజ్ఞానాభివృద్ధికి చెందిన అంశాలకే కాక మానవాభివృద్ధికి కూడా ప్రాముఖ్యత ఇవ్వాలి. తద్వారా వారి వ్యాపారం కూడా వృద్ధి చెందుతుంది. కార్పొరేట్ కంపెనీలు తమ వ్యాపార లక్ష్యాలతో పాటు, సామాజిక బాధ్యత లక్ష్యాలను కలిపి అమలుచేయడం తమ ఎజెండాలో భాగం చేయాలి. సుమారు 10,000 - 12,000 కోట్లు రూపాయలు, సామాజిత బాధ్యత కార్పొరేట్ ఆదాయం అన్నది భారత ప్రభుత్వం సామాజిక అభివృద్ధి కోసం ఖర్చుచేసే ఆదాయం కన్నా అతి తక్కువ అని చెప్పవచ్చు. కార్పొరేట్ సామాజిక బాధ్యత ప్రాజెక్ట్‌కోసం అనుకూలమైన, కొలవలేని, వాడదగిన ఆర్థిక జనాభా కావాలి. రోడ్లు మరియు అభివృద్ధి కోసం ఈ ప్రాజెక్ట్ లోని కొంత ఆదాయాన్ని కేటాయించాలి. సామాజిక వ్యవస్థలో నిర్దిష్ట అంశాలు కొంత అవరోధాన్ని కలిగిస్తున్నాయి. ఈ విషయాలు ప్రభుత్వేతర సంస్థలను, వాటి సుస్థిరతను అటంకపరుస్తున్నాయి. "కార్పొరేట్ సాంఘిక ఆవిష్కరణలతో పాటు," కార్పొరేట్ సామాజిక బాధ్యత కూడా కలిసి సుస్థిర అభివృద్ధికి పాటుపడాలి. విలువలతో కూడిన సృజనాత్మక నమూనాలు సాంఘిక అట్టడుగుస్థాయి అభివృద్ధిని నిలబెడతాయి. కార్పొరేట్ కంపెనీలకు వచ్చిన ఆదాయవనరులు, సామాజిక అభివృద్ధికి వినియోగపడాలి. దీనికోసం అనంతంగా విస్తరించి వున్న వనరులను వినియోగించి సృజనాత్మకమైన నైపుణ్యం కల సామాజిక/సాంఘిక అభివృద్ధిని సాధించాలి. ఏ దేశ అభివృద్ధి అయిన పర్యావరణ వినియోగం. వృద్ధి, ఆరోగ్య సృజనాత్మక జీవనం, అభివృద్ధిపై ఆధారపడి వుంటుంది. సుస్థిర కార్పొరేట్ సామాజిక బాధ్యత ప్రాజెక్ట్ ద్వారా అట్టడుగు స్థాయిలో వున్న మైనారిటీలు, దళితులను, ఆదివాసులను, మహిళలను మరియు అసంఘటిత కార్మికులను ఏకం చేసి సామాజిక అభివృద్ధిలో భాగస్వామ్యులను చేయవచ్చు. ■


**ఏజెంట్లు కావలెను**

యోజన తెలుగు మాస పత్రిక పంపిణీకి ఆంధ్రప్రదేశ్‌లో ఏజెంట్‌లు కావలెను. సోల్ సెల్లింగ్ విధానంలో కానీ, జిల్లాల వారీగా కానీ ఏజెంట్‌లు కావలెను.

(ఇది ఉద్యోగ ప్రకటన కాదు)

**వివరాలకు సంప్రదించండి**

ఎడిటర్, **యోజన (తెలుగు),**
హైదరాబాద్.
ఫోన్ 9440406712.
e-mail : yojana_telugu@yahoo.co.in

సాధికారత

# యువత సామాజిక భద్రతకు నాణ్యమైన విద్య

- డాక్టర్ రాకేశ్ కే వత్స్
- డాక్టర్ మీను వత్స్



**భారతీయ సామాజిక భద్రత నేపథ్యంలో యువత సాధికారత అన్నది జాతి అవసరాలకే కాకుండా వ్యక్తిగత వృద్ధికి కూడా అత్యవసరమైంది. ఏ దేశమైన సుస్థిర అభివృద్ధి గురించి మాట్లాడాలంటే ముందుగా వారి దేశంలోని యువత క్రియాశీలక పాత్ర కీలకంగా ఉంటుంది. భారతీయ యువత సుస్థిరాభివృద్ధి అన్నది కింద సూచించిన నాలుగు స్థంభాల ఆధారంగా ఉంటుంది. విద్య, నైపుణ్యం, ఉపాధి, సమూలమైన మార్పు ప్రభుత్వ విధానాలు, చర్యలు భారతదేశంలో ఉన్నతవిద్యలో చేరే వారి శాతం చాలా తక్కువగా అంటే 22 శాతంగా ఉంటే అది ప్రపంచ సగటు శాతం 28 కన్నా దిగువన ఉంది.**

ప్రపంచంలో రెండో అత్యధిక జనాభా ఉన్న భారతదేశంలోని 600 మిలియన్ల మందిలో పాతికేళ్లలోపు వారు యాభై శాతంపైగా ఉన్నారని తాజా గణాంకాల్లో వెల్లడైంది. మరో రెండు సంవత్సరాలు గడిస్తే మన దేశ జనాభాలో పాతికేళ్ల లోపు వారు నాలుగింటా మూడొంతుల మందితో ప్రపంచంలోనే అత్యధిక యువత ఉన్న దేశంగా ఆవిర్భవించ నుంది. మన దేశ జనాభాలోని ఈ యువత శాతం కారణంగానే జాతీయ స్థూలోత్పత్తిలో 34 శాతం వృద్ధి సాధ్యమవుతోంది. అదే సరైన విద్యాపరమైన మౌలిక సదుపాయాలు, తగిన రీతిలో నైపుణ్యాభివృద్ధి, వీటి తగ్గ రీతిలో ఉపాధి అవకాశాల కల్పన లేదా వ్యాపార, వాణిజ్య అవకాశాలుంటేంటే దేశం, సంఘం, వ్యక్తుల అభివృద్ధి శరవేగంగా ఉంటుంది.

ఒక సాంఘిక ఆచరణ ఫలితం ఎప్పుడూ దేశానికి భారం కాదు, పైగా అది అవకాశాల సృష్టికి కవాటాలు తెరుస్తుంది. అలాంటి వైవిధ్యభరితమైన జనాభా లక్షణాలను సాంఘిక ఆచరణ ఫలితాలుగా భావిస్తే, ఇటీవల కాలంలో కొరియా వంటి అనేక తూర్పు ఆసియా దేశాలతో పాటు మన దేశం కూడా ఆర్థిక వృద్ధి రేటును సాధించడమే కాకుండా వీటిని బలోపేతం చేస్తూ, సాధికారత అందిస్తే భవిష్యత్‌లో కూడా సత్ఫలితాలు సాధిస్తుందని నిశ్చయంగా చెప్పవచ్చును. సాధికారత అన్నది సమాజంలో ఛలామణిలో ఉన్న విలువలకు అనుగుణంగా ఒక వ్యక్తి సంతృప్తికరమైన జీవనం గడపడానికి అవసరమైన ఒక నిరంతర ప్రక్రియగా భావించాలి. భారతీయ నేపథ్యంలో యువత సాధికారత అన్నది జాతి అవసరాలకే కాకుండా వ్యక్తిగత వృద్ధికి కూడా అత్యవసర మైంది. యువకుల హక్కులు, యువత క్రియాశీలత, సామూహిక నిర్ణయాల్లో వారి పాత్ర కారణంగా సాధికారత సిద్ధిస్తుంది.

యువత సాధికారతలో కీలకమైంది ఏంటంటే, వారికి తగిన విద్యతో పాటు ఉపాధి కల్పించడం. ఏ దేశమైన సుస్థిర అభివృద్ధి గురించి మాట్లాడాలంటే ముందుగా వారి దేశంలోని యువత క్రియాశీలక పాత్ర కీలకంగా ఉంటుంది. అవకాశాల లేమి అన్నది వారిని సమాజం అంచున కూచోపెడు తుంది. ఎన్నటి రాని రైలు కోసం ఎదురు చూడడం లాగా ఉంటుంది.

### యువత సాధికారతకు మూలస్థంభాలు:

భారతీయ యువత సుస్థిరాభివృద్ధి అన్నది కింద సూచించిన నాలుగు స్థంభాల ఆధారంగా ఉంటుంది.

ప్రొఫెసర్, నేషనల్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ & రీసెర్చ్, చండీగఢ్. E-mail: rakeshwats@gmail.com
అసిస్టెంట్ ప్రొఫెసర్, డి.ఎ.వి. కళాశాల, చండీగఢ్.

+ విద్య
+ నైపుణ్యం, ఉపాధి
+ సమూలమైన మార్పు
+ ప్రభుత్వ విధానాలు, చర్యలు

కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ లక్ష్యమైన భారతదేశాన్ని సమూలంగా మార్చడం అన్న నినాదం అన్నది సాకారం కావడానికి నాణ్యమైన విద్య అందరికీ అందడం సాధ్యం కావడానికి, అభివృద్ధి చెందుతున్న దేశ స్వరూపాన్ని మార్చడానికి, సామర్థ్యం, నైపుణ్యం ఆధారంగా అందరికీ అందుబాటులో సమానమైన, నాణ్యమైన విద్యా వ్యవస్థను తీసుకొని రావడం కీలకంగా ఉంటుంది.

భారతదేశంలో ఉన్నతవిద్యలో చేరే వారి శాతం చాలా తక్కువగా అంటే 22 శాతంగా ఉంటే అది ప్రపంచ సగటు శాతం 28 కన్నా దిగువన ఉంది. అభివృద్ధి చెందిన దేశాలైన చైనా (28 శాతం) బ్రెజిల్ (36 శాతం), ఇంగ్లాండ్ (59 శాతం) ఉండగా, మరో రెండు సంవత్సరాల్లో అంటే 2020 నాటికి మన దేశ జనాభా పాతికేళ్లలోపువారి శాతం ప్రపంచంలోనే అత్యధికంగా ఉండబోతోంది. అందుకని ఉన్నత విద్యను అభ్యసించే వారి శాతాన్ని 30కి తీసుకెళ్లాలంటే ఇప్పుడు ఉన్న విద్యసంస్థల సంఖ్యను రెట్టింపు చేయాలి. ఉన్నత విద్యావంతుల శాతాన్ని పెంచడానికి, అందుబాటులో ఉన్న విద్యాసంస్థల సంఖ్య మధ్య ఉన్న అంతరం తీవ్రంగా ఉంది. అది ఎంతగా ఉందంటే, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు, యూనివర్శిటీలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయినా, అంతరం మాత్రం తగ్గడం లేదు. **దేశంలో శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల సాంద్రత ప్రపంచ దేశాలతో పోలిస్తే అతి తక్కువగా ఉంది.** నాణ్యమైన విద్య అనే లక్ష్యాన్ని అందుకోవాలంటే అందరికీ విద్య అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్లడం ఒక్కటే మార్గం.

భారతదేశం ఒక లౌకికవాద, ప్రజాస్వామ్య దేశమైనా, కులం, లింగ, వయో, ప్రాంతీయ తదితర అనేక అడ్డుగోడలు అందుబాటులో ఉన్న విద్యా వనరులు కూడా అందరికీ అందుబాటులోకి రాకుండా అడ్డుగా నిలుస్తున్నాయి. ఫలితంగా వ్యవస్థ ఆశిస్తున్న ఫలితాలు రావడం లేదు. నాణ్యమైన విద్య గురించి మన చర్చించే ముందు ఈ అసమానతలను తొలగించాల్సి ఉంటుంది. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాల విషయంలో అసమానతలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఉన్నత విద్యలో ఆర్ట్స్, హ్యూమానిటీస్ తీసుకొనే విద్యార్థుల శాతం ఉజ్జాయింపుగా 30 నుంచి 40 వరకు ఉంటే, కామర్స్, మేనేజ్‌మెంట్ కోర్సులకు 20 నుంచి 25 శాతం, చివరగా ప్రాథమిక, అప్లైడ్ సైన్సెస్‌కి వరసగా 19 నుంచి 21 శాతం, 15 నుంచి 16 శాతం ఉంది. విద్యార్థుల ఈ అసమాన ఎంపికలకు కారణాలను అన్వేషిస్తే, ప్రభుత్వం, విధాన రూపకర్తల కనువిప్పు కలిగే అంశాలు వెల్లడయ్యాయి. విద్యార్థుల ప్రాధాన్యతలకు సిలబస్ సరళత్వం, నైపుణ్యాభివృద్ధికి అవకాశాలు, క్యాంపస్‌లో లోపల, వెలుపలా రాకపోకలు, ప్రపంచ కార్యక్షేత్రానికి అనువుగా ఉండడంతో పాటు ఉపాధి అవకాశాలు కీలకంగా ఉన్నాయి.

గత రెండు దశాబ్దాలుగా వృత్తిగతమైన డిగ్రీల జోరు పెరగడంతో ఏఐసిటీఈ, యూజిసి తదితర ఉన్నత విద్యాసంస్థలు అందించే నాణ్యత లేని విద్య కారణంగా వాటి భారీ భవనాల గేట్లు మూతపడుతున్నాయి. అయితే జాతీయాభి వృద్ధికి ప్రభుత్వం ప్రొఫెషనల్ విద్యను ప్రోత్సహించడానికి తీసుకున్న చర్యల ఫలితంగా వృత్తిగతమైన కోర్సులు, డిగ్రీలకు డిమాండ్ పెరిగినా, అందులో నాణ్యమైన విద్యాబోధన, నైపుణ్య వృద్ధి లోపించడంతో కోరుకున్న ఫలితాలు రాలేదు. లక్షిత లక్ష్యాలను చేరుకోలేక పోయాము. ఇవాళ జాతీయాభివృద్ధి రేటు ప్రధానంగా సేవా రంగంపై (66.1 శాతం) ఆధారపడి ఉండగా, అందుకోసం అత్యున్నత నైపుణ్యాల అవసరం ఉంది. ఇక తెరపైకి శరవేగంగా వస్తున్న సాంకేతిక రంగం (9.2 శాతం వాటా) యువత నుంచి అత్యధిక పరిమాణంలో నైపుణ్యాలను కోరుతుంటే అవి లోపించిన ఫలితంగా వారు యజమానులను సంతృప్తి పరచలేకపోతున్నారు. కేవలం మూడింట ఒక వంతు కన్నా తక్కువ ఇంజనీరింగ్ పట్టభద్రులు, ప్రాథమిక శాస్త్ర విద్య, ఇతర విభాగాల నుంచి 5 శాతం మంది మాత్రమే వారి చదువుకి తగిన ఉపాధి పొందగలుగుతున్నారు. దీంతో మన విద్యారంగంలోని రెండు ప్రధాన స్రవంతులు వాటి విలువను కోల్పోతున్నాయి.

ఉన్నత విద్య అందుబాటులో ఉండడం, అందులో సమానత్వం వంటి రెండు ప్రధాన అంశాలతో పాటు, నాణ్యమైన విద్య అన్నది మూడో ప్రధానాంశంగా ఉంటుంది. దేశంలో నాణ్యమైన విద్య లోపించడాన్ని అవకాశంగా తీసుకొంటున్న అభివృద్ధి చెందిన దేశాల విద్యాసంస్థలు మన దేశ ఆర్థిక రంగానికే కాకుండా, మన దేశీయ మేధోసంపత్తికి కూడా తూట్లు పొడుస్తున్నాయి. ఏటికేడు అసంఖ్యాకంగా భారతీయ విద్యార్థులు నాణ్యమైన విద్య కోసం విదేశాలకు వలస పోవడం పెరుగుతోంది. దీన్ని ప్రస్తుత దేశీయ విద్యా విధానంలో కొన్ని సవరణలు, మార్పులు తీసుకొని రావడం ద్వారా మార్చడం సాధ్యమవుతుంది. ప్రపంచంలోనే అతి ప్రాచీన, అతి పెద్దదైన మన విద్యా వ్యవస్థను కొంత వినూత్నమైన, సృజనాత్మక ఆలోచనలతో మార్చడం సాధ్యమవుతుంది.

దేశంలో ఉనికిలో ఉన్న విద్యా వ్యవస్థ అసంఖ్యాకమైన అడ్డంకులను అధిగమించే పరుగులు తీస్తోంది:

**అవరోధాలు–**

+ నాణ్యమైన, స్వయం ప్రేరక ఉపాధ్యాయ సిబ్బంది కొరత– ఉపాధ్యాయ వృత్తికి భవిష్యత్ లేకపోవడం, తక్కువ వేతనాలు,

దేశంలో అథమ స్థానంలో ఉన్న వృత్తి కావడం.

+ దేశంలో ఉన్నతస్థాయిలో ఉన్న విద్యాసంస్థల్లో కూడా బోధనా సిబ్బంది కొరత తీవ్రస్థాయిలో ఉంది. రెగ్యులర్ అధ్యాపకులు, నిపుణులైన బోధనా సిబ్బంది, అనుభవమున్న పరిశోధకులు లేకపోవడంతో మూడింట ఒక వంతు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
+ ప్రభుత్వ అధ్వర్యంలో నడిచే విద్యా సంస్థల్లో నిధుల లేమి పెద్ద లోపంగా ఉంటోంది. రాష్ట్రప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచే విద్యాసంస్థలతో పోలిస్తే కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉన్న సీట్లు ఎక్కువగా ఉండడం, చేరే విద్యార్థుల సంఖ్య కూడా ఎక్కువగా ఉండడంతో నిధుల కేటాయింపు కీలక సమస్యగా మారింది.
+ ప్రపంచంలోనే అతి పెద్ద విద్యావ్యవస్థ ఉన్న మన దేశంలో విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో జాతీయ స్థూలోత్పత్తిలో కేవలం 3.3 శాతమే కేటాయించడంతో ఖాళీగా ఉన్న పాత్రలు ఎక్కువ శబ్దం చేస్తాయని స్పష్టమవుతోంది.
+ విద్యాసంస్థల్లో రాజకీయ, అధికారుల జోక్యం, అధికార చెలాయింపు ఎక్కువ కావడం కూడా సమస్యగా మారింది.
+ అనుభవజ్ఞులైన పరిశోధకులు, అధ్యాపకుల సుదీర్ఘ అనుభవ సారాన్ని విద్యార్థులకు అందించలేకపోవడం మరో వైకల్యంగా చెప్పుకోవాలి.

**కాలం చెల్లిన పద్ధతులు–**

+ సిలబస్‌లో కాలం చెల్లిన అంశాలు, లోపించిన ఏకీకృత, సంప్రదాయ పరమైన బోధనా పద్ధతల నుంచి నేటి సాంకేతిక యుగపు యువతకు అనుగుణమైన బోధన చేయలేపోవడం, ప్రయోగశాల ఆధార విద్యను ప్రత్యేకించి ప్రాథమిక శాస్త్ర విద్యలో కుదించడంతో విద్యా వ్యవస్థ వెలవెలబోవడంతో పాటు, యువతకు కూడా అందులో ఆసక్తి సన్నగిల్లుతోంది.
+ సంకుచిత దృక్పథం- గతంలో రూపొందించిన సిలబస్ యువతని విద్యావంతులను చేస్తుంది కానీ, ఒక సంపూర్ణమైన అభివృద్ధికి దోహదపడడం లేదు. విద్యా బోధనలో వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం కారణంగా వారు ఆచరణాత్మకంగా వారు నేర్చుకున్నదాన్ని అన్వయించడంలో విఫలమవుతున్నారు.

**పాలుపంచుకోకపోవడం–**

+ సిలబస్ రూపకల్పనలో ఉద్యోగి, యజమాని భాగస్వామ్యం లేకపోవడంతో సిలబస్ రూపకల్పన యావత్తు శతాబ్దాల నాటి ఆలోచనలున్న సీనియర్ అధ్యాపకులు లేదా కొన్నిసార్లు అధికారులు చేస్తుండడంతో విద్యా ఫలాలు అందడం లేదు. పరిశ్రమ లేదా ప్రయోగశాలలు లేదా వ్యాపార, వాణిజ్య సంస్థలను వేటినీ సిలబస్ రూప కల్పనలో భాగస్వామ్యులను చేయడం లేదు. ఫలితంగా, మరింతమంది ఉన్నత విద్యావంతులైన నిరుద్యోగులు తయారు కావడంతో అది దేశానికి పెను భారంగా మారుతోంది.

అయితే ఎన్ని అవరోధాలున్నప్పటికీ దేశ యువత శాస్త్ర, సాంకేతిక, ఆర్ట్స్, హ్యూమానిటీస్‌ను అభ్యసిస్తూ పురోగమిస్తూనే ఉన్నారని చెప్పాలి. ఐఐటి, ఏఐఐఎమ్ఎస్, ఐఐఎస్ఈఆర్, ఐఎమ్‌టెక్, ఐఐఎస్‌సీ, ఐఐఎమ్ వంటి అత్యున్నత విద్యాసంస్థలు ప్రపంచ విద్యాసంస్థల జాబితాలో అగ్రభాగాన నిలుస్తున్నాయి. దీనికి అందులో చదువుకొనే విద్యార్థులు కాకుండా అక్కడ విద్య బోధన చేసే అధ్యాపకులే కారణంగా చెప్పాలి. 2002–2016 మధ్య కాలంలో శాస్త్రీయ ప్రచురణలు అయిదు రెట్లు పెరిగాయి. అంతరిక్ష సమాచార రంగం, ఐటీ రంగం, పరిశోధన, అభివృద్ధి రంగం, ఔషధ రంగం, రోగ నిర్ధారణ రంగాల్లో ప్రాథమిక శాస్త్ర విద్య ఆధారంగానే దేశీ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేశాం. ప్రభుత్వం కూడా పాత బోధనా పద్ధతులకు తిలోదకాలిస్తూ సాంకేతికతను వినియోగించుకొంటూ యువతకి సాధికారత అందించడానికి అనువైన విధానాలను, సంస్కరణలను, చర్యలను, పథకాలను ప్రవేశపెడుతోంది. యువతకు విద్యను అందించడానికీ మరింతగా విస్తృత పరచడానికీ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాయిలో ఐఐటీ, ఐఐఎమ్, ఐఐఐటి, ఐఐఎస్ఈఆర్, ఏఐఐఎమ్ఎస్, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, కాలేజీలు తదితరాలను సంస్థలకు సంస్థాగత సామర్థ్య నిర్మాణ చర్యలను ఆపాదించడమవుతున్నది.

**గ్లోబల్ ఇనేషియేటివ్ ఆఫ్ ఎకడమిక్ నెట్‌వర్క్స్ (జిఐఏఎన్)** ద్వారా శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలను అంతర్జాతీయంగా ఒక వేదికపైకి తీసుకొని రావడం ద్వారా దేశంలో ప్రస్తుతం ఉన్న విద్యా వనరులను అంతర్జాతీయ స్థాయికి శాస్త్ర, సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఉన్నత విద్యా సంస్థలతో అనుసంధానించడం.

**ఇంపాక్టింగ్ రీసెర్చ్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ (ఇంప్రింట్) ఇండియాతో** సాంఘిక పరమైన రంగాల్లో దేశంలోని అత్యున్నత విద్యాసంస్థలలో ప్రత్యక్ష పరిశోధనలకు తెరతీయడం.

**ఉచ్చత్తర్ అవిష్కార్ అభియాన్** (యుఏవై)ని ప్రారంభించడం ద్వారా పరిశ్రమల ప్రత్యేక అవసరాలను తీర్చే పరిశోధనలను ప్రోత్సహించడం ద్వారా భారతీయ పారిశ్రామిక రంగాన్ని అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా చేయడం.

**నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)తో** నాణ్యతను

పెంపొందించే లక్ష్యంతో ప్రతి ఏడాది ఉన్నత విద్యా సంస్థలకు ర్యాంకింగ్‌లను ఇవ్వడం.

**ఎష్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ ఫైనాన్సింగ్ ఏజెన్సీ (హెచ్‌ఈఎఫ్‌ఏ)** ద్వారా ఉన్నత విద్యా సంస్థలు శరవేగంగా అభివృద్ధి చెందడానికి అవసరమైన భారీ ప్రోత్సాహాన్ని ఇవ్వడానికి తగిన నిధులను అందించడం.

**నేషనల్ ఎకడమిక్ డిపాజిటరీ (ఎన్‌ఏడి)**తో ఆన్‌లైన్‌లో అందరికీ అందుబాటులో ఉండే విధంగా డిజిటల్ రూపంలో అకడమిక్ అవార్డులను నిల్వ చేయడం ద్వారా తప్పుడు ధృవీకరణ పత్రాలు, మార్కుల జాబితా తయారీని నిరోధించడం.

**స్వయం ప్రతిభ–** ఈ ప్రాజెక్ట్ కింద రోజులో ఇరవై నాలుగు గంటల పాటు 32 డీటీహెచ్ ఛానల్స్ ద్వారా ఉన్నత విద్యా కార్యక్రమాలను ప్రసారం చేయడం.

**స్వయం– ఈ ప్రాజెక్ట్** కింద దేశీయంగా అభివృద్ధి చేసిన ఐటీ వేదికలపై మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సెస్ (ఎమ్‌ఓఓసి)ను దేశంలో మారుమూల ప్రాంతాల విద్యార్థులకు కూడా అందుబాటులో ఉండే విధంగా అన్ని కోర్సుల్లో నాణ్యమైన విద్యను అందించడం.

**నేషనల్ డిజిటల్ లైబ్రరీ–** పుస్తకాలు, ఈ–లెర్నింగ్ మెటీరియల్, ఎన్‌సైక్లోపీడియా, పత్రికలు, మోనోగ్రాఫ్స్, సమీక్షలు, పరిశోధనా పత్రాలు, వ్యాసాలు తదితరాలను జాతీయ సంపదగా డిజిటల్ రూపంలో నిక్షిప్తం చేస్తున్నారు. విద్యార్థులకు, వృత్తి నిపుణులకు, పరిశోధకులకు, ఇతరత్రా ఆసక్తి ఉన్న వారికి ఉపయోగపడే విధంగా డిజిటల్ లైబ్రరీని రూపొందించారు.

**క్యాంపస్ కనెక్ట్–ఇందులో** క్యాంపస్‌లో వైఫైని అందుబాటులోకి తీసుకొనస్తూ యూనివర్సిటీలకు 1 జీబీపీఎస్, కాలేజీలకు 10 ఎమ్‌బీపీఎస్ అనుసంధానం చేయనున్నారు. ఆల్ ఇండియా సర్వే ఆన్ హైయర్ ఎడ్యుకేషన్ (ఏఐఎస్‌హెచ్‌ఈ)– దీని కింద దేశంలోని అన్ని ఉన్నత విద్యాసంస్థలను అనుసంధానిస్తూ, విధాన నిర్ణయాలను, పరిశోధనల ఫలితాలను తెలియచేస్తారు.

**నేషనల్ ఇనీషియేటివ్ ఫర్ డిజైన్ ఇన్నోవేషన్–** ఇంటర్నెట్ ద్వారా ఉచితంగా వివిధ కోర్సులకి సంబంధించిన సమాచారాన్ని, విద్యను అత్యధిక స్థాయిలో అందరికి అందుబాటులోకి తీసుకొని రావడం.

**పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్– సైన్సెస్,** హ్యూమానిటిస్‌ల్లో యువ పరిశోధకులను ప్రోత్సహించడం ద్వారా వారు అకడమిక్‌గా, పరిశోధనా పరంగా వృత్తుల్లో రాణించడానికి అవసరమైన సరికొత్త నైపుణ్యాలను వృద్ధి చేస్తూ, వివిధ రంగాలపైనా అవగాహన పెంచడం.

**యూజీసీ–బీఎస్ఆర్ ఫాకల్టీ ఫెలోషిప్ ప్రోగ్రామ్:** యూనివర్సిటీల్లో ప్రాథమిక సైన్స్‌లో పరిశోధనలను బలోపేతం చేయడం, శాస్త్ర, సాంకేతిక బోధనలో అనుభవముండి పదవీ విరమణ చేసే అధ్యాపకుల సేవలను కొనసాగించడం.

సైన్స్ ఆధారిత ఉన్నత విద్య, పరిశోధనలను యూనివర్సిటీల్లో, కాలేజీల్లో బలోపేతం చేసే పథకం కింద పరిశోధనా కార్యక్రమాలకు ఊతం అందిస్తూ ఉన్నత విద్యలో జరిగే పరిశోధనల్లో నాణ్యత పెంచడం.

**స్కిల్ ఇండియా–** మన ప్రధానమంత్రి చేపట్టిన అద్భుతమైన ఈ కార్యక్రమం కింద దేశంలోని నిరుద్యోగ యువతకు, నిరాదరణకి గురైన మహిళలకు,, గ్రామీణ ప్రాంత ప్రజలకు నిపుణతను అందించడం ద్వారా ఉపాధి అవకాశాలను వృద్ధి చేయడంతో పాటు సుస్థిరమైన జీవనోపాధి కల్పనతో జీవన ప్రమాణాలను పెంచడం ఇందులో ప్రధానమైంది.

**రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (ఆర్‌యుఎస్‌ఏ)–** విద్య అన్నది పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత అయినప్పటికీ రాష్ట్రాల విద్యా రంగాల ప్రమాణాలను పెంచడానికి ఆర్‌ఎస్‌యూఏ కింద రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు సమకూర్చడం ద్వారా ఆయా రాష్ట్రాలు సామర్థ్య ఆధారిత విద్యను ప్రోత్సహించడం. ఫలితాలు కనబర్చని రాష్ట్రాలకు జరిమానాల వంటి శిక్షలు విధించే విధానం ఆధారంగా ఆర్‌యుఎస్‌ఏ పనిచేస్తుంది.

**చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్)–** సిలబస్ రూపకల్పనలో విద్యార్థిని కేంద్రకంగా చేసుకోవడం, అంతర్జాతీయంగా, జాతీయంగా, రాష్ట్రాల మధ్య విద్యాభ్యాసానికి వెళ్లడానికి, వివిధ విభాగాల మధ్య పరిజ్ఞానం సాధించడానికి వారికి తగినంత అవకాశం ఇవ్వడం ఇందులో ముఖ్యమైనవి. ఈ వ్యవస్థలో మార్కులు వేయడంలో అనుసరించే మూస విధానాలను,ఉపాధి కల్పనలో అవరోధాలను తొలగించడం జరుగుతుంది.

ఈ అనేకానేక కార్యక్రమాల ద్వారా దేశంలోని యువతకి విద్య ద్వారా సాధికారత అందించడానికి ప్రత్యేకించి ఆర్ట్స్, హ్యూమానిటీస్, బేసిక్ సైన్సెస్‌లో నిర్మాణాత్మక సంస్కరణలు అవసరం. అభివృద్ధి చెందుతున్న మనలాంటి దేశంలోని పరిమిత వనరులతోనే, ప్రస్తుతం ఉనికిలో ఉన్న వ్యవస్థలు, విధానాలను సవ్యంగా వినియోగించుకుంటూ అద్భుతాలు చేయడం సాధ్యమవుతుంది. నాలుగు వైపులా సానుకూల దృక్పథంలో.. విద్యార్థి కేంద్రక విద్యా వ్యవస్థ (సీబీసీఎస్), యజమానికి అవసరాల ఆధారమైన సిలబస్ (ఎన్‌బీసీఎస్), ప్రభుత్వం తన విధానాలు, పథకాల ద్వారా ప్రోత్సాహాలు అందించడం, ఆ విధంగా శిక్షణ తీసుకున్న సామర్థ్యమున్న యువతను గుర్తించడం ద్వారా యువతకి, దేశానికి సాధికారత అందించడం సాకారమవుతుంది.

■

# మౌలికరంగానికి ఊతం - దేశాభివృద్ధికి సోపానం

**- కె.ఆర్. సుధామన్**




**గత 15 సంవత్సరాలుగా దేశీయంగా మౌలిక రంగానికి డిమాండ్ మరింత పెరిగింది. ఆధునికత వైపు సమాజం అడుగులు పడుతున్నాయి. టెక్నాలజీ ప్రతీ ఒక్కరికీ చోదక శక్తిగా మారింది. ఈ నేపథ్యంలో మౌలిక రంగం అత్యంత ప్రాధాన్యత కలిగిన రంగంగా మారింది. ఇప్పటికే దేశంలో ఆర్థిక వృద్ధిరేటు సాలీనా 7.5 శాతంగా ఉంది. 2014 అనంతరం మౌలిక రంగంపై దృష్టి సారించేందుకు ప్రభుత్వం ఎక్కువగా ఆసక్తి కనబరిచింది. ఈ రంగం అభివృద్ధికి రూ. 43 లక్షల కోట్ల తక్షణ అవసరంగా రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ అంచనా వేసింది.**

కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో దేశంలోని మౌలిక రంగం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రెండు దశాబ్దాలుగా మౌలిక రంగంలో ఆశించిన మేర అభివృద్ధి సాధించలేదని తెలియజేశారు. ముఖ్యంగా అవకాశాలు ఉన్నప్పటికీ పెట్టుబడుల కొరత కారణంగా మౌలిక రంగం పలు అడ్డంకులను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని గత మూడు సంవత్సరాలుగా మౌలిక రంగానికి ఇతోధికంగా కేంద్రం ప్రోత్సాహం అంది స్తోంది. ముఖ్యంగా రైల్వేలు, రోడ్లు, పోర్టులు, షిప్పింగ్, విమానయానం, అంతర్గత జలరవాణా, విద్యుత్, అలాగే సాంప్రదాయే తర ఇంధన వనరుల అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నారు. వీటిని జోడించడం ద్వారా కనెక్టివిటీ పెరిగే వీలుంది. ముఖ్యంగా గడిచిన ఏడు దశాబ్దాలుగా ఏఏ రంగాలైతే వెనుకబడ్డాయో ఆ రంగాల వైపు ప్రత్యేక శ్రద్ధ వహించనున్నారు.

ముఖ్యంగా మౌలిక రంగ అభివృద్ధికి నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తితో పాటు డిజిటైజేషన్ చాలా అవసరం. ముఖ్యంగా దేశంలో మౌలిక రంగ అభివృద్ధి కోసం మేకిన్ ఇండియా కార్యక్రమ రూపకల్పన జరిగింది. దీన్ని మరింత వేగంగా ముందుకు తీసుకువెళ్లేందుకు స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్వచ్ఛ భారత్ లాంటి కార్యక్రమాలను సమాంతరంగా రూపకల్పన చేశారు. తద్వారా భారత్ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనలో ముందడుగు వేసే అవకాశం ఉంది. 12వ పంచవర్ష ప్రణాళిక 2017 చివరినాటికి మౌలిక రంగానికి ఒక ట్రిలియన్ డాలర్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించే అవకాశం ఉంది. ఇందులో చాలా వరకూ ప్రైవేటు పెట్టుబడి ద్వారా తరలివచ్చే వీలు ఉంది. అభివృద్ధికి బాటలు వేసేందుకు దేశీయ మౌలిక రంగానికి ఊతం ఇవ్వడం ఒక్కటే సులభ మార్గంగా కనిపిస్తోంది. సమీప భవిష్యత్తులో దేశం ప్రపంచ స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకునేందుకు మౌలిక రంగాన్ని కీలక రంగంగా ఎంపిక చేసుకున్నది. మరోవైపు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసేందుకు సైతం మౌలిక వసతుల కల్పన అత్యంత ఆవశ్యకం. ముఖ్యంగా వ్యవసాయానికి ప్రోత్సాహం కల్పించేలా గ్రామాల్లో రవాణా సదుపాయాలు, కోల్డ్ స్టోరేజీలు, సాగునీటి కల్పన వంటి మౌలిక సదుపాయాల ఆవశ్యకత ఎంతో ఉంది. వీటి

పి.టి.ఐ వార్తా సంస్థ, మాజీ ఎకనమిక్స్ ఎడిటర్, న్యూఢిల్లీ
E-mail: sudhaman23@gmail.com

అభివృద్ధితోనే గ్రామీణ పేదరికం తగ్గుముఖం పడుతుందని అధ్యయనాలు వెలువడ్డాయి.

గత 15 సంవత్సరాలుగా దేశీయంగా మౌలిక రంగానికి డిమాండ్ ఏర్పడింది. ఆధునికత వైపు సమాజం అడుగులు పడుతున్నాయి. టెక్నాలజీ ప్రతీ ఒక్కరికీ చోదక శక్తిగా మారింది. ఈ నేపథ్యంలో మౌలిక రంగం అత్యంత ప్రాధాన్యత కలిగిన రంగంగా మారింది. ప్రస్తుతం దేశం 125 కోట్ల జనాభాను దాటింది. వీరందరి అవసరాలు తీర్చాల్సిన ఆవశ్యకత కూడా ఉంది. అంతే కాదు జనాభాలో రెండు వంతుల మంది 35 సంవత్సరాల వయస్సు లోపల గల వారున్నారు. దరిమిలా పలు రంగాలు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిం చేందుకు దోహదపడుతున్నాయి. వీటికి మౌలికరంగం తోడైతే అభివృద్ధి ఉరకలు వేసే వీలుంది. ఇప్పటికే దేశంలో ఆర్థిక వృద్ధిరేటు సాలీనా 7.5 శాతంగా ఉంది. అది కూడా ప్రపంచంలో మాంద్యం పరిస్థితులతో పాటు చైనా లాంటి పెద్ద ఆర్థిక వ్యవస్థలు మందగమనంలో ఉన్నప్పటికి మన దేశం వృద్ధి రేటు వేగంగా కదులుతోంది. దీనికి మన దేశంలో ఊపందుకున్న మౌలిక రంగమే కారణమని చెప్పవచ్చు. మరోవైపు ప్రపంచ డిమాండ్ కు తగ్గట్టుగా ఉత్పత్తి రంగం జోరందుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకు మౌలిక రంగ అభివృద్ధి చాలా అవసరం. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ముడిచమురు, సిమెంట్, స్టీల్ ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ నేపథ్యంలో మౌలికరంగానికి కలిసి వచ్చే సూచికగా చెప్పవచ్చు. పలు ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం కూడా తగ్గే అవకాశం ఉంది. అంతే కాదు అభివృద్ధి చెందిన దేశాలకు చెందిన పలు పెన్షన్ ఫండ్ హౌస్‌లు సైతం ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. ఇది ఆసక్తికరమైన పరిణామంగా చెప్పవచ్చు. ప్రస్తుతం ప్రపంచంలో నెలకొన్ని మాంద్యం పరిస్థితుల దృష్ట్యా మన ఆర్థిక వ్యవస్థ తప్ప మరో ఆర్థిక వ్యవస్థ బలంగా లేని నేపథ్య ఉంది. ఇది కూడా కలిసి వచ్చే అంశమే. ప్రపంచ స్థాయి ఫండ్ హౌసెస్ నేడు భారత్ లోని మౌలిక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఈ పరిణామాల చోదక శక్తిగా మారుతున్నాయి.

చైనా లాంటి శక్తులు మందగ మనంలో ఉన్నప్పటికీ మన ఆర్థిక వ్యవస్థ మాత్రం స్థిరంగా అభివృద్ధి చెందడం గమనించదగిన అంశం. ముఖ్యంగా మన దేశ ద్రవ్యోల్బణం ఐదుశాతం కన్నా తక్కువగా ఉండటం, ఆర్థికలోటు కూడా అదుపులో ఉండటం, అలాగే వ్యవసాయ రంగంలో వడ్డీ రేట్లు తక్కువగా ఉండటం, డిమాండ్ కలిగి ఉండటం, వంటి పరిణామాలు మౌలిక రంగం యొక్క ఆవశ్యకతను సూచిస్తున్నాయి. రానున్న మూడు నాలుగేళ్లలో ప్రభుత్వం దాదాపు ట్రిలియన్ డాలర్లను ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉంది. ముఖ్యంగా ఇప్పిటికే పలు నిలిచిపోయిన ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు మొత్తం 18 శాతం నిధులను కేటాయించారు. ఇంధన మంత్రిత్వ శాఖ అంచనాల ప్రకారం పలు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సైతం మౌలిక రంగంలోకి తరలివస్తున్నాయి.

అలాగే 2014 జూలైలో భారత ప్రభుత్వం రైల్వే రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు పచ్చజెండా ఊపింది. ముఖ్యంగా రైల్వే రంగం అభివృద్ధి కోసం నిధుల కొరత ఉంది. కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, 400 స్టేషన్ల నిర్మాణం, సుమారు 15 బిలియన్ డాలర్ల నిధులతో బుల్లెట్ ట్రైన్ నిర్మాణం, అలాగే 12.5 బిలియన్ డాలర్లతో పూర్తి స్థాయి సరుకురవాణా కారిడార్ నిర్మాణం లాంటివి కేంద్రం చేపట్టనుంది. వీటి కోసం సుమారు 128 బిలియన్ డాలర్ల మేర రైల్వేల్లో మౌలిక రంగ అభివృద్ధికి అవసరం అయ్యే అవకాశం ఉందని అంచనాలు వెలువడ్డాయి. అలాగే దేశంలోని రైల్వేల విస్తరణతో పాటు సరుకు రవాణా కోసం ప్రత్యేకంగా మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే దేశంలోని ప్రధాన ఫ్రైట్ కారిడర్ రైల్వే మార్గాలుగా చెబుతున్న ముంబై – ఢిల్లీ, లుధియానా – కోల్‌కతా మార్గాల్లో పనులు మొదలు అయ్యాయి. అలాగే మరో మూడు ఫ్రైట్ కారిడార్ల పనులు కూడా మొదలయ్యాయి. వాటిలో ప్రధానంగా కోల్ కతా – విజయవాడ, ఢిల్లీ – చెన్నై, కోల్ కతా – ముంబై ఫ్రైట్ కారిడార్ల పనులు మొదలు కానున్నాయి. సుమారు 6 బిలియన్ డాలర్ల నిధితో జాతీయ మౌలిక రంగం పెట్టుబడి సంస్థ (ఎన్ఐఐఎఫ్) ను ఏర్పాటు చేయగా, ఇందులో పలు విదేశీ సంస్థాగత మదుపరులు, అలాగే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు. ఈ ఎన్ఐఐఎఫ్ లో కేంద్ర ప్రభుత్వం సుమారు 49 శాతం వాటాలను కలిగిఉంది. తద్వారా అటు ప్రభుత్వ, విదేశీ పెట్టుబడులతో పలు అంతర్జాతీయ పెట్టుబడి సంస్థల ద్వారా నిధుల సమీకరణ విజయవంతంగా జరిగే వీలు ఏర్పడింది. ముఖ్యంగా మౌలిక రంగ అభివృద్ధికి గతంలో ఇలాంటి సంస్థలు ఏర్పాటు కాలేదు. సరళీకృత ఆర్థిక విధానాలు అమలు అయ్యాక ఇటువంటి ప్రయత్నం జరగలేదు. అలాగే బాండ్‌ల మార్కెట్ ద్వారాను ఇతర పద్ధతుల ద్వారాను మౌలిక రంగానికి నిధులను మళ్లించడంలో పెద్దగా చొరవ కనబరచలేదు. అలాగే బ్యాంకులపై మౌలికరంగం నిధుల కోసం ఆధార పడక తప్పలేదు. అయితే బ్యాంకులు దీర్ఘకాలిక రుణాలను ఇవ్వలేవు. ముఖ్యంగా మౌలిక రంగంలో రిటర్నులు రావాలంటే సమయం పడుతుంది. బ్యాంకులు స్వల్పకాలిక రుణాల ద్వారా రిటర్నులు రాబట్టుకోవాలనే తపన ఉండటం సహజం. అయితే బ్యాంకులపై ఆధార పడటంతో రుణాల చెల్లింపుపై దృష్టి సారించడంతో మౌలిక రంగంపై ఒత్తిడి పెరగి ప్రాజెక్టులు నిలిచిపోయిన పరిస్థితి కోకొల్లలు.

ముఖ్యంగా మౌలిక రంగం స్థిరంగా నిలదొక్కుకొనేందుకు చాలా సమయం

పడుతుంది. అప్పటి వరకూ నిధుల కొరత ఏర్పడకుండా చూడాల్సిన అవసరం కూడా ఉంది. అందుకోసం బ్యాంకులపై ఆధార పడటం కష్టం. ఈ నేపథ్యంలో ఫండ్ హౌసెస్ అయిన బీమా సంస్థలు, పెన్షన్ ఫండ్స్ వంటి ఆర్థిక సంస్థల నుంచి నిధులు పొందడం ఉత్తమ మార్గం. వీటికి దీర్ఘ కాల పరిమితి ఉంటుంది. కార్పోరేట్ బాండ్స్, ఇన్ఫ్రా ఫండ్స్ ఏర్పాటు ద్వారా నిధుల రాక సులభం అవుతుంది. ముఖ్యంగా మౌలిక రంగాన్ని పీడిస్తున్న మరో సమస్య నిరర్థక ఆస్తులుగా మిగిలిపోవడం. తద్వారా బ్యాంకులకు మొండి బకాయి సంస్థలుగా మౌలికరంగ పరిశ్రమ కుదేలవడం పరిపాటిగా మారింది.

గణాంకాల పరంగా చూస్తే 2014 అనంతరం మౌలిక రంగంపై దృష్టి సారించేందుకు ప్రభుత్వం ఎక్కువగా ఆసక్తి కనబరిచింది. ముఖ్యంగా 2014 నాటికి ఈ రంగం అభివృద్ధికి 43 లక్షల కోట్ల రూ.ల తక్షణ అవసరంగా రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ అంచనా వేసింది. ముఖ్యంగా మూడు రంగాలకు ఈ నిధులు అవసరం ఉంది. అందులో విద్యుత్, రవాణా, పట్టణాభివృద్ధి ప్రాధాన్య రంగాలు గా ఉన్నాయి. ఏటా ఈ రంగాలకు సాలీనా 8.6 లక్షల కోట్లు అవసరం. అంతేకాదు 43 లక్షల కోట్ల అంచనా నిధుల్లో 70 శాతం పైనా పేర్కొన్న ప్రాధాన్య రంగాలకే సరిపోతుంది. ఈ తక్షణ అవసరాన్ని దృష్టి లో ఉంచుకొని ఈ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కేంద్రం ఊతమిచ్చింది. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో విదేశీ పెట్టుబడులు ఆసక్తి చూపిస్తున్నాయి. అంతేకాదు రానున్న కాలంలో సాంప్రదాయేతర ఇంధన వనరులపై కేంద్రం దృష్టి సారించే అవకాశం ఉంది. 2022 నాటికి 30 నుంచి 100 గిగా వాట్ల హరిత విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా కేంద్రం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ రంగంలో కూడా విదేశీ పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంది. అలాగే ముఖ్యంగా మౌలిక రంగాలైన సాంప్రదాయేతర ఇంధన వనరులు అలాగే రహదారులు, రైల్వేలు కేంద్ర పరిధిలోనివి. దీంతో కేంద్రం మరింత పారదర్శకతతో ఈ రంగంలో పెట్టుబడులకు ఊతమిస్తోంది. అలాగే కేంద్రం ప్రైవేట్, విదేశీ పెట్టుబడులను మౌలిక రంగంలో ఆకర్షించడం సులభతరమైంది. అలాగే ప్రభుత్వం జపాన్, కొరియా, ఆస్ట్రేలియా, అమెరికాలకు చెందిన పలు బ్యాంకులు, ఫండ్ హౌసెస్ నుంచి నిధుల సమీకరణ కోసం ప్రత్యేక ప్రణాళిక సైతం సిద్ధ చేసింది.

ముఖ్యంగా జపాన్‌కు చెందిన సంస్థలు రైల్వే ఫ్రైట్ కారిడార్లలో సుమారు 5 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టాయి. అలాగే కెనడాకు చెందిన పెన్షన్ ఫండ్ హౌస్ కూడా 2 బిలియన్ డాలర్ల నిదులు కేటాయించింది. అలాగే యూఏఈకి చెందిన అబుదాబి ఇన్వెస్ట్ మెంట్ అథారిటీ సైతం పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది.

అలాగే కేంద్రం రాష్ట్రాలతో సత్సంబంధాలు నెరపేందుకు చర్యలు పెద్దన్న తరహాలో నిర్ణయాలు తీసుకుంటోంది. అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా పంచాలంటే ఈ చర్యలు అవసరం. ముఖ్యంగా నీతీ ఆయోగ్ ఏర్పాటు ద్వారా నిధుల ప్రాధాన్య రంగాలకు నిధుల కేటాయింపు జరిగింది. అలాగే పలు కీలక సంస్కరణలు చేపట్టింది. అందులో ప్రదానంగా జన్ ధన్, ఆధార్ మొబైల్ లింకేజీ, ద్వారా సంక్షేమ రంగంలో పారదర్శకత పాటించేందుకు వీలు కలిగింది. ఈ పారదర్శకత ద్వారా సంక్షేమ రంగంలో నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడింది. ఈ నేపథ్యంలో కేంద్రం మౌలిక సదుపాయాలపై దృష్టి సారించే వీలు కలిగింది. వస్తుసేవల పన్ను (జీఎస్‌టి) సైతం కేంద్ర రాష్ట్రాలకు ఊతమిచ్చే వీలు కలిగించింది. పలు అధ్యయనాల్లో జీఎస్టీ ద్వారా జీడీపీ 1-2 శాతం వరకూ సాలీనా వృద్ధికి దోహదపడుతుందని తేల్చాయి. మౌలిక రంగం అభివృద్ధి చెందడం ద్వారా ముఖ్యంగా సరుకు రవాణా వేగవంతం అయ్యే వీలుంది. తద్వారా 8 నుంచి 9 శాతం మేర వృద్ధి వీలవుతుంది. ఈ వృద్ధిలో రైల్వేలతో సహా రవాణా రంగానిది 2 శాతం భాగస్వామ్యం ఉంటుంది. రైల్వేశాఖ పెట్టబడి పద్దు లక్ష కోట్ల రూ.లకు చేరింది. ఇదే మూడేళ్ల క్రితం కేవలం 40 వేల కోట్ల రూ.లుగా ఉంది.

కేంద్ర రహదారుల, రవాణా మంత్రిత్వ శాఖ అంచనాల ప్రకారం రానున్న మూడేళ్లలో మొత్తం రహదారులు, నౌకాయాన రంగంలో పెట్టుబడుల సమీకరణ లక్ష్యం 25 లక్షల కోట్ల రూపాయలుగా నిర్ణయించింది. అలాగే 8 లక్షల కోట్లు రూపాయల నిధులతో 27 పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటును లక్ష్యం నిర్దేశించారు. అలాగే 5 లక్షల రూ.ల నిధులతో రోడ్లు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణానికి కేటాయించారు.

ఇక 2016 సంవత్సరానికి గానూ ప్రపంచ బ్యాంకు ప్రకటించిన లాజిస్టిక్స్ పెర్ఫార్మెన్స్ ఇండెక్స్ సూచీలో మన దేశం 19 స్థానాలు మెరుగుపరుచుకొని 160 దేశాల్లో 35 స్థానంలో నిలిచింది. ముఖ్యంగా భారతీయ విద్యుచ్ఛక్తి రంగం రానున్న 4-5 సంవత్సరాల్లో 250 బిలియన్ డాలర్ల. మేర పెట్టుబడుల ఆవశ్యకత ఉంది. ముఖ్యంగా విద్యుచ్ఛక్తి ఉత్పాదన, ట్రాన్స్‌మిషన్, అలాగే పరికరాల డిమాండ్ ఈరంగంలో నెలకొని వుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని అంతర్జాతీయ పెట్టుబడులకు పెద్ద ఎత్తున అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే పలు స్పానిష్ కంపెనీలు సైతం హై స్పీడ్ రైళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపిస్తున్నాయి. అలాగే స్మార్ట్ సిటీల రూపకల్పన కోసం స్కై ట్రాన్స్ కార్పోరేషన్ పెట్టుబడులు సమీకరిస్తోంది. ముఖ్యంగా నాసా టెక్నాలజీ ద్వారా పాడ్ కార్ సిస్టంను అభివృద్ధి చేస్తున్నారు. తద్వారా ప్రజా రవాణాలో విప్లవాత్మకమైన మార్పులకు ఆస్కారం ఏర్పడింది.

అలాగే దేశంలో మౌలిక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు అంతర్జాతీయ ఈక్విటీ సంస్థలు, ఈక్విటీ హెడ్జ్ ఫండ్స్, గ్లోబల్ నాన్ బ్యాంకింగ్ సంస్థలు, గ్లోబల్ సోవరీన్ వెల్త్ ఫండ్స్, గ్లోబల్ ఫెన్షన్ ఫండ్స్ ఆసక్తి కనబరుస్తున్నాయి. ముఖ్యంగా ఇండస్ట్రియల్ కారిడార్ల నిర్మాణంలో ఈ ఆసక్తి ఎక్కువగా కనబడుతోంది. ఢిల్లీ – ముంబై, లుధియానా – కోల్ కతా, కోల్ కతా–విశాఖపట్నం– విజయవాడ, చెన్నై–ట్యూటికోరన్, చెన్నై – బెంగుళూరు, బెంగుళూరు – ముంబై కారిడార్ల అభివృద్ధికి పెట్టుబడులు పెట్టేందుకు జపాన్, వరల్డ్ బ్యాంక్, ఏడీబీ బ్యాంక్, బ్రిటన్ సంస్థలు ఆసక్తి కనబరుస్తున్నాయి. అలాగే వంద స్మార్ట్ సిటీ నిర్మాణం కూడా ప్రధాన లక్ష్యంగా కేంద్రం పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో టెలికాం రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. అలాగే స్వచ్ఛ భారత్ అభియాన్ సైతం ఈ రంగంలో మౌలిక వసతుల కొరకు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టనుంది. తద్వారా, స్వచ్ఛమైన జలం, పారిశుధ్యం, సీవేజి ప్లాంట్ల నిర్మాణం, వేస్ట్ మేనేజ్ మెంట్ లపై కేంద్రం చొరవచూపించనుంది. జపాన్, ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికా, చైనా సహా పలు అభివృద్ధి చెందిన దేశాలు మౌలిక రంగాల్లో బిలియన్ల కొద్దీ డాలర్ల పెట్టుబడులను కేటాయిం చేందుకు సిద్ధంగా ఉన్నాయి.

మరో ప్రధాన అంశం గృహ సముదాయాల నిర్మాణం, మలేషియాకు చెందిన కన్ స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్ మెంట్ బోర్డ్ (సీఐడీబీ) పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి సుమారు 30 బిలియన్ డాలర్లను కేటాయించేందుకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే సీఐడీబీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ ఎదురుగా మినీ స్మార్ట్ సిటీ నిర్మాణానికి పనులు జరుగుతున్నాయి. దీంతో పాటు ఘర్ ముక్తేశ్వర్ (ఉత్తర్ ప్రదేశ్)లో గ్రీన్ సిటీ ప్రాజెక్ట్, గంగా శుద్ధి ప్రాజెక్ట్‌ను చేపట్టేందుకు పెట్టుబడులను ఆహ్వానిస్తు న్నారు. ఇక కేంద్ర రహదారులు, రవాణా మంత్రిత్వ శాఖ సుమారు 3.17లక్షల కోట్ల రూ.లు, అలాగే నౌకాయన మంత్రిత్వ శాఖ 80 వేల కోట్ల రూ.లతో అంతర్జాతీయ స్థాయి రహదారులు, నౌకాయన వసతులకు ఖర్చు చేస్తున్నాయి. ముఖ్యంగా 15000 కి.మీటర్ల జాతీయ రహదారుల నిర్మాణమే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయి.

ఇక 2017–18 కేంద్ర బడ్జెట్‌లో సైతం పలు సరికొత్త ప్రతిపాదనలతో మౌలిక రంగానికి ఊతం అందించింది. ముఖ్యంగా మౌలిక వసతుల రూపకల్పనకు 20.6 శాతం మేర నిధులను పెంచడం జరిగింది. రైల్వేలకు 8 శాతం, గృహ సముదాయాల నిర్మాణానికి మౌలిక సదుపాయాల హోదా కల్పన వంటి చర్యలతో కేంద్రం ఇతోధికంగా ప్రాధాన్యత కల్పించింది. ముఖ్యంగా 5 బిలియన్ డాలర్లతో రైల్వేస్ ఆఫ్ ఇండియా డెవలప్ మెంట్ ఫండ్ బోర్డు ఏర్పాటు విప్లవాత్మకమైన చర్యగా చెప్పవచ్చు. తద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో 3500 కిలో మీటర్ల మేర రైల్వేలైన్ల నిర్మాణం జరగనుంది.

నౌకాయాన మంత్రిత్వ శాఖ సైతం 37 జాతీయ జలమార్గాల అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు చేసింది. అలాగే అలాగే నేషనల్ వాటర్ వేస్ యాక్ట్ ద్వారా సుమారు 111 జాతీయ జలమార్గాలను గుర్తించింది. తద్వారా సరుకు రవాణా మరింత చవకగా మారే అవకాశం ఏర్పడింది. ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన కింద పలు వ్యవసాయ ప్రాధాన్యతా రంగాలను గుర్తించి పలు ప్రాజెక్టులను గుర్తించారు. అందులో 23 ప్రాజెక్టులు ప్రాధాన్యత – 1 గానూ, 31 ప్రాజెక్టుల ప్రాధాన్యత క్రమం–2 గానూ, 45 ప్రాజెక్టులు ప్రాధాన్యత క్రమం–3 గానూ గుర్తించి నిధుల కేటాయింపు జరుగుతోంది. అలాగే 106 పట్టణాల్లో పేవ్ మెంట్స్, సైకిల్ ట్రాక్స్ నిర్మాణం ద్వారా వాయు కాలుష్యం తగ్గించే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

అలాగే సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ద్వారా 2.6 లక్షల కోట్ల రూ.లతో పవర్ ట్రాన్స్ మిషన్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి జరుగుతోంది. 45,700 మెగావాట్ల ప్రాంతీయ లింక్ ల ఏర్పాటు చేయనున్నారు. అలాగే 75 ప్రజా ప్రాయోజిత రహదారులు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం 35,600 కోట్ల రూ.లను కేటాయించారు. తద్వారా 2700 కిలోమీటర్ల రోడ్లను నిర్మించనున్నారు. అలాగే స్మార్ట్ సిటీ తరహాలో అటల్ మిషన్ ఫర్ రిజువునేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ (అమృత్) స్కీం కింద ఆరు రాష్ట్రాల్లో పట్టణాభివృద్ధి చేపట్టారు. ఇక ఎయిర్‌వేస్ అభివృద్ధి కోసం 12 ఏయిర్ పోర్టులను ఏర్పాటు చేయను న్నారు. ఏయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా దేశ వ్యాప్తంగా 13 రీజినల్ ఏయిర్ పోర్టుల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా ఆదాయ వృద్ధికి కేంద్రం కృషి చేయనుంది. నేడు కేంద్రం తీసుకున్న చర్యలతో కళ్ల ముందే మౌలిక రంగం అభివృద్ధి కనిపిస్తోంది. రానున్న మూడు సంవత్సరాల్లో నేషనల్ హైవేస్ బిల్డింగ్ ప్రాజెక్టుల కింద 45 బిలియన్‌డాలర్లను కేటాయించనున్నారు. ఇందు కోసం భూ కేటాయింపుల కోసం పరిహారం, అలాగే పారదర్శకత విధానాలను అవలబించ నున్నారు. ముఖ్యంగా న్యాయ సంబంధిత చిక్కులు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నారు. ముఖ్యంగా రోడ్ల నిర్మాణంలో ప్రతి రోజు 2–3 కి.మీల జాతీయ రహదారుల నిర్మాణం జరుగు తోంది. ఇది సుమారు 40 కి.మీటర్ల ప్రతిరోజు సామర్థ్యానికి చేరే వీలుంది. ముఖ్యంగా రైల్వేలు, పోర్టులు, మెట్రో, సహా పలు మౌలిక రంగాల్లో ఈ అభివృద్ధి కనిపిస్తోంది.

■

## పాఠక స్పందన:

**గౌరవనీయులైన ఎడిటర్ గారికి**

**యోజన,**

**హైదరాబాద్ వారికి.....**

శ్రీ యన్. నారాయణస్వామి అను నేను గత దశాతబ్ద కాలంగా యోజన పాఠకునిగా ఉన్నాను. మీ యోజనలో ప్రచురించే వ్యాసాలు, రచనలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల వివరాలను విశ్లేషణాత్మకంగా వివరిస్తూ యోజన పాఠకులైన పోటీ పరీక్షలకు సన్నద్ధమైయ్యేవారికి, అకడమీషియన్స్‌కి, పరిశోధకులకు, పౌరసేవకులకు ఇలా అన్ని రంగాల వారికి ముఖ్యంగా పోటీ పరీక్షార్ధులకు (గ్రూప్ – 1, గ్రూప్ – 2, గ్రూప్ – 3, సివిల్ సర్వీసెస్) ఇతోధికంగా దోహదపడుతున్నదని అనడంలో అతిశయోక్తిలేదు.

మీ యోజన నా ఉద్యోగ సాధనలో సంపూర్ణంగా దోహదపడినదని తెలుపుటకు సంతోషం వ్యక్తం చేస్తున్నాను. ఈ సందర్భంగా నాదొక చిన్న విన్నపం. ఏమనగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న (విధానాలు) ఉదాహరణకు జాతీయ ఆరోగ్య విధానం (రివైజ్‌డ్), దివ్యాంగుల విధానం మొదలైనవి. రాష్ట్ర ప్రభుత్వలలోని పారిశ్రామిక విధానం తదితర కార్యక్రమాలను, స్కీంలను విశ్లేషణాత్మకంగా అభివృద్ధి వ్యూహాత్మకంగా వివరాలను అందించవలసినదిగా కోరడమైనది. ఈ పై విషయాలు చర్చ, విశ్లేషణాత్మకంగా వివరించవలసినదిగా కోరడమైనది.

ఇట్లు

తమ విధేయుడు

యన్. నారాయణ స్వామి

అసిస్టెంట్ రిజిస్ట్రార్, సహకార శాఖ, అనంతపురం జిల్లా,

చరవాణి 9949918032

జ॥ నారాయణస్వామి గారూ యోజనపై మీకున్న అభిమానానికి ధన్యవాదాలు. మీ సూచనలను త్వరలో కార్యరూపం ఇవ్వడానికి ప్రయత్నిస్తాం!

## గమనిక


**వ్యాసకర్తలకు సూచన** యోజన మాసపత్రికకు వ్యాసాలు పంపేవారు తమ వ్యాసం సాఫ్ట్ కాపీని పేజిమేకర్ 6.5 లేదా 7 మరియు "అను" 7 ఫాంట్‌లో, వర్డ్‌లోనూ పంపాలి. వ్రాతప్రతిని కూడ హామీ పత్రంతో కలిపి పోస్టుద్వారా పంపాలి. హామీ పత్రంలో ఇది తమ స్వంత రచన అనీ, దేనికీ అనువాదం, అనుసరణ కాదనీ, మరే పత్రికకూ పంపలేదనీ, ఇంతకుముందు పుస్తకంగా ముద్రించలేదని పేర్కొనాలి. రచనలు ప్రతి నెలా 15వ తేదీ లోపు మాకు చేరాలి. ప్రచురణకు నోచుకోని రచనలు తిరిగి పంపబడవు. దీనిపై ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకూ చోటులేదు. గమనించగలరు.

**సీనియర్ ఎడిటర్**

యోజన తెలుగు మాసపత్రిక, 205, రెండవ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.

E-mail: yojana_telugu@yahoo.co.in - yojana.telugu@nic.in

# నూతన పెన్షన్ పథకం - స్వావలంబన పథకం - అటల్ పెన్షన్ యోజన



పేద, అల్పాదాయ వర్గాల ప్రజలకు వృధ్యాప్యంలో ఆర్థిక స్వావలంబన కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటోంది. పేదలందరూ పెన్షన్ పథకంలో చేరేలా ప్రోత్సహించేందుకు అనేక చర్యలను చేపట్టింది. స్వావలంబన పథకంలో సభ్యులుగా చేరిన ఒక్కొక్క కార్మికుని తరపున సంవత్సరానికి రూ. 1000 వంతున రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ పథకాన్ని 'సంధాన కర్తలు'గా వ్యవహరించే మధ్యవర్తుల ద్వారా నిర్వహిస్తారు.

అసంఘటిత రంగంలో పనిచేస్తున్న పేద, అల్పాదాయ వర్గాల ప్రజలకు వృధ్యాపంలో ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 2010లో ఎన్.పి.ఎస్./లైట్/ 'స్వావలంబన' పేరిట సహ-కంట్రీబ్యూటరీ పెన్షన్ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ సహ-కంట్రీబ్యూటరీ అంటే లబ్దిదారులు, ప్రభుత్వం పరస్పర సహకారంతో ఈ పథకాన్ని అమలు చేస్తారు. ఇంకొంచెం విపులంగా చెప్పుకోవా లంటే ఈ పథకంలో సభ్యులుగా చేరిన వారు చెల్లించ వలసిన చందా సంవత్సరానికి కనిష్టంగా రూ. 1,000 గరిష్టంగా 12,000 వరకు తమ స్వావలంబన ఖాతాలో జమ చేసే ప్రతి ఒక్కరి పేరునా ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాటు లేదా 2016 -17 వరకు రెంటిలో ఏది తక్కువ అయితే అంతకాలం పాటు సంవత్సరానికి రూ.1,000 జమ చేస్తుంది. అలాగే, ఈ పథకాన్ని అతి తక్కువ ఖర్చుతో నిర్వహించే ఎన్.పి.ఎస్/లైట్ పద్దతిలో నిర్వహిస్తారు. చందాదారులు వ్యక్తిగత స్థాయిలో జమ చేసే చిన్న చిన్న మొత్తాలను కలిపి పెట్టుబడిగా కూడబెడ తారు. అయితే, ఎవరి ఖాతా వారికి విడిగా ఉంటుంది. ఈ పథకంలో మరొక సౌలభ్యం ఉంది. వ్యక్తులతో పాటుగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇందులో సభ్యులుగా చేరవచ్చును. అంటే, తమ తమ రాష్ట్రాలలో ఏదైనా ఒక అసంఘటిత కార్మికవర్గానికి పెన్షన్ సౌలభ్యం కల్పించేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు లేదా కేంద్ర ప్రభుత్వం తరపున ఈ పథకంలో సభ్యత్వం పొంది, వారు చెల్లించవలసిన చందా మొత్తాన్ని ప్రభుత్వాలే చెల్లించవచ్చును. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాలు ఇందులో భాగస్వాము లయ్యాయి. తమ తమ రాష్ట్రాలలోని అసంఘటిత వృత్తులలో పనిచేస్తున్న, అంగన్‌వాడి సహాయకులు, ఆశా వర్కర్లు, నిర్మాణ కార్మికులు, మొదలైన వారి తరపున రాష్ట్ర ప్రభుత్వాలు స్వావలంబన పథకాన్ని అమలు చేస్తున్నాయి. రాష్ట్రలవారీగా చూస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నిర్మాణ కార్మికులకు ఈ పథకాన్ని అమలు చేస్తోంది. స్వావలంబన పథకంలో సభ్యులుగా చేరిన ఒక్కొక్క కార్మికుని తరపున సంవత్సరానికి రూ. 1000 వంతున రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. కర్ణాటక ప్రభుత్వం అంగన్‌వాడి కార్యకర్తలకు సంవత్సరానికి రూ.1800, సహాయకులకు రూ.1004 చెల్లిస్తోంది. అదే విధంగా ఝార్ఖండ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, అస్సాం, మధ్య ప్రదేశ్, హర్యాణా ప్రభుత్వాలు

పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అథారిటీ, న్యూఢిల్లీ.

కూడా వివిధ వర్గాలకు చెందిన అసంఘటిత కార్మికుల కోసం ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఈ పథకాన్ని 'సంధాన కర్తలు'గా వ్యవహరించే మధ్యవర్తుల ద్వారా నిర్వహిస్తారు. సంధానకర్తలు పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పి.ఎఫ్.ఆర్.డి.ఏ)లో నమోదైన వారై ఉంటారు. సంధాన కర్తలు వినియోగదారుల పెన్షన్ ఖాతాలను ప్రారంభించడం, క్రమం తప్పకుండా సభ్యుల నుంచి చందాలు వసూలు చేయడం, వసూలు చేసిన మొత్తాన్ని ట్రస్టీ బ్యాంకులో ఎన్ పి ఎస్ ట్రస్ట్ ఖాతాలో జమ చేయడం వంటి విధులు నిర్వర్తిస్తారు.

2. స్వావలంబన పథకంలో 2017 మార్చి 31 నాటికి 43.39 లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. అయితే, 2015 అటల్ పెన్షన్ యోజన పథకాన్ని ప్రారంభించిన అనంతరం, స్వావలంబన పథకం పరిధిలో కొత్తగా సభ్యులను చేర్చుకోవడం నిలిపి వేశారు. అలాగే, స్వావలంబన పథకంలో చందాదారులైన వారిలో 18-40 సంవత్సరాల మధ్య వయసున్న వారిని అటల్ పెన్షన్ యోజనలోకి మారాలని ప్రభుత్వం సూచించింది. ఇలా స్వావలంబన పథకం నుంచి అటల్ పెన్షన్ పథకంలోకి మారే సభ్యులు తమ ఖాతా ఉన్న బ్యాంకుకు వెళ్లి బ్యాంకు పొదుపు ఖాతా పాస్ బుక్, స్వావలంబన 'ప్రాణ్' (PRAN) కార్డు, ఆధార్ కార్డు చూపిస్తే బ్యాంకు సిబ్బంది స్వావలంబన ఖాతాను అటల్ పెన్షన్ యోజన ఖాతాలోకి మారుస్తారు. ఒక వేళ సభ్యులకు బ్యాంకు ఖాతా లేదా ఆధార్ కార్డు లేకపోతే, ముందుగా బ్యాంకు ఖాతా తెరిచి, ఆధార్ కార్డు తీసుకుని స్వావలంబన ఖాతాను అటల్ పెన్షన్ ఖాతాలోకి మార్చుకోవచ్చును. 40 సంవత్సరాల వయసుపై బడిన వారు మాత్రం తమకు 60 సంవత్సరాలు వచ్చే వరకు అంటే పెన్షన్ అర్హత పొందే వరకు స్వావలంబన పథకంలోనే కొనసాగుతారు.

**అటల్ పెన్షన్ యోజన**

3. పేద, అల్పాదాయ వర్గాల ప్రజలకు వృద్ధాప్యంలో ఆర్థిక స్వావలంబన కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటోంది. పేదలందరూ పెన్షన్ పథకంలో చేరేలా ప్రోత్సహించేందుకు అనేక చర్యలను చేపట్టింది. ప్రోత్సాహకాలను ప్రకటించింది. అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు రిటైర్ అయిన తర్వాత లేదా వృద్ధాప్యంలో ఎదురయ్యే ఆర్థిక సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అటల్ పెన్షన్ యోజనను 2015 మే నెలలో ప్రారంభించింది. ఈ పథకంలో 18 సంవత్సరాలు వయసు నిండిన భారతీయ పౌరులు ఎవరైనా సభ్యులుగా చేరవచ్చును. అటల్ పెన్షన్ యోజనలో చేరదలచుకున్న వారు, ఏదైనా ప్రభుత్వ రంగ బ్యాంక్, ప్రైవేటు రంగ బ్యాంక్, ప్రాంతీయ సహకార బ్యాంక్, ఇతర సహకార బ్యాంకులు, లేదా కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ పరిధిలో గల గుర్తించిన, సీబీఎస్‌తో ఏపీవై మోడ్యూల్ అనుసంధానమైన పోస్టాఫీసుల ద్వారా చందాదారులుగా సభ్యత్వం పొందవచ్చును. అదే విధంగా కొన్ని బ్యాంకులు ఇంటర్నెట్ సదుపాయాన్ని కూడా కలిపిస్తున్నాయి. ప్రస్తుతానికి దేశ వ్యాప్తంగా 228 బ్యాంకులు, 1,45,000 తపాలా శాఖల ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. **అటల్ పెన్షన్ యోజన పరిధిలో సభ్యులు 60 సంవత్సరాల వయసు వచ్చిన నాటి నుంచి వారు చెల్లించిన మొత్తాల ఆధారంగా నెలకు కనీసం రూ.1000 నుంచి రూ. 5000 వరకు పెన్షన్ పొందే అవకాశం ఉంది.** పథకంలో చేరిన సమయంలో చందాదరుని వయసు, వారు చెల్లించే చందా, ఎంచుకున్న నెలసరి పెన్షన్ ఆధారంగా సభ్యులుగా చేరే సమయంలోనే నెలకు ఎంత పెన్షన్ వస్తుందనేది నిర్ణయిస్తారు.

ఒక సభ్యుడు 18 సంవత్సరాల వయసులో సభ్యత్వం తీసుకుంటే, నెలకు రూ.1000 పెన్షన్ పొందేందుకు సంవత్సరానికి కేవలం రూ.42లు చెల్లిస్తే సరిపోతుంది. అలాగే, నెలకు రూ.5000 పెన్షన్ పొందాలనుకుంటే 39 సంవత్సరాల వయసు గల వ్యక్తి సంవత్సరానికి రూ.1054 రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. జూన్ 31, 2016 ముందు చేరిన, అంతకు ముందే మరే ఇతర సామాజిక భద్రత పథకంలో లబ్ధిదారులు కాని, ఆదాయ పన్ను పరిధిలోకి రాని ప్రతి చందాదారుని ఖాతాలో కేంద్ర ప్రభుత్వం సభ్యుడు చెల్లించే చందాలో 50 శాతం లేదా సంవత్సరానికి గరిష్ఠంగా రూ.1000, రెంటిలో ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని ఐదు సంవత్సరాల పాటు జమ చేస్తుంది. మరో వంక ఈ పథకంలో చేరిన వారు ఎప్పుడైనా సంవత్సరంలో ఒక సారి అంటే ఏప్రిల్ మాసంలో తాము ఎంచుకున్న పెన్షన్ మొత్తాన్ని పెంచుకునే లేదా తగ్గించుకునే అవకాశం ఉంటుంది. అందుకు అనుగుణంగా సభ్యులు ప్రతి సంవత్సరం చెల్లించే చందా మొత్తాలను సవరించడం జరుగుతుంది. అరవై సంవత్సరాలు నిండిన తరవాత పెన్షన్ పొందుతున్న వారు మరణిస్తే సభ్యుని భార్య లేదా భర్తకు వారి జీవిత కాలం మొత్తం అదే మొత్తంలో పెన్షన్ అందుతుంది. భార్య భర్తలు ఇద్దరూ చనిపోయిన తర్వాత వారి నామినీకి వారి ఖాతాలోని మొత్తాన్ని చెల్లిస్తారు. అలా కాకుండా ఒక వేళ సభ్యుడు 60 సంవత్సరాలు నిండక ముందే చనిపోతే, చనిపోయిన చందాదారుని భార్యా లేదా భర్త మిగిలిన కాలానికి ఖాతాను కొనసాగించి, కాల పరిమితి ముగిసిన అనంతరం పెన్షన్ పొందే అవకాశం ఉంటుంది. చందాదారులు ఏదైనా కారణం చేత పథకం నుంచి తప్పుకోవాలని అనుకుంటే, అతడు లేదా ఆమెకు వారు అంతవరకు చెల్లించిన మొత్తాన్ని, ఆ మొత్తం పై వచ్చిన ఆదాయాన్ని కలిపి అందులోంచి నిర్వహణా వ్యయాన్ని మినహాయించి మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తారు.

**పట్టిక: అటల్ పెన్షన్ యోజన పరిధిలో చందా వివరాలు ఏ క్రింది విధంగా ఉన్నాయి.**

| | | కనీస పెన్షన్ నెలకు రూ. 1000 | | | కనీస పెన్షన్ నెలకు రూ. 2000 | | | కనీస పెన్షన్ నెలకు రూ. 3000 | | | కనీస పెన్షన్ నెలకు రూ. 4000 | | | కనీస పెన్షన్ నెలకు రూ. 5000 | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| నామినీకి లభించే కార్పస్ మొత్తం (అంచనా) | | రూ. 1.7 లక్షలు | | | రూ. 3.4 లక్షలు | | | రూ. 5.1 లక్షలు | | | రూ. 6.8 లక్షలు | | | రూ. 8.5 లక్షలు | | |
| * ప్ర వ | * చ చె కా | * నె చ | * త్రై చ | * 6 నె చ | * నె చ | * త్రై చ | * 6 నె చ | * నె చ | * త్రై చ | * 6 నె చ | * నె చ | * త్రై చ | * 6 నె చ | * నె చ | * త్రై చ | * 6 నె చ |
| 18 | 42 | 42 | 125 | 248 | 84 | 250 | 496 | 126 | 376 | 744 | 168 | 501 | 991 | 210 | 626 | 1239 |
| 19 | 41 | 46 | 137 | 271 | 92 | 274 | 543 | 138 | 411 | 814 | 183 | 545 | 1080 | 228 | 679 | 1346 |
| 20 | 40 | 50 | 149 | 295 | 100 | 298 | 590 | 150 | 447 | 885 | 198 | 590 | 1169 | 248 | 739 | 1464 |
| 21 | 39 | 54 | 161 | 319 | 108 | 322 | 637 | 162 | 483 | 956 | 215 | 641 | 1269 | 269 | 802 | 1588 |
| 22 | 38 | 59 | 176 | 348 | 117 | 349 | 690 | 177 | 527 | 1045 | 234 | 697 | 1381 | 292 | 870 | 1723 |
| 23 | 37 | 64 | 191 | 378 | 127 | 378 | 749 | 192 | 572 | 1133 | 254 | 757 | 1499 | 318 | 948 | 1877 |
| 24 | 36 | 70 | 209 | 413 | 139 | 414 | 820 | 208 | 620 | 1228 | 277 | 826 | 1635 | 346 | 1031 | 2042 |
| 25 | 35 | 76 | 226 | 449 | 151 | 450 | 891 | 226 | 674 | 1334 | 301 | 897 | 1776 | 376 | 1121 | 2219 |
| 26 | 34 | 82 | 244 | 484 | 164 | 489 | 968 | 246 | 733 | 1452 | 327 | 975 | 1930 | 409 | 1219 | 2414 |
| 27 | 33 | 90 | 268 | 531 | 178 | 530 | 1050 | 268 | 799 | 1582 | 356 | 1061 | 2101 | 446 | 1329 | 2632 |
| 28 | 32 | 97 | 289 | 572 | 194 | 578 | 1145 | 292 | 870 | 1723 | 388 | 1156 | 2290 | 485 | 1445 | 2862 |
| 29 | 31 | 106 | 316 | 626 | 212 | 632 | 1251 | 318 | 948 | 1877 | 423 | 1261 | 2496 | 529 | 1577 | 3122 |
| 30 | 30 | 116 | 346 | 685 | 231 | 688 | 1363 | 347 | 1034 | 2048 | 462 | 1377 | 2727 | 577 | 1720 | 3405 |
| 31 | 29 | 126 | 376 | 744 | 252 | 751 | 1487 | 379 | 1129 | 2237 | 504 | 1502 | 2974 | 630 | 1878 | 3718 |
| 32 | 28 | 138 | 411 | 814 | 276 | 823 | 1629 | 414 | 1234 | 2443 | 551 | 1642 | 3252 | 689 | 2053 | 4066 |
| 33 | 27 | 151 | 450 | 891 | 302 | 900 | 1782 | 453 | 1350 | 2673 | 602 | 1794 | 3553 | 752 | 2241 | 4438 |
| 34 | 26 | 165 | 492 | 974 | 330 | 983 | 1948 | 495 | 1475 | 2921 | 659 | 1964 | 3889 | 824 | 2456 | 4863 |
| 35 | 25 | 181 | 539 | 1068 | 362 | 1079 | 2136 | 543 | 1618 | 3205 | 722 | 2152 | 4261 | 902 | 2688 | 5323 |
| 36 | 24 | 198 | 590 | 1169 | 396 | 1180 | 2337 | 594 | 1770 | 3506 | 792 | 2360 | 4674 | 990 | 2950 | 5843 |
| 37 | 23 | 218 | 650 | 1287 | 436 | 1299 | 2573 | 654 | 1949 | 3860 | 870 | 2593 | 5134 | 1087 | 3239 | 6415 |
| 38 | 22 | 240 | 715 | 1416 | 480 | 1430 | 2833 | 720 | 2146 | 4249 | 957 | 2852 | 5648 | 1196 | 3564 | 7058 |
| 39 | 21 | 264 | 787 | 1558 | 528 | 1574 | 3116 | 792 | 2360 | 4674 | 1054 | 3141 | 6220 | 1318 | 3928 | 7778 |

* ప్రవేశ వయసు/ * చందా చెల్లించవలసిన కాలం/ * నెలసరి చందా/ * త్రైమాసిక చందా / * 6 నెలల చందా

కనీస పెన్షన్‌కు ప్రభుత్వం హామీ ఇస్తుంది. చందాదారులు తమ పెన్షన్ ఖాతాలో జమ చేసిన మొత్తం పై వచ్చిన వాస్తవ ఆదాయం ఆశించిన దాని కంటే ఎక్కువగా ఉంటే, ఆ మొత్తాలను సభ్యులకు బదిలీ చేస్తారు. ఫలితంగా సభ్యులకు అధిక ప్రయోజనం చేకూరుతుంది. అంటే ఆశించిన దాని కంటే తక్కువ ఆదాయం వస్తే ఆ నష్టాన్ని ప్రభుత్వం భరించి, కనీస పెన్షన్ను చందాదారులకు అందచేస్తుంది. అదే ఆదాయం ఆశించిన దానికంటే ఎక్కువ ఉంటే, అధికంగా వచ్చిన ఆదాయాన్ని చందాదారులు / లబ్ధిదారులకు ఇస్తుంది. ఇలా స్వావలంబన పథకాన్ని మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్ది, అటల్ పెన్షన్ యోజనను రూపొందించారు. **అటల్ పెన్షన్ యోజనలో ప్రభుత్వ కో-కాంట్రిబ్యూషన్‌తో పాటుగా కనీస పెన్షన్‌కు ఖచ్చితమైన హామీ ఉంటుంది.** స్వావలం బన పథకంలో ఈ ప్రయోజనాలు లేవు. **కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఎన్పీఎస్ కాంట్రిబ్యూషన్‌కు వర్తించే పద్ధతే అటల్ పెన్షన్ యోజనకు కూడా వర్తిస్తుంది.** 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకంలో పెట్టిన పెట్టుబడుల పై 13.91 శాతం ఆదాయం లభించింది.

4. అటల్ పెన్షన్ పథకంలో సభ్యులుగా చేరిన చందాదారులు www.npscra.nsdl.com లేదా www.npstrust.org.in ద్వారా తమ ఖాతాకు సంబంధించిన లావాదేవీలను (Statement of transactions-SOT), ఈ-ప్రాన్ (e-PRAN) వివరాలను ఆన్ లైన్‌లో తెలుసుకోవచ్చును. ఆన్‌లైన్ ద్వారా వివరాలను తెలుసుకునేందుకు చందా దారులు తమ APY PRAN నెంబర్ లేదా బ్యాంకు పొదుపు ఖాతానెంబర్ వినియోగించి ఆన్‌లైన్ సేవలను పొందవచ్చును. APY PRAN నెంబర్ అందుబాటులో లేని చందా దారులు తమ పుట్టిన తేదీ (డేట్ అఫ్ బర్త్) లేదా బ్యాంకు పొదుపు ఖాతా నెంబర్ ద్వారా తమకు కావలసిన వివరాలను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చును. చందాదారులు తమ APY ఖాతాకు సంబంధించిన లావాదేవీలా వివరాలు, పెన్షన్ మొత్తం, పెన్షన్ ఎప్పటి నుంచి వస్తుంది, నామినీపేరు, అసోసియేటెడ్ బ్యాంకు పేరు వంటి అన్ని వివరాలను ఈ ఆన్‌లైన్ సదుపాయం ద్వారా పొందవచ్చును. అలాగే అటల్ పెన్షన్ యోజన చందాదారులు అవసరం అనుకుంటే ఈ-ప్రాణ్ కార్డ్ ప్రింట్ అవుట్ ను తీసుకుని భద్రపరుచుకోవచ్చును. అటల్ పెన్షన్ యోజన చందాదారులు ఎప్పుడైనా పెన్షన్ మొత్తం, చందా చెల్లింపు కాల వ్యవధి, వ్యక్తిగత సమాచారం వంటి విషయాలలో మార్పులు చేర్పులు చేసుకుంటే, మళ్ళీ తిరిగి తమ ఈ- ప్రాణ్ ప్రింటౌట్ తీసుకోవచ్చును. అదే విధంగా పథకానికి సంబంధించి ఏదైనా ఫిర్యాదులు/సమస్యలు ఉన్నచో, చందాదారులు తమ సమస్య లేదా ఫిర్యాదులను https://npslite-nsdl.com/CRAlite/grievances ద్వారా వాటిని నమోదు చేయవచ్చును.

5. అటల్ పెన్షన్ యోజన పరిధిలో జూన్ 13, 2017 వ తేదీ నాటికి సుమారు 54.71 లక్షల మంది చందాదారులున్నారు. ఇందులో పురుషులు 62 శాతం అయితే మహిళలు సుమారు 38 శాతం. చాలా వరకు చందాదారులు నెలసరి చందా చెల్లింపును ఎంచుకున్నారు. ఇంకా ఖచ్చితంగా చెప్పా లంటే 97.5 శాతం మంది నెలసరి చందా చెల్లింపు పద్ధతిని ఎంచుకున్నారు. 0.8 శాతం మంది త్రైమాసిక చెల్లింపు పద్ధతిని, 1.7 శాతం మంది ద్వైవార్షిక చెల్లింపు పద్ధతిని ఎంచుకున్నారు. ఇక పెన్షన్ ఎంపిక విషయానికి వస్తే ఎక్కువ మంది అంటే 51.5 శాతం మంది చందాదారులు నెలసరి పెన్షన్ రూ. 1000 ఎంచుకోగా, 34.5 శాతం మంది చందాదారులు నెల పెన్షన్ రూ. 5000 ఎంచుకున్నారు. ఏ ఏ వయసుల వారు, ఎంతెంతమంది, ఏ ఏ చందా చెల్లింపు పద్ధతిని ఎంచుకున్నారు, ఎంత పెన్షన్ ఎంచుకున్నారు వంటి ఇతర వివరాలు పై పట్టికలో చూడవచ్చును.

■

*54వ పేజీ తరువాయి...*

## పేదల సాధికారతే పథకాల లక్ష్యం

శుభారంభం. "నయా రోష్నీ పథకం" కింద మహిళలకు నాయకత్వ శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. సాంఘిక సంక్షేమ రంగంలో మహిళల సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోంది. యువతకు సంబంధించిన ఇతర పథకాలలో "మానస్" (MANAS) ప్రధాన మైంది. యువతను ఔత్సాహిక పారిశ్రామిక రంగంలో ప్రోత్సహించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. అయితే, ప్రభుత్వం చేయవలసింది ఇంకా ఎంతో ఉంది. విద్యారంగంలో ప్రభుత్వం ఇంకా ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉంది. విద్యాపరమైన అవకాశాలు ఇంకా పెంచాలి. వ్యక్తుల జీవితాన్ని సమూలంగా మార్చేది విద్య మాత్రమే. విద్యావంతులైన వారు సాంఘిక, ఆర్థిక రంగాలలో ముందుకు సాగేందుకు అవకాశాలు ఉంటాయి. బలహీన, నిరుపేద వర్గాల పిల్లలకు ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలు అమలు జరగాలి. పాఠశాలల్లో టాయిలెట్లు, మంచినీటి సౌకర్యాలు, గ్రంథాలయాల వంటి సౌకర్యాలు వృద్ధి చేయాలి. నిరుపేద వర్గాలకు ఉపకార వేతనాలు అందేటట్లు చూడాలి. విద్యారంగంలో పెట్టుబడి, భవిష్యత్తుకు అవకాశాలు కల్పించడం ఏ ప్రభుత్వానికైనా సాంఘిక భద్రత పెట్టుబడుల ప్రధానాంశం కావాలి. మిగిలినవన్నీ అదనంగా సమకూర్చేవే.

■


## నైసర్గిక స్వరూపం

చిన్నప్పుడు ఎప్పుడో మనం పాఠ్యపుస్తకాలలో చదువుకుని ఉంటాం నైసర్గిక స్వరూపం అని! అంటే మనం నివసించే భూమి, దానిమీద ఉన్న కొండలు, లోయలు, నదులు, రోడ్లు, ప్రాజెక్టులు, రైల్వే మార్గాలు మొదలైనవి అన్నీ. ఒక ఎంపిక చేసిన అంశం భూమి మీద ఏ అక్షాంశం మీద లేక రేఖాంశంమ్మీద ఉన్నదో తెలుసుకోవడమే ఈ నైసర్గిక అధ్యయనం లక్ష్యం. అంటే సర్వేయింగ్ కార్యక్రమంలో భాగమన్నమాట! దీనికి సంబంధించిన పరికరాలను సివిల్ ఇంజనీర్లు, పర్యావరణ శాస్త్రవేత్తలు, చరిత్రకారులు అధికంగా వినియోగిస్తుంటారు. మూడు డైమెన్షన్లతో ఉండే భూమి ఉపరితలాన్ని రేఖా చిత్రాలలో రెండు డైమెన్షన్లలో ఈ నిపుణులు చూపుతారు. ఇలాంటి సర్వేలలో కోణాలను, దూరాలను కొలిచేందుకు థియోడోలైట్స్ అనే పరికరాన్ని వాడతారు. డిజిటల్ ఇమేజింగ్ విధానానికి కూడా ఇది ఎంతో ఉపయోగకరం. ముఖ్యంగా ఉపగ్రహాలు పంపే ఫోటోలను, సమాచారాన్ని సరిగ్గా అంచనావేయడానికి దీనిని ఉపయోగిస్తారు. అయితే సముద్రాలను మాత్రం సోనార్ మాప్పింగ్ విధానంలో కొలుస్తారు. ఈ విధానంలో ఒక ధ్వని యొక్క ప్రతిధ్వని ఎంత కాలంలో తిరిగి చేరుతుంది అనే దానిని బట్టి సముద్ర గర్భంలోని దూరాన్ని అంచనా వేస్తారు. అయితే ఇటీవలి కాలంలో వచ్చిన సాంకేతిక ప్రగతి వలన గ్లోబల్ పొజిషనింగ్ విధానంలో ఈ దూరాలను మరింత ఖచ్చితంగా అంచనా వేయడానికి వీలవుతోంది. అంతరిక్షంలో ఫోటోలకు ఫోటోగ్రమెట్రీ విధానాన్ని ఉపయోగిస్తారు. త్వరలోనే ఉపగ్రహాలకు సెన్సార్లను బిగించి చిత్రాలను రూపొందించే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.



Publishing date 30 June 2017, Posting on 4 - 5 July 2017
Yojana (Telugu) July 2017 RNI Regd. No 37729/80 Regd. No. H/HD-663/2015-17

## ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన




### అందరికీ విద్యుత్తు

విద్యుత్తు లేని 18,456 గ్రామాలకుగాను సుమారు 13,500 గ్రామాలకు విద్యుత్తు అందుతోంది.

### సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన



- ఎంపిక చేసిన గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి కింద వ్యవసాయం, వైద్యం, విద్య, పరిశుభ్రత, పర్యావరణం, ఉపాధి తదితర రంగాలు ఉన్నాయి
- ప్రతి పార్లమెంట్ సభ్యుడూ 2019 మార్చి నాటికి మూడు ఆదర్శ గ్రామాలు అభివృద్ధి చేయాలని లక్ష్యం.

### గ్రామీణ త్రాగునీటి సరఫరా

- ఏప్రిల్ 2014లో 73.66 శాతం గ్రామాలకు అందుతున్న గ్రామీణ త్రాగునీటి పథకాన్ని 77.01 శాతం గ్రామాలకు అందేలా పెంచాం. ఇప్పుడు 55 శాతం మంది గ్రామీణులకు నల్లా(కుళాయి)ల ద్వారా నీరు లభిస్తోంది.

### ఉపాధి హామీ పథకం

- ఈ పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 2016-17 ఆర్థిక సం॥లో అత్యధికంగా రూ. 51,902 కోట్లు ఖర్చయ్యాయి, 2016-17లో 51.3 లక్షల పనులు జరగ్గా 2013-14లో ఇది సగటున 20 నుంచి 30 లక్షలుగా మాత్రంగానే ఉంది.

### అంత్యోదయ ఎక్స్‌ప్రెస్

- సూపర్ ఫాస్ట్ రైళ్ళలో రిజర్వేషన్ లేని బోగీల్లో ఛార్జింగ్ స్విచ్ బోర్డులు, బయో టాయిలెట్లు, రక్షిత త్రాగునీరు తదితర సదుపాయాలున్నాయి. ఈ సౌకర్యాలతో మొదటి రైలు ముంబయి-టాటానగర్‌ల మధ్య నడుస్తోంది.

### పేదల సంక్షేమం

- మౌలిక సదుపాయాల అభివృద్ధికోసం ప్రతి గ్రామ పంచాయితీకి కేంద్రం నేరుగా నిధులు అందిస్తోంది.
- ఐ.డి.ఎస్ 2016 ద్వారా ప్రభుత్వానికి రూ. 65,250 కోట్లు లభించాయి. ఈ నిధులతో పాటు ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద వచ్చిన నిధులను పేదల అభ్యున్నతికి ఖర్చు చేస్తున్నారు.
- పేదలు, బ్యాంకు ఖాతాలేని వారికి బ్యాంకింగ్ సౌకర్యాన్ని కల్పించడానికి ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకును ఏర్పాటు చేశారు.



## పేదరిక నిర్మూలన

### అత్యవసర మందుల పట్టిక

- అత్యవసర మందుల ధరలు తగ్గాయి, 835 రకాల మందుల గరిష్ఠ ధర నిర్ణయించారు. దీంతో వినియోగదారులకు రూ. 5320 కోట్లు ఆదా అయ్యాయి.
- మే 2014లో 82 మాత్రమే ఉన్న జన ఔషధి కేంద్రాలను మార్చి 2017లో 1080 కి పెంచారు.
- జన ఔషధి కేంద్రాల ద్వారా మే 2014 వరకు 361 రకాల మందులు మాత్రమే లభిస్తుండేవి. వీటిని మార్చి 2017 నాటికి 600కు పెంచారు.

- గుండె జబ్బులతో బాధపడే వారి సహాయార్థం స్టెంట్ల ధరలను **85** శాతం వరకు తగ్గించారు.
- వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో కనీస కూలీ రేటును **42** శాతం పెంచడంతో **55** లక్షల మంది కూలీలకు నేరుగా లబ్ధి కలిగింది.
- బోనస్ చెల్లింపు (సంస్కరణ) చట్టం **2015** కింద బోనస్ పొందడానికి కనీస నెలసరి వేతనాన్ని **10,000** రూ॥ల నుండి **21,000** రూ॥లకు పెంచారు.





సత్యమేవ జయతే
భారత ప్రభుత్వం

మీ ఆలోచనలను ప్రధానమంత్రి దేశ ప్రజలందరితో పంచుకుంటారు. "మన్ కి బాత్" కార్యక్రమానికి మీ ఆలోచనలు, సలహాలు అందించండి. **1922** కి మిస్‌డ్ కాల్ ఇవ్వండి.

సత్యమేవ జయతే
భారత ప్రభుత్వం

# పేదల సంతోషంగా, సౌకర్యాలన్నీ చేరువగా

వెంట ఉన్నాం, విశ్వాసముంది
...అభివృద్ధి జరుగుతోంది




Printed & Published by Mrs. Sadhana Rout, Director General and Head on behalf of the Publications Division, Ministry of I & B, Govt. of India.
and Printed at Prakhya Art Printers Pvt. Ltd. 1-8-724/A/31, Vegetable Market Street, Nallakunta, Hyderabad - 500 044. E-mail: print@prakhyaarts.com
and Published at Yojana (Telugu), 205, 2nd Floor, C.G.O. Towers, Kavadiguda, Hyderabad - 500 080. Senior Editor: Vijayakumar Vedagiri, Tel: 040-27546314